ఎన్నాళ్ళీ కన్నీళ్ళు?

(రాయలసీమ చరిత్ర, కరువు, కక్షలపై పరిశోధన)

మైనాస్వామి

ఎన్నాళ్ళీ కన్నీళ్ళు?

(రాయలసీమ చరిత్ర - సంస్కృతి, కరువు - నీటివనరులు, అభివృద్ధి ముఠాకక్షలపై పరిశోధనాత్మక పుస్తకం)

మైనా స్వామి

B.Sc., M.A., P.G.D. in Temple Culture., (L.L.B.)

శ్రీచరణ్ & శ్రీకరణ్ పబ్లికేషన్స్

8, టి.టి.డి. క్వార్టర్స్,

మూడో సత్రం వద్ద,

తిరుపతి - 517501.

సూచిక

1. రాయలసీమ చరిత్ర 13
2. లోహయుగానికి నాంది 19
3. రాయలసీమగా మారిన రాజుల సీమ 21
4. వలసపాలకులకు ఊపిరి పోసిన విజయనగర రాజులు 23
5. అలయ సంస్కృతే సీమ సంస్కృతి 26
6. 'సీమ' చరిత్రకు శిథిల సాక్ష్యాలు 28
7. కళల కాణాచి 30
8. 'సీమ' చరిత్ర సమస్తం కరువులమయం 32
9. కరువు పూజలు 38
10. అమెరికాయే ఆదర్శం 40
11. పొదుపుచేసి నీళ్ళివ్వండి 43
12. పెదదోవలో పవిత్రలక్ష్యం 46
13. కథావస్తువుగా కరువు... గోమాత 50
14. బలి(కథ) 53
15. 'సీమ' ప్రాజెక్టులకు మోక్షం ఎప్పుడు? 62
16. హంద్రీ - నీవా సుజల స్రవంతి 66
17. గాలేరు - నగరి పథకం 68
18. శ్రీతిరునారాయణ్ సూచనలు 70
19. అమలుకాని క్రిష్ణా -పెన్నార్ ప్రాజెక్టు 71
20. రాడార్‌తో రుతుపవనాలను అధ్యయనం చేయాలి 72
21. 'గంగ'కు రాజకీయ గ్రహణం 74
22. పెను ప్రమాదం 78
23. కరువు ప్రకటనలతోనే కాలయాపన 81
24. 'సీమ' వాసుల ఆశలు వమ్ము 84
25. పాలెగాళ్ళ వారసులే ఫ్యాక్షనిస్టులు 86
26. వ్యర్థ విధానాలతో వ్యవసాయానికి విపత్తు 94
27. విధ్వంసక విత్తనాలు వద్దు 96
28. పంటలబీమా పథకం ఏదీ? 98
29. మానవతావాదులంతా ముందుకు రండి 101
30. ఉపగ్రహాలతో ఉత్పత్తుల పెంపుదల 103
31. 'సీమ' నీటిని మింగుతున్న కర్నాటక 105
32. చెరువులపై చిన్న చూపు తగదు 107
33. వ్యవసాయాభివృద్ధే దేశాభివృద్ధి 109
34. కృత్రిమ వర్షాలు కురిపించండి 111
35. 'సీమ'ను మరో ఇథియోపియోగా మార్చొద్దు 112
36. అధోగతిలో గ్రామీణ ఆర్థిక వృద్ధి 115
37. మానవ హక్కులకు ముప్పు 118
38. సంఘ సంస్కర్తల 'సీమ' 120

రాయలసీమ పై లఘు సర్వస్వం

డాక్టర్ పొత్తూరి వెంకటేశ్వర రావు

చైర్మన్, ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ

రాయలసీమకు కరువు కొత్తకాదు. అందువల్ల, కరువు గురించి మాట్లాడుకొనడం ప్రజలకూ కొత్తకాదు. స్వాతంత్ర్యసిద్ధికి పూర్వం, తరువాత కూడా ఈ ప్రాంతం తరచూ కరువుకు గురవుతూనే ఉంది. ప్రజలు కష్టాలు పడుతూనే ఉన్నారు. రాయలసీమ పరిస్థితి నాటికీ నేటికీ ఒకేవిధంగా ఉంది.

రాజకీయ పక్షాలన్నీ రాయలసీమ పరిస్థితులను మెరుగు పరచడం గురించి ఎన్నెన్నో వాగ్దానాలు చేశాయి, సీమ సమస్యలకు పరిష్కారాలు సాధిస్తామని పాలకులు ప్రతిజ్ఞలు చేశారు. వాగ్దానాలు అమలు కాలేదు. ప్రతిజ్ఞా పాలనలు జరగలేదు. పత్రికలలో అసంఖ్యాకంగా వ్యాసాలు వచ్చాయి. కొన్ని పుస్తకాలూ వెలువడ్డాయి. వాటివల్ల కూడా ఒరిగిందేమీ లేదు. ఈ నేపథ్యంలో రాయలసీమ కరువు సమస్యపై మరో రచనకు అవసరం ఉన్నదా? ఉంటే అది పుస్తకరూపంగా వెలువడ వలసిన సందర్భం ఏమిటి?

జర్నలిస్టు శ్రీ మైనాస్వామి అలాంటి అవసరం ఉన్నదని చెప్పి, రాయలసీమ సమస్యలను తీర్చే మార్గాలను సూచిస్తూ పూర్వాపరాలతో పుస్తకం రాశారు. దాని ప్రచురణకు సందర్భం కూడా కలసి వచ్చింది. బచావత్ ట్రిబ్యునల్ నిర్ణయించిన 2000 సంవత్సరం గడువు ముగిసి కృష్ణాజలాల పంపిణీ వ్యవహారం పునః పరిశీలనకు వచ్చింది. రెండు వేల సంవత్సరం తరువాత మన పరిస్థితి ఏమిటని ఆలోచించమంటూ, వివిధ రాజకీయ పక్షాలకంటె, నాయకుల కంటె ముందుగా ప్రజల ముందుకు వచ్చిన కీర్తి శ్రీ మైనాస్వామికి దక్కుతుంది. ఆలోచించమనడమే కాదు, "మీ పరిశీలనకు కావలసిన సమస్త సమాచారం ఇందులో ఉంది, చదవండి!" అంటూ "ఎన్నాళ్లీ కన్నీళ్లు?" పుస్తకాన్ని ప్రజలకు అందించారాయన.

రాయలసీమ చరిత్ర, ఇక్కడ సహజ సంపద, తరచు అనావృష్టి కలుగుతుండటానికి కారణమైన భౌగోళిక పరిస్థితులు, ముఠాకక్షలు, వాటికి దారితీసిన సాంఘిక, ఆర్థిక

పరిస్థితులు, ప్రజాస్వామ్య విలువలను హరిస్తున్న కొందరు ముఠా నాయకుల రాజకీయ దౌర్జన్యాలు, అభివృద్ధికి ఆటంకంగా నిలుస్తున్న అభద్రతా భావం, సాగునీటికోసం, తాగునీటి కోసం అర్థశతాబ్ది కాలంగా కాగితాలకే పరిమితమై కాలు ముందుకు సాగని వివిధ పథకాలు - వీటన్నింటినిగురించి, నాకు తెలిసినంతలో ఎవరూ ఇంతవరకూ ఒకే పుస్తకంగా రాసినట్టు లేదు.

రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల పంపిణీ వ్యవహారం తిరిగి పరిశీలనకు వస్తున్న దశలో ఎవరికైనా "రిఫరెన్సు" కు ఉపయోగపడేవిధంగా పుస్తకాన్ని వెలువరిస్తున్నందుకు శ్రీమైనాస్వామి అభినందనార్హులు. అంతేగాదు, "ఎన్నాళ్లీ కన్నీళ్లు?" పరిశోధనాత్మక రచన కూడా. విషయ సేకరణకు రచయిత చేసిన కృషి పుస్తకంలో కనిపిస్తుంది.

"రాయలసీమ" అనే పేరును పెట్టింది, వాడుకలోకి తెచ్చింది గాడిచర్ల హరిసర్వోత్తమరావు గారని పుట్టపర్తి నారాయణా చార్యులు గారి లాంటి పెద్దలు చెపుతుండేవారు. 1928లో నంద్యాలలో జరిగిన ఒక మహాసభ "దత్త మండలాలు" అనే పేరుకు బదులు "రాయలసీమ" ను వాడుకలోకి తీసుకొని రావాలని తీర్మానించింది. కాని, 17వ శతాబ్దంనాటి "అభిషిక్తరాఘవం' 'కావ్యంలో "రాయలసీమ" అనే పదం ఉన్నదని, అందువల్ల అది గాడిచర్ల హరిసర్వోత్తమరావు గారో, చిలుకూరి నారాయణ రావుగారో పెట్టిన పేరు కాదని శ్రీ మైనాస్వామిరాశారు. "రాయలసీమ" అనే మాట ఎప్పటినుంచో ఉన్నదని మొదట చెప్పిన వారు మల్లంపల్లి సోమశేఖర శర్మగారట. ఇదికూడా మైనాస్వామి రాశారు. రచయిత పరిశోధనా దృష్టిని, రచనలో నిజాయితీని ఇది సూచిస్తుంది.

పాతరాతియుగం విశేషాలు మొదలుకొని రాయలసీమలో బ్రిటిష్ పాలన పాదుకొన్నంత వరకు ఎన్నో విశేషాలను రచయిత సేకరించి రాశారు. రాజకీయ చరిత్రతోపాటు కనీసం నాలుగు శతాబ్దాల కరువుల చరిత్రను కూడా రాశారు. దొరికినంత వరకు సాక్ష్యాధారాలను పేర్కొంటూ శతాబ్దాలుగా కరువు రాయలసీమను ఎలాకుంగదీసిందో వివరించారు. కరువు వల్ల "లెక్కలేనంత మంది మరణించి నట్టు" పేర్కొన్న అనంతపురం జిల్లా కదిరిలోని శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయ శిలాశాసనాన్ని ఉదహరించారు. "ఇక్కడ గోలచేసే కాకి గొంతు తడుపుకోలేదు", "ఇక్కడ అంతా దైన్యమే. ఇక్కడ రాజ్యాన్ని బీభత్సంగా పరిపాలన చేస్తున్నది కరువే", "నదులు ఇసుకతో, గులకరాళ్లతో బావురు మంటున్నాయి" లాంటి కవితాత్మక వాక్యాలు కరువు తీవ్రతను సూచిస్తూ పఠిత మనస్సుని స్పందింపజేస్తాయి.

"కృష్ణా - పెన్నార్", "తెలుగు గంగ", "హంద్రీ-నీవా", "గాలేరు-నగరి" మొదలైన ప్రాజెక్టుల వివరాలెన్నింటినో సేకరించి, అవి ఎలా రాజకీయ ఒడుదుడుకులకు లోనైనాయో రచయిత నిర్మొగమాటంగా విశ్లేషించి చెప్పారు. రాయలసీమలో చరిత్ర కలిగిన చెరువులను గురించి, లక్షల ఎకరాలకు అవి నీటి సాగు సౌకర్యం కలిగించిన ఒక నాటి పరిస్థితులను గురించి చెప్పారు. రచయిత కథకుడు కూడా కనుక రాయలసీమ కరువు వాతావరణాన్ని కళ్లకు కట్టినట్టు చిత్రించే రెండు కథలను కూడా పుస్తకంలో చేర్చారు.

రాయలసీమ ప్రస్తుత పరిస్థితికి అన్ని రాజకీయ పక్షాలకు బాధ్యత ఉన్నదని రచయిత నొక్కి చెపుతున్నారు. "సీమలో నెలకొన్న దారుణ పరిస్థితులను బాహ్య ప్రపంచానికి తెలియజెప్పటంలో తగిన పాత్ర నిర్వహించలేద"ని పత్రికల వారిమీద కూడా ఒక విసురు ఉంది.

పత్రికలలో రేఖామాత్రంగా కనిపించే ఫ్యాక్షనిష్టుల దురాగతాలను గురించి, "ఎందరో మహిళలు సమిధలు" కావడం గురించి రచయిత వేదనతో రాశారు. అక్కడ బాంబుల సంస్కృతి గురించి, మందు పాతరలు సైతం ప్రారంభమై బీభత్సం సృష్టించడం గురించి హెచ్చరికలు చేశారు.

శ్రీ మైనాస్వామి కేవలం రాయలసీమ దైన్యాన్ని చిత్రించి అంతటితో తన పనైపోయిందని ఊరుకోలేదు. సీమ సమస్యలను పరిష్కరించే విషయంలో ఆయనకు కొన్ని స్పష్టమైన అభిప్రాయాలు ఉన్నాయి. ఉదాహరణకు రాయలసీమకు మిగులు జలాలనుంచి గాక, నికర జలాలనుంచి వాటా రావాలని అంటారాయన. అలాగే మొత్తం 16 ప్రతిపాదనలతో ఒక పరిష్కార పథకాన్ని ఆయన సూచించారు. "సిల్వర్ అయొడైడ్" తో చౌకగా కృత్రిమ వర్షాలు కురిపించాలన్నది కూడా ఇందులో ఒక ప్రతిపాదన

ఏకబిగిన చదివించే శైలీ, శక్తీ ఈ గ్రంథానికి ఉన్నాయి.

వివిధ విషయాలపై విలువైన సమాచారంతో వెలువరించిన "ఎన్నాళ్లీ కన్నీళ్లు?" రాయలసీమపై లఘు సర్వస్వమని చెప్పవచ్చు. సీమను అర్థం చేసుకొనదానికి, సీమ. సమస్యల అధ్యయనానికి శ్రీ మైనాస్వామి రచన నిస్సందేహంగా ఉపయోగపడుతుంది.

రాయలసీమపై మంచి పుస్తకం

ప్రొఫెసర్ ఆర్. జగదీశ్వరరావు
చైర్మన్, రాయలసీమ వికాస పరిషత్,
రాయలసీమ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్, తిరుపతి

'ఎన్నాళ్ళీ కన్నీళ్ళు?' చదవడం మొదలు పెడితే పూర్తయ్యే వరకు చదవాలనిపిస్తుంది. మరోసారి చదవాలనిపించడం పుస్తకం ప్రత్యేకతకాగలదు. ఒక జర్నలిస్టుకు ఇంత శక్తి ఎట్లా వచ్చింది అని నాకు కొంత ఆశ్చర్యం కలిగింది. 'ఎన్నాళ్ళీ కన్నీళ్ళు?' వ్యాస సంపుటిని పదే పదే చదివిన తర్వాత అప్పుడనిపించింది. శ్రీ మైనాస్వామి జర్నలిస్టు మాత్రమే కాదు. ఆయనలో ఒక పరిశోధకుడు, ఒక ఆర్థిక వేత్త, ఒక మంచి రచయిత, అన్నిటికీ మించి నేటి ఆధునిక సమాజ అవసరాలకు సరిపోయే సైంటిస్ట్, సంస్కరణవాది, సంస్కృతీ పరి రక్షకుడు దాగివున్నాడు. ఈ పుస్తకాన్ని పిహెచ్.డి., కోసం రాయలేదు. రాయలసీమపై అంత విస్తృతంగా పరిశోధన చేయడానికి 'ఒక ప్రాజెక్టు'ను శ్రీ మైనాస్వామి తెచ్చుకోలేదు. ఆయనలోని జిజ్ఞాస అతనిచేత అంతపని చేయించింది.

పురావస్తు శాస్త్రం - చరిత్రల ఆధారాలతో రాయలసీమలోని లోహయుగం, ఆలయ సంస్కృతి, కళాభివృద్ధి, అతివృష్టి, అనావృష్టిల వల్ల ఎదురయ్యే ఇబ్బందులు, నీటి వనరులు, వర్షాలు సకాలంలో పడకపోతే చేసే కరువు పూజలు, వ్యవసాయాభివృద్ధి కార్యక్రమాలు, సీమ గ్రామీణుల ఆర్థిక పరిస్థితి, ఫ్యాక్షనిస్టుల ఆగడాలు - ముఠాకక్షలు మొదలైన విషయాలెన్నింటినో రచయిత చాలా చక్కగా వివరించారు. క్రిష్ణ, తుంగభద్ర నదీ జలాలను రాయలసీమకు తరలించడానికి ఉద్దేశించిన శ్రీశైలం కుడి కాలువ, తెలుగు గంగ, తుంగభద్ర రెండవస్టేజ ఎగువ కాలువ, గాలేరు - నగరి, హంద్రీ - నీవా సుజల స్రవంతి వంటి ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదిక మీద పూర్తి చేయడానికి ఏమి చేయాలో వివరించారు. అంతటితో ఆపకుండా రాయలసీమ రైతుల కష్టాలను రూపుమాపడానికి కృత్రిమ వర్షాలను కురిపించడం, పంట దిగుబడిని పెంచడం, పంటల బీమా పథకాన్ని అమలు చేయడం, పంటకు గిట్టుబాటు ధరను కల్పించడం వంటి సంస్కరణల గురించి కూడా రచయిత రాశారు.

రాయలసీమ నీటివనరులను అభివృద్ధి చేయడం ద్వారానే రాయలసీమ అభివృద్ధిని సాధించ వచ్చని మన రాష్ట్ర ముఖ్యమంత్రి గారికి బాగా తెలుసు. అందుచేతనే జన్మభూమి కార్యక్రమాలలో భాగంగా నీరు - మీరు పథకాన్ని రాయలసీమలో పెద్ద ఎత్తున అమలు చేస్తున్నారు. వృథాగా పోతున్న నదీ జలాలను వాటర్‌షెడ్ అభివృద్ధి పథకాల ద్వారా వీలైనంత వరకు ఆపి, ఆ నీటిని వాడకంలోకి తీసుకురావడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. క్రిష్ణాజలాలను రాయలసీమకు తరలించే ప్రాజెక్టులను త్వరితగతిని పూర్తి చేయడానికి కావలసిన నిధుల సేకరణకు కృషి చేస్తున్నారు.

రాయలసీమ సేద్యపు నీటి ప్రాజెక్టుల రూపకల్పనలో అనేక సాంకేతిక లోపాలుండడం వల్ల కేంద్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టులకు హైడ్రలాజికల్ అనుమతిని మంజూరు చేయలేదు. అంతర్జాతీయ సంస్థలు ఈ ప్రాజెక్టుల నిర్మాణానికి కావలసిన నిధులను అప్పుగా ఇవ్వడానికి నిరాకరించాయి. మన ప్రభుత్వం ఈ ప్రాజెక్టుల రూప కల్పనలోని లోపాలను వెంటనే సవరిస్తే హైడ్రలాజికల్ అనుమతిని పొందడమేకాకుండా అంతర్జాతీయ సంస్థల నుంచి అవసరమైన నిధులను పొందవచ్చు. రాయలసీమలో వర్షపాతం తక్కువ. అయినా కూడా మూడు వంతుల వ్యవసాయ భూములు వర్షం మీదనే ఆధారపడి వున్నాయి. ఇదే రాయలసీమలోని కరువుకు ముఖ్య కారణం.

రాయలసీమలో సేద్యపు నీటి ప్రాజెక్టుల నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో వందల కోట్లు ఇప్పటికే ఖర్చు చేసింది. అయితే సేద్యపు నీటిపై ఆధారపడే వ్యవసాయ భూములలో 36 శాతం భూములకు మాత్రమే ప్రాజెక్టుల ద్వారా నీరు అందుతున్నది. తక్కిన సేద్యపు భూములకు నీటి సదుపాయం కల్పించడం కోసం రైతులే ఎన్నో వ్యయప్రయాసలకోర్చి భూగర్భ జలాలను సమకూర్చుకొంటున్నారు. భూగర్భజలాల అభివృద్ధికి ప్రభుత్వం రైతులకు అందజేస్తున్న సహాయం అంతంత మాత్రమే. భూగర్భ జలాల వినియోగం ఎక్కువ కావడంతో భూగర్భ జలాల మట్టాలు ఈ మధ్య కాలంలో గణనీయంగా పడిపోయాయి. కొత్త బోరు బావులను తవ్వడాన్ని నియంత్రణ చేసే చట్టాన్ని తీసుకురావడం ద్వారా ఈ సమస్యను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వం చూస్తున్నది. ఈ చట్టం వల్ల సమస్య పరిష్కారం గాక పోవడమే కాకుండా రైతులకు అనేక కొత్త ఇబ్బందులు ఎదురవుతాయి. ఎక్కడైతే నీటి వినియోగం ఎక్కువగా వుండి, భూగర్భ జలాల మట్టాలు గణనీయంగా పడిపోతున్నాయో అక్కడ వాటర్‌షెడ్ పథకాలను పెద్ద ఎత్తున చేపడితే నీటిమట్టాలు బాగా పెరుగుతాయి.

అంతేగాక ప్రభుత్వం నిర్మించే సేద్యపు నీటి ప్రాజెక్టులు కేవలం పొలాలకు నీటిని అందించడానికే గాక భూగర్భ జలాల అభివృద్ధికి కూడా ఉపయోగపడేటట్లు మార్పు చేస్తే తక్కువ వ్యవధిలో తక్కువ ఖర్చుతో ప్రాజెక్టులు పూర్తవుతాయి. దానితో రైతులకు ఎంతో మేలు కలుగుతుంది.

అవసరమైనంత తాగునీరు, సేద్యపునీరు రాయలసీమ ప్రజలకు అందించడమే శ్రీ మైనాస్వామి రాసిన 'ఎన్నాళ్ళీ కన్నీళ్ళు?' లక్ష్యం.

రాయలసీమ కన్నీటిగాథ

ప్రొఫెసర్ హెచ్.ఎస్. బ్రహ్మానందం
కార్యదర్శి, తి.తి.దే. ధర్మ ప్రచారపరిషత్, తిరుపతి

సుమతీ కారుడు ఏనాడో చెప్పాడు.

'అప్పిచ్చువాడు వైద్యుడు - ఎప్పుడు నెడతెగక పాఱు నేఱును ద్విజుడున్
చొప్పడిన యూరనుండుము - చొప్పడ కున్నట్టి యూరు చొఱకుము.... అని

ఊరి పక్కన ఎప్పుడూ పారుతుండేటి ఏరు ఉండాలి - అనటంలోని అర్థం రాయలసీమ పల్లెల్ని చూస్తే తెలుస్తుంది. శ్రీ మైనాస్వామి రాసిన 'ఎన్నాళ్ళీ కన్నీళ్ళు అన్న వ్యాస' సంపుటి చదివితే మనకు 'నీటి' విషయం ఎంత పెద్ద రాజకీయ సుడిగుండంగా మారిపోయిందో స్పష్టంగా తెలుస్తుంది. ధర్మాలలో 'సామాజికధర్మం' ఒకటి ఉంది. ఇవాళ 'సామాజిక న్యాయం' అని మేధావులు దాన్నే పిలుస్తున్నారు. దాని స్వరూపం ఏమిటంటే మన సమాజంతో పాటు ఇతర సమాజాలు గూడా అభ్యుదయాన్ని పొందాలి అని ఆశించడం. నీటి విషయంలో ప్రకృతిది పెద్ద పీట అనడంలో సందేహం లేదు. ఒక ప్రాంతంలో అతివృష్టి, మరో ప్రాంతంలో అనావృష్టి. ఒకచోట నిరంతరం సస్యశ్యామలంగా ఉండటం, మరోచోట ముళ్ళ పొదలతో ఎడారిగా దిశాలుగా ఉండటం - ఇది ప్రకృతి సహజమైన వేర్పాటు - అని సర్దుకొని పోవటం సమంజసం కాదు. పక్కన ఉన్నవారు బాధ పడుతున్నపుడు మనిషి చేయకల్గింది ఉంటే తప్పకుండా చేయాలి. ఇలా చేయాలని ఎక్కడ ఉంది? అని అడిగే అతి తెలివివారూ ఉండవచ్చు. అందుకే నీటి సమస్య రాజకీయమైకూర్చుంది.

ఎన్ని ఒడంబడికలు జరిగినా, రచయితలు ఎంత రాసిన ఎంత మంది నిరసన దీక్షలు చేసినా, మైనాస్వామి వంటివారు ఎన్ని పరిశోధనలు జరిపినా - దీనికి పరిష్కారం భగ్న ప్రాంతాల మధ్య పరస్పర సహకారాన్ని సాధించడం ఒక్కటే. దీన్ని కేంద్ర ప్రభుత్వం నిర్దిష్టమైన 'జల పథకం'గా రూపొందించి దేశం మొత్తానికి ఒక 'జల మార్గాన్ని' అను సంధింప చేయాలి. ఇది అసాధ్యం కాదు. మనిషి తనకున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని సమాజానికి ఉపయోగపడేలా చేయటంలో గొప్ప సామాజిక ధర్మం దానికి ఉంది. అది నేటి - శాస్త్రజ్ఞులు తప్పకుండా నేర్చుకోవాల్సి ఉంది.

రాయలసీమలో చెరువులు, ఊట బావులు, అధికంగా కనిపిస్తాయి. దీన్ని బట్టి వర్షం నీటిని ఎలా కాపాడుకోవడం పై మొదటి నుంచీ మనవారు అధ్యయనం చేశారని తెలుస్తున్నది.

ఇవాళ చెరువులన్నీ అదృశ్యమవుతున్నాయి.. వాటి స్థానాల్లో బస్టాండ్లు వస్తున్నాయి. ఊరిలో నీటివాలు ఉన్నచోట్లను ఏదోవిధంగా భర్తీ చేయటం వల్ల నీటికి నిలువ చోటు లేకుండా పోయింది.

అలాగే నీటిని వృథాగా సముద్రం పాలు చేయకుండా ప్రతి రాష్ట్రంలోను ఇతర రాష్ట్రాల నీటి వాలు ప్రదేశాలను గుర్తించి ఒక జల సంరక్షణ విధానాన్ని రూపొందించుకోవడం అవసరం. మనది 'రాష్ట్రాల కూటమి' అన్న భావన ఉంటే ఇది ఆచరణ సులభం అవుతుంది. ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రమే ఒక రాజ్యమనే భావనలో మునిగి ఉండటం దురదృష్టకరం. అందుకే భిన్న రాష్ట్రాల మధ్య నదుల అను సంధానం చేయలేకపోయాము.

శ్రీ మైనాస్వామి దాదాపు 6 నెలల క్రితం తమ వ్యాస సంపుటి గురించి నాతో చెప్పారు. నెలక్రితం వ్యాసాలను ఇచ్చి 'ముందుమాట' రాయమన్నారు. ఇవి చిన్న విన్నపాలు. కానీ గంభీరమైన సమస్యను మన ముందు ఉంచుతాయి. రాయలసీమ చరిత్ర, కళలు, ఆలయ సంస్కృతి మొదలైన సాధారణాంశాలు చెప్పి విశేషంగా ఈ గ్రంథంలో 'కరువు' మీద 'నీటి' సమస్యమీద 'Focus' చేయటం ప్రధానంగా కనిపిస్తుంది. రాయలసీమ రైతులు రాజకీయంగా ఎదగాలని చెప్పిన అంశం (అమెరికాయే ఆదర్శం) - రాయలసీమ నేతలందర్నీ ఆలోచింపచేస్తుంది. రాయలసీమలో ముఠాలు పోవాలి. పాలెగాళ్ళ సంస్కృతి నశించాలి - అప్పుడే ప్రజాస్వామికమైన హక్కుల పోరాటాలు సాగుతాయి. లేకపోతే ఒకరు చేసిందాన్ని మరొకరు నాశనం చేయడమే ధ్యేయంగా రాజకీయాలు నడుపుతారు. రాయలసీమలో అన్ని సమస్యలు పెడదారి పట్టడానికి కారణం ఇదే. ఈ అంశాన్ని రచయిత చాలా చక్కగా వివరించారు.

శ్రీ మైనాస్వామి స్వయంగా రచయిత. కథా రచయితగా మంచి పేరు పొందారు. వారి కథలో 'కరువు' ఎలా వివరింపబడిందో చూస్తే నాకు రాయలసీమ కరువు నేపథ్యంగా రాసే కథకులు పలువురు గుర్తుకు వచ్చారు.

పంటల భీమా పథకాలు ఎన్నో రావాలి. రైతుకు ప్రాణ భద్రత కల్గించాలి. కృత్రిమ వర్షాలు కురిపించాలి - ఇవన్నీ తప్పకుండా వెంటనే చేపట్టాల్సిన పనులు.

కాగా ఆధునిక పద్ధతులపై విశ్వాసమున్న మేధావి రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడు కూడా రాయలసీమవారే. వారు ఈ గ్రంథంలోని అంశాలను తన మెదడు కంప్యూటర్లో భద్రపరుచుకొని 'వాటర్ మేనేజ్‌మెంట్' విషయంలో ఒక కొత్త ప్రమాణాన్ని జాతీయ స్థాయిలో చేయించ గలిగితే మనమందరం ఆయనకి ఋణపడి వుంటాం. అదే గనుక జరిగితే రచయిత లక్ష్యం నెరవేరినట్లే.

ఆదినుంచి అన్యాయమేనా?

రాయలసీమకు అన్ని రంగాల్లో ఆదినుంచి అన్యాయం జరుగుతున్నది. నీటి వనరులు, పరిశ్రమలు, విద్య, వైద్యం, తదితర రంగాల అభివృద్ధిలో స్వాతంత్ర్యం నాటినుంచే ద్రోహం జరిగింది. రాయలసీమకు గుండెకాయ వంటి అనంతపురంలో 1926లోనే (ఆంధ్ర) విశ్వవిద్యాలయం స్థాపించి వుంటే 'సీమ' ప్రజానీకంలో మరింత చైతన్యం వచ్చి వుండేది. ఆ విశ్వవిద్యాలయం వాల్తేరు (విశాఖ)కు వెళ్ళిపోయింది. 'దేశోద్ధారక' కాశీనాధుని నాగేశ్వరరావు పంతులు ఆధ్వర్యంలో, ఆయన నివాసమైన 'శ్రీబాగ్' (మద్రాసు)లో 1936 నవంబర్ 19న జరిగిన పెద్ద మనుషుల ఒప్పందం అమలు గాక పోవడం దారుణం. రాయలసీమ అభివృద్ధికి అందరూ దోహదం చేస్తామని చెప్పిన పెద్ద మనుషులు శ్రీబాగ్ ఒప్పందానికే తీరని ద్రోహం చేశారు. క్రిష్ణా జలాల్లో అత్యధిక వాటాను కరువు సీమకు వినియోగించాలన్న శ్రీబాగ్ సూత్రాన్ని నాటి పాలకులు తుంగలో తొక్కారు. రాష్ట్ర రాజధానిని కర్నూలులో ఏర్పాటు చేసినట్టే చేసి మార్చివేశారు. రాయలసీమ రాజుల యేలుబడిలో వుండిన చెన్నపట్టణం (చెన్నయ్), బళ్ళారి ప్రాంతాలు 'సీమ'కు దక్కకుండా పోవడం వెనుక కుతంత్రాలు, కుత్సిత రాజకీయాలు దాగి వున్నాయి. చంద్రగిరి సంస్థానానికి సామంత రాజుగా వున్న దామెర్ల వెంకటాద్రి నాయకుడు తన తండ్రి చెన్నప్ప పేరు మీదుగా మైలాపూరును చెన్నపట్టణంగా తీర్చిదిద్దాడు. రాష్ట్రాల విభజన, ఏర్పాటు సమయంలో 'సీమ' నాయకులు చిత్తశుద్ధితో వ్యవహరించి వుంటే.. రాళ్ళసీమగా, మరుభూమిగా ఈ నేల మారివుండేది కాదు. రాష్ట్ర విస్తీర్ణంలో 27 శాతం ఆక్రమించిన రాయలసీమలో 70 లక్షల ఎకరాల సాగుభూమి వుంది. అందులో 15 లక్షల ఎకరాలకు కూడా నీటి వసతి లేదు. గనులకు, త్యాగధనులకు, పౌరుషానికి ప్రతీకగా వున్న రాయలసీమకు నాటి నుంచి నేటి వరకు ద్రోహం జరుగుతూనే వుంది. నీటి ప్రాజెక్టుల నిర్మాణానికి వేసిన పునాదిరాళ్ళు సీమ వాసులను వెక్కిరిస్తున్నాయి.

తెలుగువారి తొలి గడ్డగా రాయలసీమకు చరిత్రలో చోటు లభించినా, సీమ సంస్కృతి మహా గొప్పదని పొగిడించుకొన్నా, పేరు గొప్ప ఊరు దిబ్బ సామెతను గుర్తుకు తెస్తున్నది. బళ్ళారి సమీపంలోని మ్యాకదొన దగ్గర దొరికిన పల్లవరాజు శివస్కంద వర్మ క్రీ.శ. 234 నాటి ప్రాకృత శాసనంలో "ఆంధ్ర పథం" అనే పదం తొలిసారిగా అగుపించింది. క్రీ.శ. 575 నాటి తొలి తెలుగు శాసనం కడప జిల్లా కలమళ్ళ వద్ద లభించింది.

మహోన్నత చరిత్ర - సంస్కృతి కలిగిన రాయలసీమ నుంది కొందరు రాష్ట్రపతి, ప్రధాని, ముఖ్యమంత్రి వంటి ఉన్నత పదవులు అధిష్టించినా.. కరువు సీమ ప్రజల కడగండ్లు తీరలేదు. ఈ పాపంలో ఎవరి భాగం ఎంత సీమకు జరిగిన విద్రోహంలో ఎవరి వాటా ఎంతెంత అని ప్రతి ఒక్కరూ ఆలోచించి మన సీమకు న్యాయం జరగడానికి పోరాటం చేయాలి.

* * *

రాయలసీమ... రాయలేలిన రతనాల సీమ. ఇది ఒకప్పటి మాట. రాయలసీమ .... రాళ్ళసీమ. ఇది నేటి మాట. రాయలసీమకు కరువుకు అవినాభావ సంబంధం వుంది. బీటలు వారిన పొలాలు, పాతాళానికి పోయిన నీటి చుక్క, ప్రకృతి నిరాదరణ, రాజకీయ నాయకుల నిర్లక్ష్యం తదితర కారణాల వల్ల రాయలసీమ ఎడారిదిశగా పయనిస్తున్నది. తరాలు మారినా 'సీమ' వాసుల తల రాతలు మాత్రం మారలేదు.

రాయలసీమను రతనాల సీమగా మార్చడానికి తమ స్వంత ఆభరణాలను సైతం ఖర్చుపెట్టారు విజయనగర రాణులు. అది చారిత్రక వాస్తవం. కరువులు సంభవించినప్పుడు కాలువలు, చెరువులు నిర్మించడం, కోనేరులు తవ్వించడం లాంటి "కరువు పనులు" చేపట్టి ప్రజలను రక్షించారు నాటి రాజులు. విజయనగర పాలకులు తమ పాలనలో రాయలసీమలో నీటి వనరుల పరిస్థితిని ఎంతగానో మెరుగు పరచారు. "ఈ ప్రాంతంలో కొత్తగా కాలువలు, చెరువులు, బావులు నిర్మించవలసిన పనిలేదు. ఉన్న వాటికి మరమ్మత్తులు చేసి వాటిని వినియోగించుకొంటే చాలు' ' అని అప్పటి దత్త మండలాల కలెక్టర్ సర్ థామస్ మన్రో 1801 లో చెప్పారు.

రాయలసీమ ఎడారిగా మారకుండా నిరోధించడానికి, 'సీమ'ను సస్యశ్యామలం చేయడానికి కల్నల్ మెకంజీ, రిటైర్డు చీఫ్ ఇంజనీర్ డా. తిరునారాయణ్, డా.కె.ఎల్.రావు, తెలుగు గంగ మాజీ ప్రత్యేక అధికారి డా. శ్రీరామక్రిష్ణయ్య, శ్రీరామరెడ్డి వంటి మేధావులు ఎన్నో పథకాలను రూపొందించారు. అయితే పాలకులు అనుసరిస్తున్న కుత్సిత రాజకీయాల వల్ల, నిర్లక్ష్యం వల్ల ఆ పథకాలు కొన్ని కాగితాలకే పరిమితమయ్యాయి. మరికొన్ని రద్దు కూడా అయ్యాయి. ప్రస్తుతం వున్న "తుంగభద్ర హైలెవెల్ కెనాల్"కు సమాంతరంగా మరో కాలువను తవ్వి అత్యంత వెనుక బడిన అనంతపురం జిల్లాను ఆదుకొంటామని అప్పటి ముఖ్యమంత్రి డా. ఎన్టీరామారావు 1985లో ప్రకటించారు. అయితే ఆ పథకం ఆచరణ యోగ్యం కాదని ఆనాటి ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కరరెడ్డి 1993లో తేల్చి పారేశారు.

రాయలసీమకు ప్రాణాధారం కానున్న గాలేరు - నగరి, హంద్రీ - నీవా తదితర ప్రాజెక్టుల పరిస్థితి ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్నట్టుంది. మరెన్నో చిన్న చిన్న నీటి ప్రాజెక్టుల పునాది రాళ్ళపై మరో రాయి పడలేదు. నీటి ప్రాజెక్టులకు "రాజకీయ గ్రహణం" పట్టింది. 'సీమ' సమస్యల కోసం ఉద్యమాలు చేసిన వారు 'సీమ' సింహాలుగా పేరు తెచ్చుకొన్నారు. 'సీమ' ఉద్యమం ద్వారా నాయకులుగా ఎంతో ఎత్తుకు ఎదిగారు. అధికారాన్ని తమ 'హస్త'గతం చేసుకొన్నారు. 'సీమ' కోసం ప్రాణత్యాగం చేస్తామన్నారు. రాయలసీమను ఎడారి కానివ్వం అన్నారు. అవన్నీ "ఉత్తరప్రగల్భాలు"గా మిగిలిపోయాయి. 'సీమ' కోసం వారు చేసింది శూన్యం. 1986లో 'సీమ' ఉద్యమ నాయకులతో పాటు నేను కూడా 'పాదయాత్ర' చేశాను. ఆ స్ఫూర్తితో కరువుపై ఎన్నో వ్యాసాలు రాశాను. ఉజ్వల, ఆంధ్రప్రభ, ఇండియన్ ఎక్స్‌ప్రెస్, ఆంధ్రజ్యోతి దినపత్రికల్లో, సుప్రభాతం వార పత్రికలో రాయలసీమ చరిత్ర - సంస్కృతి, రైతన్నల దీనగాథలు, కరువు పరిస్థితులు, నీటివనరులు, ముఠాకక్షలు తదితర అంశాలపై పరిశోధనాత్మక వ్యాసాలను రాయడం జరిగింది.

రాయలసీమలో నెలకొన్న దుర్భర పరిస్థితులపై ఒక పుస్తకాన్ని ప్రచురించాలన్న తపన తొమ్మిదేండ్ల తర్వాత నెరవేరింది. సుసంపన్నమైన రాయలసీమ చరిత్ర, 'సీమ' లోగిలిలో శాశ్వతంగా తిష్ఠ వేసిన కరువు, అభివృద్ధికి అడ్డుగోడలుగా నిల్చిన ముఠాకక్షలు, ప్రజా సంక్షేమం కోసం నాటి రాజుల చర్యలు, నేటి పాలకుల విధానాలు, సీమ అభివృద్ధికి ఏమి చేయాలి వంటి వాటి గురించి తెలియ జెప్పాలన్న సంకల్పమే నా పుస్తకం "ఎన్నాళ్ళీ కన్నీళ్ళు?". పాఠక దేవుళ్ళు దయతో నన్ను ఆశీర్వదించాలని, రాయలసీమ అభివృద్ధికి 'సీమ'లో పుట్టిన ప్రతి వ్యక్తి పాటుపడాలని అర్థిస్తున్నాను.

ఈ పుస్తకం ప్రచురించాల్సిన అవసరం ఇప్పుడే ఎందుకు కలిగింది? 2000 సం॥ ముగిసిన తరువాత రాయలసీమ హక్కులకు ప్రమాదం ముంచుకొచ్చింది. అందువల్ల ప్రజలను మరింత చైతన్యవంతులను చేయడం కోసమే నా ప్రయత్నం. పుస్తక ప్రచురణలో నాకు సహకరించిన సహృదయ స్నేహశీలురకు, శ్రేయోభిలాషులకు నా నమస్కారాలు.

మైనాస్వామి
తిరుపతి

3.3.2001

నాగురించి.....

పూర్తిపేరు	:	మైలారం నారాయణ స్వామి
కలం పేరు	:	మైనాస్వామి
తల్లిదండ్రులు	:	శ్రీమతి తులశమ్మ, స్వర్గీయ రంగప్ప
పుట్టినవూరు	:	మల్లాపల్లి, గోరంట్ల మండలం, అనంతపురం జిల్లా
పుట్టిన తేది	:	03-10-1962
ప్రాథమిక విద్య	:	ప్రాథమిక పాఠశాల, కరావులపల్లి, గోరంట్ల మండలం,
హైస్కూల్	:	జిల్లా పరిషత్ హైస్కూల్, గోరంట్ల
జూనియర్ కాలేజి	:	విజయనగర సామ్రాజ్య రెండో రాజధాని - పెనుకొండ
బి.యస్సీ	:	మున్సిపల్ కళాశాల, చిక్కబళ్ళాపురం, బెంగుళూరు విశ్వవిద్యాలయం
ఎం. ఏ. (చరిత్ర)	:	మైసూరు యూనివర్శిటీ, మైసూరు
ఆలయ సంస్కృతిలో పి.జి. డిప్లొమా	:	సంస్కృత యూనివర్సిటీ, తిరుపతి
ఎల్.ఎల్.బి.	:	తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ పరిధిలోని అంబేద్కర్ లా కాలేజిలో ప్రస్తుతం మూడో సంవత్సరం.
శాశ్వత చిరునామా	:	మైనాస్వామి, కరావులపల్లి, గోరంట్ల మండలం, అనంతపురం జిల్లా

ప్రస్తుత చిరునామా : మైనాస్వామి, 8, టి.టి.డి. క్వార్టర్స్, మూడో సత్రం వద్ద,
తిరుపతి - 517 501
e-mail:mynaswamy@usa.net

అనుభవం : 18 సం॥ లుగా ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి, ఇండియన్ ఎక్స్‌ప్రెస్, సుప్రభాతం వీక్లీలలో పాత్రికేయ వృత్తి

ప్రత్యేకత : సుమారు 475 ప్రత్యేక వ్యాసాలు, 29 కథలు, 32 వరకు రేడియో ప్రసంగాలు, నవల - భగీరథుడు

రచనలు :
1. రాయలసీమ అపూర్వ కళాఖండాలు (A research book on Temples & Historic Places of Rayalaseema)
2. ఎన్నాళ్ళీ కన్నీళ్ళు? (A research book on History & Culture, Drought conditions & Irrigation facilities, Factionism, Development etc ., of Rayalaseema)
3. దైవారాధన - దేవాలయం పుట్టు పూర్వోత్తరాలు (A research book on Temple Culture)

రాబోవు రచనలు :
1. స్పేస్ ఇండియా (A book on Indian Space Science & Rocket Technology)
2. ఆది సోషలిస్టు బుద్ధుడు (A new Theory)
3. అమెరికా - భారత్‌లలో మానవ హక్కుల పరిరక్షణ
4. భారతీయ సంస్కృతి - హరప్ప నుంచి హంపి దాకా

జీవితాశయం : *నా వున్నతికి కారణమైన నా జన్మభూమి ప్రాంతంలో కనీసం 500 ఎకరాలకు అదనంగా నీటి సౌకర్యం కల్పించడం, నిరుపేదల - దళితుల అభ్యున్నతికి పాటు బడడం.*

రాయలసీమ చరిత్ర

చరిత్ర అంటే మానవ వికాసం. మనిషి ఆలోచనలు, అవసరాలు ముఖ్యమైన సంఘటనలు, జీవన విధానం, సంస్కృతి, నాగరికతలు చరిత్రకు ముఖ్యాంశాలు. రాజులు -యుద్ధాలు, పట్టాభిషేక మహోత్సవాలు మాత్రమే చరిత్ర కాదంటారు ప్రఖ్యాత భారత చరిత్రకారుడు దామోదర్ ధర్మానంద్ కోశాంబి. ఆచార వ్యవహారాలు, వ్యవసాయ విస్తరణ, నాగరికత చరిత్రకారులకు అత్యంత ముఖ్యమన్నది కోశాంబి అభిప్రాయం. ప్రపంచ ప్రసిద్ధి పొందిన పాశ్చాత్య చరిత్రకారుడు బ్యూరీమాటల్లో చెప్పాలంటే "చరిత్ర సామాజిక శాస్త్ర విజ్ఞానం". ఆధారాలు లేని చరిత్ర అనర్థం. ప్రాచీన గ్రంథాలు, పురాణాలు, ఇతిహాసాలు, మతపరమైన విషయాలు, కర్మకాండలు, ఆయుధాలు, పనిముట్లు, అలంకరణ సామగ్రి, సమాధులు చరిత్ర రచనలో ప్రముఖ పాత్ర వహిస్తాయి. సాహిత్య ఆధారాలు కొంత వరకు మాత్రమే సమాచారాన్ని ఇవ్వగలవు. పురావస్తు ఆధారాలు చాలా ముఖ్యమైనవి.

రాయలసీమకు భారతదేశ చరిత్రలో ప్రత్యేక స్థానం ఉంది. ఈజిప్టులోని నైలునది ప్రాంత నాగరికత, మెసపటేమియా, స్విట్జర్లాండ్‌లో విలసిల్లిన సరస్సు వాడల సంస్కృతి నాగరికతలతో పోల్చదగిన ప్రాంతాలు రాయలసీమ జిల్లాల్లో వున్నాయి. అనంతపురం, కర్నూలు, కడప, చిత్తూరు జిల్లాలను రాయలసీమగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం కర్నాటకలో వున్న బళ్లారి జిల్లా భాషా ప్రయుక్త రాష్ట్రాలు యేర్పడక ముందు రాయలసీమలో అంతర్భాగమే. అదేవిధంగా కంభం, గిద్దలూరు, మార్కాపురం ప్రాంతాలు ప్రస్తుతం ప్రకాశం జిల్లాలో వున్నా సీమ సంస్కృతినే కలిగివున్నాయి. ప్రాచీన కాలంలో ఈ ప్రాంతాన్ని 'దక్షిణాపథం' అని పిలిచేవారు. వింధ్య పర్వతాలకు దక్షిణం నుంచి కింది వైపున సముద్రాల వరకు గల ప్రదేశమంతా 'దక్షిణాపథం' అని ప్రతీతి. రామాయణం, మహాభారతం ఇతిహాసాల్లో రాయలసీమలోని కొన్ని ప్రాంతాల ప్రస్తావన వుంది. రావణుడు సీతను ఎత్తుకొని పోతుండగా జటాయువు అనే పక్షి అడ్డుకొనింది. సీతను వెదుకుతూ వచ్చిన శ్రీరామునికి రెక్కలు తెగి పడిన జటాయువు కనిపించింది. 'లే... పక్షి' అంటూ ఆ పక్షిని శ్రీరాముడు చేతుల్లోకి తీసుకొన్నారు. అప్పటి నుంచి ఆ ప్రదేశం లేపాక్షిగా ప్రసిద్ధి చెందిందన్న కథ ప్రచారంలో ఉంది. లేపాక్షిలో అపూర్వ శిల్ప సంపదకు ఆలవాలమైన వీరభద్రాలయం, అతిపెద్ద నంది విగ్రహం, శివలింగాన్ని ఆలింగనం చేసుకొన్న ఐదు తలల పాము విగ్రహాలు విశేష ప్రాచుర్యాన్ని పొందాయి. లేపాక్షి అనంతపురం జిల్లా హిందూపురం సమీపంలో వుంది. రామాయణంలో వాలి, సుగ్రీవుల రాజధాని కిష్కింధ బళ్లారి జిల్లాలోని హంపీ క్షేత్రం. రాయలసీమలో పారే క్రిష్ణా, తుంగభద్ర, పెన్నా, చిత్రావతి, బాహుదా నదీ తీరాల్లో ఆదిమ మానవుల ఆవాసాలు, ఈజిప్టులోని పిరమిడ్‌లతో పోల్చదగిన రాక్షస సమాధులు, అతి ప్రాచీన శిలలు, ఆలయాలు 'సీమ' చరిత్రను సుసంపన్నం చేశాయి. శ్రీ వేంకటేశ్వరస్వామి కొలువైన తిరుమల కొండలు ప్రపంచంలో

అత్యంత ప్రాచీనమైనవి. తిరుమలలోని సహజ శిలాతోరణంలోని శిల వయస్సు 250 కోట్ల సంవత్సరాలని శాస్త్రజ్ఞులు అంచనా వేశారు. తిరుమల కొండ నుంచి కాలినడకన కడప జిల్లా వైపు వెళ్ళేదారిలో యుద్ధగళ తీర్థం అనే ఆదిమ మానవుల ఆవాసం వుంది. అక్కడ ఆదిమ మానవులు గీసిన రేఖా చిత్రాలు వున్నాయి. ఒక పెద్ద బండపై ఆదిమ మానవుని ఆకారం, బండ్లను లాగే ఆబోతులు, బండి ఇరుసులు తదితర బొమ్మలను చిత్రించారు. ఆ చిత్రాలు క్రీస్తు పూర్వం 2,500 నాటివి. అనంతపురం జిల్లాలోని పాలవాయి, దొరిగల్లు, పులికల్లు, కదిరి దగ్గర గల ముండ్ల వారి పల్లి, కడప జిల్లా వేముల, వెల్లటూరు, కర్నూలు జిల్లా బెలూం గుహలు, పత్తిపాడు, చిత్తూరు జిల్లా గుడిపాల, నెల్లిపట్ల, బళ్ళారి జిల్లాలో ఆదిమ మానవులు నివసించినట్టు ఆధారాలున్నాయి.క్రిష్ణా, పెన్నా నదుల గట్లలో పాత శిలాయుగం పనిముట్లులభించాయి. అనంతపురం జిల్లా గుంతకల్లు, విడపనకల్లు, వేల్పుమడుగు,లత్తవరం, ఉరవకొండ, తాడిపత్రి, ముచ్చుకోట, కర్నూలు జిల్లా నదీ తీరాల్లో, కడప జిల్లా రాయిచోటి వద్దగల సరస్వతిపల్లి, ముక్రాలపల్లి, కోడూరు సమీపంలోని చిట్వేలు, కలసపాడు, కనములపల్లి, చిత్తూరు జిల్లా తిరుమల, రేణిగుంట తదితర ప్రాంతాల్లో పాతశిలాయుగం పనిముట్లు దొరికాయి. బళ్లారి జిల్లా సంగనకల్లు వద్ద మధ్యశిలాయుగం, కొత్త శిలాయుగం మధ్యకాలం నాటి పనిముట్లు లభించాయి. అమెరికన్ బాప్టిస్ట్ మిషన్‌కు చెందిన ఫ్రాంక్ పి. మాన్లే, బ్రూస్ ఫుట్‌లు దక్షిణ దేశంలో పాత శిలాయుగంపై విస్తృతంగా పరిశోధించారు. కొత్త శిలాయుగం ప్రారంభసమయానికి పశువుల పెంపకం, వ్యవసాయం చేస్తుండేవారు. ఇనుము వాడకంలోకి వచ్చిన తరువాత వ్యవసాయ విస్తరణ జరిగింది. ఇనుము, వ్యవసాయ పద్ధతులు ఉత్తరాది నుంచి దక్షిణాదికి దిగుమతి అయ్యాయని కోశాంబి పేర్కొన్నారు. కానీ క్రీ.పూ. 2000 సం॥నాడు తిరుపతి సమీపంలోని కరకం బాడి వద్ద గల క్రిష్ణమనాయుడు మిట్టలో ఇనుమును కనుగొన్నారు. ఇనుము ద్వారా ఆయుధాలు, వ్యవసాయ పనిముట్లు తయారయ్యాయి. ఆహారం వేటమాని ఆహారం ఉత్పత్తిని ప్రారంభించారు. ఉలవలు, రాగులు పండించినట్టు తిరుపతి శ్రీ వెంకటేశ్వర యూనివర్శిటీ పరిశోధకులు తేల్చిచెప్పారు. బళ్లారి, అనంతపురం, కర్నూలు జిల్లాల్లో కూడా లోహ (ఇనుము) యుగం ప్రారంభానికి సంబంధించిన ఆనవాలు దొరికింది. పత్తిపాడు వద్ద చిన్న పాత్రలు, గుర్రం బొమ్మ వంటి వస్తువులు లభించాయి. అంటే ఇనుము, వ్యవసాయం దక్షిణాదికి ఎక్కడి నుంచో దిగుమతి కాలేదని ఖచ్చితంగా చెప్పవచ్చు. ఇప్పటికీ కూడా దక్షిణాదిలో వున్నంతగా వ్యవసాయాభివృద్ధి ఉత్తర దేశంలో లేదు. విశాలమైన భూములు, అపార జల సంపద వున్నా.. ప్రస్తుత ఆధునిక సమాజంలోనూ జొన్నలే ఎక్కువగా పండిస్తున్నారంటే ఉత్తరాదిన వ్యవసాయ విస్తరణ ఏ మాత్రం జరిగిందో అర్థం చేసుకోవచ్చు.

ఇదిలా ఉండగా వ్యవసాయవిస్తరణ జరిగిన తరువాత రాయలసీమ నాగరికతలో పలుమార్పులు చోటుచేసుకొన్నాయి. మానవుని ఆలోచన, మేధ పెరిగింది. భూమి పూజ, లింగపూజ మొదలయింది. బళ్ళారి జిల్లా కుప్పగల్లు మిట్ట మీద శివలింగం, శివుని వాహనం నంది బొమ్మలు గీశారు. మత పరమైన కర్మకాండలు ఊపిరిపోసుకొన్నాయి. శవఖననానికి ప్రత్యేక ప్రాధాన్యత వచ్చింది. మృత శరీరాన్ని ఆరుబయలులో పారేయడానికి స్వస్తిచెప్పి పెద్ద గుంత తవ్వి అందులో పూడ్చి పెట్టడం, చనిపోయిన వ్యక్తికి ఇష్టమైన వాటిలో కొన్నింటిని కుండలో వుంచి ఖననం చేయడం ఆనవాయితీ అయింది. ఆ పెద్ద సమాధులే రాక్షస సమాధులు. 'సీమ'లో వాటిని పాండుగుళ్ళు అంటారు. సమాధులు చిన్న గుడి ఆకారంలో వున్నందున రాక్షస సమాధులను పాండుగుళ్ళుగా పిలుస్తున్నారు. రాక్షస గుళ్ళు అని కూడా

అంటారు. రాక్షస సమాధుల సంస్కృతి క్రీ.పూ. 2500 సంవత్సరం సమీపంలో మొదలయి వుంటుందని పాశ్చాత్య చరిత్రకారులు పేర్కొన్నారు. రాక్షస సమాధులు అనంతపురం జిల్లా గోరంట్ల మండలం కరావులపల్లి, పులేరు, కొండాపురం, ధర్మవరం దగ్గర గల మాల్యవంతం, కర్నూలు జిల్లా పత్తిపాడు, కోయిలకుంట్ల, కడప జిల్లా వేముల, పులివెందుల, యర్రగుంట్ల, రాయచోటి, చిత్తూరు జిల్లా పలమనేరు దగ్గరలోని బాపలనత్తం, గుడిపాల, బోడిగుట్ట, బసినికొండ, మదనపల్లి పరిసరాల్లో వున్నాయి. అనంతపురం జిల్లా గోరంట్ల, చిత్తూరు జిల్లా పలమనేరు చుట్టుపట్ల వందలాది సమాధులు వున్నాయి. కరావులపల్లిలోని మైలారం వెంకటప్ప గారి మైలారం రంగప్ప పొలంలో గల ఒక సమాధి తవ్వకంలో నేను (రచయిత) స్వయంగా పాల్గొన్నాను. అందులో పలు ఆసక్తికరమైన అంశాలు బయటపడ్డాయి. సమాధి దీర్ఘచతురస్రాకారంగా వుంది. నాలుగువైపుల నాలుగు చాలా బలమైన బండలను భూమిలో గోడల్లాగా వుంచారు. సమాధి అడుగున ఒక బండ, పై భాగాన (మూత) మరో బండ వుంది. ఎర్రటి కుండలు మూడు వున్నాయి. కుండలు ఒక దానిపై ఒకటి సైజు వారీగా పెట్టారు. కుండల్లో వరిపొట్టు, బొగ్గులు, ఎర్రటి బూడిద వుంచారు. సమాధి కాబట్టి ఎముకలు ఎలాగూ వుండనే వుంటాయి. అంతకు మించి సమాధిలో ఏమీ దొరకలేదు. కుండలు కళాత్మకంగా, నునుపుగా, నాజూగ్గా వున్నాయి. ఆ కుండలు అప్పటి నాగరికతను సూచిస్తున్నాయి. రాక్షస గుళ్ళను చరిత్రకారులు 'మెగాలితిక్ కల్చర్'గా పిలుస్తున్నారు. ఆంగ్లేయ సైనికాధికారి కల్నల్‌బ్రాన్‌హిల్ తొలిసారిగా సుమారు శతాబ్దం కిందటే రాక్షస గుళ్ళపై పరిశోధనలు చేశారు.

రాజరిక వ్యవస్థ ఏర్పడిన తరువాత రాయలసీమను ఎందరో రాజులు పాలించారు. మౌర్య సామ్రాజ్యం నాటి కాలం నుంచి వలస పాలన ముగిసేవరకు సీమ ప్రజలు ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొన్నారు. అందరి రాజుల ధ్యేయం ఒక్కటే.. పన్నుల వసూలు కోసం ప్రజలను పీల్చి పిప్పి చేయడం.. విజయనగర రాజుల పాలనలోనే రాయలసీమ వ్యవసాయం బాగా అభివృద్ధి చెందింది. మౌర్య సామ్రాజ్య చక్రవర్తి అశోకుడు క్రీస్తు పూర్వం మూడో శతాబ్దంలో దాదాపు దేశమంతటినీ తన పాలన కిందకు తెచ్చుకొన్నాడు. తాను చేసిన పనులను ప్రజలు ఆచరించవలసిన ధర్మసూత్రాలను బోధిస్తూ శిలాశాసనాలు రాసే కొత్త పద్ధతికి అశోకుడు శ్రీకారం చుట్టాడు. రాయలసీమ ప్రాంతం అశోకుని ఏలుబడిలో వుండేదనడానికి కర్నూలు జిల్లా ఎర్రగుడి, బళ్ళారి జిల్లా సిద్ధాపురం, అనంతపురం జిల్లా గుత్తికోటలో దొరికిన శిలాశాసనాలే సాక్ష్యం. అయితే మౌర్య సామ్రాజ్య వ్యవస్థాపకుడు చంద్రగుప్తుని కాలం నాటికే శాతవాహనుల పరిపాలనలో ఆంధ్ర రాజ్యం బలీయంగా వుందని చంద్రగుప్తుని ఆస్థానంలోని గ్రీకు రాయబారి మెగస్తనీసు పేర్కొన్నాడు. అంటే క్రీ.పూ. 400 సం॥ నాడే శాతవాహన రాజ్యం ఆవిర్భవించి వుండవచ్చు. దాదాపు ఐదు నూర్ల సంవత్సరాలు ఆంధ్ర ప్రాంతాన్ని వారు పాలించారు. రాయలసీమ వారి పాలనలోనే వుండింది. క్రీ.పూ. రెండో శతాబ్దానికి చెందిన పరశురామేశ్వర లింగ ప్రతిష్ఠ శాతవాహనుల హయాంలోనే జరిగింది. పరశురామేశ్వర గుడి చిత్తూరు జిల్లా రేణిగుంట దగ్గరగల గుడిమల్లం గ్రామం వద్ద వుంది. శాతవాహనులు తొలుత సామంతులుగా వుండి తరువాత స్వతంత్ర రాజులైనట్లు చరిత్ర తెలుపుతున్నది. ఆంధ్ర ప్రాంతాన్నే గాక దక్షిణ భారతదేశాన్నంతా వారు పాలించారు. శాతవాహనుల్లో తొలి సర్వస్వతంత్ర రాజు శ్రీముఖుడు. శ్రీముఖుడు క్రీ.పూ. 221 నుంచి 198 వరకు పాలించాడు. ఆఖరిరాజు యజ్ఞశ్రీ శాతకర్ణి. అతను క్రీ.శ. 174 నుంచి 203 వరకు రాజుగా

కొనసాగారు. శాతవాహనుల కాలంలో 'ప్రాకృతం' శాసనభాష (రాజభాష)గా వెలుగొందినది. అశోకుని శాసనాలు బ్రాహ్మీలిపిలో వున్నాయి. శాతవాహనుల రాజ్యంలో సంస్కృతం కూడా వుంది. వివిధ ద్రావిడ భాషలు వాడుకలో వున్నాయి. అందులో ఆంధ్రం ఒకటి. ప్రాకృత శాసనాల్లో పలు తెలుగు పదాలున్నాయి.

ఇదిలా వుండగా దక్షిణాది భాషలైన తెలుగు, తమిళం, కన్నడం, మళయాళంలకు మూలం ద్రావిడం. ద్రావిడం శాఖలుగా చీలి స్వతంత్ర భాషలు ఆవిర్భవించాయి. దక్షిణాది బాషలన్నీ దాదాపు ఒకే కాలంలో అభివృద్ధి చెందాయి. పల్లవరాజు శివస్కంద వర్మ క్రీ.శ. 234లో బళ్ళారి జిల్లాలో చెక్కించిన ప్రాకృత శాసనంలో "ఆంధ్ర పథం" అనే పదం తొలిసారిగా అగుపడింది. ఆంధ్రపథం అనేది తెలుగు ప్రజలు నివసించే ప్రాంతం. క్రీస్తు శకారంభానికి చెందిన బళ్ళారి జిల్లా మ్యాకదొన శాసనంలో 'వేపూరు' అనే తెలుగు పదం వుంది. వేము+వూరు=వేపూరు. మ్యాకదొనశాసనంలో వున్నది ప్రాచీన తెలుగు భాషేనని చరిత్రకారుల అభిప్రాయం. తెలుగువారి తొలి నివాసం రాయలసీమ అని భాషా శాస్త్రవేత్తల, చరిత్రకారుల అభిమతం. చిత్తూరు, అనంతపురం, బళ్ళారి జిల్లాలు పల్లవుల పాలన కిందకు రాగా, కడప, కర్నూలు జిల్లాలు రేనాటి (తెలుగు) చోళుల ఆధీనంలో వుండేవి. క్రీస్తు శకం ఐదు ఎనిమిది శతాబ్దాల మధ్య రేనాటి చోళులు రాజ్యాధికారంలో వున్నారు. రేనాటి చోళులకు చెందిన క్రీ. శ. 575 నాటి కడప జిల్లా కలమళ్ళ శాసనమే అత్యంత ప్రాచీన తెలుగు శిలా శాసనం. కన్నడ లిపి కూడా ఐదారు శతాబ్దాల్లోనే అభివృద్ధి చెందింది. క్రీ. శ 3వ శతాబ్ద ంనుంచి రాయలసీమలో అనేక చిన్న రాజ్యాలు అవతరించాయి. కుదురు, గణ పెద్దలు రక్షకులై రాజులుగా మారి రాజ్యాలను స్థాపించారు. రాయలసీమ క్రీ.శ 3,4 శతాబ్దాల్లో హిరణ్యాక రాష్ట్రంగా పిలువబడింది. హిరణ్యాక రాష్ట్రాన్ని రేమణక అనే సేనాని పాలించాడు. రేమణక క్రీ. శ. 200-250 లో 'సీమ'ను పాలించినట్టు తెలుస్తున్నది. చాళుక్య వంశానికి రేమణక మూల పురుషుడు. దక్షిణాదిలో బలమైన రాజ్యాన్ని స్థాపించిన చాళుక్యుల జన్మస్థలం రాయలసీమ. పల్లవరాజు త్రిలోచనుని చేతిలో పరాజయం పొందిన చాళుక్య రాజు విజయాదిత్యుని (క్రీ.శ 458-480) భార్య కడప జిల్లా ముదివేములో ఒక శిశువుకు జన్మనిచ్చింది. ఆ శిశువే విష్ణు వర్ధన చాళుక్యుడు. చాళుక్యులు ఆంధ్ర, కర్నాటక, మహారాష్ట్ర, గుజరాత్‌లలో రాజ్యాలు స్థాపించారు. తూర్పు చాళుక్యులు, బాదామి చాళుక్యులు, కళ్యాణి చాళుక్యులు అని వివిధ రకాలుగా పిలువబడ్డారు. అదేవిధంగా చోళుల్లో కూడా తెలుగు (రేనాటి)చోళులు, తమిళ చోళులు వున్నారు. కరికాళ చోలుడు చోళ వంశానికి మూల విరాట్టు. పల్లవులు, తమిళ చోళులు కొంతకాలం చిత్తూరు, అనంతపురం, బళ్ళారి జిల్లాలను పాలించారు. అనంతపురం, బళ్ళారి జిల్లాలు, కడప జిల్లాలోని కొంతభాగం కన్నడ రాజులైన రాష్ట్రకూటులు, హొయసలల రాజ్యంలో వున్నాయి. అనంతపురం జిల్లా కదిరిలోగల శ్రీలక్ష్మీనరసింహాలయం లోని శిలాశాసనం ప్రకారం అనంతపురం, బళ్ళారి జిల్లాలు ద్వార సముద్రం (హళేబీడు) రాజధానిగా వున్న హొయసల రాజ్యంలో వున్నాయి. కాకతీయ రాజ్యంలో రాయలసీమ అంతర్భాగమయింది. కాకతీయ సామ్రాజ్యం పతనమైన తరువాత రాయలసీమ విజయనగర రాజుల పాలనలోకి వచ్చింది. హిందూ మత గురువు విద్యారణ్యస్వామి ఆశీస్సులతో హరిహరరాయలు, బుక్కరాయలు (అన్నదమ్ములు) క్రీ.శ. 1336 ఏప్రిల్ 18న రాజ్యాన్ని స్థాపించారు. వారి రాజధాని బళ్ళారి జిల్లాలోని హంపి. హంపికి విజయనగరం, ఆనెగొంది, పంపానగరం అని వివిధ రకాల పేర్లు వున్నాయి. విజయనగరాధీశుల పాలనలో రాయలసీమ వ్యవసాయం బాగా విస్తరించింది. చెరువులు, కాలువల కింద తరీ వ్యవసాయం బాగా సాగడానికి వారు ఎంతో పాటు బడ్డారు. రాయలసీమలో వున్న వేలాది చెరువుల నిర్మాణం వారి హయాంలోనే జరిగింది.

రాష్ట్రంలోని అతిపెద్ద చెరువుల్లో ఒకటైన అనంత పురం జిల్లా బుక్కపట్నం చెరువును విజయ నగర సామ్రాజ్య మంత్రి క్రియాశక్తి ఒడయార్ ఆధ్వర్యంలో నిర్మించారు. నేరుగా సేద్యం చేయడానికి వీలు లేకున్నా చుట్టు పక్కల బావుల్లో నీటి వూటను పెంచే విధంగా నీటిని నిల్వ చేయడం కోసం కూడా వారు చెరువులను కట్టారు. హరిహరరాయలు, బుక్కరాయలు ఆదేశాల మేరకు సామంతులైన తొలిదేదిరాజుకుమారుడు పెద్ద బైరరాజు అనంతపురం జిల్లా గోరంట్ల మండలం మేరెడ్డిపల్లి వద్ద క్రీ.శ. 1383లో ఒక చెరువును నిర్మించడం జరిగింది. ఆ చెరువు నిర్మాణ విశేషాలను తెలిపే శిలాశాసనం కరావులపల్లి పొలాల్లో వుంది. విజయనగర రాజుల కాలంలోనే తుంగభద్ర ఆనకట్టకు పూపిరిపోశారు. అరటి, ఆకుతోటలు, దానిమ్మ ద్రాక్ష, వరి, రాగి తదితర పంటలను విస్తారంగా పండించారు. సాహితీమూర్తి, సమరాంగణ చక్రవర్తి శ్రీ కృష్ణదేవరాయలు (క్రీ. శ. 1509 - 1529) కాలంలో రాయలసీమ వెలుగు ఖండాంతరాలు దాటింది. రక్కసి-తంగడి యుద్ధం (క్రీ. శ. 1565 జనవరి 22) తరువాత విజయనగర సామ్రాజ్యం కొన్ని ఒడిదుడుకులకు లోనయింది. పరిపాలనా సౌలభ్యం కోసం తమ రాజధానిని హంపి నుంచి మార్చారు. రాజ్యం మూడు భాగాలు అయింది. పడమర ప్రాంతానికి పెనుకొండ (అనంతపురం జిల్లా), తూర్పు భాగానికి చంద్రగిరి (చిత్తూరు జిల్లా), దక్షిణ బాగానికి కర్ణాటక లోని శ్రీరంగపట్నం రాజధానీ నగరాలు అయ్యాయి. ఆరవీడు రాజవంశానికి చెందిన తిరుమల రాయలు 1570లో విజయనగర సామ్రాజ్యాన్ని విభజించి కొడుకులను అధికారులను చేశాడు. పెనుకొండకు శ్రీరంగరాయలు, చంద్రగిరికి వెంకటపతిరాయలు అధికారులయ్యారు. విజయనగర రాజ్యం విబాగాలైన తరువాత రాజ్యంలో అంతర్యుద్ధాలు, కుట్రలు, కుతంత్రాలు పెరిగిపోయాయి. దానితో బీజాపూర్, గోల్కొండ నవాబులు 'సీమ'పై కన్నేశారు. మూడో శ్రీరంగ రాయలు బాగా బలహీనపడ్డారు. ఢిల్లీ చక్రవర్తుల సూచనతో, గోల్కొండ నవాబుల సహకారంతో బీజాపూర్ నవాబు ఆదిల్‌షా విజయనగర రాజ్యంపై దాడిచేశాడు. రాజ్యాన్ని రక్షించుకోవడానికి చేతగాని శ్రీరంగరాయలు తొలుత తంజావూరు, తరువాత మైసూరుకు పారిపోయాడు. ఆయన 1672లో మైసూరులోనే మరణించాడు. రాయలసీమ ప్రాంతమంతా బీజాపూర్ రాజ్యంలో కలిసిపోయింది. మహారాష్ట్ర రాజు ఛత్రపతి శివాజీ బీజాపూర్ రాజులను ఓడించి రాయలసీమను 1674లో తన పాలనలోకి తెచ్చుకొన్నాడు. శివాజీ రాయలసీమలో పర్యటించాడు. కర్నూలు జిల్లా శ్రీశైలంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయ ఉత్తర ద్వార గోపురాన్ని శివాజీ కట్టించాడు. ఆ గోపురాన్ని నేటికీ శివాజీ గోపురం అని పిలుస్తున్నారు.

విజయనగర సామ్రాజ్యం 1565లో విచ్ఛిన్నమైన తరువాత రాయలసీమలో రాజకీయ సంక్షోభం ఏర్పడింది. బ్రిటీష్ ఈస్ట్ ఇండియా కంపెనీవారు 1800లో కడప జిల్లాలో దత్తమండలాల కలెక్టర్ కార్యాలయాన్ని స్థాపించేవరకు రాజకీయ అస్థిరత కొనసాగింది. చంద్రగిరి రాజధానిగా యేలిన వెంకటపతిరాయలు (1586-1614) కొంతవరకు స్థిరమైన ప్రభుత్వాన్ని అందించారు. కిందిస్థాయి రాజుల మధ్య శతృత్వం, పాలెగాళ్ళ పాలన ప్రజలను పీల్చి పిప్పిచేశాయి. 'సీమ'రాజుల అంతఃకలహాలు పరరాజులకు బాగా ఉపయోగపడ్డాయి. రాయలసీమను తమ యేలుబడిలోకి తెచ్చుకోవాలని ప్రయత్నించి విఫలులైన ముస్లిం రాజులకు రాజకీయ అస్థిరత రాచబాట వేసింది. 1646లో చిత్తూరు జిల్లా, తరువాత కడప, అనంతపురం, కర్నూలు జిల్లాలోని కొన్ని ప్రాంతాలు గోల్కొండ నవాబుల పాలనలో చేరాయి. గోల్కొండ నవాబులు తమ ప్రతినిధులుగా చిన్న చిన్న నవాబులను నియమించారు. నవాబుల యేలికలోనే పాలెగాళ్ళ వ్యవస్థ పటిష్టమైంది. పాలెగాళ్ళు పన్నుల గురించి తప్ప ప్రజల

ఇదిలా వుండగా క్రిష్ణమనాయుడు మిట...

బాగోగులు, అవసరాల గురించి పట్టించుకోలేదు.

కాగా కర్నాటకలో శ్రీరంగపట్నం రాజధానిగా పరిపాలిస్తున్న రామరాయల రాజ్యం పతనానంతరం మైసూరు మహారాజులు రాయలసీమను చేజిక్కించుకున్నారు. వారి తరువాత శ్రీరంగపట్నం రాజు హైదరాలీ, ఆయన కుమారుడు టిప్పుసుల్తాన్ పాలించారు. రాయలసీమ అంతా తిరిగి గోల్కొండ నవాబుల స్వాధీనమయింది. రాజకీయ అస్థిరతతో నిత్యకరువుతో సీమ ప్రజలు శవాలయ్యారు. పన్నుల రూపంలో ఆదాయం సరిగా అందదని భావించిన గోల్కొండ నవాబులు 1799లో రాయలసీమను బ్రిటీష్ ఈస్ట్ ఇండియా కంపెనీకి దత్తత ఇచ్చారు. గోల్కొండ నవాబులు ఈస్ట్ ఇండియా కంపెనీ నుంచి తాము పొందిన సైన్య సాయానికి ప్రతిఫలంగా సీమను ధారాదత్తం చేశారు.



ఆది మానవుడు గీచిన ఆబోతు చిత్రం



పాండుగుడి

లోహ యుగానికి నాంది

రాయలసీమ చరిత్రకు సాక్షీభూతంగా కొన్నివేల యేళ్ళ నాటి ఆలయాలు, చారిత్రక కట్టడాలు నిలిచాయి. అవన్నీ ఒక ఎత్తుకాగా.. తిరుపతి సమీపంలోని కరకంబాడి వద్దగల క్రిష్ణమనాయుడు మిట్టలో 1997లో బయల్పడిన కొత్తరాతియుగానికి చెందిన ఇనుము -ఉక్కు కర్మాగారం మరో ఎత్తు. ఆ కర్మాగారం క్రీస్తుపూర్వం రెండు వేలయేళ్ళ నాటిదని అంచనా. ఆంధ్రరాష్ట్ర చరిత్రలోనే గాక భారతదేశ చరిత్రలో చోటు సంపాదించుకోబోతున్న ఆ చారిత్రక స్థలం వివరాలు ఇలా వున్నాయి. ఆదిమ మానవుల ఆవాసాలకు నిలయమైన ప్రాంతం శేషాచలం (తిరుమల) కొండల కొస కరకంబాడి గ్రామం వద్ద వుంది. ఆ పక్కనే క్రిష్ణమనాయుడుమిట్ట అనే కుగ్రామం వుంది. కొత్త రాతియుగం ప్రారంభ చరిత్రపై కొత్త వెలుగులు విరజిమ్మిన కృష్ణమనాయుడు మిట్ట అత్యంత ప్రాచీన స్థలం. కొత్త ఊహలకు, సరికొత్త ఆలోచనలకు రూపకల్పన చేసిన ప్రాంతం. నాటి సంస్కృతి నేటికీ కొనసాగుతుండదం చారిత్రక విశేషం. నాడు చిన్న చిన్న మూసలలో తయారుచేసిన ఇనుము, ఉక్కు, వాటి ఉప ఉత్పత్తులైన పూసలు, గాజులు నేడు పెద్ద పెద్ద పరిశ్రమలుగా విలసిల్లుతున్నాయి.

కొత్త రాతియుగం మనుషులు తీర ప్రాంతాల్లో, పల్లపు ప్రదేశాల్లో, కొండగుట్టల్లో నివసించారని పురాతత్వ పరిశోధకుడు నజీమ్ అభిప్రాయపడ్డారు. క్రిష్ణమ నాయుడుమిట్ట కొండ పాద పీఠంలో వుంది. మిట్టకు అనుకునే కరకంబాడి గ్రామ చెరువు వుంది. నాగరికత పెరగడానికి నీరు ఎంతో దోహదపడుతుందనడానికి క్రిష్ణమ నాయుడు మిట్టలో విలసిల్లిన కొత్త రాతియుగం సంస్కృతి చక్కటి వుదాహరణ. కాశ్మీర్ కొండల లోతట్టు ప్రాంతాల్లో, అస్సాంలోని ఖాసీ - గారో ప్రదేశాల్లో, దక్షిణ భారతదేశంలో గోదావరికి దక్షిణ దిక్కులో కొత్త రాతియుగం మనుషులు గుంపులు గుంపులుగా నివసించినట్టు పరిశోధకులు అభిప్రాయపడ్డారు. అయితే ఆంధ్రరాష్ట్రంలో కొత్త రాతియుగం నాటి జన జీవన స్రవంతికి చెందిన ఆనవాలు లభించడం యిదే ప్రప్రథమం. కరకంబాడి, రైల్వేకోడూరు (కడప జిల్లా) కొండల్లో లభించే ఇనుప ఖనిజంతో కొన్ని ఆయుధాలు, పనిముట్లు తయారుచేయడం ద్వారా లోహ యుగానికి నాంది పలికారు. గాలి సంచితో పనిచేయించే కొలిమి ద్వారా మూసలలో ఇనుము ముడి పదార్థాన్ని వేడి చేయడానికి బొగ్గును వాడారు. ఇనుమును 1500 నుంచి 1600 డిగ్రీల ఉష్ణోగ్రత వరకు - వేడి చేయడంతో పూసలు, గాజులు తయారుచేయడానికి ఒక కొత్త పదార్థాన్ని క్రిష్ణమనాయుడుమిట్టలో నివసించిన నాటి మనుషులు కనుగొన్నారు. మూడు రకాల ఆకారాలు గల చిన్నమట్టి పాత్రలను వాడి ముడి పదార్థం నుంచి ఇనుమును, ఇతర పదార్థాలను తయారుచేశారు. అక్కడ లభ్యమైన ఇనుములో మ్యాంగనీసు, కార్బన్ వంటి రసాయనిక పదార్థాలు వున్నాయి.

ఇదిలా వుండగా క్రిష్ణమనాయుడు మిట్ట ప్రాంతాల్లో గతంలో లభించిన ఒక చిన్న మట్టి పాత్ర (మూస) కొత్త రాతియుగం అవశేషాలను వెలికితీయడానికి దారి చూపింది. శ్రీ వెంకటేశ్వర యూనివర్శిటీ కళాశాల అప్పటి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆర్. జగదీశ్వరరావు (జియాలజీ), తమ పరిశోధక బృందంతో వెళ్ళి క్రిష్ణమనాయుడు మిట్టలోని రెండు చోట్ల తవ్వకాలు జరిపారు. పరిశోధకులు ఊహించని విధంగా లోహపరిశ్రమ చిహ్నాలు దొరికాయి. లోహయుగ తొలి మనుషులు తయారుచేసిన మట్టి పాత్రలు, ఇనుము ముద్దలు, ముడి ఇనుము పదార్థాలు, బొగ్గులు తదితరాలు తవ్వకాల్లో బయల్పడ్డాయి. అంతేకాక ఇనుమును తయారుచేయడానికి వాడిన కొలిమిని కూడా పరిశోధకులు కనుగొన్నారు. అప్పట్లో వారు తయారుచేసిన ఇనుము నుంచి గొడ్డలి, బాణం కొస వంటి ఆయుధాలు, నాగలికి వేసే ఇనుపకారు లాంటి వ్యవసాయ పనిముట్లను రూపొందించినట్లు తమ పరిశోధనల్లో తేలిందని ప్రొ॥ జగదీశ్వరరావు చెప్పారు. *దొరికిన వస్తువులు క్రీస్తుపూర్వం 2000-1900 సంవత్సరం నాటివని పరిశోధకులు గుర్తించారు.*

కొత్త రాతియుగం నాటి లోహపరిశ్రమపై పరిశోధన చేయడానికి క్రిష్ణమ నాయుడు మిట్ట ఎంతగానో దోహదపడుతుంది అంతేగాక క్రిష్ణమ నాయుడు మిట్టవాసులే దక్షిణాదిలో తొలిసారిగా వ్యవసాయ విస్తరణకు వుపక్రమించారని చారిత్రక పరిశోధకులు అభిప్రాయపడుతున్నారు. వ్యవసాయం ప్రారంభంకావడానికి ముందే బంకమట్టి ద్వారా చిన్న పాత్రలను తయారుచేసి తమ అవసరాలకు వినియోగించుకొన్నారని 'మిట్ట'లో లభించిన నాటి మట్టి పాత్రల వల్ల తెలుస్తున్నది. మొదట మట్టి పాత్రలను సృష్టించి తద్వారా తమ జీవన విధానంలో ఎన్నో మార్పులు తెచ్చుకొన్నారని తెలుస్తున్నది. పశు సంపదను తమ అధీనంలోకి తెచ్చుకోవడం, వాటిద్వారా మనుషులు లబ్ధిపొందడం అప్పుడే ఆరంభమైంది.

నేడు కరకంబాడి చెరువు వున్న స్థలంలో అనాడు ఒక సరస్సు వుండి వుంటుందని అందువల్లనే కొత్త రాతియుగం సంస్కృతి కొత్త జీవన విధానానికి దారితీసిందని పరిశోధకుల అభిప్రాయం. స్విట్జర్లాండ్‌లో విలసిల్లిన "సరస్సువాడల" సంస్కృతితో క్రిష్ణమ నాయుడు మిట్టను పోల్చవచ్చు. మిట్ట ప్రాంతంలో సమిష్టి వ్యవసాయం జరిగినట్టు కొన్ని ఆధారాల వల్ల తెలుస్తున్నది. ఆ రోజుల్లో ఎత్తయిన, మిట్ట ప్రదేశాల్లో "వలయాకారపు గుడిసెలు" నిర్మించుకొనేవారు. వారందరూ సమిష్టి వ్యవసాయం చేసి, పండిన పంటను అందరూ సమంగా పంచుకొనేవారు. రాగి, ఉలవలు పండించేవారని పరిశోధకులు తేల్చారు. వలయాకారపు గుడిసెలు ఆ ప్రాంతంలో నేడు కూడా వున్నాయి. రాగి పంట నేటికీ వుంది. తరువాత కొన్నేళ్ళకు కొర్ర, సజ్జ వంటి పంటలు వచ్చాయి.

క్రిష్ణమ నాయుడు మిట్టలోహపరిశ్రమ సంస్కృతి దక్షిణ భారతచరిత్రలో కొత్త అధ్యయానికి దారి తీయగలదని చెప్పవచ్చు. ఆ ప్రాంతంలో పురావస్తుశాఖ వారు తవ్వకాలు జరిపితే మరిన్ని విషయాలు వెలుగులోకి వస్తాయి. అత్యంత విలువైన సమాచారాన్ని కనుగొన్న శ్రీ వెంకటేశ్వర యూనివర్శిటీ పరిశోధక బృంద సభ్యులు అభినందనీయులు.

కాగా చిత్తూరు జిల్లా కరకంబాడి సమీపంలోని కొన్ని గ్రామాల్లో పూసలు, గాజులు తయారుచేస్తున్నారు. నాటి సంస్కృతి నేటికీ కొనసాగుతున్నది.

రాయలసీమగా మారిన రాజుల సీమ

రాజులు తమ పరిపాలనా సౌలభ్యం కోసం రాజ్యాన్ని కొన్ని విభాగాలుగా చేశారు. నాడు-నాడి, పాడు పాడి, వాడి వాడ అనే రాజ్యవిభాగపు గుర్తులు ఆంధ్ర శాతవాహనుల కాలం నుంచే వాడుకలో వున్నాయి. మారాజవాడి, మార్లవాడి, మహారాజపాడి, మారాయపాడి, మహారాజర నాడు, మహారాజునాడు, రేనాడు వంటి పేర్లు చిన్న చిన్న రాజ్యాలకు వున్నాయి. ఆ పేర్లన్నీ కూడా రాజు కేంద్రంగా రూపొందినవే. అంటే రాజులు నివసించే ప్రదేశం అని పేర్లలోని నిగూఢార్థం. ప్రజలుంటేనే రాజు వుంటాడు. వివిధ గణాధిపతులు తమంతట తాముగా రాజులుగా ప్రకటించుకొని దేశ హద్దులను ఏర్పాటు చేసుకొన్నారు. ఒక్కొక్క చిన్న ప్రాంతం ఒక్కో దేశంగా అవతరించింది. ప్రస్తుతం రాయలసీమగా పిలవబడుతున్న అనంతపురం, కర్నూలు, కడప, చిత్తూరు జిల్లాల్లో పలువురు చిన్న రాజులు పుట్టుకొచ్చి వాళ్ళ ఆధ్వర్యంలో రాజ్యాలు ఆవిర్భవించాయి. ప్రాచీన కాలంలో రాయలసీమ రేనాడుగా పిలువబడింది. రేడు అంటే రాజు అని అర్థం. నాడు అంటే రాజ్యం. రేడు నాడు రేనాడు అయింది. రేనాడు అనగా రాజులదేశం. దానినే మహారాజునాడు అని కూడా అనేవారు. క్రీ.శ. ఏడెనిమిది శతాబ్దాల నుంచి రాయలసీమను వివిధ పేర్లతో పిలిచారు. తొలుత రేనాడుగా, 8వ శతాబ్దంలో మహారాజరనాడుగా పిలువడింది. 12వ శతాబ్దం నాటికి రేనాడు అనే పేరు మారాయపాడిగా రూపాంతరం చెందింది. రాజ్యం రెండు విభాగాలుగా వుండేది. తూర్పు మారాయపాడికి క్రీష్ఠ మారాయపాడి అని, పడమర మారాయపాడికి మేల్ మారాయపాడి అని పేరుంది. 12వ శతాబ్దం నాటి శాసనాల్లో ఆపేర్లను స్పష్టంగా పేర్కొన్నారు. 12, 13 శతాబ్దాల్లో మరాయపాడి (రాయలసీమ) రాజధాని కడప జిల్లా వల్లూరు. దక్షిణాన కోలారు జిల్లా, ఉత్తరాన నల్లగొండ జిల్లా, తూర్పున బంగాళాఖాతం, పడమర రాయచూరు జిల్లా హద్దులు.

కాకతీయుల కాలంలో వారి రాజ్యాన్ని 77నాడులుగా విభజించి పాలించారు. అందులో రాయలసీమలో ఐదు 'నాడు'లున్నాయి. కడప జిల్లాలోని పులివెందుల, రాజంపేట, ప్రొద్దుటూరు తాలూకాలు, బళ్ళారి జిల్లాలోని ఉత్తర భాగం ములికినాడుగా పిలవబడింది. వినుకొండ కేంద్రంగా రాజ్యపాలన చేసిన వల్లభరాయలు తానురాసిన వీధినాటకం 'క్రీడాభిరామం'లో ములికినాడు ప్రస్తావన వుంది. ములికినాడులోని మోహనగిరిపై వున్న భైరవ క్షేత్రాన్ని వినుకొండ వల్లభరాయలు క్రీ.శ. 1310లో సందర్శించినట్లు ఒక శిలాశాసనం వుంది. రేనాడు, ఏరువనాడు, గండికోట, పెదకల్లులు రాయలసీమలో ప్రాచీన రాజ్యాలు. రేనాడు అన్నిటికంటే పెద్ద రాజ్యం. కర్నూలు జిల్లాలోని కోయిలకుంట్ల, సిరువెల్ల, కడపజిల్లాలోని పులివెందుల, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, కమలాపురం, అనంతపురం జిల్లాలోని హిందూపురం, చిత్తూరు జిల్లాలోని మదనపల్లి తాలూకాలురేనాడులో అంతర్భాగం.

ఇదిలా ఉండగా రాయలసీమ ప్రాంతం హైదరాబాద్ నిజాం నవాబుల పాలనలో నుంచి 1799లో బ్రిటీష్ ఈస్ట్ ఇండియా కంపెనీ వారి అధీనంలోకి వెళ్లింది. రాయలసీమను బ్రిటీష్‌వారికి నిజాం నవాబు దత్తత ఇచ్చాడు. అందువల్ల అప్పటి నుంచి దత్త మండలాలుగా వాడుకలోకి వచ్చింది. రాయలసీమ వాసులు దత్తమండలం అని పిలవడానికి ఇష్టపడేవారు కాదు. జాతీయోద్యమ కాలంలో పెరిగిన జాతీయాభిమానం కొత్త పేరును సూచించింది. మొట్టమొదటి తెలుగు మహాసభ 1928 నవంబర్ 17,18 తేదీల్లో కర్నూలు జిల్లా నంద్యాలలో జరిగింది. ఆ సభలో స్వాతంత్ర్య సమరయోధుడు, సాధన పత్రిక వ్యవస్థాపకుడు పప్పూరు రామాచార్యులు దత్తమండలాలకు కొత్త పేరు పెట్టాలని కోరారు. అధ్యాపకుడు చిలుకూరు నారాయణరావు అప్పటికే రాయలసీమ అనే పేరును ప్రతిపాదించారు. ప్రథమాంధ్ర మహాసభ ఆమోదంతో 'రాయలసీమ' అనే పేరు ఖరారుచేస్తూ తీర్మానించడం జరిగింది. శ్రీక్రిష్ణ దేవరాయలు పరిపాలన చేసినందువల్ల దత్తమండలాలకు రాయలసీమ అని పేరు పెట్టినట్లు అందరూ అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం కూడా అదే అభిప్రాయాన్ని కలిగి వున్నారు. రాయలసీమ అనే పేరు నేడు కొనసాగుతున్నది. కానీ రాయలు యేలిన ప్రాంతం కనుక రాయలసీమ అని పేరు వచ్చిందన్న అభిప్రాయం సరైనది కాదు. ఎందుకంటే శ్రీక్రిష్ణదేవరాయలు లేదా ఆయన వంశీయులు ప్రస్తుత నాలుగు జిల్లాలనే గాక దాదాపు దక్షిణ భారతదేశాన్నంతా పాలించారు. ఆ ప్రకారం దక్షిణాపథమంతా రాయలసీమగా పిలువబడాలి. రాయలు అనేది వంశపు గుర్తుకాదు. రాజుకు పర్యాయపదం. తెలుగులో రాయలు, కన్నడంలో రాయరు, తమిళంలో రాయన్ అనే పదాలు రాజు నుంచి వచ్చినవే. ప్రాచీన కాలంలో ఎక్కువమంది రాజులు ఈ ప్రాంతంలో నివసించినందువల్ల రాజుల దేశంగా, రాజులసీమగా పేరుగాంచింది. దాని ననుసరించే రాయలసీమ అనే పదం పుట్టింది. వాస్తవానికి రాయలసీమ అనే పేరు మట్లరాజుల కాలంలో రాసిన 'అభిషిక్త రాఘవం' అనే కావ్యంలో స్పష్టంగా పేర్కొన్నారు. మట్లకుమార అనంత రాజును పొగుడుతూ మట్ల దేశ వివరాలను తెలిపే పద్యంలో రాయలసీమ పేరు దాగి ఉంది. కడప జిల్లా రాజంపేట కేంద్రంగా సీమలోని కొంతభాగాన్ని మట్లరాజులు పాలించారు. తిరుపతి గోవిందరాజస్వామి గుడి మొదటిముఖద్వార గోపురాన్ని కుమార అనంతరాజు 1624లో కట్టించాడు..

పద్యం : రాయలకులశ్వరాయబల భానులు మట్ల అనంతరాజు కొక్షేయకధార ద్రవ్విరని చెప్పె దరింతయు కాక కేలుపున్ రాయలసీమ లోన చతురంగ బలంబుల తోడ వైరములే పాయకమున్నవారు పరిపాలన వైచిన మట్ల జస్రమున్.

కనుక రాయలసీమ, రాజుల సీమ, మహారాజుల సీమ పేర్లు ప్రాచీన కాలం నుంచి వాడుకలో వున్నాయి. రాయలసీమ పేరు చిలుకూరు నారాయణరావు పెట్టింది లేదా కనుగొన్నది ఎంత మాత్రమూ కాదు. రాయలసీమ పేరును గాడిచర్ల హరిసర్వోత్తమరావు పెట్టారన్న వాదన కూడా సమంజసమైంది కాదు.

నాటి రాజుల సీమ రూపాంతరం చెంది రాయలసీమ అయింది. అంతేకాని ప్రథమాంధ్ర మహాసభ సందర్భంగా నంద్యాలలో పుద్భవించింది కానే కాదు. రాయలసీమకు రాజులసీమ, మహారాజుల సీమ, మారాయపాడి తదితర పేర్లు శతాబ్దాల కిందటే వున్నాయని ఆధునిక ఆంధ్ర చరిత్రకారుడు మల్లంపల్లి సోమశేఖరశర్మ అభిప్రాయపడ్డారు. మల్లంపల్లి వారి వాదన అక్షరసత్యం.

వలస పాలకులకు ఊపిరి పోసిన విజయనగర రాజులు

భారతదేశం పరులపాలు కావడానికి రాయలసీమను పాలిస్తున్న నాటి రాజులు కారకులయ్యారు. చిత్తూరుజిల్లా తిరుపతి సమీపంలోని చంద్రగిరి భారత చరిత్ర గతినే మార్చివేసింది. 'సీమ' సంక్షేమం కోసం ఎంతగానో శ్రమించిన విజయనగర రాజులే వలస పాలకులకుపెద్దపీట వేశారు. వ్యాపారం చేసుకోవడానికి కాస్త స్థలం కావాలంటే.. కోటనే కట్టుకోండని మన రాజులు భారత భూభాగాన్ని బ్రిటీష్‌వారికి ధారాదత్తం చేశారు. వలస వారి వ్యాపారం విస్తరించి రాయలసీమనే మింగేసింది. తరువాత యావత్ భారతావనినే కబళించింది. వలస పాలన ప్రారంభమైంది తొలుత ఈ 'సీమ'లోనే అంటే ఆశ్చర్యం! వ్యాపార కార్యకలాపాలను నిర్వహిస్తున్న నాటి ఇంగ్లీష్ ఈస్ట్ ఇండియా కంపెనీ ముందు రాయలసీమను. మళ్ళీ ఇండియాను ఏవిధంగా హస్తగతం చేసుకొందో తెలుసుకొందాం.

ఇండియాలో వ్యాపారం చేయడానికి క్రీ.శ. 1500 నుంచి వివిధ దేశాలు ముందుకు వచ్చాయి. అందులో ప్రధాన వ్యాపార పోటీ బ్రిటీష్, ఫ్రెంచి, డచ్ దేశాల మధ్య సాగింది. "ఈస్ట్ ఇండియా కంపెనీ' పేరుతో మూడు దేశాలూ మూడుకంపెనీలను మనదేశంలో ప్రారంభించి వ్యాపార లావాదేవీలను మొదలు పెట్టాయి. వ్యాపారంలో ఫ్రెంచ్ వారిది పై చేయి. డచ్‌వారు, ఫ్రెంచ్‌వారు అప్పటికే ఫ్యాక్టరీలను కట్టుకొని వస్త్ర వ్యాపారం చేస్తున్నారు. నెల్లూరు జిల్లా పులికాట్ దీవిలో విదేశీ వ్యాపారం జోరుగా సాగేది. ఫ్రెంచ్ వారి ఎత్తుగడల ముందు ఇంగ్లీష్ ఈస్ట్ ఇండియా కంపెనీ వెలవెలబోయింది. దానితో తాము కూడా ఒక ఫ్యాక్టరీ నిర్మిస్తేనే మనుగడ వుంటుందని భావించి అప్పటి స్థానిక రాజులను కంపెనీ పాలకులు ఆశ్రయించారు. మద్రాసులో ఒక స్థావరం ఏర్పాటు చేసుకొంటే తూర్పు ప్రాంతంలో బాగా వ్యాపారం సాగించవచ్చునని కంపెనీ డైరెక్టర్లు ఆలోచించారు. మద్రాసు ప్రాంతం అప్పట్లో శ్రీకాళహస్తి సామంత రాజు దామెర్ల వెంకటాద్రి నాయుడు పాలనలో వుండేది. వెంకటాద్రి నాయుడు ఆదీనంలోని మొత్తం ప్రాంతం చంద్రగిరి రాజుల యేలుబడిలోనే వుండేది. ఇంగ్లీషువారు దామెర్ల వెంకటాద్రినాయుడును మద్రాసులో స్థలం కోసం అర్థించారు. తనకు సర్వాధికారాలు లేకుండడంతో చంద్రగిరి చక్రవర్తి రంగరాయలను సంప్రదించాలని సూచించాడు. వెంకటాద్రి బ్రిటీష్ వారిని వెంటబెట్టుకొని చంద్రగిరికి వెళ్ళాడు. రంగరాయలుకు విషయాన్ని వివరంగా తెలిపాడు. బ్రిటీష్‌వారు మద్రాసులో తమ వ్యాపార *కార్యకలాపాలు నిర్వహించుకొనేందుకు "స్థావరం" యివ్వడానికి రంగరాయలు అంగీకరించారు. చంద్రగిరిలోని రాజమహల్‌లో 1639 ఆగస్టు 22 న రంగరాయలుతో బ్రిటీష్‌వారు ఒక ఒప్పందాన్ని కుదుర్చుకొన్నారు. దాని ప్రకారం ఇంగ్లీషు ఈస్ట్ ఇండియా కంపెనీ మద్రాసులో సెయింట్ జార్జి కోటను* నిర్మించింది. ఆ ఆవరణలోనే ఒక ఫ్యాక్టరీని కూడా కట్టారు. చంద్రగిరి ఒప్పందం జరిగిన తరువాతనే ఇంగ్లీషు ఈస్ట్ ఇండియా కంపెనీ వాణిజ్యం విస్తరించింది. అంతకుముందు పడిన ఇబ్బందులను

అదిగమించి కంపెనీ మంచి లాభాలను గడించింది. అంటే కంపెనీ ప్రగతికి మనరాజులే తోడ్పడ్డారు. ఇంగ్లీష్ ఈస్ట్ ఇండియా కంపెనీ సరుకులపై గల సుంకాలు చంద్రగిరి ఒప్పందం మేరకు రద్దు అయ్యాయి. రహదారి పన్నులో సగం చెల్లిస్తే చాలని రాజు శాసనం చేశాడు. నాణాలను ముద్రించే అధికారం సైతం ఇంగ్లీష్ వారు సంపాదించారు. అంతేగాక తమకు అవసరమైన సరుకులు కొన్నదానికి కూడా సుంకం కట్టేపని లేకుండా 1641లో మరో అనుమతిని పొందారు. ఆ విధంగా ఇంగ్లీష్ కంపెనీ ఇండియాలో విజృంభించడానికి చంద్రగిరి పాలకుడు రంగరాయులు, ఆయన సామంతుడు శ్రీకాళహస్తి దామెర్ల వెంకటాద్రిలు ఉపయోగపడ్డారు. అప్పట్లో వారు చేసింది తప్పు, పొరబాటు అని అనిపించకపోయి వుండవచ్చు.

కాగా కంపెనీతో పని లేకుండా కొందరు ఇంగ్లీషు వ్యాపారులు స్వంతంగా వాణిజ్యాన్ని కొనసాగించారు. దానిపై కంపెనీకి, వ్యాపారులకు గొడవలు జరిగాయి. చివరకు 1702లో యునైటెడ్ ఇంగ్లీష్ ఈస్ట్ ఇండియా కంపెనీ అవతరించింది. అప్పటి నుంచి కంపెనీ ప్రాబల్యం బాగా పెరిగింది. "ఇండియాలో వ్యాపారం చేసే సామాన్యులను కంపెనీ దావు దెబ్బతీసిం"దని కార్ల్‌మార్క్స్ అభిప్రాయపడ్డారు. బ్రిటీష్ ఈస్ట్ ఇండియా కంపెనీ ప్రాబల్యం 'సీమ'లోనే కాక దక్షిణాది అంతటా పెరుగుతూ వస్తున్నది. ఫ్రెంచ్, డచ్ వారి వ్యాపారాలు దెబ్బతిన్నాయి. ఫ్రెంచ్ వారికి, హైదరాబాద్ నిజాం నవాబుకు యుద్ధం జరిగింది. నిజాం నవాబులు ఇంగ్లీషు వారి సహాయం కోరారు. బ్రిటీష్ సైన్యం సహకారంతో కోస్తా ప్రాంతంనుంచి ఫ్రెంచ్ వారిని పారదోలారు. ఫ్రెంచ్‌వారు మచిలీపట్నం ప్రధాన స్థావరంగా వ్యాపారం చేసేవారు. సైన్యసహాయం తీసుకొన్నందుకు తమకు కప్పం కట్టాలని కంపెనీవారు అడిగారు. దానితో సర్కారు ప్రాంతాన్ని గుత్తకు తీసుకొమ్మని నిజాం నవాబు 1766లో ఇంగ్లీష్ వారికి ఒక ఒప్పందం చేసి యిచ్చాడు. రాయలసీమ కన్నడ రాజుల పాలనలో వుండేది. కర్నాటకలోని శ్రీరంగపట్నం సంస్థానాధిపతి హైదరాలీ, ఆయన కుమారుడు టిప్పుసుల్తాన్ మరణానంతరం 1792లో 'సీమ' నిజాం నవాబు పాలనలోకి వెళ్ళింది. 'సీమ'లో అప్పటికే ఎన్నో కరువులు వచ్చాయి. పన్నుల కోసం రాజులందరూ 'సీమ' ప్రజలను పీల్చి పిప్పి చేశారు. హైదరాబాద్ నిజాం నవాబు కూడా పన్నుల కోసం ప్రజలను పీడించాడు. కరువు సీమ కావడంతో పన్నులు సరిగా వసూలయ్యేవి కావు. పైగా బ్రిటీష్ సైన్య సహకారంతో పాలన సాగిస్తున్నందున ప్రత్యేక పన్ను కట్టించుకోవడానికి నిజాం నవాబుపై ఇంగ్లీష్‌వారి వత్తిడి పెరిగింది. తాను పన్ను కట్టలేనందున రాయలసీమను దత్తత తీసుకోండని నిజాం నవాబు కోరాడు. రాయలసీమ ప్రాంతాన్ని ఇంగ్లీష్ ఈస్టిండియా కంపెనీకి యిస్తూ 1799లో నిజాం నవాబు వుత్తర్వులు జారీచేశాడు. ఆ మేరకు 'సీమ'లో పన్నులు వసూలు చేసే హక్కు కంపెనీకి సంక్రమించింది. బ్రిటీష్‌వారు దత్తత తీసుకొన్నందువల్ల రాయలసీమ ప్రాంతం దత్తమండలాలుగా వాడుకలోకి వచ్చింది. కడప జిల్లా కేంద్రంగా 'సీమ'లో కంపెనీ పాలన మొదలయింది. కడపజిల్లా కలెక్టర్ కార్యాలయం 1800సం॥లో ప్రారంభమైంది. ఈస్ట్ ఇండియా కంపెనీ డైరెక్టర్లలో ఒకరైన థామస్ మన్రో 'సీమ' (దత్తమండలాల) మొదటి కలెక్టర్‌గా నియమితులయ్యారు. 'సీమ' వ్యాప్తంగా వున్న చిన్న రాజరికాలు, పాలెగాండ్ర వ్యవస్థ మట్టిలో కలిసిపోయాయి. రాయలసీమలో ఇంగ్లీష్ వారి పాలన అధికారికంగా 1800 సం॥లో ప్రారంభమైంది. దేశంలోని పలు ప్రాంతాలు ఈస్ట్ ఇండియా కంపెనీ యేలుబడిలోకి వచ్చాయి. దేశంలోని సంపద అంతా సముద్రాలు దాటి లండన్ నగరానికి తరలించుకొని పోయారు వలస పాలకులు కంపెనీ పాలకులు దేశాన్ని అరాచకంలోకి నెట్టారు. కంపెనీ పాలకుల దురాగతాలు విపరీతంగా పెరిగిపోయాయి. వలస పాలనపై నిరసనధ్వనులు

మొదలయ్యాయి. వలస పాలకులపై 1857 లో తిరుగుబాటు జరిగింది. దానినే "మొదటి స్వాతంత్ర్య సంగ్రామం" లేదా "సిపాయిల తిరుగుబాటు " అని చరిత్రకారులు రాశారు. సిపాయిల తిరుగుబాటు వల్ల ఏర్పడిన బ్రిటిష్ వ్యతిరేక జాట బలపడుతూ వస్తున్నది. దేశవ్యాప్తంగా వలస పాలకులపై వస్తున్న నిరసన వెల్లువను అరికట్టడం కంపెనీకి చేతకాలేదు. అప్పుడు బ్రిటిష్ ప్రభుత్వం రంగంలోకి దిగింది. విక్టోరియా రాణి ఆధ్వర్యంలో 1890లో ఇండియా పాలన బ్రిటిష్ పార్లమెంట్ పరిధిలోకి వెళ్ళింది.

కాగా చంద్రగిరి రాజు రంగరాయులు 1639లో చేసిన చిన్న పొరపాటు పోరతప్పుగా మారింది. ఆనాడు ఇంగ్లీష్ ఈస్ట్ ఇండియా కంపెనీకి మద్రాసులో స్థలం యిచ్చి వుండకపోతే మనదేశం వలస పాలకులకు దక్కేది కాదు. మన భారీ సంపద సముద్రాలు దాటి లండన్‌కు చేరేది కాదు. చంద్రగిరి రాజు చేసిన చారిత్రక తప్పిదం భారత చరిత్ర గతిపై ఎంతో ప్రభావం చూపింది.



కోటి కాంతుల్లో చంద్రగిరి కోట (సౌండ్ అండ్ లైట్ షో)



కొత్త రాతియుగం పనిముట్లు

ఆలయ సంస్కృతే 'సీమ' సంస్కృతి

రాయలసీమ అంటే బాంబులు, తుపాకుల సంస్కృతి అని బయటి ప్రాంతాలలో పేరు. ఇతర రాష్ట్రాల నుంచి ఉద్యోగాలు, వ్యాపారాలు చేయడానికి 'సీమ'కు రావాలంటే జంకుతారు. 'సీమ' సంస్కృతిపై వారిలో అంతభయం వుంది. నిజానికి నాగరికతకు నడకలు నేర్పిన సంస్కృతి రాయలసీమది. భిన్నజాతులు, నాగరికతలు, విభిన్న సంస్కృతులు 'సీమ'లో సమ్మిళిత మయ్యాయి. ఆదిమ మానవులు ఆహారం కోసం వేట సాగించే దశ నుంచి అధునిక వ్యవసాయం వరకు 'సీమ' సంస్కృతి సమున్నత స్థితిలోనే సాగింది. మతాలు, ఆచార వ్యవహారాలు, పండుగలు, పరిశ్రమలు, సాహిత్యం.. అన్నింటా తనకు తానే సాటి అనేరీతిలో 'సీమ' సంస్కృతి సాగుతూ వస్తున్నది. గ్రామ దేవతల కొలువుతోప్రారంభమై 'ఆలయ సంస్కృతి దేశంలోనే అత్యున్నత సంస్కృతి'గా కీర్తి తెచ్చుకొన్నది. నాలుగువేల యేండ్ల కిందటే సీమలో వ్యవసాయం మొదలయింది. వ్యవసాయ పనిముట్లు రూపొందించడానికి చిత్తూరు జిల్లా రేణిగుంట సమీపంలోని కరకంబాడి వద్ద గల క్రిష్ణమ నాయుడు మిట్టలో ఇనుము లోహాన్ని కనుగొన్నారు. తరువాత మహిళల ఆభరణాలు, చేతి గాజులు, పూసలు తయారుచేశారు. చేనేత పరిశ్రమకు 'సీమ' పెట్టింది పేరు. ఎనిమిది మూరల చీర అగ్గిపెట్టెలో పట్టేటంత పలుచగా తయారుచేశారంటే నాటి నేత పనివారల చాతుర్యం మనకు అర్థమవుతుంది. అనంతపురం జిల్లాలోని ధర్మవరం, సోమందేపల్లి, కడప జిల్లా మాధవరం, చిత్తూరు జిల్లా శ్రీకాళహస్తి తదితర ప్రదేశాలు ఆది నుంచి కూడా చేనేత పరిశ్రమకు ప్రసిద్ధి. శ్రీకాళహస్తి కలంకారీ, అద్దకం కళలకు ఎంతోపేరుంది.

రాయలసీమలోని పల్లె పల్లెలో ఒక గుడి ఉంది. ప్రతి ఆలయం ఒక కళాఖండమే. ప్రతి గుడి ఎదుట ఎత్తైన రాజగోపురం. ఆలయం చుట్టూ అందమైన ప్రాకారం. ఆ ప్రాకారపు గోడల్లో సుందరమైన శిల్పాలు, భావితరాలకు చరిత్రను అందించాలన్న ఉద్దేశంతో ఏర్పాటు చేసిన శాసనాలు వున్నాయి. రాయలసీమ సంస్కృతిని ఆలయాల ద్వారా శాశ్వతీకరించారు నాటి శిల్పులు,రాజులు. సంప్రదాయాలు, సంగీత నాట్య రీతులు, ఆచారాలు, శృంగార అంశాలను శిల్పాకృతుల్లో పొందుపరచి ఆలయాల్లో స్థిరంగా వుండేటట్లు చేశారు. వేల సంవత్సరాలచరిత్రలు కలిగిన గుళ్లు సీమలో ఎన్నో వున్నాయి. దక్షిణ భారతదేశంలో తొలి చోళ ఆలయం చిత్తూరు జిల్లా శ్రీకాళహస్తి సమీపంలోని తొండమనాడులో నిర్మించారు. ఆ విషయాన్ని 'సమగ్ర ఆంధ్ర సాహిత్య' కర్త, పరిశోధకుడు డా॥ ఆరుద్ర ధ్రువీకరించారు. అత్యంత ప్రాచీనమైన గుడి తిరుమల క్షేత్రంలో వెలసి, అజేయంగా భాసిల్లుతున్న శ్రీ వెంకటేశ్వరస్వామి కోవెల, ప్రపంచప్రఖ్యాతిగాంచిన శిల్పకళా నిలయమైన లేపాక్షి వీరభద్రాలయం కరువు సీమలో వున్నవే. కొన్నివేల గుళ్ళు రాయలసీమలో వున్నాయి. లక్షలాది మంది గుళ్ళకు వెళ్ళి ఆయా దేవతా మూర్తులను సందర్శించి

వస్తున్నారు. సందర్శకుల దృష్టి అంతా విగ్రహంపై మాత్రమే ! రాళ్ళను సజీవ ఆకృతులుగా, సుందర శిల్పాలుగా మలిచిన శిల్పులను, ఆలయ నిర్మాణాల్లో భాగస్వాములైన కూలీలను స్మరించడం మనకు అలవాటు లేదు. ఆలయాలు మన జాతి సంపద. మన సంస్కృతీ సంప్రదాయాల సంపదలు. శాస్త్ర, సాంకేతిక విజ్ఞానాన్ని సయితం తమలో దాచుకొన్న మన జాతీయ సొత్తులు 'సీమ' దేవాలయాలు.

కాగా దక్షిణ భారతదేశంలో పల్లవ రాజులు చాళుక్యులు ఆలయాల కట్టడాలకు ప్రత్యేక రూపాన్ని ప్రసాదింపచేశారు. మద్రాసు దగ్గరలోని మహాబలిపురం వద్ద బంగాళాఖాతం సముద్రతీరంలో నిర్మించిన ఆలయ కట్టడాలు ప్రాచీనమైనవని ప్రసిద్ధి. కానీ అంత కంటే ప్రాచీన కట్టడాలు కరువు సీమలో వున్నాయి. చిత్తూరు జిల్లా రేణిగుంట సమీపంలోనిగుడిమల్లంలోగల పరశురామేశ్వర గుడి క్రీస్తు పూర్వం రెండో శతాబ్దం నాటిది. కలియుగ వైకుంఠంగా వెలుగొందుతున్న శ్రీవారి ఆలయం. తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయం, శ్రీకాళహస్తిలోని శ్రీకాళహస్తీశ్వరాలయం, కాణిపాకంలోని వినాయక దేవాలయం, మొగిలిలోని మొగిలీశ్వరాయలం, అనంతపురం జిల్లా తాడిపత్రిలోని బుగ్గ రామలింగేశ్వర గుడి, అపూర్వ కళాసృష్టి లేపాక్షి వీర భద్రాలయం, కదిరి లక్ష్మీ నరసింహ ఆలయం, గోరంట్ల మాధవరాయుల గుడి, కర్నూలు జిల్లా శ్రీశైలంలో గల శ్రీ భ్రమరాంబ మల్లికార్జున దేవాయులం, మహానంది లోని నందీశ్వరాలయం, మంత్రా ల యంలో వెలసిన రాఘవేంద్ర స్వామి బృందావనం, అహో బిలం, కడప జిల్లా ఒంటి మిట్ట లోని కోదండ రామాలయం, పులివెందుల వద్ద వున్న మోపూరు సమీపంలోనిభైరవ క్షేత్రం, మైదుకూరు దగ్గరలోగల బ్రహ్మంగారి మఠం, పుష్పగిరి చెన్నకేశ వాలయం, ప్రొద్దుటూరు అగస్త్యేశ్వ రాలయం 'సీమ' లో ప్రముఖమైనవి. అదేవిధంగా పెనుకొండ, గుత్తి, రాయదుర్గం, కర్నూలు, సిద్ధవటం, గండికోట, కార్వేటి నగరం, చంద్రగిరి చారిత్రక కట్టడాలు మన ప్రాచీన ప్రాభవానికి నిదర్శ నాలుగా నిలిచాయి. హిందూ సంస్కృతి తోపాటు



బౌద్ధ , జైన మతాలకు చెందిన గుళ్ళు, ముస్లిమ్ మతానికి చెందిన దర్గాలు 'సీమ'లో వున్నాయి. అనంతపురం జిల్లా రాయదుర్గం, పెనుకొండ, కడప జిల్లా జమ్మలమడుగు సమీపంలోని దానవుల పాడు తదితర ప్రదేశాల్లో క్రీ.శ. ఐదు, ఆరు శతాబ్దాల్లో జైన సంస్కృతి విలసిల్లింది. ఒకప్పటి తెలుగు నేల బళ్ళారి జిల్లా (నేడు కర్ణాటక) హొస్పేట వద్ద గల హంపీ క్షేత్రంలోని విరూపాక్ష, విఠలాలయంలోని శిల్ప సంస్కృతి, రాణీమహల్, గజశాల కట్టడాలు, శిల్ప కళా నైపుణ్యానికి పరాకాష్టగా వున్న 'రాతిరథం' నాటి వైభవ చిహ్నాలుగా మిగిలాయి. అనంతపురం జిల్లా రాయదుర్గం సమీపంలోని వీరాపురం వద్ద పూర్తిగా రాతిలో అందంగా మలచిన 'రాతిమంచం' ప్రాచీన కళా సంస్కృతికి ప్రతీక.

'సీమ' చరిత్రకు శిథిల సాక్ష్యాలు

ఆలయాలు సంస్కృతికి, శిల్ప కళానైపుణ్యానికి ప్రతీకలే కాక చరిత్ర నిర్మాణంలో ప్రముఖ పాత్ర వహిస్తున్నాయి. వివిధ ఆలయాల నిర్వహణకు రాజులు ఇచ్చిన మాన్యాలు, ఆలయంలోని మూల విగ్రహాల అలంకరణకు బంగారు ఆభరణాలను కానుకలుగా సమర్పించిన సంఘటనలను అక్కడి బండ రాళ్ళపై చెక్కారు. సమాచారనిక్షిప్తం కోసం, కీర్తి కోసం వారు ఆనాడు ఆపనిని చేయగా.. ప్రస్తుతం ఆ శాసనాలే చరిత్రకు మూలాధారాలయ్యాయి. తిరుమలలో వెలసిన శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో 640 శిలాశాసనాలున్నాయి. అందులో తమిళభాషలో ఎక్కువ శాసనాలున్నాయి. తిరుపతిలోని గోవిందరాజస్వామి గుడిలో, తిరుచానూరులోని పద్మావతి అమ్మవారి ఆలయంలో, శ్రీకాళహస్తిలోని శ్రీకాళహస్తీశ్వరాయలంలో వందలాది శాసనాలున్నాయి. ఆ శాసనాల ఆధారంగా ద్రావిడ రాజులైన పల్లవులు, చోళులు,పాండ్యులు, తెలుగు రాజుల వివరాలు తెలుస్తున్నాయి. తిరుమల - తిరుపతిలలో లభించిన అనేక శిలా శాసనాలవల్ల దక్షిణ దేశంలోని రాజులు, రాజ్యాలు, సరిహద్దులు వంటి వివరాలు దొరికాయి. చిత్తూరుజిల్లా రేణిగుంట సమీపంలోని గుడిమల్లంలోగల పరశురామేశ్వరగుడి, కర్నూలు జిల్లాలోని శ్రీశైలం, మహానంది, అనంతపురం జిల్లా లేపాక్షిలోని వీరభద్రాలయం సముదాయంలో, తాడిపత్రిలోని చింతల వెంకటరమణ గుడి, గోరంట్లలోని మాధవరాయల ఆలయం, సోమేశ్వరాలయం, కదిరిలోని లక్ష్మీ నరసింహస్వామి గుడి, కడపజిల్లా పుష్పగిరిలోని చెన్నకేశవ దేవాలయం, ఒంటిమిట్ట రామాలయం, నందలూరులోని సౌమ్యనాథ ఆలయం, పులివెందుల సమీపంలోని మోపూరు వద్ద గల భైరవ క్షేత్రం తదితర ఆలయాల్లోని శిలాశాసనాలు 'సీమ' చరిత్రకు శిథిల సాక్ష్యాలుగా మిగిలాయి. ఆలయాల్లో ఆరుబయలులో వున్న శాసనాలు క్రమక్రమంగా రూపు చెదురుతున్నాయి. శాసనాలు ఎండకు ఎండి, వానకు తడుస్తూ వుండడంతోనూ, శాసనాల విలువ తెలియని వారు రాళ్ళతో కొట్టడం వల్ల అవి పాడవుతున్నాయి. ఆ శిలాశాసనాలకు అవసరమైన రసాయనిక వైద్యం చేయకుంటే అవి శాశ్వతంగా చెదిరిపోతాయి. భవిష్యత్తు చరిత్రకారులు శిలాశాసనాలను చదివే అవకాశాన్ని కోల్పోతారు. ఆలయ పరిపాలనా విధానాలు ఆలయంలో జరిగే ఉత్సవాలు శిలాశాసనాల్లోనే దాగి వున్నాయి. తిరుమల శ్రీవారి ఆలయంలోని క్రీ.శ. 830నాటి శాసనాన్ని బట్టి తెలుగు ఆడపడుచు, పల్లవరాణి సమవాయి (పెరుందేవి) తిరుచానూరులోని కొన్ని భూములను శ్రీవారికి మాన్యంగా సమర్పించింది. బ్రహ్మోత్సవాలు నిర్వహించడానికి ధన సహాయం చేసింది. ఆభరణాలను కానుకగా యిచ్చింది. భోగశ్రీనివాసమూర్తి వెండి విగ్రహాన్ని బహూకరించి బ్రహ్మోత్సవాలప్పుడు ఊరేగించాలని ఆదేశించింది. అన్నిటికీ మించి ఆమె శాసనపదాలు ఆసక్తిదాయకం. తాను యిచ్చిన దానాలను తెలిపే 'శిలాశాసనాలను కాపాడేవారి పాదాలు నాకు శిరోధార్యం' అని శాసనంలో రాణి సమవాయి పేర్కొన్నది. అనంతపురం జిల్లా గోరంట్ల

మాధవరాయుల గుడి సమీపంలోని రెండు పెద్ద బండ రాళ్ళపై చెక్కిన శాసనాలు ప్రాచీనాంధ్రలిపికి నిదర్శనంగా నిలిచాయి. విజయనగరరాజుల ఆర్థికవిధానాలు, నాయకంకర పరిపాలనను, ఆలయ ఉత్సవాలను గోరంట్ల శాసనాలు తెలుపుతున్నాయి. ఆ విధంగా శిలాశాసనాలు చరిత్ర రచనలో అత్యంత ప్రధాన పాత్రను పోషిస్తున్నాయి.

కాగా విజయనగర సామ్రాజ్య చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయల కాలంలో వివిధ భాషల్లో శాసనాలు చెక్కడం అలవాటయింది. బహుభాషలను ఆదరించి సర్వ శిలాశాసనాలను కూడా రకరకాల భాషల్లో చెక్కించాడు. తెలుగు, కన్నడం, తమిళంలో శ్రీకృష్ణదేవరాయలు శాసనాలను రాయించాడు. మౌర్య సామ్రాజ్య మహారాజు అశోకునితో మొదలైన శిలాశాసనాల సంస్కృతి విజయనగర రాజ్యంలో సమున్నత స్థాయికి చేరుకొన్నది. తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి సంబంధించి క్రీ.శ. 830 నాటి రాణి సమవాయి శాసనమే మొట్టమొదటిది. సీమ చరిత్రకు ప్రత్యక్షర సాక్ష్యాలైన శిలాశాసనాలను కాపాడవలసిన బాధ్యత అందరిదీ.




అసంపూర్ణ కళ్యాణ మండపం-లేపాక్షి

కళల కాణాచి

జన పథంలోనుంచి పుట్టిందే జానపదం. పని - పాటలు రెండూ ఒక దానితో ఒకటి పెనవేసుకొన్నాయి. వ్యవసాయ పనితో పాటే పల్లెపదాలు పుట్టాయి. తాను చేస్తున్న శ్రమను మరిచిపోవడానికి జానపదులు కొన్ని కళారూపాలను సృష్టించుకొన్నారు. ఒక జాతి సంస్కృతిని చాటి చెప్పేదే జానపదం. అపురూపమైన జానపద కళారూపాలు రాయలసీమలో ఎన్నో వున్నాయి. తోలు బొమ్మలాట, బయలు నాటకాలు, నాటకాలు, కీలుగుర్రాలాట, ఉట్టి కొట్టడం, ఉరుములు, డప్పులు, కోలాటం, గొరవయ్యల కొట్లాట, గొల్ల సుద్దులు, బుడబుక్కల భిక్షాటన, బుర్రకథ, ద్రౌపదమ్మ (ధర్మరాజుల) తిరునాళ్ళు, లంబాడీ నృత్యం, వివిధ రకాల జాతరలు తదితర జానపద కళాకాంతులు సీమ సంస్కృతిని ప్రతి బింబిస్తున్నాయి.

రాయలసీమ కళలకు, కళాకారులకు మాత్రమే పుట్టినిల్లు కాదు. దేశ స్వాతంత్ర్యం కోసం తెల్లవాళ్ళను తరిమికొట్టడానికి జాతిరత్నాలను సైతం అందించింది. స్వాతంత్ర్య సముపార్జన కోసం జాతిని జాగృత పరచడానికి తోలుబొమ్మలాటలు, బయలు నాటకాలు, బుర్రకథలు, వీధి భాగోతాలు, నాటకాలు వంటి ఎన్నో కళారూపాలను ప్రదర్శించడం జరిగింది. *తోలుబొమ్మలాటలు, బయలు నాటకాలు, వీధి బాగోతాలు, పగటి వేషాలు, కీలు గుర్రాలు, కోలాటం, చెక్కభజన, ఉరుములు, ఉట్టి కొట్టడం, హరికథ, బుర్రకథలు చెప్పడం, ధర్మరాజుల తిరునాళ్ళు (ద్రౌపదమ్మ తిరునాళ్ళు), గొరవయ్యల కొట్లాట, బుడబుక్కల భిక్షాటన, లంబాడీ నృత్యం వంటి జానపద కళలకు పుట్టినిల్లు రాయలసీమ.* రాయలసీమ తోలుబొమ్మలాటలు అంతర్జాతీయ ఖ్యాతిని పొందాయి. తోలుబొమ్మలాటల ప్రదర్శనలో మనదేశం తరువాత డెన్మార్క్ దేశం ప్రసిద్ధి. అలాంటి డెన్మార్క్‌కే వెళ్ళి మన తోలుబొమ్మల కళాకారులు ప్రదర్శనలు యిచ్చి వచ్చారు. అనంతపురం జిల్లా ధర్మవరం సమీపంలోని నిమ్మలకుంట తోలుబొమ్మల తయారీలోనూ, ఆటల ప్రదర్శనలోనూ అగ్రస్థానంలో వుంది. అదేవిధంగా కడప జిల్లాలోని పోరుమామిళ్ళ, బద్వేలు, అలంఖాన్‌పల్లి, చెన్నంపల్లి, కొత్తపల్లి, చెన్నుముక్కపల్లి తదితర ప్రాంతాల్లో వందలాది తోలుబొమ్మలాట కళాకారులున్నారు. సీమ వ్యాప్తంగా తోలుబొమ్మలాటలు ప్రదర్శించే కళాకారులకుటుంబాలు గతంలో వేయికి పైగానే వుండేవని అంచనా. దాదాపు రెండువేల సంవత్సరాల నుంచి తోలుబొమ్మల ప్రదర్శనలు జరుగుతున్నట్లు చారిత్రక పరిశోధకుల అభిప్రాయం. తోలుబొమ్మలాట ఆడేవారికి చదువురాదు. అయినాకూడా పాటలు, పద్యాలు, మాటలు ఆయా పాత్రలకు అనుగుణంగా మనసుకు హత్తుకొనేలా చెబుతారు. వంశ పారంపర్యంగా వస్తున్న కళ అది. ఉదా : అనంతపురంజిల్లా నిమ్మలకుంటలో ఒకప్పుడు గ్రామంలోని అన్ని కుటుంబాల వారూ తోలుబొమ్మల కళాకారులే! తోలుబొమ్మలాటకు ఆదరణ పూర్తిగా

తగ్గిపోవడంతో ఆ కళాకారులు తమ జీవన విధానాన్ని మార్చుకొన్నారు. వ్యవసాయదారులుగా, వ్యవసాయ కూలీలుగా, రిక్షా కార్మికులుగా రకరకాల వృత్తులను చేపట్టి బతుకు బండిని వెళ్ళదీస్తున్నారు.

కాగా జింకలు, మేకల చర్మాలను శుద్ధి చేసి వివిధ ఆకృతుల్లో కత్తిరించి, వాటికి రంగులు వేసి అందమైన బొమ్మలుగా తయారుచేస్తారు. అన్ని రకాలైన భొమ్మలను సిద్ధంగా వుంచుకొని తెల్లని పలుచటి తెరవెనుక నుంచి తోలుబొమ్మలను కదిలిస్తారు. రామాయణం, మహాభారత గాథలనే ఎక్కువగా ప్రదర్శించేవారు. తోలుబొమ్మలాటలకు గ్రామీణ ప్రాంతాల్లో గతంలో విపరీతమైన ఆదరణ వుండేది. నేటి యువతకు "తోలుబొమ్మలు అంటే ఫలానా" అని వివరించవలసిన పరిస్థితి వచ్చింది. వేలాది సంవత్సరాలుగా వస్తున్న సంస్కృతి తోలుబొమ్మల కళారూపాలు కనుమరుగు అవుతుండడం బాధాకరం.

నాటకాల పుట్టినిల్లు

తెలుగు నాటక రంగం పుట్టింది రాయలసీమలోనే. సీమలో జన్మించిన తెలుగునాటకం జగద్విఖ్యాతమైంది. రాయలేలిన సీమ రాయలసీమలో కళలు ఎలా వృద్ధి చెందకుండా వుంటాయి. వైభవోన్నతులు చూసిన నాటక రంగం చారిత్రక నేపథ్యంలోకి పోతున్నది. సినిమాలు, టి.వి.లు ప్రధాన సాధనాలు కావడంతో ఒక నాటి 'సరసవినోదిని' లాంటి నాటక సంస్థలు అంతరించిపోయాయి. ధర్మవరం రామకృష్ణమాచార్యులు, సుబ్రహ్మణ్యశాస్త్రి, రొద్దం రాజారావు, రొద్దం హనుమంతరావు, బళ్లారి రాఘవ. కోలాచలం శ్రీనివాసరావు, చిత్తూరు నాగయ్య, కల్లూరు సుబ్బారావు వంటి నటరత్నాలను కన్నతల్లిని నేడు రాళ్ళసీమగానే చూడవలసి వస్తున్నది. రాయలసీమ రంగస్థలంపై తలచుకొన్నంతలో దర్శనమిచ్చే మరోనటులు ధర్మవరం రామకృష్ణమాచార్యులు. 1886లోనే సరస వినోదిని అనే నాటక కళాసంస్థను స్థాపించి తద్వారా ఎందరో రంగ మార్తాండులను తీర్చిదిద్దారు. గద్వాలరాజా ద్వారా రత్నఖచిత కిరీటాన్ని ధరించి "ఆంధ్ర నాటక పితామహ" బిరుదాన్ని పొందిన పుణ్యమూర్తి రామకృష్ణమాచార్యులు. ఆయన వృత్తి రీత్యా న్యాయవాది. స్వయంగా చిత్ర నళీయం అనే నాటకాన్ని రచించడమే కాక సరస వినోదిని ద్వారా అనేక ప్రదర్శనలు ఇచ్చారాయన. ధర్మవరం సోదరులు రచించిన సారంగధర, లవకుశ, క్రిష్ణలీలలు. రామదాసు తదితర నాటకాలను కర్ణాటక, ఆంధ్ర, మద్రాను ప్రాంతాల్లో విజయవంతంగా ప్రదర్శించారు శ్రీ కోలాచలం శ్రీనివాసరావు బళ్ళారిలో తాను స్థాపించిన సమనోరమ సంస్థ ద్వారా బళ్ళారిలోనే గాక అనేక చోట్ల ప్రదర్శనలు ఇచ్చారు. సరస వినోదిని, సమనోరమ సంస్థల ద్వారా బళ్ళారి రాఘవ మంచి నటుడుగా పేరు సంపాదించుకొన్నారు. వీరికి సమకాలికులు తారానాథ్, రొద్దం గౌడ్ ఆనాటి నాటక రంగంలో స్త్రీ పాత్రలను పురుషులు ధరించకుండా స్త్రీలే ధరించేటట్లు చేసిన కీర్తి బళ్ళారి రాఘవకు దక్కింది. రాజరాజ నరేంద్రుడు, రామదాసు, హిరణ్యకశిపుడు, దుర్యోధనుడు, పఠాను వంటి పాత్రలను మహత్తరంగా పోషించారు. మొదలియార్, శశికుమార్, బాల గంధర్వ, గుబ్బి వీరన్న, బెర్నార్డ్‌షా తదితర ప్రముఖ కళానేతలెందరో బళ్ళారి రాఘవ నటనను గొప్పగా మెచ్చుకొన్నారు. అనంతపురం జిల్లా కల్లూరు గ్రామంలో జన్మించిన పద్మశ్రీ కల్లూరుసుబ్బారావు స్వాతంత్ర్యయోధుడే కాక మహానటుడు. లేపాక్షి వీరభద్రాలయంలో దాగిన కళాఖండాలకు ఖండాంతర కీర్తి లభించేటట్లు చేసిన కళాతపస్వి కల్లూరుసుబ్బారావు. రాయలసీమ రాజకీయాల్లో వీర కిశోరమనవచ్చు. దాదాపు నూరు సంవత్సరాల

క్రితం కడపజిల్లాలోని సురభి అనే గ్రామంలో పుట్టిన నాటక సమాజమే 'సురభి' సమాజం. సురభి కీర్తి దేశంలోని అన్ని దిశలకూ వ్యాపించింది. సురభి నాటక రంగంలో మేరుశిఖరాలైన పుట్టా వెంకటరావు. సుబ్బాబాయి దంపతులకు జన్మించిన పి. రాజ్యం గొప్ప పేరు సంపాదించుకొన్నారు. కడప జిల్లాలో సురభి తరువాత చెప్పుకోదగినది "సవేరా ఆర్ట్స్". సవేరా వారి శ్రీరామ వనవాసం, శ్రీరామ పాదుకలు. సతీ అహల్య, కన్యకాపరమేశ్వరి నాటకాలు రాష్ట్ర నాటక అకాడమీ బహుమతులు పొందాయి. ఈ సమాజాన్ని శివనాగిరెడ్డి, వెంకటయ్య నిర్వహిస్తున్నారు. కర్నూలులోని లలిత కళా సమితి ద్వారా కోదండరామయ్య వంటి నటులెందరో తయారయ్యారు. సుప్రసిద్ధ సినీ తారలు కన్నాంబ, ఎస్. వరలక్ష్మి, లక్ష్మీరాజ్యం పైకి వచ్చింది ఈ సమాజం ద్వారానే. చిత్తూరు రామవిలాస సభ మరో వేదిక. బ్రహ్మాండం నరసింహారావు, అనంతశయనం, చిత్తూరు నాగయ్య లాంటి ఉద్దండులకు కళాజన్మనిచ్చింది రామవిలాసభ. కళాకారుల గురించి చెప్పుకోవలసి వచ్చినప్పుడు చిత్తూరు ప్రస్తావన రాక తప్పదు.

కాగా నాటి కళాకారుల్లో ఎందరో త్యాగధనులున్నారు. నాటక రంగం నుంచి సినీ రంగానికి వెళ్ళిన చిత్తూరు నాగయ్య, అనంతపురం జిల్లాకు చెందిన బళ్ళారి రాఘవ వంటి మహనీయులు సమాజ శ్రేయస్సుకై పాటు పడ్డారు. ఒక వైపు కళామతల్లి ఒడిలో వుంటూ, మరోవైపు మాతృభూమి విముక్తి కోసం పోరాటం చేశారు. ఆ దేశాభిమానులకు, కళానేతలకు కళాభివందనాలను ప్రతి ఒక్కరూ సవినయంగా సమర్పించవలసిందే!

సినిమా రంగంలోనూ.....

రాయలసీమ రంగస్థలంలో నీరాజనాలు అందుకొన్న నటీనటులు సనిమా రంగానికి వెళ్ళారు. రంగస్థలంతో సంబంధం లేని వారు సైతం సినిమా నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. దక్షిణాదిలో తొలి స్టూడియోగా పేరుగాంచిన వాహినీ స్టూడియోను నిర్మించింది సీమ వాసులే. అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన మూలా నారాయణస్వామి వాహినీని నెలకొల్పారు. తాడిపత్రి సమీపంలోని ఒక చిన్న గ్రామానికి చెందిన హెచ్.ఎం.రెడ్డి తొలి తెలుగు టాకీ (మాటల) సినిమా - భక్తప్రహ్లాదను 1931లో నిర్మించి చరిత్రలో నిలిచారు. తెలుగు సినీరంగం అభివృద్ధి వెనుక సీమకు చెందిన పలువురి కళాకారుల కృషి వుంది.



గ్రామ దేవత - కోటమ్మ

'సీమ' చరిత్ర సమస్తం కరువుల మయం

ఎటుచూసినా బీడు భూములు. బీటలు వారిన చెరువులు. పాడు పడిన పల్లెటూళ్లు. నిరాశానిస్పృహలతో వ్యవసాయమనే జూదంలో గెలవలేక రైతులు, రైతుకూలీలు స్వంత గ్రామాలను వదిలి సుదూర ప్రాంతాలకు వలసపోతున్న దృశ్యాలు ఎప్పుడూ కనిపిస్తూనే ఉంటాయి. ఇక్కడ తమ కడుపులు నిండవని, కబేళాదారుల కడుపులు నింపడానికి తరలి పోతున్నాయి పశువులు. అంతేలేని కరువులకు నిలయమైన 'రాయలసీమ' రైతన్న బ్రతుకే దుర్భరమైంది. జీవితం జల ప్రళయమైంది. ఇక్కడ ఆకాశంలో కారుమబ్బులు కనిపించవు. "సీమ" ప్రజల గుండెల్లో మాత్రం నిరాశా మేఘాలు దట్టంగా తిష్టవేశాయి. ఇంతటి విపరీత, విపత్కర కరువు పరిస్థితులకు ప్రకృతి వైపరీత్యాలే కారణం కాదు. ప్రకృతి నిరాదరణకు ప్రభుత్వ నిర్లక్ష్యం, వైఫల్యం తోడయ్యాయి. పాలకులు అనుసరిస్తున్న రాజకీయాలవల్ల పచ్చని పంటపొలాలతోకళకళలాడాల్సిన సీమ పొలాలు ఎడారిభూములవుతున్నాయి. రైతాంగం కోసం పోరాటం చేయవలసిన రాజకీయ పార్టీలు 'ఓట్ల రాజకీయాలు' చేస్తున్నాయి.

ఇక్కడ గోల చేసే కాకి గొంతు తడుపుకోలేదు. ఇక్కడ పొద్దు గూట్లో పడేటప్పుడు కడుపారామేసిన పశువులు అడవి నుంచి వస్తున్న ఆనవాలుగా గోధూళిఎగరదు. ఇక్కడ కలుపు తీసిన పైరు పచ్చలు తలలూగించవు. పదిమందికి ఆశ్రయం కల్పించే రైతన్న పొట్ట చేత పట్టుకొని తనే పదిమందిని యాచిస్తున్నాడు. కాస్తా కూస్తో భూమి వున్న మధ్య తరగతి రైతన్న బతుకు బండిని లాగడానికి పరాయి ప్రాంతాలకు పోయి రిక్షా తొక్కుతున్నాడు. కన్న బిడ్డలకన్నా మిన్నగా పెంచిన కోడెదూడల్ని తన కళ్ళ ఎదుటే కాళ్ళు విరిచి లారీలలో ఎక్కిస్తుంటే చూస్తూ కన్నీరు కారుస్తున్నాడు రైతన్న. ఇక్కడ ఎండిపోయిన చెట్ల కొమ్మలపై ప్రస్తుతం కొత్తరకం పక్షులు కనిపిస్తున్నాయి. ఇక్కడ అంతా దైన్యమే. ఇక్కడ రాజ్యాన్ని భీభత్సంగా పరిపాలన చేస్తున్నది కరువే. ఇది 'రాయలసీమ' పరిస్థితి.

రాయల కాలంలో 'రతనాలసీమ'గా వెలుగొంది నేడు రాళ్ళసీమగా మారిన రాయలసీమకు తరతరాల కరువు చరిత్ర వుంది.

ఆ భువిడిబ్బంగిని
భూభాగంబేలునపుడు, పుట్టెన్నహవ
క్రా భద్ర క్షామ మహా
క్షోభంబు, జగంబు వర్ష శూన్యము గాగన్.

కఱవంతలకు ఒత్తగ
గరువెరుక తినంగ నోవగలుగక, మనజుల్
నురనుర స్రుక్కిరి, కొందరు
పరదేశంబులకు జనిరి బ్రతుకుల కొఱకున్!

మహాకవి ధూర్జటి రాసిన ఈ పద్యాలను పరిశీలిస్తే రాయలసీమకు, కరువుకుగల అవినాభావ సంబంధం తెలుస్తుంది. 16వ శతాబ్దంలో వర్షాభావ పరిస్థితుల వల్ల రాయలసీమ ప్రజానీకం పర ప్రాంతాలకు వలస వెళ్లారని ధూర్జటి తన 'శ్రీకాళహస్తీశ్వర మహాత్మ్యం' కావ్యంలో పేర్కొన్నారు. ఆనాటి నుంచి ఈనాటి వరకు రాయలసీమ వ్యవసాయ స్థితిగతుల్లో ఆశించినంత మార్పు రాలేదు. రాయలసీమ చరిత్ర సమస్తం కరువులతో నిండి వుంది. కరువుకు పర్యాయపదంగా మారిన రాయలసీమను కొంతవరకు సస్యశ్యామలం చేయడానికి వివిధ ప్రభుత్వాలు పలు పథకాలను ప్రకటించాయి. రాయలసీమ అభివృద్ధి కాగితాలకే పరిమితమయింది. సుప్రసిద్ధ రచయిత విద్వాన్ విశ్వం తమ 'పెన్నేటిపాట'లోసీమ కరువును గురించి ఇలా పేర్కొన్నారు.

ఇంతమంచి పెన్నతల్లి ఎందుకెండిపోయెనో?
ఇంతమంది కన్నతల్లి ఎందుకిట్లమారెనో?
ఈయేటి కాల్వలోతుల
పాయలుగాపారు. నీటి ప్రతిబొట్టున, నీ
చాయలరైతుల నెత్తుటి
చాయలు సమ్మిళితమై విచారము గొల్పున్
కోటి కొక్కరిది ఇ
చ్చట రాయలసీమ,
పేట కొక్కరలేని
పెద్దారాయలసీమ,
వేటాడి వేటాడి
వెదికినా ఇందులో
నేటి పేదల సీమ
నిజరూపు కనపడదు
ఇది ఎదారిలోని ఒయాసిస్సే కానివ్వు
వడగొట్టిన పేదకేమొ వట్టి ఎండమావు

కరువు అంటే.... : *అనావృష్టిని కరువు, వారుపు అంటారు. సకాలంలో వర్షం కురవకుండా పంటలు ఎండిపోవడం, మనుషులకు తిండి గింజల కొరత, పశువులకు గడ్డికొరత, పస్తులతో వుండలేక రైతులు, రైతు కూలీలు పనికోసం పరప్రాంతాలకు వలసపోవడాన్ని "కరువు" అని పిలుస్తారు. అదునులో పదును వానపడక పంటలు ఎండి దిగుబడి 75 శాతం కంటే తగ్గి, ప్రజలు వలస పోవడం ప్రారంభిస్తే అనావృష్టి పరిస్థితులు నెలకొన్నట్లేనని 1950 నాటి కరువు చట్టం నిర్దేశిస్తున్నది. కరువు చట్టం నిర్వచనానికి రాయలసీమ రైతాంగం దుస్థితి అద్దం పడుతున్నది. జూన్‌లో మొదలు కావలసిన ఖరీఫ్ సీజన్ ఆగస్టుదాకా ప్రారంభదశలోనే వుంటున్నది. కరువు వల్ల రైతులు ఆర్థికంగా చితికిపోతున్నారు. వ్యవసాయ ఆధారిత పరిశ్రమల్లో పనిచేసేవారూ, దెబ్బతింటున్నారు. కరువు సంభవించినప్పుడు ఏర్పడే నీటి కొరతతో గ్రామీణులే గాక పట్టణ వాసులూ తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.*

క్రీస్తు శకం 1390-91లో మనుషులను మనుషులే పీక్కుతినేటంత కరువు ఏర్పడి, లెక్కలేనంత మంది మరణించినట్లు అనంతపురం జిల్లా కదిరిలోని శ్రీ లక్ష్మీ నరసింహాలయంలోగలఒక శాసనం ద్వారా తెలుస్తున్నది. 16వ శతాబ్దంలో సంభవించిన భయంకరమైన కరువును గురించి శ్రీకాళహస్తీశ్వర మహాత్మ్యంలో ధూర్జటి రాశారు. 1542, 1630 సంవత్సరాలలో సైతం పెద్ద కరువులు సంభవించాయి. 1803-1885మధ్య అనేకసార్లు కరువులు వచ్చాయని అప్పటి బళ్లారి జిల్లా కలెక్టర్ నికొల్సన్ పేర్కొన్నారు. 1853-54లో వచ్చిన కరువు వల్ల ఒక్క బళ్ళారి జిల్లాలోనే 13.5 లక్షల పశువులు మృతి చెందినట్లు అంచనా. 1866లో సంభవించిన కరువు పేదలను పీల్చి పిప్పి చేసింది.

ధాతు కరవు : బ్రిటీష్ పాలకుల హయాంలో భయంకరమైనది 'ధాతు' కరువు ఇది 1876-77లో సంభవించింది. ధాతు కరువు వల్ల 22నెలల పాటు ప్రజలు గడగడలాడారు. తినడానికి తిండి దొరకకపోతే ఆకులు,అలుములు తిని తమ ప్రాణాలు కాపాడుకొన్నారు. దేవదారు ఆకులు, చెట్ల బెరడులు తిని నాటి ప్రజలు బతికారు. రూపాయికి 20 శేర్లు దొరికే జొన్నలు ఏడు శేర్లకు దిగాయి. ఈ భయంకర కరువు నుంచి కొంత ఉపశమనం కలుగచేయడానికి కరువు పనులు చేపట్టారు. కరువు కేంద్రాలు ప్రారంభమాయ్యయి. 1878 గణాంక లెక్కల ప్రకారం ఈ కరువు వల్ల 16 శాతం జనాభా తగ్గిపోయినట్టు నమోదయింది.

1891-92, 1896-97లలో కూడా కరువులు వచ్చాయి. 1897లో ఏర్పడిన కరువు వల్ల 9వేల 200 పశువులు ఒక్కఅనంతపురం జిల్లాలో మాత్రమే చనిపోయినట్టు అంచనా. మైసూరు నుంచి ధాన్యం దిగుమతి అవుతుండేది. హిందూపురం గుంతకల్లు మధ్య ధాన్యాన్ని దిగుమతి చేసే రెండు ప్రత్యేక రైళ్ళు నడిచాయి. 1900, 1901, 1920 -21, 1924-25 సంవత్సరాలలో కూడా త్రీవ దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నాయి.

1934-35లో తీవ్ర కరువు సంభవించి ప్రజలు ఆకలితో అలమటించారని అనంతపురం జిల్లా కరావుల పల్లెకు చెందిన మైలారం లింగప్ప, మార్లపల్లి అంజనప్ప వివరించారు. కరువు పరిస్థితిని వారు ఇలా పేర్కొన్నారు. పెనుకొండ, హిందూపురం రోడ్డు పనులు చేపట్టారు. కొడికొండ - కొత్తచెరువు రోడ్డు పని కూడా అప్పుడు చేసిందే. పగలంతా పనిచేస్తే పురుషులకు ఒక బొట్టు కూలీగా యిచ్చేవారు. ఒక

ముద్ద సంగటి పెట్టేవారు. అంతేకాక కూలి పనికి వచ్చిన వారి వెంట వచ్చిన పిల్లలకు ఉచితంగా తిండిపెట్టేవారు. ఏమీ చేతకాని వారు పక్కనున్న అడవికి పోయి ఆకులు, అలుములు తెచ్చుకొని తిని జీవించారు. చెరువు పనులు కూడా జరిగాయి. 1937-38, 1941-42 సంవత్సరాల్లో కూడా కరువు విలయ తాండవం చేసింది. 1945-46లో ఏర్పడిన కరువు వల్ల నీటిని లారీలద్వారా సరఫరా చేయవలసి వచ్చింది. కొన్ని వేల లారీల గడ్డి, మనుషులకు గుడ్డలు దిగుమతి అయ్యాయి.

1951-53 మధ్య వచ్చిన కరువు 'గంజి' కరువుగా పేరు గాంచింది. వ్యవసాయ కూలీలు పనులు లేక పస్తులతో కాలం గడిపారు. అనంతపురం జిల్లాలోనే 448 గంజి కేంద్రాలు ప్రారంభమయ్యాయి. వాటి ద్వారా 2.04లక్షల మంది ప్రజలు తమ కడుపులు నింపుకొనేవారు. గంజి కేంద్రాలు జనంతో కిటకిటలాడాయి. మంచినీటి బావులను లోతు చేయడానికి సైన్యం రంగంలోకి దిగవలసి వచ్చింది. అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జిల్లాలో పర్యటించారు. కరువు పరిస్థితిని కళ్ళారా చూసిన నెహ్రూ కలత చెందారు. 650 టన్నుల బియ్యం, వెయ్యి టన్నుల గోధుమలు రష్యానుంచి దిగుమతి అయ్యాయి. 1955, 1957-58, 1960-61, 1967 సంవత్సరాల్లో కరువు కోరల్లో 'సీమ' వాసులు నలిగిపోయారు. 1967 నుంచి 2000 వరకు 12 పైగానే కరువులు సంభవించాయి.

1985లో అనంతపురం జిల్లాలో సంభవించిన ఆకలి చావు పెద్ద సంచలనం సృష్టించినా అధికారులు మాత్రం నోరు మెదపలేదు. అనంతపురానికి 50 కిలోమీటర్లదూరంలోని బోరంపల్లికి చెందిన 70 ఏళ్ళ వృద్ధురాలు హనుమక్క ఆకలితో మరణించిందని ఆమె రెండవ కుమారుడు అనంతపురం జిల్లాలో కరువును పరిశీలించడానికి వచ్చిన ఆరోగ్యశాఖ డైరెక్టర్ ఎస్.వి. గిరికి ఫిర్యాదు చేశారు. అప్పటి జిల్లా కలెక్టర్ అశోక్‌కుమార్ తిగిడి హనుమక్కది ఆకలి చావు కాదని ప్రకటించారు. కలెక్టర్ ప్రకటనవిని విస్తుపోయిన పాత్రికేయులు బోరంపల్లిని వెంటనే సందర్శించారు. తన అత్త హనుమక్క మూడురోజులుగా తిండిలేకపోవడం వల్లనే మరణించిందని హనుమక్క కోడలు వివరించారు. ఆ వృద్ధురాలికింత కూడు పెట్టలేకపోయామని బోరంపల్లి వాసులు భోరున విలపించారు. మరి ఇది ఆకలి చావు కాదా? అనంతపురం జిల్లా ఉరవకొండకు చెందిన హరిజన దేవన్న 1986లో చనిపోయిందెందుకని? ఆకలికి! అడుక్కుతినడానికి కూడా శక్తి లేక గుడిసెలో మూడు రోజులుగా కదలలేని స్థితిలో వుండి అట్లే చనిపోయాడు. అధికారులు మాత్రం దేవన్న అనారోగ్యంతో చనిపోయాడంటూ ప్రకటనలు చేశారు. వాస్తవానికి దేవన్నది కూడా ఆకలిచావే. 1986లోనే కాలిదారిన నడుస్తున్న ఒక బాటసారి ఎండలో స్పృహ తప్పి చనిపోతే ఆ శవం పెదవులు తడపడానికి కూడా దోసెడు నీరు దొరుకలేదంటే ఎంతటి దారుణ పరిస్థితి వుందో వూహించుకోవచ్చు. 'రాయలసీమ'లో అప్పుడప్పుడు ఆకలి చావులు సంభవిస్తున్నా అధికారులు, పాలకులు అవి ఆకలి చావులు కాదంటూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. రాయలసీమలో పదే పదే దుర్భిక్ష పరిస్థితులు నెలకొంటున్నాయి. రాయలసీమ రైతన్న కష్టాలను తింటూ, కన్నీళ్ళను తాగుతున్నాడు. కరువు తాకిడికి తట్టుకోలేని ప్రజలు బెంగుళూరు, హైదరాబాద్, మద్రాస్ వంటి నగరాలకు పనికోసం వలస పోతున్నారు. కొంతమంది రైతులు రిక్షా తొక్కుతూ జీవిస్తున్నారు. తమ గ్రామాల్లో, సమీప గ్రామాల్లో రిక్షా తొక్కితే నామోషీగా వుంటుందని పక్క జిల్లాకు పోయిరిక్షా తొక్కుతున్నారు. వలసలుపోవడం 'సీమ' వాసులకు కొత్తేమీ కాదు. పనిలేదు, తిండిలేదు. అప్పు పుట్టలేదు. 'రాయలసీమ' ప్రజలు అప్పులలో పుట్టి, అప్పులలో చస్తున్నారని ప్రొఫెసర్ గంగూలీ అన్నమాటలు అక్షరాలా నిజం. వ్యవసాయం పైన వాటి ఉత్పత్తులపైన

వ్యయం చాలా ఎక్కువగా వున్నందున తిండికి ఖర్చు పెట్టిన తరువాత పేద రైతులు వద్ద ఏమి మిగలడం లేదని "భారతదేశంలో అధిక వ్యయ ఆర్థిక వ్యవస్థ వున్నదా?" అనే పుస్తకంలో ప్రముఖ ఆర్థిక శాస్త్రవేత్త మాల్కమ్ ఆదిశేషయ్య పేర్కొనడం జరిగింది. అయిన డబ్బంతా తిండికే సరిపోతే ఇక గుడ్డలు, ఇళ్ళు నిర్మించుకోవడం. తమ పిల్లల భవిష్యత్తు కోసం రైతులు ఏమి చేయాలి. అప్పు చేయాలి. ఆ అప్పు తీర్చలేక చివరికి తమ భూములను అమ్ముకొని వలస వెళ్ళాలి. ప్రస్తుతం రాయలసీమలో జరుగుతున్నది ఇదే. రాయలసీమలోని దాదాపు అన్ని జిల్లాల్లోనూ తొంభై శాతం పైగా సేద్యపు బావులు ఎండిపోయాయి. బావులలో వేసిన (ఇన్‌వెల్) బోర్లు కూడా ఇంకిపోతున్నాయి. దాదాపు 250 అడుగులలోతు బోర్లు వేసినా కూడా నీరు లభ్యం కావడం లేదంటే పరిస్థితి ఎలా వుందో ఊహించవచ్చు. పల్లె సీమల్లోని ప్రజలు నీటి కోసం మైళ్ళకు మైళ్ళు పోతున్నారు. ఇక పట్టణాల్లో సరే సరి!

'సీమ'లోని చెరువులన్నీ నెర్రెలు చీలాయి. రాష్ట్రంలో రెండవ చెరువుగా పేరుగాంచిన బుక్కపట్నం (అనంతపురం జిల్లా) చెరువులో బురదనీరు మాత్రమే వుంటుంది. ఈ చెరువు కింద దాదాపు ఐదువేల ఎకరాల సాగువుంది. ధర్మవరం, అనంతపురం, బద్వేలు, పోరుమామిళ్ళ, జమ్మలమడుగు, పులివెందుల, పాకాల, నాగలాపురం, అమ్మినాయనిపేట, తదితర ఎన్నో పెద్ద చెరువులు తమ వునికిని కోల్పోతున్నాయి.

రాయలసీమను పునీతం చేయవలసిన పెన్నా, చిత్రావతి, పాపాఘ్ని, కుందు, స్వర్ణముఖి, బాహుదా పింఛా, కుశస్థలి తదితర నదులు వాటి ఉపనదులలో నీరు సరిగాపారడంలేదు. ఈ నదులు ఇసుక, గులకరాళ్ళతో బావురుమంటున్నాయి.



రాయలసీమలో ఏనేలను చూసినా ఏమున్నది గర్వకారణం

కరువు పూజలు

రాయలసీమలో వందలాది మంది గ్రామదేవతలున్నారు. గ్రామ దేవతలకు ప్రత్యేకంగా గుడులు వుండవు. ఊరి చివర ఎత్తైన తిన్నెపై, రాతి గుట్టపై, వేపచెట్లకింద, చెరువు కట్టలమీద గ్రామదేవతలు కొలువు తీరారు. గ్రామస్థులంతా కలిసి గ్రామదేవతలను కొలవడం అనాదిగా వస్తున్న ఆచారమే. గ్రామాలు ఎలాంటి ఇబ్బందులు, కష్టాలకు లోనుగాకుండా, పంటలు బాగాపండి జనజీవనం సజావుగా సాగాలని కోరుతూ ప్రజలు గ్రామ దేవతలను ఆరాధించే వారు. రోగాల బారినుంచి కాపాడడానికి ఒకదేవతను, నదులు - చెరువులు పొంగిపొరలినప్పుడు ఒకదేవతను, కరువులు వచ్చినప్పుడు మరో దేవతను పూజించే పద్ధతి నేడుకూడా కొనసాగుతూనే వుంది. వానలు కురవక పంటలు ఎండుతున్నప్పుడు చేసే నగ్న పూజలు నేటి ఆధునిక సమాజంలోనూ జరుగుతున్నాయి. గ్రామం సుభిక్షంగా వుండాలని కోరుతూ గ్రామ దేవతలకు బలి, పొలి నిర్వహిస్తారు. గ్రామదేవతలు ఎక్కువ చోట్ల వట్టి బండరాళ్ళు మాత్రమే. కొన్నిచోట్ల రాతి విగ్రహాలు, మట్టి విగ్రహాలు వున్నాయి. గంగమ్మ, పోలేరమ్మ, నలనమ్మ, చౌడమ్మ చొప్పలమ్మ, పోతులమ్మ, కోటమ్మ, గొర్లమ్మ, బుర్లమ్మ... వందలాది మంది అమ్మలు వెలిశారు. అనంతపురం జిల్లా గోరంట్ల మండలం మేరెడ్డిపల్లిలో వెలసిన నలనమ్మకు విగ్రహం వుంది. ఊరికి ఉత్తరాన ఒక ఎత్తైన వేదికపై అమ్మవారు కూర్చొన్న విధంగా నల్లని రాతిలో చెక్కారు. చిత్తూరు జిల్లా మొలకల చెరువు సమీపంలోని సోమపాళ్యంలో గల కోటమ్మ విగ్రహం భయానకంగా వుంది. నాలుగు చేతులుండి శూలధారియై, నాలుక బార చాపి, కోరలు కలిగి చూపరుల గుండెలవిసేవిధంగా వుంది. కడప జిల్లా బ్రహ్మంగారి మఠం మండలం కందిమల్లాయపల్లి లోని పోలేరమ్మ వట్టి బండరాయి. విగ్రహం లేదు. గ్రామీణుల జీవనంలో గ్రామదేవతలు ముఖ్య భూమికను పోషిస్తున్నారు. దక్షిణాదిలో గ్రామదేవతల స్వరూప స్వభావాలు ప్రత్యేకమైనవని 'సమగ్ర ఆంధ్ర సాహిత్యం' సృష్టికర్త దివంగత డా. ఆరుద్ర పేర్కొన్నారు. గ్రామ దేవత ఆరాధన ద్రావిడ సంస్కృతికి దర్పణం. గ్రామదేవతలంతా శక్తి స్వరూపిణులే! గ్రామదేవతల్లో మాతృ లక్షణాలు వున్నాయని జానపద వాఙ్మయ పరిశోధకులు ప్రొ. నాయని కృష్ణకుమారి తన రచనల్లో తెలిపారు. గ్రామదేవత ఒక్కో ఊరిలో ఒక్కో విధంగా వున్నా పూజా విధానాలు, దేవతా లక్షణాలు అన్నిచోట్ల ఒకేరకంగా వుంటాయి. గ్రామ దేవతలను ప్రసన్నం చేసుకోవడానికి వారికి పొంగళ్ళు పెట్టడం, జాతర చేయడం, పిండి పదార్థంతో జ్యోతులు తయారు చేసి సమర్పించడం విశేషం. గ్రామ దేవతల కొలువులో గ్రామస్థులంతా కలిసి పూజలు చేస్తారు. వ్యాధులు సోక కూడదని,

పంటలు బాగా పండాలని 'పొలి' అనే పూజా కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. గ్రామస్థులందరికీ సమ్మతమైన రోజున 'పొలి' చేస్తారు. పొలిలో అమ్మవారికి జంతువులను బలి ఇస్తారు. ఎనుబోతులను, పొట్టేళ్ళను బలిస్తారు. జంతువులను నరికిన తర్వాత జంతు రక్తాన్ని వేపాకు రెమ్మలపై వెదజల్లుతారు. రక్తంతో తడిసిన వేపాకును తీసుకొని గ్రామ చాకలి "ఓ.... పొలి...... పొలి" అంటూ అరుస్తూ ప్రతి ఇంటి ముందూ వేస్తాడు. అదే విధంగా రైతులు 'పొలి'ని తీసుకొని పంట పొలాల్లో చల్లుతారు. జంతు బలి మాంసాన్ని గ్రామస్థులంతా సమంగా పంచుకొని వండుకొని తింటారు.

ఇదిలావుండగా బాగావానలు కురిసి చెరువులు నిండినప్పుడు తెప్ప తిరుణాళ్ళు జరుగుతాయి. గ్రామస్థులు చెరువుకట్టపైనున్న గంగమ్మ (చిన్నరాయి)కు పూజలు చేస్తారు. ఎనుబోతులను గంగమ్మకు బలిస్తారు. ఒక తెప్పను తయారు చేసి అందులో ఒక జ్యోతిని వుంచి, తెప్పను చెరువులో తిప్పుతారు. కొన్నిచోట్ల తెప్ప తిరుణాళ్ళు నేడు కూడా వైభవంగా జరుగుతున్నాయి. వర్షాలు సరిగా రాక కరువులు వచ్చినప్పుడు వానకోసం ప్రత్యేక పూజలు చేస్తారు. అందులో కప్పల పెళ్ళి చాలా ఆసక్తికరమైన అంశం. హరిజనులు, గిరిజనులు మాత్రమే కప్పల పెళ్ళి నిర్వాహకులు. మిగతావారు కొందరు నిర్వాహకుల వెంబడి వుంటారు. ఒక పెద్ద కప్పను పట్టుకొని రోకలి బండకు కడతారు. రోకలి బండకు వేపాకు రెమ్మలను వేలాడదీస్తారు. పసుపు, కుంకుమలతో కప్పను పూజించి గ్రామంలోని ఇంటింటికీ తిరుగుతారు. పాటలు పాడుతారు. కప్పను తీసుకొని వచ్చిన వారిపై నీళ్ళు చల్లడం ఆచారం. నీళ్ళుమీద పడినప్పుడు "వానొచ్చె... వానొచ్చె" అని అరుస్తారు. చివరగా కప్పను చెరువులో వదులుతారు. 'కొరచ' అనే తెగవారు కూడా కప్పల పెళ్ళి ఆచారాన్ని పాటిస్తారు. రాయలసీమ గ్రామీణులు వానకోసం నగ్న పూజలు చేస్తారు. అయితే అందులో బాలురు మాత్రమే పాల్గొనడం విశేషం. వానలు లేక పంటలు ఎండుతున్నప్పుడు గ్రామస్థులు గొర్లమ్మ (గ్రామదేవత)కు నీళ్ళు పోయాలి అని తీర్మానిస్తారు. ఆమెకు నీళ్ళు పోసేముందు *రాత్రి పూట చెరువు కట్టపై బాలురంతా నగ్నంగా 'లబలబ' అని నోరు కొట్టుకొంటూ చెరువు కట్టపై అటూ ఇటూ ముూడుసార్లు తిరుగుతారు. కట్ట మధ్యలో వున్న గంగమ్మ గుడి వద్దకు వచ్చి కరువు పరిస్థితులను గంగమ్మకు వివరిస్తారు.* ఒక బాలుడు గంగమ్మగా నటిస్తూ త్వరలో వానకురుస్తుందని చెబుతాడు. ఆ విధంగా చెరువు కట్టపై మూడు రోజులు నగ్నపూజలు జరిపి గొర్లమ్మకు ఊరందరూ నూటొక్క కడవల నీళ్ళు పోస్తారు. రోజూ గొర్లమ్మను పూజిస్తారు. పెళ్ళిళ్ళప్పుడూ వధూవరులు తొలుత గ్రామదేవతను పూజిస్తారు. కరువులు వచ్చినప్పుడు 'రామదండు' వెళ్ళే ఆచారమూ వుంది. ఊరిలో ఇంటికొక్కరు చొప్పున బయలుదేరి ఐదు లేక ఏడు గ్రామాల్లో రామభజన చేస్తారు. రామదండు సభ్యులు సాయంత్రం స్వగ్రామానికి చేరుకోగానే ఊరిముందు వారికి ఘనంగా స్వాగతం చెప్పి గుడిలో అన్న సంతర్పణ గావిస్తారు. ఆ అన్నాన్ని గ్రామస్థులు దైవ ప్రసాదంగా స్వీకరిస్తారు. నాటి ప్రాచీన ఆచారాలు గ్రామాల్లో నేటికీ సజీవంగా వున్నాయి.

అమెరికాయే ఆదర్శం

రాయలసీమ రైతులు అమెరికా రైతాంగ పోరాటాన్ని ఆదర్శంగా తీసుకోవాలి. ఎందుకంటే రాయలసీమ రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం చేయడానికి రైతన్నలలో అంత చైతన్యం లేదు. రైతాంగాన్ని సంఘటితపరచి, పోరుబాటలో నడిపించడంలో రైతు సంఘాలు చెప్పుకోదగ్గ విజయం సాధించలేదు. శాశ్వత ప్రాతిపదికన కరువు నివారణా పనులు, పెండింగ్ నీటి ప్రాజెక్టుల సత్వరమే పూర్తి, పంటల బీమా పథకం అమలు, దర నిర్ణయం హక్కు తదితర అంశాలు రైతాంగం ముందున్నాయి. అవన్నీ అమలయితేనే రైతాంగానికి విముక్తి లభిస్తుంది. లేకుంటే రైతన్నలు సమస్యల సుడిగుండంలోనే శాశ్వతంగా వుండవలసి వుంది. ఒక ఉద్యోగి కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకొంటే జీవితకాలమంతా ఇంక్రిమెంట్ వస్తుంది. అదే ఆపరేషన్ రైతు చేయించుకొంటే భిక్షం వేసినట్టు రూ.500 లు ఇస్తున్నారు. ఉద్యోగులకు సకల సౌకర్యాలు (విద్య, వైద్యం) సమకూర్చుతున్న పాలకులు రైతాంగం పట్ల పక్షపాతంతో వ్యవహ రిస్తున్నారు. వివక్ష చూపుతున్నారు. అందరికీ అన్నం పెట్టే రైతు 'దేహీ' అని దేవురించవలసిన పనిలేదు. పోరాట పంథాలను అనుసరిస్తే ప్రభుత్వాలు దిగివస్తాయి. రైతులు ఉద్యమిస్తే అది పెను ఉప్పెనగా మారి ప్రభుత్వాలనే కూల్చివేసిన దాఖలాలున్నాయి. అమెరికా చరిత్రను చదివితే ఆ విషయం అర్థమవుతుంది.

అమెరికాలో రైతాంగ పోరాటానికి నాంది పలికింది ఒక పత్రికా సంపాదకుడంటే ఎవరికైనా ఆశ్చర్యం కలుగుతుంది. 1880లో వ్యవసాయ ఉత్పత్తుల ధరలు దారుణంగా పడిపోయాయి. గిట్టుబాటు ధరలు లేక రైతాంగం విలవిలాడింది. పరిస్థితిని గమనించిన "వెస్టరన్‌రూరల్ " పత్రికా సంపాదకుడు 'మిల్టస్ జార్జ్' ఒక రైతు సంఘాన్ని చికాగోలో ప్రారంభించారు. ఆరు నెలల్లో ఆయన సంఘంలో లక్షమంది రైతులు సభ్యులుగా చేరారు. మిల్టన్ జార్జ్ సంఘం ఉత్తర అమెరికాలో పోరాటాలు చేస్తుండగా, దక్షిణ ప్రాంతంలో డా. సి. డబ్ల్యు. మకూస్ ఆధ్వర్యంలోని రైతుసంఘం పలుఆందోళనలు నిర్వహించింది. 1889 డిసెంబర్‌లో ఉత్తర, దక్షిణ అమెరికా రైతు సంఘాలు ఏకమయ్యాయి. రైతులకు వ్యతిరేకంగా వున్న ప్రభుత్వ ఆర్థిక విధానంపై గిట్టుబాటుధరలకై వ్యవసాయ సౌకర్యాల మెరుగుకై, రైలు మార్గాలను ప్రభుత్వమే నిర్మించాలని కోరుతూ రైతు సంఘాలు ఉద్యమించాయి. రైతుసంఘాలు నిర్వహించే సభలు, సమావేశాలకు పెద్ద ఎత్తున స్పందన లభించింది. రైతులు స్వచ్ఛందంగా సమావేశాలకు హాజరై సంఘీభావాన్ని ప్రదర్శించారు. అంతలో 1890లో ఎన్నికలు వచ్చాయి. ఆ ఎన్నికల్లో రైతులుపోటీ చేయాలని అమెరికా రైతు సంఘాలు పిలుపునిచ్చాయి. పలువురు రైతులు, రైతునాయకులు ఎన్నికల్లో పోటీ

చేయడానికి ముందుకు వచ్చారు. రాజకీయ అధికారం లేకుంటే తమ సమస్యలకు పరిష్కారం లభించదని భావించిన రైతాంగం 1890 ఎన్నికల్లో అత్యంత ఉత్సాహంగా పోటీచేసి విజయం సాధించారు. రాజకీయ వేదిక లేకుండా స్వతంత్రులుగానే పోటీచేశారు. సుమారు 12 రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చారు. ఆరు రాష్ట్రాలకు గవర్నర్‌లను రైతులే ఎన్నుకొన్నారు. అమెరికాలో అత్యున్నత శక్తిగా వున్న "అమెరికన్ కాంగ్రెస్' ' కు యాభైమంది ఎన్నికయ్యారు. 40 మంది సెనేటర్లు అయ్యారు. హౌస్ ఆఫ్ రెప్రజెంటేటివ్స్ లో 44 స్థానాలను దక్కించుకొన్నారు. రైతాంగ విజయం రిపబ్లికన్, డెమోక్రటిక్ పార్టీలకు వణుకు పుట్టించింది. ఏ రాజకీయ పార్టీ కూడా ఊహించని పరిణామం అది. ఆ విజయ స్ఫూర్తితో రైతు నాయకులు 1892 జూలై 4న ఒమహాలో సమావేశమై రాజకీయ పార్టీకి ప్రాణం పోశారు. అంతవరకు వున్న వేదికను "పీపుల్స్ పార్టీ"గా మార్చారు. 1892లో జరిగిన కొన్ని ఎన్నికల్లో పోటీ చేసిన పీపుల్స్ పార్టీ చెప్పుకో దగ్గ స్థాయిలో విజయం సాధించలేదు. 1896 ఎన్నికల ఫలితాలు సైతం ఆశాజనకంగా లేకపోయినా వారు బాధపడలేదు. అమెరికా ఉపాధ్యక్ష పదవికోసం టామ్ వాట్సన్ అనే రైతు నాయకున్ని పీపుల్స్ పార్టీ తమ అభ్యర్థిగా రంగంలోకి దించింది. అయితే రిపబ్లికన్, డెమోక్రటిక్ పార్టీ నాయకుల కుయుక్తుల వల్ల పీపుల్స్ పార్టీ అభ్యర్థి పరాజయం పాలయ్యాడు. అయినా రైతాంగ పోరాటం ఆ పార్టీలకు పెద్ద గుణపాఠం నేర్పింది. రైతులు తలచుకొంటే పాలకులను దించి, ప్రభుత్వాలను మార్చివేయగలరని ఆపోరాటం నిరూపించింది. అమెరికా రైతులు రాజకీయంగా ఎదిగిన తర్వాతనే వారి సమస్యలకు పరిష్కారం లభించింది. కనుక అమెరికా రైతాంగ పోరాటం స్ఫూర్తితో రాయలసీమ రైతాంగ సమస్యలను సాధించడానికి యువకులు ముందుకు రావాలి. "ఉద్యమిస్తే విజయం మనదే" నన్న నగ్న సత్యాన్ని రైతులకు తెలియచెప్పి, వారిని చైతన్యవంతులను చేయవలసిన బాధ్యత యువకులపై వుంది.

రైతాంగాన్ని మరచిన రాజకీయ పార్టీలు

ఏ రాజకీయపార్టీ అయినా అధికారంలోకి రావాలంటే రైతాంగం ఓట్ల పైనే ఆధారపడాలి. రైతులు ఎవరికి ఓట్లు వేస్తే వారే అధికారంలోకి వస్తున్నారు. రైతులు వద్దనుకొన్న రాజకీయ పార్టీలు అధికారానికి ఆమడదూరంలో వుంటున్నాయి.అంటే.. రైతన్నల ఓట్లు అతి ముఖ్యమైనవి. రైతాంగం ఓట్లు దండుకొని అధికారానికి వస్తున్న పార్టీలు రైతు సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వుంటున్నాయి. ఏ ఒక్క రాజకీయ పార్టీ రైతు ప్రయోజనాలను కాపాడడంలేదు. అన్ని పార్టీలకు రైతులంటే చిన్న చూపు. ఏదైనా ఒక సంఘటన జరిగినప్పుడు దానిని అడ్డు పెట్టుకొని పోరాటం చేస్తామంటూ ముందుకు వచ్చి రాజకీయం చేస్తారు. ఆ సమస్యను పార్టీ ప్రచారానికి బాగా వినియోగించుకొంటారు. లబ్దిపొందిన తర్వాత గాలికి వదలివేస్తారు. ఎన్నికల ప్రణాళికల్లో రైతు సంక్షేమానికి సరైన పథక రచన జరగడం లేదు. ఒక్క మాటలో చెప్పాలంటే రైతాంగం అవసరాలను, ఆశయాలను, సమస్యలను, సంక్షేమాన్ని రాజకీయ పార్టీలు మరచిపోతున్నాయి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి యాభై యేండ్లు గడచినా గ్రామీణ ప్రాంతాల్లో కనీస అవసరాల కొరత యింకా వుండడం సిగ్గుచేటుకాదా? 1996 లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో జనతాదళ్ నాయకులు తమ ఎన్నికల ప్రణాళికలో వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యతనిస్తామన్నారు. జాతీయ బ్యాంకులు వ్యవసాయ రంగానికిచ్చే పెట్టుబడులను 28 శాతానికి పెంచుతామని వాగ్దానం చేశారు. కానీ వ్యవసాయ

రంగ పెట్టుబడులు 12 శాతానికి మించడం లేదు. పంటలకు గిట్టుబాటు ధరలు లేకపోవడం, వ్యవసాయానికి అవసరమైన నీరు, విద్యుత్ సరఫరా చేయకపోవడం, పంటల బీమా పథకాన్ని సరిగా అమలు చేయకుండడం, రుణాల మంజూరులో తీవ్ర నిర్లక్ష్యం, రాయలసీమలాంటి కరువు ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక పథకాలను అమలు చేయక పోవడం వంటి సమస్యలు రైతాంగాన్ని పట్టి పీడిస్తున్నాయి. అయితే రైతు సమస్యలపై పోరాటం చేయడానికి ఏ రాజకీయ పార్టీ కూడా ముందుకు రావడం లేదు. పైగా ఆందోళన చేస్తున్న రైతులపై ఘనత వహించిన ప్రభుత్వాలు పోలీసు కాల్పులు జరిపిస్తున్నాయి. మధ్య ప్రదేశ్‌లోని బెటుల్ ప్రాంతంలో గిట్టు బాటు ధరలు కావాలని, పంటలకు నష్టపరిహారం యివ్వాలని ఆందోళన చేస్తున్న రైతులపై పోలీసులు కాల్పులు జరిపారు. ఆ కాల్పులలో దాదాపు ఇరవై మంది రైతులు మరణించారు. హర్యానాలో విద్యుత్ సరఫరా ఎక్కువగా జరగాలని కోరిన నేరానికి పోలీసులు రైతులపై తుపాకులతో గుండ్ల వర్షం కురిపించడంతో వారు నేలకొరిగారు. ఆంధ్ర ప్రదేశ్‌లో సైతం విద్యుత్ సరఫరాపై ఆందోళన చేస్తున్న రైతాంగంపై పోలీసు కాల్పులు జరిగాయి. తెలంగాణా జిల్లాల్లో పత్తి రైతులు దాదాపు 200 మంది అనంతపురం జిల్లాల్లో 40 మంది ఆత్మహత్యలు చేసుకొన్నారు. తీసుకొన్న రుణాలు ఎగ్గొట్టడం, మోసాలు చేయడం వంటి చర్యలకు రైతులు ఏనాడూ పాల్పడరు. రైతులకు ఆత్మాభిమానం ఎక్కువ. అందువల్లనే తమ కోర్కెలను చంపుకోవడమే గాక, వారు కూడా చనిపోతున్నారు. ఆత్మహత్యలు సరైన పరిష్కారం కాదని రైతులు తెలుసుకోవాలి. ఆత్మస్థైర్యంతో సమస్యలను ఎదుర్కొని పోరాటాన్ని ప్రారంభించాలి. ప్రభుత్వాలకు, రాజకీయ పార్టీలకు తగిన గుణపాఠం నేర్పాలి. రైతు సంఘాలు, సమాఖ్యలు బాధ్యతాయుతమైన కార్యాచరణను చేపట్టి రైతులను చైతన్యవంతులను చేయాలి.



బక్కచిక్కిన పశువులకు వేపాకే దిక్కు

పొదుపు చేసి నీళ్ళివ్వండి

రాష్ట్రంలోని నీటి వనరులను అన్ని ప్రాంతాలకూ సమానంగా పంచవలసిన బాధ్యత ప్రభుత్వంపై వుంది. అయితే ఒక ప్రాంతానికి ఎక్కువగానూ, మరో ప్రాంతానికి తక్కువ ప్రాధాన్యతనిస్తూ రాయలసీమ పట్ల పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఉదాహరణకు కోస్తా ప్రాంత నీటి వసతిని పరిశీలిద్దాం. క్రిష్ణ డెల్టాలో సంవత్సరానికి మూడు పంటలు పండిస్తున్నారు. మరి రాయలసీమలో ఒక పంట కూడా లేదు. కనుక కోస్తాలో మూడో పంటకు నీటికోత విధించి, ఆనీటిని రాయలసీమకు మళ్ళించాలి. బచావత్ అవార్డు ప్రకారం మనరాష్ట్రానికి సంక్రమించిన హక్కు 811 టి.ఎం.సి.లు. ఆ నీటిలో కాలువల అధునీకరణ, పూడికల తొలగింపు, భూగర్భ జలాల వినియోగం వంటి వాటివల్ల సుమారు 200 టి.ఎం.సి.ల నీటిని ఆదాచేయవచ్చునని నీటి పారుదలశాఖ నిపుణులు అంచనా వేశారు. ఆ విధంగా మిగిలించిన నీటిని కరువు ప్రాంతాలన్నింటికీ సమానంగా పంపిణీ చేయవచ్చు. నమ్మదానికి వీలు లేని క్రిష్ణ మిగులు నీటిని రాయలసీమ ప్రాజెక్టులకు కేటాయించి, నమ్మకమైన నికరజలాలను కోస్తాలో విరివిగా వాడుకొంటున్నారు. మిగులు జలాలతో 'సీమ' ప్రజల బతుకులను ముడిపెట్టడం దగా చేయడం కాదా? ఇదెక్కడి న్యాయం? మన రాష్ట్రానికి కేటాయించిన 811 టి.ఎం.సి.ల క్రిష్ణ నీటిపై ఏ ప్రాంతానికి చెందిన వారికీ గుత్తాధిపత్యం లేదు.

ఇదిలావుండగా తెలుగు గంగలో ముఖ్యమైన పోతిరెడ్డిపాడు హెడ్‌రెగులేటర్ నిర్మాణాన్ని కుదించడం వల్ల రాయలసీమ దారుణంగా నష్టపోవలసి వచ్చింది. శ్రీశైలం ప్రాజెక్టు పూర్తి నీటి మట్టం 885 అడుగులు. పోతిరెడ్డిపాడు హెడ్‌రెగులేటర్ వద్ద ఎత్తు సముద్రమట్టానికి 841 అడుగులు వుంది. శ్రీశైలం ప్రాజెక్టులో 860 అడుగుల నీటి మట్టం వుంటేనే పోతిరెడ్డిపాడు హెడ్ రెగులేటర్ నుంచి మిట్ట కందాల డీప్‌కట్ కాలువ ద్వారా బనకచెర్ల క్రాస్ రెగులేటర్‌కు నీటిని వదలడం సాధ్యంకాదు. సంవత్సరంలో ఎన్ని రోజులు శ్రీశైలం ప్రాజెక్టులో 860 అడుగుల నీటిమట్టం వుంటుంది?వాస్తవానికి బచావత్ అవార్డు విషయంలోనే కె.సి. కెనాల్‌కు అన్యాయం జరిగింది. కె.సి. కెనాల్ వాగులు వంకలు గుండా చాలాదూరం ప్రవహిస్తుంది.ఇవేవీ లెక్క చేయకుండా అప్పుడు కె.సి. కెనాల్‌కు 40 టి.ఎం.సి.ల నీరు చాలని ట్రిబ్యునల్ ముందు చెప్పారు. అయితే కె.సి. కెనాల్‌కు 70 టి.ఎం.సి.ల నీరు అవసరం నదీ పరివాహక ప్రాంతాలలో వర్షం బాగా కురిసినప్పుడు తుంగభద్ర, కుందు, నిప్పులవాగు తదితర వాటిల్లో నీరు బాగా ప్రవహించడంతో దాదాపు 60 టి.ఎం.సి.ల నీరు కె.సి. కెనాల్‌లోకి వస్తోంది. కె.సి. కెనాల్ పై బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు లేనందున పంటలకు రక్షణలేకుండా పోయింది.

కాగా శ్రీశైలం రైట్ బ్రాంచ్ కెనాల్ (ఎస్.ఆర్.బి.సి)కు 19 టి.ఎం.సి. ల నీటిని కేటాయించారు. కె.సి. కెనాల్‌ను ఆధునీకరించడం ద్వారా మిగిలిన నీటిని ఎస్.ఆర్.బి.సి.కు ఇస్తారట. ఈ మేరకు కేంద్ర జలవనరుల కమిటీ అనుమతిని కూడా పొందారు. ఈ పనిని "తెలుగు గంగ" విషయంలో కూడా చేసి వుండవచ్చు. నాగార్జున సాగర్, క్రిష్ణా డెల్టా కాలువలను ఆధునీకరించడం ద్వారా 'తెలుగు గంగ' కు నీటిని ఇస్తామని చెప్పివుంటే ఏ గొడవ వుండేది కాదు. క్రిష్ణానది మిగులు జలాలను కె.సి. కెనాల్‌కు ఇచ్చి, కె.సి. కెనాల్‌కు వచ్చే తుంగభద్ర 10 టి.ఎం.సి.ల నీటిని అనంతపురానికి మళ్ళిస్తామంటే మరో ఇబ్బంది కలుగవచ్చు. ఈ పది టి.ఎం.సి.ల నీటిని కె.సి. కెనాల్‌కు మాత్రమేనని, ఈ నీటిని ఇతర పథకాలకు మళ్ళిస్తే ఉమ్మడిగా మళ్ళీ పంచుకొందామని కర్నాటక ప్రభుత్వం వాదించవచ్చు.

•పాలకులకు రాయలసీమ పై ప్రేమ అనేది వుంటే పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్‌నుంచి బనక చర్లకు గల కాలువను 12 టి.ఎం.సి.లకు కుదించి వుండేవారు కాదు. ఈ కుదింపు వల్ల భవిష్యత్తులో అదనంగా నీరు విడుదల కావడానికి అవకాశమే లేకుండా పోయింది. ఇదిలా వుండగా 1973లో బచావత్ ట్రిబ్యునల్ ముందు రాయలసీమ కరువును బూచిగా చూపి మిగతా రాష్ట్రాల కంటే ఎక్కువగా కృష్ణా జలాలను కేటాయింపచేసుకొన్నారు. అంతేగాక మిగులు జలాలపై సైతం హక్కును పొందారు. వాటిలో కేవలం 122.7 టి.ఎం.సి.ల నీటినే రాయలసీమకు కేటాయించారు. 811 టి.ఎం.సి.ల క్రిష్ణా నీటిలో కోస్తాకు 377.70 టి.ఎం.సి.లు (49.2 శాతం), తెలంగాణాకు 266.83 టి.ఎం.సి.లు (34.8 శాతం), రాయలసీమకు 122.7 టి.ఎం.సి.లు (16 శాతం) కేటాయించడం జరిగింది. ఆవిరి ద్వారా 33 టి.ఎం.సి.ల నీరు నష్టమవుతుందని అంచనా వేశారు. ఇంజనీరింగ్ నిపుణుల అంచనా ప్రకారం రాష్ట్రంలో 2,746 టి.ఎం.సి. ల నీరు లభ్యమవుతున్నది. సాగుభూమి ప్రాతిపదికగా ఆ నీటిని పంపిణీ చేస్తే రాయలసీమకు 722.5 టి.ఎం.సి.ల నీరు వాటాగా రావాలి. విజయవాడ వద్దగల ప్రకాశం బ్యారేజి నుంచి సంవత్సరానికి సుమారు 1000 టి.ఎం.సి. ల వరదనీరు వృధాగా వెళ్లి సముద్రంలో కలుస్తున్నది. క్రిష్ణానదిలో 300 టి.ఎం.సి.లు నికరంగానే మిగిలి వృధా అవుతున్నట్టు ఒక అంచనా. రాయలసీమలోని ప్రాజెక్టులన్నిటికీ అవసరమయ్యే నీరు 129 టి.ఎం.సి. లు మాత్రమే. నికర జలాలను సముద్రంలోకి వదలి, మిగులు జలాలను 'సీమ' ప్రాజెక్టులకు కేటాయించడం అన్యాయంకాదా? ఒకరి దయా దాక్షిణ్యాలతో పనిలేకుండా 'సీమ'కు న్యాయంగా దక్కవలసిన నీటిని కేటాయిస్తే బీడుభూమి సస్యశ్యామలమవుతుంది.

గోదావరి నీటిని మళ్ళించండి.

మన రాష్ట్రంలో అతిపెద్ద నది గోదావరిలో 2750 టి.ఎం.సి.ల నీరున్నట్టు అంచనా వేశారు. అందులో రాష్ట్ర వాటా 1479 టి.ఎం.సి.లు. మన వాటాలో 50 శాతం మాత్రమే వినియోగించుకోగలుగుతున్నాము. పూర్తిస్థాయిలో నీటిని వాడడానికి ప్రాజెక్టులు లేవు. దానితో గోదావరిలోని అపార జలసంపద సముద్రంలోకి వెళ్ళిపోతున్నది. గోదావరి - క్రిష్ణా నదుల అనుసంధానం జరిగితే తెలంగాణా, రాయలసీమ కరువు ప్రాంతాలకు సేద్యపు నీరు కావలసినంత లభ్యమవుతుంది. హైదరాబాద్ - సికింద్రాబాద్ జంటనగరాలకు శాశ్వతంగా నీటి కరువు తీరుతుంది. గోదావరి జలాల వినియోగంపై పలువురుమేధావులు, ఇంజనీరింగ్ నిపుణులు పలు నివేదికలను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించారు. అన్ని నివేదికలలాగే అవి కూడా

కాగితాల్లోనే వున్నాయి. "ఎత్తిపోతల" ద్వారా గోదావరి నీటిని మళ్ళించి 'సీమ' పొలాల్లో సిరులు పండించవచ్చునని ఇంజనీరింగ్ నిపుణులు డాక్టర్ కె. శ్రీరామక్రిష్ణయ్య ప్రతిపాదించడం జరిగింది. కాగితాల్లో వున్న పోలవరం ప్రాజెక్టును నిర్మిస్తే గోదావరి నీటిని క్రిష్ణ లోకి మళ్ళించవచ్చు. దాదాపు 100 టి.ఎం.సి.ల నీటిని క్రిష్ణ కింద సాగుకు వాడుకోవచ్చు. క్రిష్ణ నీటిని కరువు ప్రాంతమైన రాయలసీమలో ఎక్కువగా వినియోగించుకోవచ్చు. అలాంటిది పోయి కరువు ప్రాంత అవసరాలకు ఉపయోగపడే క్రిష్ణ నీటిని జంటనగరాలకు మళ్ళించడానికి ప్రయత్నించడం అవివేకం.

ప్రతి సంవత్సరం రాష్ట్రంలోని అన్ని నదుల్లోని దాదాపు 2000 టి.ఎం.సి.ల నీరు సముద్రంలో వృధాగా కలుస్తున్నది. ఆ నీటినంతా వినియోగిస్తే ఒక్క రాయలసీమే కాదు... మొత్తం రాష్ట్రంలోని ప్రతి గ్రామానికి నది నీటిని మళ్ళించవచ్చు. పాలకుల చిత్తశుద్ధికి ప్రజాసహకారం తోడయితే లక్ష్యం తప్పకుండా నెరవేరి 'సీమ' పొలాల్లో సిరులు పండుతాయని నిస్సందేహంగా చెప్పవచ్చు.



సీమ అవసరాలు తీర్చలేని శ్రీశైలం ఆనకట్ట

పెడదోవలో పవిత్ర లక్ష్యం

బీటలుబారిన పొలాలు, పాతాళానికి పోయిన నీటి చుక్క, ప్రకృతి నిరాదరణ, పాలకుల నిర్లక్ష్యం తదితర కారణాల వల్ల రాయలసీమ ఎడారి దిశగా పయనిస్తున్నది. రాయలసీమ సమస్యలపై ఎందరో నాయకులు ఉద్యమాలు చేశారు. కమ్యూనిస్టు పార్టీలు, కాంగ్రెస్, తెలుగుదేశం, బి.జె.పి.లు ఉద్యమించాయి. అయితే 'సీమ' కరువును 'క్యాష్' చేసుకొన్నది ఒక్క కాంగ్రెస్ పార్టీ మాత్రమే! ఉద్యమంలో ప్రముఖ పాత్ర నిర్వహించిన నాయకులు అధికారం వెలగబెట్టినా 'సీమ'కు ఒరిగిందేమీ లేదు. సీమను ప్రగతి పథంలో నడిపిస్తామని వాగ్దానాల వర్షం కురిపించారు. మరి సీమకు వారు ఏమి చేశారు? పైగా ప్రస్తుతం సీమ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న నాయకులకు కొరతలేదు. అప్పటి ప్రధాని పి.వి. నరసింహారావు వెనుక బడిన ప్రాంతమైన నంద్యాల నియోజకవర్గం నుంచి ఎన్నికయ్యారు. అప్పటి ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర రెడ్డి పాణ్యం నుంచి ప్రాతినిధ్యం వహించారు. అప్పటి ప్రతిపక్ష నాయకుడు ఎన్టీరామారావు హిందూపురం స్థానం నుంచి ఎన్నికయ్యారు. సీమ పుత్రులు, దత్తపుత్రులు కరువును తమ ఊతపదంగా వాడుకొంటున్నారు. 'సీమ' ఉద్యమం పూర్వాపరాలు ఇలా వున్నాయి. సి.పి.ఐ. సీమ ఉద్యమ అవశ్యకతను తొలుత ప్రస్తావించింది. ఆ మేరకు 1975లో ప్రొద్దుటూరులో సీమ ప్రాజెక్టుల పై ఒక మహాసభను విజయవంతంగా నిర్వహించింది. అప్పటి నుంచి సీమ సమస్యలపై అదపా దడపా ఉద్యమాలు చేస్తూనే వున్నారు. సి.పి.ఐ. నాయకులు 1992లో సీమ వ్యాప్తంగా పర్యటించారు. నీటి ప్రాజెక్టుల నిర్మాణాల తీరు, కొత్త ప్రాజెక్టుల అవసరాలు, గ్రామీణుల అభిప్రాయాలపై సర్వే చేశారు.

టి.డి.పి. అధికారంలో వుండగా కాంగ్రెస్ నాయకులు నిర్మాణాత్మక ఉద్యమం చేపట్టారు. అయితే ఆ ఉద్యమం పెడదోవపట్టి 'దేశం'ను గద్దెదించే ఆందోళనగా మారింది. సీమ సమస్యలపై ఉద్యమాలు, ధర్నాలు, పికెటింగ్‌లు, కలెక్టరేట్ల దిగ్బంధనాలు, రాస్తారోకోలు, బహిరంగ సభలు, బంద్‌లు, పాదయాత్రలు వంటి ఆందోళనా కార్యక్రమాలు అప్పటి ప్రభుత్వాన్ని బెంబేలెత్తించాయి. నాటి ముఖ్యమంత్రి ఎన్టీరామారావును సీమ నాయకులు పలుమార్లు నిలదీశారు. *సీమలో రూపుదాల్చుతున్న నీటి ప్రాజెక్టులకు 370 టి.ఎం.సి.ల నికర జలాలు కేటాయించాలని, శ్రీశైలం రిజర్వాయరు దిగువన వున్న పోతిరెడ్డిపాడు హెడ్ రెగులేటర్‌స్థాయిని పెంచాలని, సీమలో భారీ పరిశ్రమలు నెలకొల్పాలని, పరిపాలనా సౌలభ్యం కోసం సీమలోని పెద్ద జిల్లాలను విభజించి కొత్త జిల్లాలు ఏర్పాటు చేయాలని. కొత్త రైల్వే మార్గాలను నిర్మించాలని; కొత్త జాతీయ రహదారులు ఏర్పాటు చేయాలని, సీమ పొలాలకు గోదావరి, క్రిష్ణా జలాలే శరణ్యమని సీమ నాయకులు ఉద్యమించారు.*

రాయలసీమను ఎడారి కానివ్వకూడదంటూ 1986 జనవరి 2నుంచి 22 వరకు పాదయాత్రలు జరిగాయి. రాయలసీమ ఐక్య కార్యాచరణ సమితి నాయకులు వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి, ఎం.వి. మైసూరారెడ్డి, రాయలసీమ కార్మిక, కర్షక సమితి అధ్యక్షుడు సిహెచ్. చంద్రశేఖర రెడ్డి, రాయలసీమ విమోచన సమితి అధ్యక్షుడు ఎం.వి.రమణా రెడ్డి, రాయలసీమ న్యాయవాదుల సంఘం నాయకుడు గంగిరెడ్డి, రాయలసీమ ఉద్యమ కార్యాచరణ సమితి నాయకులు మండ్ల సుబ్బారెడ్డి, భూమన్, ఇమామ్ తదితరుల నాయకత్వంలో పాదయాత్రలు జరిగాయి. సీమ ఉద్యమ నాయకులు బృందాలుగా విడిపోయి ఒక్కొక్కరు ఒక్కోచోటు నుంచి పాదయాత్ర ప్రారంభించారు. అనంతపురం జిల్లా లేపాక్షి నుంచి వై.ఎస్. బృందం, రాయదుర్గం నుంచి రమణారెడ్డి బృందం, చిత్తూరు జిల్లా మదనపల్లి నుంచి చంద్రశేఖర రెడ్డి, భూమన్, ఇమామ్‌ల బృందం, కర్నూలు జిల్లా మంత్రాలయం నుంచి శేషశయన రెడ్డి బృందం పాదయాత్రలను మొదలు పెట్టాయి. కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో సీమ ఉద్యమం 1984లో ప్రారంభమైనా.. పాదయాత్రలతో 1986 జనవరి 22 నాటికి పరాకాష్టకు చేరుకొన్నది. పాదయాత్రల బృందాలు సీమ వ్యాప్తంగా పర్యటిస్తూ జన జాగృతం చేసి కర్నూలు జిల్లా పోతిరెడ్డిపాడు చేరుకొని అక్కడ నిర్మాణంలో వున్న హెడ్ రెగులేటర్‌ను విస్తరించాలని భావించారు. అప్పటి ప్రభుత్వం తీసుకొన్న కట్టు దిట్టమైన చర్యల వల్ల నాయకులు పోతిరెడ్డిపాడు చేరుకొన్నా ఏమీ చేయలేకపోయారు. అయితే సీమ ఉద్యమకారులకు ఊరూరా ప్రజలు నీరాజనం పట్టారు. ఉద్యమానికి అనూహ్య స్పందన లభించింది. 1988 జనవరిలో అనంతపురం జిల్లా కలెక్టరేట్ ముట్టడి జరిగింది. హైదరాబాద్‌లో సీమ ఎమ్మెల్యేలు చేసిన నిరాహారదీక్షలు ఉద్యమానికే హైలైట్. ఛలో హైదరాబాద్ నిర్వహించి సెక్రటేరియట్ వద్ద ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌ను నిలవేశారు. అప్పుడు ఎన్టీఆర్ నడిరోడ్డుపై పడుకొన్నారు.

సీమ ఉద్యమం పట్ల బాగా ఆకర్షితులైన ప్రజలు కాంగ్రెస్ నాయకులకు జేజేలు పలకడంతో 1989 నవంబర్‌లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అఖండ విజయం సాధించింది. సీమ ఉద్యమం నేపథ్యంలో సీమకు వరాలంటూ గాలేరు - నగరి, హంద్రీ - నీవా పథకాలను ఎన్టీఆర్ ప్రకటించారు. అంతేగాక అప్పట్లోనే వాటిపై సర్వే చేయించారు. గాలేరు - నగరి పథకంలో భాగమైన రిజర్వాయర్లకు ఎన్టీఆర్ ఆర్భాటంగా శంకుస్థాపన చేశారు.

ఇదిలా వుండగా కాంగ్రెస్ ముఖ్యమంత్రి డా. మర్రి చెన్నారెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత సీమ ఎమ్మెల్యేలతో, నాయకులతో ఒక సమావేశం ఏర్పాటు చేశారు. సీమ ప్రాజెక్టులకు నికర జలాలు కేటాయించడం 'మిధ్య' అని చెన్నారెడ్డి సీమ వాసులను చాలా చులకనగా చూశారు. అంతే గాక సీమ ఉద్యమ నాయకుల మధ్య సయోధ్య లేకుండా పోయింది. దానితో 1986లో ఏర్పాటై ఉమ్మడి వేదికగా ఉన్న రాయలసీమ సంయుక్త కార్యాచరణ సమితి నుంచి కార్మిక, కర్షక సమితి వైదొలగింది. ఫలితంగా 1990 జనవరిలో కడప జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిరాహార దీక్షలు మొదలయ్యాయి. సీమ

కార్మిక, కర్షక సమితి అధ్యక్షుడు అనంతా చార్యులు నిరాహార దీక్షలకు నాయకత్వం వహించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినా సీనియర్ నాయకులు సీమ సమస్యల ఊసే ఎత్తలేదు.

అధికారాన్ని కోల్పోయిన తర్వాత టి.డి.పి. వారు సీమ ఉద్యమాన్ని చేపడతామని 1992 ఫిబ్రవరిలో తిరుపతిలో ఒక సమావేశాన్ని నిర్వహించడం జరిగింది. ఆ తర్వాత నంద్యాలలో ఒక సభ జరిగింది. మళ్ళీ టి.డి.పి. నాయకులు ఉద్యమం మాటే ఎత్తలేదు. రాయలసీమ విమోచన సమితి నాయకుడు ఎస్. శ్రీధర్ ఆధ్వర్యంలో 1995 జనవరిలో కదిరిలో సీమ ఉద్యమ సభలు జరిగాయి.

బి.జె.పి. ఉద్యమం

అధికారం లేనప్పుడు చేసిన డిమాండ్లను అధికారంలో వున్నప్పుడు కాంగ్రెస్ నాయకులు పరిష్కరించలేదు. నికర జలాల గురించి పట్టించుకోలేదు. సీమ ఉద్యమం పూర్తిగా కనుమరుగయింది. ఆనేపథ్యంలో భారతీయ జనతాపార్టీ 'నీటికోసం - శాంతికోసం' అంటూ 1994లో సీమ ఉద్యమంలో పాల్గొనింది. సీమ సమస్యలపై జన జాగృతం చేయడం కోసం ముఠాకక్షలను మట్టుబెట్టి, బాంబుల సంస్కృతికి స్వస్తి చెప్పి శాంతిని స్థాపింపచేయాలన్న సదుద్దేశంతో బి.జె.పి. పాదయాత్రను చేపట్టింది. పాదయాత్ర తిరుపతిలో మొదలయింది. చిత్తూరు, అనంతపురం, కడప, కర్నూలు జిల్లాల మీదుగా యాత్ర సాగింది. బిజెపి రాష్ట్రశాఖ ఉపాధ్యక్షుడు చిలకం రామచంద్రారెడ్డి పాదయాత్రకు నాయకత్వం వహించారు. బిజెపి పాదయాత్ర 51 రోజుల పాటు 866 కి.మీ. దూరం సాగింది.

పెండింగ్ నీటి ప్రాజెక్టులకు విముక్తి కలిగేవరకు, హత్యా రాజకీయాలను మట్టుబెట్టే వరకు ప్రజలను చైతన్య వంతులను చేయడానికి తాము పోరాటం చేస్తామని బిజెపి జాతీయ (దళితమోర్చా) నాయకుడు బంగారు లక్ష్మణ్ ప్రకటించారు. రాయలసీమ ప్రాజెక్టుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని బిజెపి రాష్ట్రశాఖ అప్పటి అధ్యక్షుడు వి. రామారావు, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల రెడ్డిలు పేర్కొన్నారు. బిజెపి జిల్లా శాఖల అధ్యక్షులు కేశవ చౌదరి (అనంతపురం), నరాలబాలిరెడ్డి (కడప), ప్రభాకర్ (కర్నూలు), రాష్ట్ర మహిళా మోర్చా అప్పటి అధ్యక్షులు శ్రీమతి శాంతా రెడ్డి తదితరులు పాదయాత్రలో పాల్గొన్నారు. అవసరమైతే సీమ సమస్యలపై జాతీయ స్థాయిలో ఉద్యమం చేపడతామని బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి ఎం. వెంకయ్యనాయుడు ప్రకటించారు. భారతీయ జనతాపార్టీ ఆధ్వర్యంలో కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడింది. అప్పట్లో సీమ సమస్యల గురించి ఎన్నో మాట్లాడిన వెంకయ్య అధికారంలోకి వచ్చిన తర్వాత సీమ అభివృద్ధికి చేసింది శూన్యం. బి.జె.పి నాయకులు 1999లో మరోసారి పాదయాత్రలు చేశారు. బి.జె.పి ఉద్యమం కూడా కాంగ్రెస్ తరహాలోనే సాగుతుండడం శోచనీయం.

విద్రోహంలో వాటా ఎంత?

కాంగ్రెస్ నాయకుడు, కడప ఎం.పి. డా. వై.ఎస్. రాజశేఖర రెడ్డి రాయలసీమ సమస్యలపై మరోమారు ఉద్యమాన్ని చేశారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని 'విద్రోహదినం'గా పాటించారు. ఆ

విద్రోహదినంలో తమ వాటా, తమ పార్టీ వాటా వుందన్న సంగతిని తెలుసుకోలేదు. 1997 నవంబర్ 1న విద్రోహదినం పేరుతో కడపలో వై.ఎస్. జరిపిన బహిరంగ సభకు భారీ సంఖ్యలో జనం వచ్చారు. విభేదాలే ఊపిరిగా జీవిస్తున్న 'సీమ' కాంగ్రెస్ నాయకులు విద్రోహదినం వేదికపై ఒక్కటయ్యారు. అంతవరకు ఒకరిపై మరొకరు కత్తులు దూసుకొన్న కాంగ్రెస్ నాయకులు కరుణామయులయ్యారు. టి.డి.పి. ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపారు. చంద్రబాబుపై చంద్రనిప్పులు చెరిగారు. "బాబు ప్రభుత్వాన్ని గద్దె దింపుతాం" అని ప్రగల్భాలు పలికారు, సీమ సమస్యల గురించి మాట్లాడలేదు. విద్రోహదినం సభ ఎందుకు ఏర్పాటయిందో కాంగ్రెస్ నాయకులు పూర్తిగా మరచిపోయారు. వారు ఉద్వేగంతో ఊగిపోయారు. విద్రోహదినం సభకు ద్రోహం చేశారు. ఆ విధంగా చేయడం కాంగ్రెస్ నాయకులకు కొత్తకాదు. రాయలసీమ సమస్యలను సాధించడం కోసం ఉద్యమాన్ని ప్రారంభించి...తర్వాత పక్కదారి పట్టించడం వారికి పరిపాటి అయింది. 1986లో ఉవ్వెత్తున సాగిన సీమ ఉద్యమం పెడదారి పట్టి అప్పటి ప్రభుత్వాన్ని కూల్చడానికి ఉపయోగపడింది. 1989లో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి సీమ ఉద్యమం తోడ్పడింది. సీమ సమస్యలు అట్లే వుండిపోయాయి. "సీమ సమస్యల సాధన" అన్న పవిత్ర లక్ష్యం పెడదోవలో పయనించి, కాంగ్రెస్ నాయకులకు ఓట్ల వర్షం కురిపించేదిగా, ప్రభుత్వాన్ని పడదోసేదిగా మారింది. అందువల్లనే 1997లో కాంగ్రెస్ నాయకులు జరిపిన సీమ ఉద్యమానికి స్పందన లభించలేదు.1989-1994 సం॥రాల మధ్య సీమ ఉద్యమ నాయకుల సేవలను ప్రజలు బాగా గమనించారు. దానితో ఉద్యమం పట్ల ప్రజలు ఆసక్తిని కనబరచలేదు. ఒక పవిత్ర లక్ష్యం పెడదోవ పట్టడాన్ని రాయలసీమ ప్రజలు సహించరు.



గ్రామ దేవత - గంగమ్మ

నలనమ్మ

చూసి
పడు

కథావస్తువుగా కరువు

ుసీమ కరువులో నుంచి ఎందరో రచయితలు పుట్టుకొచ్చారు. కరువు పట్ల స్పందించి
ఏమ' కరువును కళ్ళకు కట్టినట్టు వివరించడంలో పలువురు రచయితలు విజయం
రాజకీయ నాయకులవలె గాకుండా పత్రికా ప్రతినిధులు, పత్రికా రచయితలు, కథా
'సీమ' లో నెలకొన్న కరువు పై విశేషంగా స్పందించారు. 1984-85 నుంచి పత్రికలు
ుకను పోషించాయి. 1980 వ దశకానికి ముందు కరువును ఇతివృత్తంగా కథలు రాసేవారు
వ. కరువు పై కథలు రాసేవారు చిత్తూరు జిల్లాలో ఐదు మంది లోపు రచయితలు
ుడేవారు. 1980వ దశకం మధ్య నుంచి అనంతపురం జిల్లా రచయితలు కరువుపై కథలు
ాయడం మొదలు పెట్టారు. 1982 - 83 నుంచి కరువుపై వివిధ పత్రికలకు నేను
ాశాను. ఆ తర్వాత కథలు, ఒక నవల రాశాను. కథా వస్తువుగా కరువును స్వీకరించిన
చయితల్లో నేనూ ఒకడు. కరువులు వచ్చిన పుడు పశువులను ఏ విధంగా అమ్ముకొంటారో,
యడానికి అంతా సిద్దం చేసుకొంటే.. వాన పడకుంటే రైతాంగం పడే బాధలు, రాయలసీమ
ముఠాకక్షలు - హత్యలు తదితర అంశాలే నా కథలకు నేపథ్యాలు. నేను రాసిన 'గోమాత'
వీక్లీలో, 'బలి' ఆంధ్రప్రభ వార పత్రికలో అచ్చయ్యాయి. గోమాత, బలి కథలు నాకు
ఇష్టమైనవి. అందుకే వాటిని ఇందులో చేర్చాను. కరువు కథలు తెలుగు సీమను
్రాయనడంలో సందేహం లేదు.'బలి' కథను కాపీ కొట్టిన కథకు 1990లో ఉత్తమ కథ అవార్డు
ేను అప్పట్లో దానిపై గొడవ చేశాను.

నగ వేసి రెన్నెళ్ళయింది. ఇంత వరకు వానరాలేదు. విత్తనాలు వేసేటప్పుడు పడిన కొద్దిపాటి
... మళ్ళీ వరుణుడు కరుణించలేదు. చెట్టు ఎదగక పోగా వున్న పూత రాలిపోతోంది. నాగన్న
ల్ల చూస్తున్నాడు అతని చూపులలో ఆశ స్పష్టంగా కనిపిస్తున్నది. ఇంటి ముందు పడుకున్న
నిద్రపట్టలా. అటు ఇటు నుసుగు తున్నాడు. 'ఏమయ్యా'! అంది భార్య నారమ్మ. 'ఏమి'
తిప్పి అన్నాడు.

ట్లో సరుకులేమి లేవు. ఇంకా అడగడానికి ఎవరి ఇండ్లూ మిగల్లేదు. యాడికైన పోయి అప్పు
' అంది నారమ్మ.

'ఇప్పటికే లెక్కకు మించిన అప్పులు చేశాను. ఈ వానొస్తుందా? పంట పండుతుందా? అప్పులు తీరుతాయా? ఆ అవుదూడనమ్మి సరకులు తెస్తాను' అన్నాడు. అవు దూడనమ్మడానికి నారమ్మకు బొత్తిగా ఇష్టం లేదు. కానీ పస్తులతో కాలం గడపలేక ఇద్దరు పిల్లలను చంపుకోలేక ఆవుదూడనమ్మడానికి ఒప్పుకొంది. పంట పెట్టేముందు ఆవునమ్మారు. మళ్ళీ రెన్నెల్లకే దూడనమ్మాల్సి వస్తుందని వారూహించలేదు. నారమ్మ దూడను కొడుకుగా చూసుకొంటుంది. ఎంతో గారాబంగా పెంచుకొన్నది. అవు దూడను సంతకు తోలుకొని పోయే ముందు పూజ చేసింది.

అవు దూడ అలా వెళ్ళిందో లేదో నారమ్మ భోరున విలపించ సాగింది. ఇంట్లో వున్న ఇద్దరు పిల్లలు నారమ్మ కల్ల అట్లే చూస్తున్నారు. అమ్మతో పాటు వారు కూడా ఏడవ సాగారు. తన కొడుకులను గుండెలకు హత్తుకుని ఏడుస్తోంది. అమ్మ ఎందుకు ఏడుస్తున్నదీ పిల్లలకు అర్థం కాలేదు. దిక్కుతేలీక అమ్మ దుఃఖంలో వారూ పాలు పంచుకొన్నారు. కొన్ని గంటలు అట్లే వున్నారు.

నారమ్మ 'రాయలో' ల్లింటికి పనికి పోతుంది. ఆ రోజు బాగా ఆలస్యమయింది. కొట్టంలోని ఆవులను బయట కట్టేసింది. వేరుశనగ పిండి కలుపుతోంది. అంతలో ఆవు దూడ అంబా! అంబా! అంటూ పరుగెత్తుకొని వచ్చింది. దూడ నోట్లోకి సెనగపిండి ముద్ద పెట్టింది. అవు దూడను పట్టుకొని విలపించ సాగింది. "ముద్దుల మూడో కొడుకుని అమ్ముకొంటినే" అని మధన పడుతోంది. తన బాధను ఎవరికీ చెప్పక, చెప్పుకోలేక మనసులోనే కుమిలి పోతున్నది. ఒక్కసారిగా తన మనసు సంత వైపు మళ్ళింది. తన దూడను ఈ పాటికి అమ్మేసుంటా డనుకొంటూ....

అదొక పెద్ద సంత. ఆ సంత రాష్ట్రంలోనే రెండవదిగా పేరుగాంచింది. ప్రతి వారం ఆ సంత నుంచి దాదాపు పదివేల పశువులు కబేళాలకు తరలిపోతుంటాయి. వారం - వారం వేల పశువులు సంతలో కలుస్తుంటాయి. గడ్డిలేక వాటిని మేపడానికి చేతగాక కొంత మంది అమ్మితే, వారికే పూటగడవక మరికొంతమంది అమ్ముతుంటారు. ఎలాగయితేనేం మొత్తం మీద ప్రతివారం ఈ సంత నుంచి వేల పశువులను కటికకత్తికి బలిచేస్తుంటారు. గో హత్య మహాపాతకమన్నారు... ఆనాడు, మరి ఈనాడు దానినే నిత్యకృత్యంగా పెట్టుకొని జీవిస్తున్నారు. తన దూద కూడా కటిక కత్తికి బలి కావలసిందేనా. మళ్ళీ దూడ అరిచే సరికి నారమ్మ ఊహలకు అంతరాయం కలిగింది. కొంగు చాటున వుంచుకొన్న సద్దన్నపు గిన్నె పిల్లలకిచ్చి ఓ మూల కూలబడింది. ఆమె మనసంతా సంత చుట్టూ తిరుగుతోంది. తన దూడ కళ్ళల్లో మెదులుతోంది. వేరే ధ్యాసే లేదు. ఆ దూద వుండి తను చచ్చినా ఫరవాలేదనుకొంది. కానీ ఆ అవకాశం తనకురాలేదే అని బాధపడింది. మూలన కూర్చున్న నారమ్మ ఏడుస్తూనే ఉంది. అంతలో సంచినిండా సరుకులతో నాగన్న సంత నుంచి తిరిగొచ్చాడు.

'బాగా ఆకలయితావుంది అన్నంవండు' అన్నాడు. వెంటనే సరుకులను కుండలలో పోసుకొంది. బియ్యపు నూకల్లో అవు దూద కనిపిస్తున్నది. ఆమె నూకలు చెరుగుతుంటే ఒక్కొక్క చుక్కే కన్నీరు నూకల్లో పడుతున్నాయి...

పళ్ళెం (తట్ట) లో అన్నం పెట్టింది బాగా ఆకలవుతోంది కాబట్టి నాగన్న గబ గబా తింటున్నాడు. భర్తవైపు తదేకంగా చూస్తోంది...

తన మనసంతా దూడపైనే. తన ఆవుదూడను కత్తులతో కోస్తున్నట్టు కనిపిస్తోంది.

భర్త పళ్ళెం వైపు చూసింది. ఆవు దూడను పట్టాకత్తులతో కోస్తున్నట్టు కనిపిస్తున్నది.

ఆ పళ్ళెం లో మాంసం ముద్దలు కనిపిస్తున్నాయి.

ఆ మాంసం ముక్కలను తన భర్త తింటున్నాడనుకొంది. ఒక్కసారిగా భర్తపక్కనున్న చారు గిన్నెవైపు చూసింది. అందులో రక్తం కనిపించింది. ఇది తన దూడ రక్తమే అనుకొంది. మనసులోనే వేదన పడుతున్న నారమ్మ తన బిడ్డలకు మాత్రమే తల్లికాదు. ఆవు దూడకు కూడా తల్లి నారమ్మే.

అందుకే ఆమె గోమాత



నాటక కళాకారుడు మల్లాపల్లి జయరామప్ప

బలి

శెనిగిత్తనా లేసే అదును దాటి పది దినాలైనా పూరా పదును వానగూడా పల్లేదు. వచ్చిన కాసింత వానకే భూమి దున్ని దుక్కి చేసినామ్. గుంటకలు తోలినా, ఆడ.. ఆడ మల్లా గడ్డి మొల్సింది. సేన్లో కానగమాను కింద కుసొని యంగటప్ప యాదన పడ్తాండాడు.

"పతిసారీ ఇత్తనాలు ఇత్తేసి. దంతులు పడతాంటిమే. ఈ సారి ఇంత వరకూ ఇత్తనాలే ఏయ్‌లేదే? అసలు ఇత్తనాలు యేసే అదురుట్టముందా? ఇంతకు ముందు వానా! అంటే ఓయ్ అనేతట్టందే. ఇబ్బుడు పదును వాన పడల్లంటే... అసలు పడితే కదా! యేటి కిందున్న ఒగెకరా నాల్లో పుట్టుదొడ్లు పండుతాండె. యాటాయాటా నూరు మూట్లు శెనిక్కాయలు గారంటీగా పండుతాండే, యాల.. ఈ కాలం ఇట్లా మారిపోయింది. బుడ్రాతెమ్మకు, ముత్తాలమ్మకు, పోలేరమ్మకు, గంగమ్మతల్లికి మాపై కోపం వచ్చిందా? నీరు గట్టి నారయ్య పిలుపుతో యంగటప్ప యాదనకు అంతరాయం కలిగింది.

'రా నారయ్యా ఈ వానొస్తుందంటవా?'

'ఏమోనయ్యా! శానా మంది జనం మనూర్లో వుంటే బదికేది కట్టమని కూలికోసరం, కాసింత కూటికోసరం పట్నానికి పోతారంట. రెండు మూడు దినాల్లో మనూర్లో సాగం మంది జనం ఎల్లిపోతారంట. పసరాలు కడుపార మేసేకి కనుసూపులో యాడా గెడ్డిపాస కనపడదే. మనకేమో ముప్పొద్దులా ఒద్దులే... రెండు పొద్దుల గాక పోయినా యాల కింత తిండి తిందామంటే అది కూడా సిక్కకుండా పోతాంది.

'అయితే.. శానామంది వూర్లో వుండరంటావా?'

'అవునయ్యా రేపో మాపో ఎల్లిపోదామని శానామంది అనుకొంటావుంటే నేను యిన్నాను'.

'అయితే.. నారయ్యా ఈ పొద్దే సందకాడ పెద్దరెడ్డిని, సిన్నరెడ్డిని కలసి నా మాటగా సెప్పు. బుడ్రాతెమ్మకు మన్నాట్నించి నీల్లు పోయల్లంట. రేపట్నించి పిల్లోల్లను కట్టమిందికి పోయ్ రమ్మను'. అట్లేనని నారయ్య పెద్దరెడ్డి కోసరం సందకాడ బయలుదేరిపోయినాడు.

'అవును. నేనేమో ఇయాలకడపోతాండాను. పెద్దరెడ్డి ఇంట్లో వుంటాడో వుండడో! వున్నాఎన్ని పన్లో. నేను పోతే నాతో బాగా మాట్లాడతాడా? అసలు ముందు సిన్నరెడ్డికి సెప్పినావా అని నన్ను నిలదీస్తే నేనేం సెయల్ల? ఏమో అంతా యంగటప్పదే బారం. ఒగాల పెద్దరెడ్డి యేమన్నా అంటే యంగటప్ప

మిందే సెప్పుతా' అని తన మనసులో అనుకొంటూ నారయ్య పెద్దరెడ్డి ఇంటివైపు చూసినాడు. అజానుబాహుడైన పెద్దరెడ్డి ఇంటి ముందరే నిలబడి ఏందో ఆలోచన చేస్తాండాడు.

పెద్దరెడ్డి చూపు టక్కున నారయ్యపైన పడింది 'ఏం నారయ్యా ఇయ్యాలకడ ఒస్తాండావ్. ఏం ఈ వానొస్తుందా! లేదా! నువ్వన్నా సెప్పుతావా?' అని నవ్వుతూ మాట్లాడినాడు.

నారయ్య తడబడుతూ 'అదేనయ్యా. యంగటప్ప సెప్పి రమ్మంటే ఒచ్చినా. మన్నాట్నించి బుడ్రాతెమ్మకు నీల్లు పాయల్లంట. దాని కోసరం రేపుట్నించి పిల్లోల్లను (చెరువు) కట్టమిందికి పంపిచ్చల్లంట. పెద్దరెడ్డికి సెప్పి సేద్దామని యంగటప్పసెప్పితే..'

'అట్లేగాన్లే మీరంతా సెప్తాంటే నేను కాదంటనా? ' అన్నాడు పెద్దరెడ్డి. అది చిన్న పల్లెటూరైనా ఆ పల్లెటూర్లో అంత అందంగా కనిపిస్తాందా రెండంతస్తుల భవనం. ఆ భవనం మారాజు సిన్నరెడ్డి. ఆ సిన్నరెడ్డి ఇంటి ముందర నారయ్య అడుగు పెట్టి పెట్టక ముందే కుక్క 'భౌ.. భౌ భౌ' మంటూ రయ్‌న రాకెట్‌లా వచ్చింది.

'ఏయ్! ఏయ్!' అని ఎంత అదిలించినా ఆ కుక్క ముందుకే ఒస్తాంది గానీ వెనక్కు పోలేదు. ఆలోచన చేస్తున్న సిన్నరెడ్డి కుక్క అరుపు విని బయటికి తొంగి చూసినాడు.

ఎదురుగా నారయ్య నిలబడుకోనుండాడు. కుక్కను అదిలించి "రా.. నారయ్య రా!' అని ఆప్యాయంగా పిలిచినాడు.

కట్టమిందికి పొయ్యే విషయం, బుడ్రాతెమ్మకు నీల్లుపోసే సంగతి అన్నీ సెప్పినాడు నారయ్య.

'అవునయ్యా'

"పెద్దరెడ్డికి సెప్పినావా?"

"మా బావమర్ది బండన్న! వాడుంటే అన్ని పన్లూ సూసుకుంటాడు. వాడు ఇయ్యాలకడ కూడా యాడపాయ్‌నాడో! ఒరే పాపన్న బండన్న యాడవుండాడో సూడు" అని అంటావున్నట్లే బండన్న వచ్చినాడు. విషయం తెలుసుకొన్నాడు.

"మాకి సమందమే లేదు. ఏమైనా సేసుకోండి. కట్టమింది కన్నా పోండి. కట్టకిందికన్నా పోండి. బుడ్రాతెమ్మకో, గిడ్రాతెమ్మకో నీల్లు పోసుకోండి. మేం మాత్తరం రామంతే! బలి యిత్తాం పాలిసేత్తాం అంతేగాని మీ కిట్టమైనబ్బుదొచ్చి రమ్మంటే మేమంతా ఎదవలా? అంత సేతగానోల్లమా? ఇబ్బటికెబ్బుడే పిలిత్తే మేమెట్లా రాము. పేరంతా పెద్దరెడ్డికే, మాకీ శాతనయితుంది. సూడండ్రి" అన్నాడు బండన్న.

"ఈ బండన్న యబ్బుడూ యింతే. ఊరందరిదీ ఉత్తరమైతే నాది మాత్తరం దచ్చినమంటాడు. ఊర్లో ఏం పనిగూడా సక్కరమంగా జరగ్గూడదు. జరగనిచ్చి సావడు గూడా. ఎట్లన్నా గానీ సెడగొట్టల్ల ఇదీ అతని (దుర్) ఉద్దేశం" అని నారయ్య మనసులో అనుకొంటూ సిన్నరెడ్డి ఇంటి నుంచి కదిలినాడు.

అడ, ఈడ జరిగిన సంగతంతా యంగటప్పకు జెప్పినాడు నారయ్య. ఏంది ఏమన్నా గానీ ఈ పొద్దు కూతెయ్యాల్సిందే ననుకొండారు యిద్దరూ. ఆ వెంటనే నారయ్య మొదలు పెట్టినాడు కూత.

"ఓ .. రేపు రాత్రికి కట్టమిందికి బోవల్ల పిల్లోలంతా యల్లబారండప్పో! మన్నాడు పొద్దన్నే బుడ్రాతెమ్మకు నీల్లు పోయల్లమ్మో!" అని ఊరందరికీ వినిపించేంత గట్టిగా కూతేస్తావుండాడు.

కూత యిన్నారో. లేదో, గానీ అప్పుడే ఒకచోట తేలినారు బండన్న గుండన్న.

"ఆ ... యినబడింది"

"ఊల్ల కతే మనకొద్దు. ఊల్లేమన్నా సేసుకోనీ, మనం మాత్తరం బాయికాడ యాట్లు నరికి పాలిసెయ్యాల్సిందే!'

"అట్లే గాన్లే బండన్న! నీ మాటకి యా పొద్దన్నా ఎదురు సెప్పినానా?"

చెరువు కట్టమింద ఆ పక్క నుంచి ఈ పక్కకు, ఈ పక్క నుంచి ఆ పక్కకు మూడు సార్లు లబ, లబ మని నోరు కొట్టుకొంటూ తిరిగినారు పిల్లోల్లు. ఒక పిల్లోన్ని పండుకోమని సెప్పి పీనిగిని సేసినారు. గంగమ్మ గుడి సుట్టూరా మూడుసార్లు దిరిగినారు. వానకోసరం గంగమ్మను అడగతావుంటే గంగమ్మ ఉలకలేదు.. పలకలేదు.

"గంగమ్మా! ఒసేయ్.. నువ్వుండావా? సచ్చినావా? నీకు గుడియాల? నీ గుడికి కంపలు కొడతాం! సెప్పుతావా, లేదా? వా నెబ్బుడొస్తుంది?" గంగమ్మ వాన కురిపిస్తుందో లేదో గాని ఒకాయన మాత్రం ఇట్లా ప్రశ్నల వర్షం కురిపిస్తాండాడు.

"వూ.. వూ..." అని మూలిగిన శబ్దం యినపడ్తాండాది.

"గంగమ్మ తల్లీ నువ్వేనా?" అన్నాడొకాయన.

"నేనేరా. మీ అమ్మనురా గంగమ్మనురా!" అనింది గుడిలోని గొంతు.

"గంగమ్మ తల్లీ! నువ్వు సూత్తాండావా? ఈడ దిన్నమూ పీనిగిలు పడతాండాయ్! వాన లేదు. నీల్లు లేవు. బావులెండిపాయె. చెరువుల్లో బంకమొన్ను మాత్తరమే వుంది. సిత్రావతి యేట్లో యిసక ఎంత తోడినా నీల్లు మాత్తరం కనబడవు. సేసేకి పని లేక తినేకి కూడు లేక జనాలంతా పూరిడుత్తాండారు తల్లో! సెప్పు ఈ వానెబ్బుడొత్తుంది? అసలీ యాడాది మాకు యిత్తనా లేసేయోగముందంటావా?"

"వుంది కొడకా. తొందరపడి వూరిడద్దండి. మూడు దినాల్లో దండిగా వాన పడ్తుంది. మీరంతా పంటలు పెడతారు. పంటలు బాగా పండితే నా కేమిస్తారు? యాటలు నరుకుతారా? జ్యోతులు మోస్తారా? జాతర చేస్తారా?"

"అబ్బా గంగమ్మగా బలే నటించినావురా. రేయ్! ఇద్దో యీనికి ఇంగాసిన్ని బియ్యము, బ్యాళ్ళు. బెల్లము పెట్టండి, బాగా తిన్ని"

'రే.. రే... రామూ, నా కాలు ఇరుక్కొందిరా. అట్లా పెరకరా. రేయ్, పెరుకుతావా, లేదా నా కొడ..' అంటాండాదొక పిల్లోడు.

వాని మాటలు ఎవరూ పట్టించుకోకుండా ఎవురంతకు వాల్లు బంక మొన్ను పెల్లలు పెరుకుతాండారు. నిజంగానే ఆ పిల్లోని కాలు చెరువులో చీలిన నెర్రిలో ఇరుక్కొంది. ఏందో తమాషా చేస్తాండాడనుకొని మొదట్లో పిల్లోల్లు ఎవరూ పట్టించుకోలా. వాడు మల్లా మల్లా అరిసేతలికి నలుగురైదుగురు పిల్లోలు వాని కాలి సుట్టూరా వున్న మొంటి పెల్లలు పెరికినారు. అప్పుడు వాడు కాలు బయటకు తీసి - 'నాకూ ఒకపెల్ల యియ్యంగ్రి' అన్నాడు.

'ఒరేయ్, నీకు కాలి, నెప్పిచ్చలేదా?' అన్నాడొగడు.

'కాలు నొప్పిచ్చలేదు. గానీ మా తాత సెప్పిన గజేంద్ర మోచ్చం లోని ముసిలి (మొసలి) ఏనిగి (ఏనుగు) కాలు పట్టుకోనుండిన సీను గుర్తుకొచ్చిందిరా' అన్నాడు వాడు.

రాము సోము ఇట్లా మాట్లాడుతూ ఒచ్చేతలికి 'బుడ్రాతెమ్మ' నిండా మొంటి పెల్లలు పేరుకోనుండాయి. బుడ్రాతెమ్మకీ జై అంటూ మొంటిపెల్ల సత్తవకొద్దీ నేలకేసి కొట్టారు.

'అబ్బ యా యమ్మ పోసుకొంటాండబ్బా! నీల్లు యిట్లా వంకవొస్తాండాయి. బచ్చిలి గుంతనిండితే వాళ్ళకు బుద్దిండద్దా? బచ్చిలి నీల్లు బజారుకు పెడితే ఊర్లో నలుగురేమనుకుంటారన్న బయం గూడా వాల్లకున్నట్లేదే! ఇంతకీ యీ నీల్లు యాట్నించి వొత్తాండాయో సూత్తాం" అని నాలుగడుగు లేసినాడో లేదో అట్లే నిలబడిపోయ్‌నాడు. బింది మింద బింది, కడవ మింద కడవ నీల్లు పోస్తానే వుండారు ఆ రాతిపైన.. అదే బుడ్రాతెమ్మ. ఆ ఊరి దేవత.

"మావా ఎప్పుడు సచ్చితీవు? సుట్టుపక్కలంతా బాగుండారా" అని ఒగడంటే.

"జెం.. జెండాపై కోతి రాజు" అని ఇంగొగడు పాట్లు పద్యాలు పాడుకొంటూ నాటకాల నారాయణప్ప సుట్టూ సేరినారు.

"మావా ఈ వానెట్లారాదు గానీ. ఒకనాటకమన్నా ఆడదాం!" అన్నాడొగడు.

"ఒరే అల్లుడా! నా మేనల్లుడా! నువ్వు నాటక మాడదామంటే కాదంటానా?" బుడ్రాతెమ్మకు నూటొక్క పూలు పెట్టి నూటొక్క కడవల నీల్లు పోసినారు?

"ఓయబ్బో.. ముచ్చంగా మూడు దినాలయిపాయె. రేపట్నించి 'బుడ్రాతెమ్మ' ఎండ కెండాల్సిందే"

"ఇంతకీ యంగటప్ప మావ ఊర్లోనే ఉండాడా?" అన్నాడు నాటకాల నారాయణప్ప.

"ఒరేయ్ నాటకాలోడా, నీకు ఊరూరు దిరిగి ఆ ఊరీ ఊరి నీల్లు దాగి కండ్లు కనపల్లేదా? పక్కనే వున్నా మాట్లాడతావనుకొంటే మాట్లాడితే గదా?"

"పొరపాటయిందిలే మావా ఈ సారి కొదిలేసెయ్! ఇంగోసారి నీసేతికి సిక్కను."

"ఏరా.. ఊరి డిసిపెడతావా?"

" ఊర్లో వుండి ఏం బోంచేయల్లని? సేసేకి పనిలా తినేకి కూడులా"

* * *

బుడ్రాతెమ్మకు నీల్లు పోసి నాలుగు దినాలు దాటినా ఆకాశంలో ఎక్కడా మబ్బులు కూడా కనబడలేదు. ఇంటి ముందర కూర్చొన్న యంగటప్ప తల పైకెత్తి ఆకాశం కల్లా చూస్తున్నాడు. ఒకే ఒక దగ్గిర కాసింత తెల్ల మాడం (మేఘం) కనపిస్తాంది. "బుడ్రాతెమ్మకు నీల్లు పోసినా ఈ వాన ఒచ్చేటట్టు లేదు. ఇరాట్‌పురం (విరాటపర్వం) నాటకమన్నా ఆడితే వానేమన్న వొస్తుందేమో! ఈ నీరు గట్టి నారయ్య యాడ పాయ్‌నాడో.. ఒరే మగేశా! ఈడు గూడా లేడా? ఏం పేర్లో ఏమో! ఏందో అది. ఎవురికీ తిరిగిసాయదు. మగేసికం, ఆడేసికం అంటేనే బాగుంటాది."

"ఏం తాతా" అన్నాడు మనవడు మహేష్. "ఆ.. ఏం లేదు. నీరు గట్టి నారయ్యను మా తాత పిలుస్తాండడని సెప్పియాడికి రమ్మను"

"రా.. నారయ్యా రా! నీకోసరమే మా మగేసిగాణ్ణి పంపిస్తావుంటి. అంతలోపలే నీవే వొచ్చినావు. ఏం.. యిసేసాలు సెప్పు".

"ఏం సెప్పమంటావు యంగటప్పా! వానేమో పూరా ఎగబెట్టేసింది. పెద్దరెడ్డి ఇరాట్‌పురం అరికత రేపు, మన్నాడులోగా సెప్పింద్దామంటాండాడు. కొందరేమో నారాయణప్ప దగ్గిర నాటకం నేర్చుకొంటాండారు".

"అరికథ, బయల్నాటక మున్నీగానీ ముందు ముత్యాలమ్మకు జోతులు మోసి, మల్లా పోలేరమ్మకు మంచి పొట్టేండ్లను 'బలి'ద్దాం. నేను పెద్దరెడ్డితో మాట్లాడుతా గానీ, సోమారం జోతులు మొయల్లని ఈపొద్దు సందకాడ కూతెయ్. అట్లే మంగలారం పోలేరమ్మకు పొట్టేండ్లను 'బలి' య్యల్లని కూతెయ్" అన్నాడు యంగటప్ప.

ఆ పొద్దు తెల్లవారుజాము నాలుగ్గంటలకే ఊర్లో సందడి మొదలయింది. ఆడోల్లు ఇండ్ల ముందర అలికే వాల్లు అలుకుతాంటే, ముగ్గులేసే వాల్లు ముగ్గులేస్తాంటే, 'జోతి'ని తయారు చేసేదానికి బియ్యప్పిండి కొడతావుంటే.. అబ్బా! వాల్ల ఆరాటం అంతా ఇంతా గాదు. ఆ ఆరాటమంతా వరుణెది కరుణ కోసరమే. ఇత్తనాలు యిత్తే కాలం దాటిపోయినా ఇంట్లో యిత్తనం సేన్లో పడలేదన్న బాధ వాల్ల నంతపనీ చేయిస్తాంది.

తప్పెట్ల శబ్దం యినబడతానే సిలకపచ్చ సీర కట్టిన పెద్దరెడ్డి పెండ్లాము పార్వతమ్మ 'జోతి' నెత్తుకొని బుడ్రాతెమ్మ దగ్గిర నిలబడింది. పెద్ద జోతి జతకు ఒక పిల్ల జోతిని కూడా ఆనవాయితీ ప్రకారం

సేసినారు. రెండు జోతుల్లోనా నేతితో దీపాలు వెలుగుతున్నాయి. ఒక్కొక్కరే వచ్చి ఆడోల్లంతా జోతులతో వరుసగా నిలబడినారు. "అందరూ వొచ్చినట్లేనా?" అని వాల్లలో వాల్లే అనుకొంటావుండారు.

"సిన్నరెడ్డి యింట్నించి ఇంకా జోతి రాలే" దని ఎవురో ఎనకల్నించి గెట్టిగా అరిసినారు. సిన్నరెడ్డి యింటి జోతి కోసరం కాసింతసేపు ఎదురుసూసి బయలుదేరినారు. ఊరి పొలిమేర్లో యాపసెట్టు కిందున్న ముత్యాలమ్మ గుడి ఎరువు, తెలుపు (కావురాయి, సున్నం) రంగుల చారలతో మెరుస్తా వుంది. ముత్యాలమ్మకు మూడు అడ్డనామాలు దిద్దినారు. పై భాగంలో వెండి కండ్లు. ముక్కు. కోరలు పెట్టినారు. పక్కనే ఒక శూలం గూడా గుచ్చినారు. ముత్యాలమ్మ గుడి పక్కనే నల్లగుట్ట మింద జనమంతా కూర్చొని ఏదో వాల్ల కిష్టమొచ్చింది మాట్లాడతా వుండారు. జోతులెత్తుకున్న వారు ముత్యాలమ్మ గుడిని మూడు సుట్లేసి, జోతిల్ని కిందికి దించి టెంకాయలు కొట్టినారు. అమ్మోరికి బట్టలు పెట్టి కొందరు తమ మొక్కుబడులు తీర్చుకొన్నారు. "ఇత్తనాలేసి బాగాపంటలు పండితే మల్లా బట్టలు పెడతాము తల్లో" అని మరి కొందరు మొక్కుకొన్నారు. పిల్ల జోతుల కోసరం అప్పుడేపిల్లోల్లు యంపర్లాడతా వుండారు.

ఒక్కసారిగా అడున్న ఆడోల్లు, పిల్లోల్లు దూరంగా పారిపోయినారు.

'ఊహూ.. హూ.. ఉహూహూ!' అని వూగిపోతున్నాడా మనిషి, ఆపక్కకు ఈపక్కకు వాలిపోతున్నాడు చేతిలో యాపాకు పట్టుకొని, "ఒరేయ్.. రండ్రా.. కొడకల్లారా!" అని పిలుస్తాండాడు. "అమ్మోరికి ఆగ్గరం వొచ్చినట్లుం"దని గుట్టమిందున్న జనం ఆ మనిషి దగ్గరకు పొయ్‌నారు. మన పూజారికి అమ్మోరు పూనకమొచ్చిందని, వా నెప్పుడొస్తుందని అడుగుదామని కొందరు పెద్దలు ఎగబడుతున్నారు. "ముత్యాలమ్మోరికి మన మేమైనా తక్కువ సేసినామా?" అని కొందరు మాట్లాడుకుంటాండారు.

పండ్లు పట పట కొరుకుతా వుండాడు పూజారి. చేతిలోని యాపాకు కట్టను యిదిలిస్తాండాడు. "నేను ముత్యాలమ్మను కానురా.. కొడకల్లారా! నన్నే గుర్తు పట్టలేదా? నేనురా మీ అమ్మనురా గంగమ్మనురా! నన్నే మర్చిపొయ్‌నార్రా నాకొడకల్లారా" అన్న మాటలు జనాన్ని జంకేటట్టు చేసినాయి. "వానెప్పుడొత్తుంది తల్లో?" అన్నాడో వ్యక్తి వెనకల నుంచి. 'ఒరే కొడుకా, ముందర కొచ్చి మాట్లాడరా వాన యిప్పుడే రాదురా సెరువు నిండితేనే గదరా మీరు నాకు 'బలి' చ్చేది. నాకు ఎనుప్పోతుల్ని 'బలి' య్యాండ్రా. నేను ఎనుప్పోతుల రగతం తాగిన పద్దినాల్లో పది పదున్ల వాన పడుతుందిరా కొడకల్లారా!' అంటూ ఆ మనిషి "హూ. హూ... ' అని వాలికింద పడిపొయ్‌నాడు.

"గంగమ్మ తల్లీ! నీ కోరిక తీరత్తామమ్మా" అని జనమంతా మొక్కుకొన్నారు.

ఎనుప్పోతులే గాదు తల్లో మేకలు, పొట్టేండ్లు కూడా 'బలి'త్తామని మరి కొందరు మొక్కుకొన్నారు.

రేపు పొద్దు మునిగేలోపల గంగమ్మ తల్లికి మన సెరువు కట్టమింద ఎనుప్పోతుల్ని 'బలి' య్యాల్లని అందరూ మాట్లాడినారు. "సిన్నరెడ్డి యింటినుంచి ఒగ పిల్లకూన కూడా రాలేదే? మనం సేసిన తీర్మానానికి సిన్నరెడ్డి ఏమంటాడో!" అన్నాడు యంగటప్ప.

"మావా ఎవరు ఒచ్చినా రాకపోయినా మన పని మనం సేసితీరల్ల మనం 'బలి'చ్చేది మనింటికోసరం గాదు గదా! నలుగురి బాగుకోసరం. మనూరు పచ్చగా పది కాలాల పాటుండల్లని మనం ఈ 'బలి' ఇత్తాండాం. అయినా సిన్నరెడ్డిని మనమేమీ వొద్దని సెప్పలేదే? వాల్ల యిట్టం. మన 'బలి' సాగవల సిందే" అన్నాడు పెద్దరెడ్డి. కాసింత సేపు తర్జన బర్జనలు జరిగినా మరుసటి దినం సాయంత్రం సెరువు కట్టమింద గంగమ్మకు ఎనుప్పోతుల్ని 'బలి'య్యడానికి అందురూ తమసమ్మతాన్ని తెలిపినారు.

"మనం లాకుండానే గంగమ్మకు పోతుల్ని బలిత్తార? సూత్తాం. ఆ 'బలి' ఎట్లా జరుగుతుందో! ఒరే పాపన్నా గుండన్నను పిల్చకరా!" అని పండ్లు పట పట మని కొరకతాండాడు బండన్న.

"ఏం బండన్నా రమ్మన్నావంట!" అన్నాడు గుండన్న

"వాల్లు... అదే పెద్దరెడ్డి గుంపు రేపు సాయంత్రం గంగమ్మకు ఎనుప్పోతుల్ని 'బలి'త్తారంట. వాల్లకంటే ముందు మనం అదే కట్టమింద ఆ గంగమ్మ గుడి ముందరే మన పెద్దనుప్పోతును 'బలి'య్యల్ల. నువ్వు పాతూరుకు పొయ్యి మనోల్లని పదైదుమందిని సందకాడ పిల్చకొచ్చెయ్. రేప్పొద్దన్నే కతనేన్జూసుకుంటా"

ఊర్లో ఆపొద్దు సంకురాత్రి పండగ చేసినంత సంబరంగా జనాలంతా 'బలి'కి సిద్దం చేస్తాండారు. పొద్దు పుట్టకుండానే ఇండ్ల ముందర పేడతో అలికి, ముగ్గులు పోసినారు. నిజంగా జనం మొగాల్లో సంబరం కనిపించలేదు. అదంతా కృత్రిమం. వానకోసరం ఇట్లాంటివి నాలుగైదు పండగలైనా చేసేదానికి వాల్లు ఎనిక్కిపోరు. మామూలుగా అయితే 'బలి' పండగనాడు ఊర్లోప్రతి యింటికీ పది పదైదుమంది బంధువులు, మిత్రులు సుట్టుపట్ల పూర్లనించి వొస్తారు. కానీ యీసారి అప్పటికప్పుడు అనుకోని సేస్తాండారు గాబట్టి అందరికీ సెప్పేకి టైం లేదు. మొత్తం మీద వూర్లో సందడి ఏమాత్రం తగ్గలేదు.

గంగమ్మ గుడికి ఎట్లాంటి సున్నం కొట్నారో గానీ గుడి మాత్రం తెల్లగా మెరస్తా వుండాది. గుడి సిన్నదైనా గుడిలో విగ్రహం మాత్రం భారీగా, భయంకరంగానే ఉండాది. నాలుగు సేతులు. ఒక సేతిలో తెగిన మనిషి తల, మరో సేతిలో తెగిన ఎనుప్పోతు తల. ఇంకో సేతిలో ఒక పెద్ద కత్తి, నాలుగో సెయ్యి అభయహస్తంతో సూసేవాల్లకు గుండె అదిరేటట్టుండాది గంగమ్మ.

తప్పెట్లు శబ్దం విని వులిక్కి పడినట్టు అడిగినాడు పెద్దరెడ్డి "పొద్దింగా శానావుంది ఇయాలకే తప్పెట్లు ఎవరు కొట్టమన్నారు? ఆ నాయాల్లను కాసింతసేపు ఊరికే వుండమని సెప్పండ్రా"

"నాయనా! సిన్నరెడ్డి, బావమర్ది బండన్న గుండన్న అందరూ గల్సి పెద్దెనుప్పోతుని పట్టుకోని కట్టమిందకు పోతాండారు. రా నాయినా సూత్తువురా" అన్నాడు నీరుగట్టి నారయ్య.

పెద్దరెడ్డి కోపానికి పట్టపగ్గాలేకుండా పొయ్‌నాయి. "మనం సాయంత్రం 'బలి'య్యల్లనుకొంటే ఆయదవనాయాల్లు అప్పుడే మధ్యాన్నంకడే పోతారా? ఎంత తెగిచ్చినారు వాల్లు! మనం శాతగానోల్లమా?

మనం దద్దమ్మలమా? మనఎనుప్పోతే ముందు తెగల్ల మనం గంగమ్మ కాపులం గంగమ్మకి కోపమొత్తే యేడేండ్లు కరువుతో మనల్ని యేడిపిత్తుంది. ఒరే ఎల్లిగా, మల్లిగా.. ! పదండి కట్టమిందికి మన ఎనుప్పోతే ముందు తెగల్ల".

పెద్దరెడ్డి ఎనుప్పోతునూ, ఆగుంపునూ దూరం నించే సూసిన గుండన్న "తొందరగా పూజలు సేసియ్యండ్రి. వాల్లొత్తాండారు."

"బండన్నా యాట కొడివిలి బాగా: నూరు వాల్లు దగ్గిర కొచ్చేసినారు. అందరూ ఒగేసోటకు రాండి" ... అన్నాడు.

'బలి'యిప్పుడు యియ్యండ్దండని పెద్దరెడ్డి మనిషి చెబితే "మేము ముందుగా వొచ్చినాం. సాయంత్రం దంకా ఈడ మాకేం పని. మా పోతును ముందుగ 'బలి'య్యాల్సిందే"నన్నాడు బండన్న.

పెద్దరెడ్డి సేద్దిగాడు మల్లన్న మాటను ఏమాత్రం పట్టిచ్చుకోకు..తా అతన్ని బండన్న మెద పట్టినూకినాడు. అయినా అడ్డమొచ్చినాడు మల్లన్న. గూబగుయ్ మనేటట్టు ఒగటిచ్చినాడు బండన్న. అంతే ! ఒగరిమిందొకరు పడి కొట్టుకొన్నారు. నరుక్కొన్నారు. యాట కొదవండ్లను పదునుబెట్టిన దానికి పని బాగానే దొరికింది. సిన్నరెడ్డి, పెద్దరెడ్డి పారిపాయ్‌నారు.

పొలికేకలు వినిపిస్తాండాయి. ఒకరు కాదు ఇద్దరు కాదు నలుగురు! నాలుగ్గు మొండాలు తెగిపడిపాయ్‌నాయి. గంగమ్మ గుడి ముందర రగతం మడుగు ఏర్పడింది. కట్టమింద గంగమ్మకు నలుగురు 'బలి' అయ్యారు.

బండన్న, గుండన్న నల్లగుట్ట దాటి అడ్డదారి పట్టి యాడపాయ్‌నారో ఎవురికీ తెలీదు. ఊరు ఊరంతా కట్టిమింద కొచ్చేసింది. ఇంగా పొద్దు మునగకనే ఆ వూర్ని చీకటి కమ్మేసింది. తమ పసుపు కుంకుమలు పొగొట్టుకొన్న ఆడపడుచులు భోరున ఏడస్తాండారు.

యంగటప్ప అప్పుడే ఆడకు చేరుకొన్నాడు. 'బలి'ని చూసి.. రెండు చేతులూ ముఖానికి అడ్డం పెట్టుకొని యేడుస్తాండాడు. "పెద్దరెడ్డి, సిన్నరెడ్డి యిద్దరినీ నరికి గంగమ్మకు 'బలి'చ్చింటే బాగుండే' దని యంగటప్ప మనసులోనే మధనపడుతూ అట్లే కుప్పకూలిపాయ్‌నాడు.

కట్టమింద గంగమ్మ 'బలి' తీసుకుని నెల దాటినా పదును కాదు ఒక్క చినుకు కూడా నేల రాల్లేదు.

కొంత సేపటికి తేరుకొన్నాడు. అరుపులు, పెడబొబ్బలు ఆగిపోయాయి. అందరూ చెరువు కట్ట మొరవకల్ల సూస్తాండారు. యంగటప్ప ముందరికి పాయ్‌నాడు. ఎదురుగా నారయ్య నీరుగట్టి నారయ్య. రెండు సేతుల్లో రెండు తలకాయలు పట్టుకొని ఒస్తాండాడు. ఒగటి పెద్ద రెడ్డిది, ఇంగొగటి సిన్న రెడ్డిది.

"శబాస్ నారయ్యా. నిజమైన 'బలి'ని సేసింది నువ్వే. మనూరికి పట్టిన పీడను, సీడను వొదిలించినందుకు మనూరు నీకు రున పడుంటుంది" అని యంగటప్ప సెబుతుంటే ఎవురూ అడ్డం సెప్పలే.

లాభం లేని సేద్యం



సీమ నదులన్నీ ఇసుకతోనే నిండి వుంటాయి

'సీమ' ప్రాజెక్టులకు మోక్షం ఎప్పుడు?

రాయలసీమను సస్యశ్యామలం చేయడానికి ఎందరో మేధావులు ఎన్నో పథకాలను రూపొందించారు. ప్రఖ్యాత మానవతావాది కల్నల్ మెకంజీ, సర్ థామస్ మన్రో, డాక్టర్ తిరునారాయణ్, డా. శ్రీరామ కృష్ణయ్య, శ్రీ శ్రీరామరెడ్డి, శ్రీఉయ్యాల వాడ నరసింహారెడ్డి తదితర ఇంజనీర్లు, 'సీమ' అభివృద్ధిని కాంక్షించినవారు రాయలసీమలోని ప్రతి మండలానికి నీరు పారించాలని పథకాలు రచించారు. గంగ - కావేరి, గోదావరి - క్రిష్ణ నదుల అనుసంధానం జరిగి వుంటే రాయలసీమ తన గతవైభవాన్ని తిరిగి పొందివుండేది. పుష్కరం ('12 సం.రాలు) కాదు. స్వాతంత్ర్యానంతరం సిద్ధంచేసిన నీటి ప్రాజెక్టులు నేటికీ పూర్తికాలేదంటే ఎవరిని నిందించాలి? పాలకుల నిర్లక్ష్యానికి పరాకాష్టగా పెండింగ్ ప్రాజెక్టులను పేర్కొనవచ్చు. కరువు బారినుంచి 'సీమ' ను కాపాడడానికి రూపొందించిన పథకాలు కొన్ని అమలయినా, కరువు సీమకు పెద్దగా ప్రయోజనం కలగలేదు. నీటి ప్రాజెక్టుల నిర్మాణాలు నత్తనడక కంటే మరింత అధ్వాన్నంగా తయారయ్యాయి. అనంతపురం, కర్నూలు, కడప జిల్లాలకు ప్రాణదారయిన తుంగభద్ర ఎగువకాలువ రెండో దశకు 1967లో రూపకల్పన జరిగింది. నిర్మాణ వ్యయం కేవలం రూ. 9.2 కోట్లు కాగా 1.21 లక్షల ఎకరాలకు నీరు అందించాలని తలపెట్టారు. రెండో దశలో ప్రధాన కాలువ లైనింగ్‌తో పాటు గుంతకల్లు ఉపకాలువ, పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, ధర్మవరం, యాడికి కాలువలు, మైలవరం డ్యామ్ - ఉత్తర, దక్షిణ కాలువలు మిడ్ పెన్నార్ దక్షిణ కాలువ వున్నాయి. వీటిలో నిర్మాణాలు చాలా భాగం పూర్తయినా నిర్మాణంలో జాప్యం వల్ల వ్యయం వందల కోట్లకు చేరుకొన్నది. పి.ఏ.బి.ఆర్.ను 1978లో చేపట్టగా యింకా అసంపూర్తిగానే వుంది. పది టి.ఎం.సి.ల నీటిని నిల్వ చేసే సామర్థ్యం వున్నా నీరు లేక పి.ఏ.బి.ఆర్. బోసిపోయింది. పి.ఎ.బి.ఆర్. కింద 40 మెగావాట్ల విద్యుత్ వుత్పాదనకు ప్రతిపాదించగా కేవలం 20 మెగావాట్ల విద్యుత్ వుత్పాదనకు మాత్రమే యంత్రాలు అమర్చారు. నీరు లేనందున విద్యుత్ ఉత్పత్తి జరగడం లేదు. పి.ఏ.బి.ఆర్. కుడికాలువనే ధర్మవరం కెనాల్ అంటారు. ధర్మవరం కాలువ పనులు అసంపూర్తిగా వున్నాయి. యాడికి కాలువ నిర్మాణవ్యయం సుమారు 250 కోట్లుగా అంచనా వేశారు. యాడికి కాలువ మిడ్ పెన్నార్ ప్రాజెక్టు ఉత్తరం వైపు నుంచి ప్రారంభమవుతుంది. అనంతపురం జిల్లా ఉరవకొండ సమీపంలోని కొర్రకోడు గ్రామం వద్ద పెన్నానదికి అడ్డంగా నిర్మించిన పి.ఏ.బి.ఆర్. కు పది టి.ఎం.సి.ల తుంగభద్ర నికర జలాలను కేటాయించాలని అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ నిర్ణయించారు. ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా పి.ఏ.బి.ఆర్‌కు నీటిని వదలాలని అభిప్రాయపడ్డారు. పాలకులు చొరవ చూపితే పి.ఏ.బి.ఆర్.కు పది టి.ఎం.సి.ల నీటిని మళ్ళించడం సమస్య కానేకాదు. తుంగభద్ర ఎగువ కాలువకు కేటాయించిన 32 టి.ఎం.సి.ల నీటిలో సగం కూడా సీమ పొలాలకు దక్కడం లేదు. పాలకులు ఇంకా జాప్యం చేస్తే

వందలాది కోట్లు వెచ్చించి నిర్మించిన ప్రాజెక్టులు వృధా కాకమానవు. అనంతపురం జిల్లాలోని రాయదుర్గం సమీపాన గల భైరవానితిప్ప (బి.టి.) ప్రాజెక్టు, హిందూపురం వద్ద వున్న పెన్నార్ కుముద్వతి రిజర్వాయర్, పెనుకొండ నియోజకవర్గంలోని రామగిరి కొండల్లో నిర్మించిన పేరూరు ప్రాజెక్టు, కదిరి సమీపంలోని చెన్నరాయగుడి (సి.జి) ప్రాజెక్టు నీళ్ళు లేక బావురు మంటున్నాయి. కదిరి నియోజకవర్గంలోని ముదిగుబ్బ మండలం అడవి బ్రాహ్మణ పల్లె సమీపంలో మద్దిలేరు నదిపై ఒక రిజర్వాయర్‌ను నిర్మించాలని 1950లో ప్రతిపాదించారు. దాదాపు 18 వేల ఎకరాలకు నీటి వసతి కల్పించడానికి ఖర్చు అంచనా అప్పట్లో 8 కోట్లు. పదేండ్ల కిందట నిర్మాణ పని ప్రారంభమయింది. ప్రస్తుతం నిర్మాణ వ్యయం అంచనా యాభై కోట్లు. మద్దిలేరు ప్రాజెక్టు పూర్తి కావడానికి మరో మూడేండ్లు పట్టే అవకాశం వుంది. కదిరి నియోజక వర్గంలోని సంబులపూలకుంట మండలంలోని పెడబల్లి వద్ద పాపాఘ్ని నదిపై ప్రాజెక్టును నిర్మించడానికి 1987 సెప్టెంబర్ 13న అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీరామారావు శంకుస్థాపన చేశారు. అప్పట్లో నిర్మాణ వ్యయం రూ. 4 కోట్లు. ప్రస్తుతం అంచనాల ప్రకారం ప్రాజెక్టు ఖర్చు 13 కోట్లు. పెడబల్లి, మద్దిలేరు రిజర్వాయర్ల నిర్మాణంలో జరిగిన జాప్యంలో కంట్రాక్టర్లు, రాజకీయ నాయకులకు సమాన భాగస్వామ్యం వుంది.

ఇదిలావుండగా రాయలసీమలోని మిగతా జిల్లాలకంటే అనంతపురంలో కరువు పరిస్థితులు అత్యంత దారుణంగా వుంటున్నందున దక్షిణ ప్రాంతాల రైతాంగం కోసం తుంగభద్ర ఎగువ కాలువకు సమాంతరంగా మరో కాలువను తవ్వాలని ఎన్టీఆర్ 1985లో ప్రతిపాదించారు. అంతేగాక కె.సి. కాల్వకు యిస్తున్న పది టి.ఎం.సి.ల తుంగభద్ర నీటిని అనంతపురం జిల్లాకు సమాంతర కాలువద్వారా మళ్లించాలని ఎన్టీఆర్ ప్రకటించారు. కె.సి. కెనాల్‌కు క్రిష్ణ నీటిని యివ్వాలని నిర్ణయించారు. తుంగభద్ర సమాంతరకాలువ అతీగతి లేదు. ఎన్టీఆర్ ప్రతి పాదనను కడపజిల్లా రాజకీయ నాయకులు వ్యతిరేకించారు.

మిగులు జలాల సుడిగుండంలో

రాయలసీమ ప్రాజెక్టులకు నికరజలాలు గాకుండా మిగులు జలాలు కేటాయించినందువల్ల ప్రాజెక్టుల మనుగడ ప్రశ్నార్థకమయింది. బచావత్ ట్రిబ్యునల్ అవార్డు ప్రకారం క్రిష్ణా నీటిని 2000 సం॥ తర్వాత పునః సమీక్ష జరుగవలసి వుండడంతో ప్రకటించిన ప్రాజెక్టుల పరిస్థితి గాలిలో దీపంలా వుంది. మిగులు జలాలపై హక్కు కోల్పోతారు. అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ ఆర్భాటంగా ప్రకటించిన తెలుగు గంగ పథకం నిర్మాణం 1983లో ప్రారంభమయింది. తెలుగు గంగ ద్వారా అనంతపురం జిల్లాకు ఏ మాత్రం లాభం చేకూరకపోగా చిత్తూరు జిల్లాలో కేవలం 46 వేల ఎకరాలకే నీటివసతి కలుగుతుంది. కర్నూలు, కడప, నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లోని 5.75 లక్షల ఎకరాలు సాగులోకి తేవాలని నిర్ణయించారు. అప్పట్లో గంగ పథకం ఖర్చు 634 కోటుమాత్రమే 1995-96 అంచనాల ప్రకారం ఖర్చు రూ. 2130 కోట్లు. అందులో తమిళనాడు వాటా రూ. 503 కోట్లు. మద్రాసుకు 15 టి.ఎం.సి.ల తాగునీటితో పాటు 26 టి.ఎం.సి.ల మిగులు నీటిని సీమ సాగుకు అందించాలన్నది లక్ష్యం. తాగునీటిని మద్రాసుకు తరలించాలని ప్రయత్నించినప్పుడు కాలువ నిర్మాణంలో నాణ్యత లేని కారణంగా పలుచోట్ల గండ్లు పడిగంగనీరు గ్రామాలపై పడింది. ఇక సాగుకు ఉపయోగించడానికి

ఉపకాలువల నిర్మాణం పూర్తికాలేదు. చిత్తూరు జిల్లాలో ఉపకాలువల నిర్మాణానికి భూసేకరణలో జాప్యం జరుగుతున్నది. సీమకు సాగునీరు అందించకుండా మద్రాసుకు తాగు నీరు ఇవ్వమని ముఖ్యమంత్రి చంద్రబాబు 'సీమ' ప్రజలకు ఇచ్చిన హామీని గంగలో కలిపారు. ఉపకాలువలు ఎప్పుడు నిర్మిస్తారో కూడా తెలియదు. అందువల్ల 'గంగ'తో ప్రస్తుతానికి ప్రయోజనం గగనకుసుమమే! ఇక హంద్రీ - నీవా, గాలేరు - నగరి, వెలుగొండ పథకాలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టున్నాయి. ఈ ప్రాజెక్టులు పూర్తి కావడానికి దాదాపు ఐదువేల కోట్లు ఖర్చు చేయాలి.

గాలేరు - నగరి పథకం పరిస్థితి కూడా భిన్నంగా లేదు. 1989 అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో వుంచుకొని అప్పటి ముఖ్యమంత్రి ఎన్.టి.ఆర్. గాలేరు - నగరి. హంద్రీ-నీవా పథకాలను ప్రకటించడం జరిగింది. కడప జిల్లా జమ్మల మడుగు వద్ద, చిత్తూరు జిల్లా రేణిగుంట సమీపంలోని కరకంబాడి వద్ద 1989 నవంబర్ 19న ఎన్టీఆర్ శంకుస్థాపన చేశారు. గాలేరు - నగరి, పథకానికి 45 టి.ఎం.సి.ల క్రిష్ణా మిగులు నీటిని కేటాయించారు. ఈ పథకంలో 1988 లో 18 రిజర్వాయర్లు వుండగా. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 1993 లో వాటిని ఏడుకు కుదించారు. గాలేరు - నగరి పథకం వివాదాల మయమయింది. వెలిగొండ ప్రాజెక్టు పరిస్థితిలో కూడా మార్పులేదు. వెలిగొండ కాగితాల్లోనే దోబూచులాడుతున్నది. వెలిగొండ ద్వారా ప్రకాశం జిల్లా లో 3.40 లక్షల ఎకరాలు, కడప జిల్లాలో 20వేల ఎకరాలు, నెల్లూరు జిల్లాలో 84వేల ఎకరాలను సస్యశ్యామలం చేయాలని సంకల్పించారు. వెలిగొండకు 42 టి.ఎం.సి.ల నీటిని కేటాయించడం జరిగింది. ఈ పథకం పూర్తి కావాలంటే సుమారు 1500 కోట్లు ఖర్చు చేయాలి. 1996 లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హంద్రీ - నీవా, గాలేరు - నగరి, వెలిగొండ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు.

క్రిష్ణా మిగులు జలాల ఆధారంగా ప్రాజెక్టులకు రూపకల్పన జరిగింది కానీ, పథకాల అమలుకు నోచుకోలేదు. నికరజలాలను పూర్తిగా కోస్తా ప్రాంతాలకు, అటునుంచి సముద్రంలోకి వృధాగా వదులుతున్న ప్రభుత్వం రాయలసీమ కోసం ప్రకటించిన పథకాలకు మిగులు జలాలు మాత్రమే కేటాయించింది. వెనుకబడిన రాయలసీమ మరింత వెనుకబడినా ఫరవాలేదని భావించి, తెలుగుదేశం (ఎన్టీఆర్), కాంగ్రెస్, టి.డి.పి (బాబు) ప్రభుత్వాలు సీమ రైతాంగానికి తీరని ద్రోహం చేశాయి. మిగులు జలాల సుడిగుండంలో చిక్కిన 'సీమ' ప్రాజెక్టులు సులభంగా బయట పడతాయనుకోవడం పొరబాటే అవుతుంది. స్వాతంత్ర్యానికి ముందు 26 టి.ఎం.సి.ల నీటిని మాత్రమే వినియోగించుకొంటున్న కర్నాటక ప్రస్తుతం సుమారు 900 టి.ఎం.సి.ల నీటిని నిల్వచేసే పరిస్థితికి చేరుకొన్నది. క్రిష్ణా, తుంగభద్ర నీటిని వీలయినంత ఎక్కువగా వాడుకొంటున్నది. ఆల్మట్టి, అప్పర్‌తుంగ ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన కర్నాటక ప్రభుత్వం పూర్తి చేస్తున్నది.

ఇదిలా వుండగా మద్రాసు నగరానికి మంచినీట సరఫరా కోసం 1975 లోనే ఆంధ్ర ప్రదేశ్, తమిళనాడు, మహరాష్ట్ర. కర్నాటక ప్రభుత్వాల మధ్య ఒక ఒప్పందం కుదిరింది. ఆ ఒప్పందం మేరకే మూడు రాష్ట్రాలు కృష్ణానదీ జలాలను సరఫరా చేయడానికి అప్పట్లో అంగీకరించాయి. శ్రీశైలం ప్రాజెక్టు కుడికాలువ - (తెలుగు గంగ) ద్వారా 15 టి.ఎం.సి.ల నీటిని మద్రాసుకు సరఫరా చేయతలపెట్టారు. కాగా 1981లో జరిగిన అఖిల పక్ష ఒప్పందంలో శ్రీశైలం కుడి కాలువకు 19 టి.ఎం.సి.ల నికర జలాలు కేటాయించడం జరిగింది.

ప్రపంచ ప్రసిద్ధి పొందిన నిమ్మలకుంట తోలుబొమ్మ

హంద్రీ - నీవా సుజల స్రవంతి

రాయలసీమను కరువు కాటకాల నుంచి సంరక్షించి ఎడారిగా మారే ప్రక్రియను నివారించడమే గాక రాయలసీమ జిల్లాల్లో తాగునీటి సౌకర్యమేర్పరచడానికి హంద్రీ - నీవా సుజల స్రవంతి రూపొందించబడింది. తాగునీటి సౌకర్యం కోసం నాలుగు శతకోటి ఘనపుటడుగుల నీటిని కేటాయించడం జరిగింది. ఈ పథకం భూగర్భజల వనరులను పెంచుటకు కూడా దోహదమవుతుంది. తత్ఫలితంగా పర్యావరణం సమతుల్యం కాగలదు. హంద్రీ-నీవా సుజల స్రవంతి పథకం ద్వారా శ్రీశైలం జలాశయపు ఉపరి భాగం నుంచి 40 శతకోటి ఘనపుటడుగుల కృష్ణానది మిగులు జలాలను హంద్రీ - నీవాకు మళ్ళిస్తారు. కర్నూలు, అనంతపురం, కడప, చిత్తూరు జిల్లాల్లోని 6,02,500 ఎకరాలకు ఖరీఫ్ కాలంలో పంటలకు, తాగునీటి సౌకర్యం కల్పించడానికి ప్రతి పాదించారు. శ్రీశైలం జలాశయపు ఉపరి భాగంలో ఎత్తిపోతలకు అనువయ్యే ప్రాంతంలో కర్నూలు జిల్లాలోని 'మల్యాల' గ్రామం సమీపంలో హంద్రీ-నీవా ప్రధాన కాలువ ప్రారంభమవుతుంది. 740 కి.మీ. ప్రయాణించి చిత్తూరు జిల్లాలోని తిమ్మాపుం, అక్కడ నుంచి ఉపకాలువ ద్వారా నీవా నదివరకు ప్రతిపాదించబడింది.

ప్రధాన కాలువ కింద సాగు చేయలేని పలు మిట్ట ప్రాంతాలకు ఉపకాలువల ద్వారా, ఎత్తిపోతల పద్ధతి ద్వారా సాగుకు నీటిని అందిస్తారు. ఈ పథకానికి 400 మెగావాట్ల విద్యుచ్ఛక్తి అవసరం అవుతుంది. ఈ పథకంలో కింది జలాశయాలను ప్రతిపాదించారు,

హంద్రీ-నీవా నిర్మాణవ్యయం 1993 - 94 అంచనాల ప్రకారం 1478 కోట్లు. ఆరు సంవత్సరాల్లో పథకాన్ని పూర్తి చేయాలని నిర్ణయించడమైంది. 2000 ఫిబ్రవరి వరకు నిర్మాణం ప్రరారంభం కాలేదు.

జలాశయాల వివరాలు

జలాశయం పేరు — సామర్థ్యం (మిలియన్ ఘనపుటడుగుల్లో)

1. క్రిష్ణగిరి జలాశయం (కర్నూలు జిల్లా) హంద్రీ - నీవా ప్రధాన కాలువపై 70 -05 కి.మీ. వద్ద 153.27.
2. పత్తికొండ జలాశయం (కర్నూలు జిల్లా) హంద్రీ - నీవా ప్రధాన కాలువపై 108.57 కి.మీ. వద్ద 898.77.

3. జీడిపల్లి జలాశయం (అనంతపురం జిల్లా) 216.30 కి.మీ. వద్ద 1550.00.
4. గొల్లపల్లి జలాశయం (అనంతపురం జిల్లా) మడకశిర ఉపకాలువపై 1,096.88.
5. నూరాల జలాశయం (అనంతపురం జిల్లా) హంద్రీ - నీవా ప్రధాన కాలువపై 381.87 కి.మీ.. 464.75.
6. చెర్లోపల్లి జలాశయం (అనంతపురం జిల్లా) పుంగనూరు ఉపకాలువపై 27.00 కి.మీ. వద్ద 142.00
7. శ్రీనివాసపురం జలాశయం (కడప జిల్లా) హంద్రీ - నీవా ప్రధాన కాలువపై 565.00 కి.మీ. వద్ద 1100.00

ఇలా వుండగా హంద్రీ-నీవా వల్ల మొత్తం 'సీమ' లోని నాలుగు జిల్లాల్లో ఆరు లక్షల రెండు వేల ఐదువందల ఎకరాలకు నీటి సౌకర్యం కలుగుతుంది. కర్నూలు జిల్లాల' 9 మండలాల్లో 80 వేల ఎకరాలకు, అనంతపురం జిల్లాలో 39 మండలాల్లో 3.45 లక్షల ఎకరాలకు, కడపజిల్లాలో 29 మండలాల్లో 37.5 వేల ఎకరాలకు, చిత్తూరు జిల్లాల్లో 29 మండలాల్లో 1.40 లక్షల ఎకరాలకు నీటి వసతి ఏర్పడుతుంది. హంద్రీ - నీవా వల్ల అనంతపురం, చిత్తూరుజిల్లాలకు ఎక్కువ ప్రయోజనం చేకూరుతుంది. సాగు నీరేగాక, ప్రధాన కాలువ వెంబడి పలు పట్టణాలకు తాగునీటి సౌకర్యం కూడా కలుగజేసే విధంగా ఈ పథకాన్ని రూపొందించడం జరిగింది.

కాగా ముఖ్యమంత్రి చంద్రబాబు అనంతపురం జిల్లా ఉరవకొండ వద్ద 1996 మార్చి 11న హంద్రీ నీవా పథకానికి శంకుస్థాపన చేశారు. ఆరేండ్లలో పూర్తి చేస్తామన్నారు. ఆరుకాదు 12 సంవత్సరాలయినా హంద్రి-నీవా పూర్తవుతుందన్న నమ్మకం లేదు.

గాలేరు - నగరి పథకం

రాయలసీమ ప్రజల చిరకాల స్వప్నం గాలేరు - నగరి పథకం. కడప, చిత్తూరు, నెల్లూరు జిల్లాల్లో దాదావు 3.25, లక్షల ఎకరాలకు సేద్యపు నీటిని అందించే ఉద్దేశ్యంతో రూపకల్పన చేసిన ఈ పథకాన్ని ప్రభుత్వాలు బుట్ట దాఖలు చేస్తున్నాయి. తమ కడగండ్లు తీరుతాయని వేయికళ్లతో ఎదురు చూస్తున్న సీమ ప్రజల కళ్లల్లో ప్రభుత్వాలు కారం కొడుతున్నాయి. తన అన్ని ఎన్నికల వగ్దానాల లాగానే గాలేరు - నగరిని గాలికి వదిలేశారు. ఎప్పుడో 1954లోనే క్రిష్ణా-పెన్నార్ పథకంలో రూపాంతరం చెందిన కొంత భాగమే ఇప్పటి గాలేరు - నగరి ప్రాజెక్టు. ఈ పథకంలో మిట్ట కందాల దీపకట్ నుంచి శ్రీశైలం కుడి కాలువ ద్వారా గోరకల్లు రిజర్వాయర్ వరకూ క్రిష్ణా జలాలను తరలిస్తారు. అందుకు అవసరమైన పోతిరెడ్డిపాడు హెడ్ రెగులేటర్, బనక చర్ల క్రాస్ రెగులేటర్ల నిర్మాణం, దీప్ కట్ సామర్థ్యాన్ని పెంచే పనులు 1993లోనే పూర్తి అయ్యాయి. గోరకల్లు రిజర్వాయర్ నుంచి గాలేరు - నగరి సుజల స్రవంతి పథకం శ్రీశైలం కుడి కాలువతో సంబంధాన్ని తెంచుకొని స్వతంత్ర ప్రతిపత్తితో కొనసాగుతుంది. గోరకల్లు రిజర్వాయర్ నుంచి కాలువ ద్వారా క్రిష్ణా జలాలను పెన్నానదిలో కడప జిల్లాలోని గండికోట వద్ద కలువుతారు.ఈ వథకంలోనిరిజర్వాయర్లు (1) వామికొండసాగర్, (2) సర్వరాజు సాగర్, (3) దుర్గాసాగర్, (4) వెలిగొండ సాగర్ (5) క్రిష్ణాసాగర్ (6) శేషాచలం సాగర్ (7) పద్మసాగర్. ఈ రిజర్వాయర్‌లు ఆయకట్టుకు అవసరమైన సేద్యపు జలాలను నిలువ చేస్తాయి. గాలేరు - నగరి కాలువ గండికోట నుంచి తన ప్రయాణంలో పాపాఘ్ని, బుగ్గ వంక, చెయ్యేరు, స్వర్ణముఖి నదులను దాటి చివరకు నగరి నదిలో కలుస్తుంది. కడప జిల్లాలోని కోడూరు పట్టణ సమీపంలో తూర్పు కనుమల పాదం వద్ద ఈ కాలువ రెండు ఉపకాలువలుగా విడిపోతుంది. తూర్పు కాలువ వెలిగొండ పర్వత శ్రేణువుల్లో తొలిచే 7 కిలోమీటర్ల సొరంగం గుండా వెళ్ళి తూర్పు కనుమల తూర్పు ప్రాంతంలో నిర్మించే వెలిగొండ సాగర్‌లో కలుస్తుంది. తర్వాత కాలువ వెలిగొండ సాగర్ నుంచి బయలు దేరి 96.5 కి.మీ. ప్రయాణించి నగరి నదిలో కలుస్తుంది. అలాగే తూర్పు కనుమల పాదం నుంచి పడమర వైపు బయలు దేరిన కాలువ కోడూరు సమీపంలోని ఎత్తైన ప్రాంతంలో 10.5 కి.మీ దూరంలోని సొరంగం గుండా ప్రయాణించి కలియుగ ప్రత్యక్షదైవం శ్రీ వెంకటేశ్వర స్వామి పాద పీఠం వద్ద తిరుపతి పట్టణం చేరుకొని తర్వాత శ్రీనివాస సాగర్‌లో కలుస్తుంది. అక్కడి నుంచి అనేక పంట కాలువలుగా విడిపోయి నగరి నదిలో తనసుదీర్ఘ ప్రయాణాన్ని ముగిస్తుంది.

ఆయకట్టు వివరాలు

ఈ పథకం కడప, చిత్తూరు, నెల్లూరు జిల్లాల్లో 3.25 లక్షల ఎకరాలకు సేద్యపు నీటిని అందించడంతో పాటు మార్గ మధ్యంలో పలుపట్టణాలకు తాగునీటిని కూడా అందిస్తుంది. తాగునీటికి, సాగునీటికి, 45 టి.ఎం.సి.ల నీరు అవసరం అవుతుంది. 1993-94 అంచనాల ప్రకారం ఈ పథకాన్ని పూర్తిచేయడానికి దాదాపు 1500 కోట్ల రూపాయలు వ్యయమవుతుంది. అంచనా వ్యయం ప్రతియేటా 15 శాతం పెరుగుతూ వుంటుంది. ఈ పథకం ద్వారా కడప జిల్లాలోని కొండాపురం, ముద్దనూరు, ఎర్రగుంట్ల, వల్లూరు, వీరపనాయుని పల్లి, పెండ్లి మర్రి, చింత కొమ్మదిన్నె , కడప, సిద్ధవటం, ఒంటి మిట్ట, సందలూరు, రాజంపేట, పుల్లంపేట, ఓబులంవారి పల్లె, చిట్వేలు మండలాల్లో 1.60 లక్షల వేల ఎకరాలకు నీళ్ళు లభిస్తాయి. చిత్తూరు జిల్లాలో రేణిగుంట, తిరుపతి, చంద్రగిరి, నింద్ర, నగరి, విజయపురం, పిచ్చాటూరు, తదితర మండలాల్లోని 1.30 లక్షల ఎకరాలకు నీరు అందుతుంది. నెల్లూరు జిల్లాలోని వెంకటగిరి, రాపూరు, డక్కిలి, బాలాయపురం మండలాల్లోని 35 వేల ఎకరాలు సశ్యశ్యామలం కాగలదు. గాలేరు - నగరి సుజల పథకంలో 76.263 లక్షల ఎకరాల భూమి కమాండ్ ఏరియా కిందకు వస్తుంది. అందులో సాగు బడిలో కొచ్చే కమాండ్ ఏరియా 4.34 లక్షల ఎకరాలు. కాగా 1985 లో ఉధృతంగా సాగిన రాయలసీమ ఉద్యమ వత్తిడిపై స్పందించిన అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీరామారావు 1989 అసెంబ్లీ ఎన్నికలకు ముందు గాలేరు-నగరి ప్రాజెక్టను ప్రకటించారు. లక్షలు ఖర్చు పెట్టి శంకుస్థాపనలు చేశారు. నాటి నుంచి నేటి వరకు పథకం అమలులో ప్రభుత్వాలు నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తున్నాయి.



ఉప్పొంగే నదుల జలాలు ఉప్పు సముద్రం పాలు

శ్రీ తిరునారాయణ్ సూచనలు

రాయలసీమ సస్యశ్యామలం కావాలంటే రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ శ్రీ ఎం.ఏ. తిరునారాయణ్ సూచనలు తప్పనిసరిగా అమలుపరచాలి. శ్రీ తిరునారాయణ్ సూచనల ద్వారా తుంగభద్ర, క్రిష్ణా జలాల పంపిణీలోని అవకతవకలను సవరించుకోవచ్చు.

1. మన రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం ప్రకారం 80 టి.ఎం.సి.ల గోదావరి నీటిని విజయవాడ వద్ద క్రిష్ణా నదిలో కలపాలి.
2. కర్నాటక సహకారంతో అప్పర్ క్రిష్ణా నీటిని దిగువ కాలువకు తుంగభద్ర కింద నిర్మించిన జలవిద్యుత్ కేంద్రం గుండా పంపడం ద్వారా కె.సి. కాలువకు మరికొంతనీటిని ఇవ్వవచ్చు.
3. శ్రీశైలం రైట్ బ్రాంచ్ కాలువకు కేటాయించగా మిగిలిన 20 టి.ఎం.సి.ల నీటిని కర్నూలు, కడప మిట్ట ప్రాంతాలకు ఉపయోగించవచ్చు.
4. ప్రస్తుతం తుంగభద్ర ఎగువ కాలువకున్న 32 టి.ఎం.సి.ల నీటికి అదనంగా 20 టి.ఎం.సి.ల నీటిని కేటాయించడం వల్ల, కాలువల పొడిగింపులతో అనంతపురం, కడప జిల్లాలలోని మెట్ట ప్రాంతాల భూములకు నీటి సదుపాయాన్ని కల్పించవచ్చు.
5. మిగతా 40 టి.ఎం.సి.ల నీటిని తుంగభద్ర రిజర్వాయర్ నుంచి చిత్తూరు కాలువకు మళ్ళించవచ్చు. భైరవానితిప్ప, బుక్కపట్నం, కదిరి, పీలేరుల ద్వారా చిత్తూరు, తిరుపతి ప్రాంతాలకు నీటిని వినియోగించుకోవచ్చు.
6. మరొక కాలువ ద్వారా తుంగభద్ర జలాలు మద్రాసు నగరానికి పూండీ రిజర్వాయర్‌కు నగరి వంక ద్వారా తరలించవచ్చు.
7. చిన్న హగరి క్రాసింగ్ వద్ద నుంచి మరొక కాలువ ద్వారా అప్పర్ షింష రిజర్వాయర్‌కు తరలించి బెంగుళూరు నగరానికి శాశ్వతంగా నీటిని సరఫరా చేయవచ్చు.

అమలు కాని క్రిష్ణా - పెన్నార్ ప్రాజెక్టు

క్రిష్ణా-పెన్నార్ ప్రాజెక్టు అమలు జరిగి వుంటే రాయలసీమ మాత్రమే గాక ఎన్నో ప్రాంతాలకు ఎంతో లాభముండేది. కానీ రాజకీయాల కారణంగా ఈ ప్రాజెక్టు అమలు కాలేదు. సర్ ఆర్థర్ కాటన్, కల్నల్ మెకంజీ వంటి మహా మేధావుల కృషి ఫలితంగా రూపకల్పన అయిన 'క్రిష్ణా-పెన్నార్ ప్రాజెక్టు' వల్ల 36 లక్షల ఎకరాలు సస్యశ్యామలం కావలసి వుండేది.

కర్నూలు జిల్లా సిద్ధేశ్వరం వద్ద క్రిష్ణా నదిపై 279 టి.ఎం.సి.ల సామర్థ్యంగల ఒక ప్రాజెక్టు, నెల్లూరు జిల్లా సోమేశ్వరం వద్ద పెన్నా నదిపై మరో ప్రాజెక్టు (276 టి.ఎం.సి.ల సామర్థ్యం) ను నిర్మించి మిట్ట కందాల డీప్‌కట్ కాలువతో 116 మైళ్ళు పొడవుగల కుందు నది ద్వారా రెండు ప్రాజక్టులను కలపడమే. 'క్రిష్ణా -పెన్నార్'. ఈ రెండు ఆనకట్టల వద్ద ఏర్పడే జలవిద్యుత్ కేంద్రాల సామర్థ్యం 2.5 లక్షల కిలో వాట్లు.

ఈ ప్రాజెక్టు వల్ల పశ్చిమ గోదావరి, క్రిష్ణా, గుంటూరు, కడప, నెల్లూరు, చిత్తూరు, కర్నూలు తమిళనాడులోని చెంగల్పట్టు జిల్లాలకు సేద్యపునీటి సౌకర్యం లభించేది. మొదటి విడతగా 21 లక్షల ఎకరాలకు, రెండో విడతగా 15 లక్షల ఎకరాలకు నీటి పారుదల సౌకర్యం కలిగేది.

క్రిష్ణా-పెన్నార్ పశ్చిమ, తూర్పు కాలువల ద్వారా ఆరుతడి పైర్లకు క్రిష్ణా నీటిని ఉపయోగించవచ్చు. పెన్నానదికి ఉత్తరానగల పెన్నార్ ఎడమ కాలువ, కావలి కాలువలకు, పెన్నకు దక్షిణానున్న పెన్నార్ దక్షిణ కాలువ, మద్రాసు కాలువ, కణుపుర కాలువలకు పెన్నానది నీటిని ఉపయోగించవచ్చు. పెన్నార్ ప్రాజెక్టు కింది వైపున నిర్మించే బ్యారేజి ఆఫ్‌టేక్ నుంచి పెన్నార్ ఉత్తర కాలువ, దక్షిణ కాలువ, మద్రాసుకాలువ నిర్మించాలి. సంగం నుంచి కణుపుర కాలువ నిర్మించాలి. పశ్చిమ కాలువ ద్వారా నీటిని పొందే గండికోట రిజర్వాయర్ ద్వారా 1.5 లక్షల ఎకరాలకు నీటి పారుదల కలిగే అవకాశం వుండేది.

కాగా కర్నూలు జిల్లాలో 4.07 లక్షల ఎకరాలకు, కడప జిల్లాలో 54 వేల ఎకరాలకు చిత్తూరు జిల్లాలో 48 వేల ఎకరాలకు, నెల్లూరు జిల్లాలో 12.03 లక్షల ఎకరాలకు నీటి సౌకర్యం కలిగేది. క్రిష్ణా-పెన్నార్ అమలయివుంటే క్రిష్ణా డెల్టాలో 4.5 నుంచి 7 లక్షల ఎకరాలకు వరకు, పెన్నా డెల్టాలో 7.5 నుంచి 10 లక్షల ఎకరాలకు నీటి సదుపాయం కలిగి వుండేది.

క్రిష్ణా - పెన్నార్ స్థానంలో వచ్చిన చిన్న ప్రాజెక్టు శ్రీశైలం.

రాడార్‌తో రుతుపవనాలను అధ్యయనం చేయాలి

తిరుపతికి 35 కి. మీ. దూరంలోని గాదంకి వద్ద గల మీసోస్ఫియర్, స్ట్రాటోస్ఫియర్, ట్రోపో స్ఫియర్ (ఎం.ఎస్.టి.) రాడార్ వ్యవస్థను వినియోగించుకొని రుతు పవనాలపై అధ్యయనం చేయాలి. ప్రస్తుతం 100 కి.మీ. దూరం పరిధిలో రుతు పవన గమనాన్ని, తీవ్రతను మూడు నెలల ముందుగా పసిగడుతున్నారు. అదీకూడా అంతరిక్ష పరిశోధనలు - ప్రయోగాల దృష్ట్యే అధ్యయనం జరుగుతున్నది. రాయలసీమ రైతుల శ్రేయస్సును దృష్టిలో వుంచుకొని ఎం.ఎస్.టి. రాడార్ ద్వారా రుతు పవన గమనం - తీవ్రతలపై అధ్యయనం చేయాలి. అధ్యయన ఫలితాలను విశ్లేషించి, ఆయా జిల్లా కలెక్టర్లకు సమాచారాన్ని అందించి పంటల విధానంపై రైతులను చైతన్య పరచాలి. అమెరికా ఎం.ఎస్.టి. వంటి పరిశోధనలను విస్తృతంగా చేస్తున్నది. రాయలసీమ రైతులకు మేలు చేయడానికి ఎం.ఎస్.టి. రాడార్ సేవలు తప్పకుండా వినియోగించాలి.

ఎం.ఎస్.టి. రాడార్ కేంద్రం

'ఎల్‌నైనో' తో అనావృష్టి 'లానైనో' తో అతివృష్టి

రాయలసీమలో అనావృష్టిని వారుపు, కరువు అంటారు. సకాలంలో వర్షం పడకుండా పంటలు ఎండిపోయి మనుషులకు, పశువులకు తిండిలేక పోవడాన్ని వారువు (కరువు) అని పిలుస్తారు. అతివృష్టిని కుండపోతవానలు అని అంటారు. అనావృష్టి, అతివృష్టి వల్ల రాయలసీమలో పలుమార్లు పంటలు దెబ్బతిని రైతాంగం ఎన్నో ఇబ్బందులకు గురయింది. 1996 ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు ఎక్కువయినందున పంట దిగుబడి బాగా తగ్గింది.1997లో ప్రధాన పంట వేరుసెనగ.. ఖరీఫ్‌లో తీవ్ర అనావృష్టిని ఎదుర్కొన్నది. 1998లో మళ్ళీ అతి వృష్టి. 1999 లో మళ్ళీ అనావృష్టి. ఆ విధంగా అనావృష్టి, అతివృష్టిలు 'సీమ'ను అతలా కుతలం చేయడానికి ప్రత్యేక కారణాలు వున్నాయి. రాయలసీమ కరువుల చరిత్రలో కొత్త విజ్ఞాన సంగతులు, విశ్లేషణలు చోటు చేసుకొంటున్నాయి. వాటినే 'ఎల్‌నైనో', 'లానైనో' అని శాస్త్రవేత్తలు గుర్తించారు. 'ఎల్‌నైనో' వల్ల అనావృష్టి, 'లానైనో' వల్ల అతివృష్టి పరిస్థితులు ఏర్పడి 'సీమ' లోనే గాక ప్రపంచ వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో పెద్ద ప్రమాదాన్ని సృష్టిస్తున్నాయి. వివరాలు ఈ విధంగా వున్నాయి. పసిఫిక్ మహా సముద్రంలో ఏర్పడే వాతావరణ పరిస్థితులకు శాస్త్రజ్ఞులు 'ఎల్‌నైనో' అని పేరు పెట్టారు. ఎల్‌నైనో కు విరుద్ధంగా జరిగే వాతావరణ మార్పులకు 'లానైనో' అని నామకరణం చేశారు. పసిఫిక్ మహా సముద్రంలో 1997లో ఉష్ణ ప్రవాహం ఉద్భవించింది. సముద్రంలోని 'ఉష్ణ ప్రవాహం' వల్ల భూవాతావరణంలో విపరీతమైన మార్పులు సంభవించాయి. ఫలితంగా తీవ్ర అనావృష్టి పరిస్థితులు ఏర్పడ్డాయి. అదే'ఎల్‌నైనో'. ఎల్‌నైనో కు పూర్తి వ్యతిరేకంగా అదే ఫసిఫిక్ మహా సముద్రంలో శీతల ప్రవాహం ఏర్పడింది. దానితో భూతలంలో పెను మార్పులు జరిగి కుండ పోతవానలు, అకాల వర్షాలు కురిశాయి. నిప్పులు కురిసే ఎండాకాలంలో 1998, 1999 ఏప్రిల్, మే నెలల్లో వడగండ్ల వర్షాలు, భయంకరమైన ఈదురు గాలులు వీయడం విడ్డూరం కాదా! మరి అదే 'లానైనో' ప్రభావం. సముద్ర గర్భంలో శీతోష్ణస్థితి గతుల్లో సంభవించే మార్పులతో భూమండలంలోని కొన్ని ప్రాంతాల్లో మానవాళికి ముప్పు కలుగుతున్నది. రాయలసీమలోని అనంతపురం, కర్నూలు, కడప, చిత్తూరు జిల్లాలతో పాటు కోస్తాలోని నెల్లూరు జిల్లా సైతం ఎల్‌నైనో, లానైనో బారిన పడక తప్పదం లేదు.

కాగా ఈ విపరీత, విపత్కర వాతావరణం మధ్య రుతు పవనాల కాలగమనం మారిపోయే అవకాశం వుంది. వర్షాకాలం, ఎండాకాలం, గాలికాలం... ఆ విధంగా రుతు ఆగమనం మారితే కరువు సీమలో ఏ ఏ పంటలు ఎప్పుడు వేయాలనే విషయంపై శాస్త్ర వేత్తలు సరికొత్త పరిశోధనలు చేయవలసిన అవసరం వుంది. గతంలో సంభవించిన కరువులు, కుండ పోత వానలకు ప్రస్తుతం వస్తున్న అతివృష్టిఅనావృష్టిలకు చాలా తేడా వుంది. ప్రస్తుత పరిస్థితుల ప్రభావ తీవ్రత ఎక్కువగా వుంది. శాస్త్రజ్ఞులకే సరిగా బోధపడని ఎల్‌నైనో, లానైనోలు రాయలసీమ జీవన గతులను మరింతగా నియంత్రిస్తున్నాయి.

'గంగ'కు రాజకీయ గ్రహణం

మిగులు జలాల సుడిగుండంలో చిక్కుకొన్న తెలుగుగంగ వివాదాస్పద పథకంగా తయారయింది. రాయలసీమకు వరప్రసాదమని భావించిన తెలుగుగంగ ఈనాటిది కాదు. స్వాతంత్ర్యానికి పూర్వమే రూపుదాల్చింది. అప్పట్లో ఈ పథకం పేరు క్రిష్ణా - పెన్నార్. 1947లో రూపకల్పన జరుగగా 1951 లో ఉమ్మడి మద్రాసు ప్రభుత్వం పథకం అమలు చేయడానికి సూత్ర ప్రాయంగా అంగీకరించింది. ఆనాటి ఖర్చు కేవలం 130 కోట్లు. నాయకుల స్వార్థ రాజకీయాల వల్ల 'క్రిష్ణా-పెన్నార్' ప్రాజెక్టు వెలుగు చూడలేదు. ఫలితంగా క్రిష్ణాజలాలను వినియోగించుకొంటున్న మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాల మధ్య 1975లో ఒక ఒప్పందం కుదిరింది. ఆ ఒప్పందం ప్రకారం 15 టి.ఎం.సి.ల క్రిష్ణ నీటిని శ్రీశైలం కుడికాలువ ద్వారా మద్రాసుకు తరలించాలి. ఆ ఒప్పందం కూడా కాగితాలకే పరిమితమైన తరుణంలో అధికారానికి వచ్చినతెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు శ్రీ ఎన్టీరామారావు ఈ పథకానికి తెలుగుగంగ అని పేరుపెట్టారు. తెలుగుగంగ పథకం అమలు చేయడానికి ఆంధ్ర ప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల మధ్య 1983 ఏప్రిల్ 19న ఒక ఒప్పందం జరిగింది. ఆ మేరకు 1983 ఏప్రిల్ 27న కడపజిల్లా చెన్నుముక్కపల్లి వద్ద తెలుగు గంగకు శంకుస్థాపన జరిగింది.

తెలుగుగంగ శ్రీశైలం ప్రాజెక్టు వద్ద ప్రారంభమై పోతిరెడ్డిపాడు హెడ్‌రెగులేటర్, బనకచర్ల క్రాస్ రెగులేటర్, వెలుగోడు, బ్రహ్మంగారి మఠం రిజర్వాయర్లు, సోమశిల ప్రాజెక్టు, కందలేరు రిజర్వాయర్ల ద్వారా ప్రవహించి తమిళనాడు లోని పూండి రిజర్వాయర్‌లో కలుస్తుంది. అక్కడి నుంచి నేరుగా మద్రాసు నగరంలోకి వెళుతుంది. తెలుగుగంగ పథకంలో భాగంగా కర్నూలు జిల్లా వెలుగోడులో రూ. 80.15 కోట్లతో ఒక జలాశయం, కడపజిల్లా బ్రహ్మంగారి మఠం వద్ద రూ. 57.14 కోట్లతో ఒక జలాశయం, నెల్లూరు జిల్లా కందలేరు వద్ద రూ. 101.33 కోట్లతో మరో రిజర్వాయర్ రూపు దిద్దుకొన్నాయి. రాయలసీమకు వర ప్రసాదమని చెప్పుకొనే ఈ పథకం వల్ల రాయలసీమ కంటే నెల్లూరు జిల్లాకు ఎక్కువ లాభం కలుగుతున్నది. ప్రాజెక్టు రూపకల్పన జరిగినప్పుడు తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో రెండో వ్యక్తిగా వున్న నల్లపురెడ్డి శ్రీనివాసులు రెడ్డి ప్రోద్బలంతో తెలుగుగంగ కాలువ ఎక్కువ భాగం నెల్లూరు జిల్లాలో వుండే విధంగా చేయడం జరిగింది. ఈ పథకం వల్ల 5.8 లక్షల ఎకరాలకు నీటి సౌకర్యం లభించనున్నా 'సీమ' లో అత్యంత వెనుక బడిన ప్రాంతమైన అనంతపురం జిల్లాకు ఏమాత్రం వుపయోగంలేదు.

బంగారప్ప తర్వాత కర్నాటక ముఖ్యమంత్రి పదవిని చేపట్టిన వీరప్పమొయిలీ తెలుగు గంగ నీటిని సేద్యపు అవసరాలకు వినియోగించుకోనివ్వమని కర్నాటక అసెంబ్లీలో స్పష్టంగా ప్రకటించారు. ఇదే

విషయాన్ని మొయిలీ మైసూరులో కూడా ఒక సమావేశంలో నొక్కి చెప్పారు. తెలుగు గంగ పై మొదటి నుంచి కూడా కన్నడిగులు అభ్యంతరాలు లేవనెత్తుతూ వస్తున్నారు. రామక్రిష్ణహెగ్డే ముఖ్యమంత్రిగా వున్నప్పుడు 'గంగ' సమస్యను చర్చల ద్వారా పరిష్కరించమని అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌కు పలువురు సూచించినా వారితోచర్చించే ప్రసక్తి లేదని ఎన్టీఆర్ పేర్కొన్నారు. తెలుగు గంగ పై ఒక వైపు ఆందోళన ప్రకటిస్తూ క్రిష్ణ నీటిని ఎక్కువగా వాడుకోవడానికి కర్ణాటక (అప్పటి) నీటి పారుదల శాఖ మంత్రి హెచ్.డి. దేవేగౌడ పలు ప్రాజెక్టులను రూపొందించారు. 'తెలుగుగంగ' పథకం చెల్లదని ఒక కన్నడ వారపత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో జనతాదళ్ నాయకుడు కర్నాటక మాజీ ముఖ్యమంత్రి ఎస్.ఆర్.బొమ్మై స్పష్టం చేశారు. ఎన్టీఆర్ మొండి వైఖరి వల్లనే తెలుగు గంగ పథకం సమస్యల సుడిగుండలో చిక్కుకొన్నదని 1989 మార్చిలో తిరుపతిలో జరిగిన పత్రికా ప్రతినిధుల సమావేశంలో బొమ్మై చెప్పడం జరిగింది.

తమ హయాంలో రూపకల్పన జరిగిన నీటి ప్రాజెక్టులన్నీ యుద్ధ క్రపాతిపదికపై పూర్తి చేయాలని డిమాండ్‌చేస్తూ దేవేగౌడ బెంగుళూరులో పెద్ద ఎత్తున ప్రదర్శన నిర్వహించారు. ఆ సందర్భంగా ముఖ్యమంత్రికి సమర్పించిన వినతి పత్రంలో తెలుగు గంగను అనుమతించడం ద్వారా కర్ణాటకకు నష్టం కలుగుతుందని గౌడ పేర్కొన్నారు.

సి.ఎం.ల సమావేశాలు సాధించిందేమిటి?

తెలుగుగంగ వివాదాలను సామరస్య పూర్వకంగా సాధించడం కోసం ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర ముఖ్యమంత్రులు సమావేశం కావాలని నిర్ణయించారు. జరిగింది.ఆ మేరకు 1990 ఏప్రిల్ 21న తిరుమలలో తొలి సమావేశం జరిగింది. ఎలాంటి పరిష్కార మార్గం కనుగొనకుండానే తిరుమల సమావేశం ముగిసింది. తెలుగుగంగ సమస్యకు త్వరలోనే పరిష్కారం లభించగలదని మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులు అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రులు తెలుగు గంగ చర్చల కంటే రాజకీయాలకే ఎక్కువ ప్రాధాన్యత నిచ్చారని మాజీ మంత్రి, టి.డి.పి. అప్పటి ప్రచార కార్యదర్శి గాలి ముద్దు కృష్ణమనాయుడు ఆరోపించారు.

రెండో సమావేశం 1990 ఆగస్టు 22న మైసూరులోని లలిత మహల్‌లో జరిగింది. అప్పటి సమావేశం నాలుగు ప్రతిపాదనలను రూపొందించింది.

1. రెండు వేల సం॥ వరకు కాలయాపన చేయకుండా మిగులు జలాలను మూడు రాష్ట్రాలూ వెంటనే పంచుకోవాలి.
2. తెలుగుగంగ కోసం ఆంధ్ర రాష్ట్రం 29 టి.ఎం.సి.ల నీటిని వినియోగించుకొంటే, కర్ణాటక మహారాష్ట్రలు అదే నిష్పత్తిలో పంచుకోవాలి.
3. ఆంధ్రకు 811 టి.ఎం.సి.లు, కర్ణాటక 700 టి.ఎం.సి.లు, మహారష్ట్రకు 560 టి.ఎం.సి.ల నీటిని వాడుకొనే విధంగా బచావత్ అవార్డు రూపొందించింది.ఇదే పద్ధతిని కొనసాగిస్తూ

బచావత్ ట్రిబ్యునల్ లో పేర్కొన్న విధంగా 2000 సం. తర్వాత నీటి వాటాలపై మళ్ళీ
చర్చలు జరగాలి. ఒక వేళ ఈ ఒప్పందం ఆంధ్రకు ఆమోద యోగ్యమైతే కర్ణాటక,
మహారాష్ట్రలు తెలుగుగంగకు ఎలాంటి అభ్యంతరం చెప్పవు.

4. క్రిష్ణానది మిగులు జలాల సమస్యలను పరస్పర సహకారంతో ఇప్పుడే
పరిష్కరించుకోవాలి.

అన్ని వర్గాల వారితో చర్చించిన తర్వాత మైసూరు ప్రతిపాదనలను అమలు చేస్తామని
ముఖ్యమంత్రులు ప్రకటించారు. తెలుగుగంగ తొలి, మలి సమావేశాలలో డాక్టర్ మర్రిచెన్నారెడ్డి (ఆం.ప్ర),
వీరేంద్ర పాటిల్ (కర్ణాటక), శరద్ పవార్ (మహారాష్ట్ర)లు పాల్గొన్నారు. తర్వాతి సమావేశం మహారాష్ట్రలోని
మహాబలేశ్వరంలో జరపాలని నిర్ణయించారు. మైసూరు మీట్‌లో ప్రతిపాదించిన సూత్రాలపై ఆంధ్ర
అసెంబ్లీలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమయింది. దీనితో అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ చెన్నారెడ్డి తాను ఆ
సూత్రాలను ఆమోదించలేదని శాసన సభలో ప్రకటించారు. తర్వాత ముఖ్యమంత్రులందరూ మారారు.
అప్పటి కొత్త ముఖ్యమంత్రులు విజయభాస్కర రెడ్డి, వీరప్పమొయిలీ, సుధాకర్ రావు నాయక్‌లు
1994 ఫిబ్రవరి 17న బొంబాయిలో చర్చలు జరుగుతాయని ప్రకటించడం జరిగింది. అయితే ఆ
చర్చలు ఎందువల్లనో వాయిదా పడ్డాయి. మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రుల మార్పిడి కారణంగా అప్పట్లో
గంగకు రాజకీయ గ్రహణం పట్టింది. ఒక వైపు చర్చల గురించి మట్లాడుతూ మరో వైపు తెలుగు గంగ
ను కర్నాటక అనుమతించదని కన్నడ ముఖ్యమంత్రులు ప్రకటనల వర్షం గుప్పించడాన్ని సీమ వాసులు
నిశితంగా విమర్శించారు.

సాక్షాత్తూ ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రి కరువు సీమ నుంచే ప్రాతినిధ్యం వహించినా తెలుగుగంగ
తలరాత మారలేదు. గంగకు పట్టిన గ్రహణం వీడేదెన్నడని 'సీమ' వాసులు ప్రశ్నిస్తున్నారు.

అంకెల గారడి 'బడ్జెట్'

తెలుగుగంగకు కేటాయించే నిధులు రాష్ట్ర బడ్జెట్ అంకెల గారడీ గా మారింది. కేటాయింపులే
తక్కువ. ఆ నిధులు కూడా ఖర్చు చేయకుండా మిగిలించారు. దీనితో గంగపని బాగా ఆలస్యమయింది.
గంగ పథకం ప్రారంభ సమయం (1983) లో ప్రాజెక్టు వ్యయం రూ. 553.53 కోట్లు. 1986 అంచనాల
ప్రకారం రూ. 843.27 కోట్లు, 1989లో ప్రాజెక్టు వ్యయం రూ. 1120 కోట్లు కాగా 1992 నాటికి రూ.
1200కోట్ల కు పెరిగింది. 1995 నాటి అంచనా ప్రకారం గంగ వ్యయం రూ. 1500 కోట్లకు చేరుకొన్నది.
ఇలా వుండగా ఆంధ్ర-తమిళనాడుల మధ్య గంగ ఒప్పందం కుదిరిన వెంటనే మద్రాసులోని నెహ్రూ
పుట్‌బాల్ స్టేడియంలో 1983మే 25న గొప్ప సభ జరిగింది. అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ ముఖ్య
అతిధిగా పాల్గొని ముఖ్యమంత్రి ఎం.జి. రామచంద్రన్ తరపున తమిళనాడు వాటా తొలివిడత రూ. 30
కోట్ల చెక్కును ఎన్టీఆర్ కు ఇవ్వడం జరిగింది. 1983-84లో తమిళనాడు వాటాతో సహా రూ. 64 కోట్లు
కేటాయించారు. ఇందులో కేవలం 34 కోట్లు ఖర్చయింది. 1984 - 85లో కూడా 60 కోట్లకు గాను
35.33 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. 1985-86లో రూ. 50 కోట్లు కేటాయించి 45.4 కోట్లు ఖర్చుపెట్టారు.

1986-87లో కేటాయించిన రూ 75 కోట్లలో 60.78 కోట్లు ఖర్చు చేశారు. 1987-88లో 85 కోట్లకు గాను 51.92 కోట్లు ఖర్చు పెట్టారు. 1988-89 లో 35 కోట్లు కేటాయించి 39.98 కోట్లు ఖర్చుపెట్టారు. 1989-90లో 40 కోట్లుకు గాను 70.07కోట్లు ఖర్చుచేశారు. 1990-91లో 50 కోట్లు కేటాయించగా 48.54 కోట్లు ఖర్చుపెట్టారు. 1991-92 రాష్ట్ర బడ్జెట్‌లో గంగకు 125 కోట్లు చూపెట్టారు. ఇందులోరాష్ట్ర వాటా 50 కోట్లు కాగా, తమిళనాడు వాటా 50 కోట్లు మిగిలిన 25 కోట్లు అంకెల గారడీ మాత్రమే! ఆ విషయాన్ని తరుపతి వచ్చిన అప్పటి ముఖ్యమంత్రి జనార్ధన రెడ్డిని పత్రికాప్రతినిధులు అడుగగా తన వద్ద తెలుగుగంగ లెక్కలు లేవని, గంగ పై విలేఖరుల ప్రశ్నలకు సమాధానాలు చెప్పడానికి తాను తయారై రాలేదని అన్నారు. మన రాష్ట్ర వాటాలో కనీసం సగం కూడా ఖర్చు చేయలేదు. ఇక 1992-93 పరిస్థితి భిన్నంగా లేదు. 1993-94 బడ్జెట్‌లో గంగకు రూ. 65లో కోట్లు కేటాయించారు. మొత్తం మీద 1992 జూన్ నాటికి గంగ కోసం 449 కోట్లు ఖర్చుచేశారు. ఇందులో తమిళనాడు వాటా 152 కోట్లు వుంది. ఎన్టీఆర్ హయాంలో గంగ పనులు కొంత చురుగ్గా జరిగినా బడ్జెట్ కేటాయింపులు పెద్దగా లేవు. అయినా కూడా 1983 నుంచి 1989 వరకు దాదాపు రూ. 280 కోట్లు ఖర్చు చేయడం జరిగింది. ఇందులో తమిళనాడు వాటా కేవలం 47 కోట్లు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తమిళనాడు తన వాటా బాగానే విడుదల చేసింది. మొత్తం తనవాటాగా రూ. 202 కోట్లు చెల్లించ వలసివుంది. గంగకు కేటాయించిన నిధులు ఖర్చు చేయకుండా వుండడంతో ప్రతి సం॥ నిర్మాణ వ్యయం విపరీతంగా పెరిగి పోతున్నది.

కాగా తెలుగుగంగ ప్రధాన కాలువ శ్రీశైలం రిజర్వాయర్ వద్ద ప్రారంభమై తమిళనాడులోని పూండి జలాశయం వద్ద ముగుస్తుంది. ఈ కాలువ పొడవు 408 కి.మీ. గంగ మద్రాసు చేరడానికి మరో 26 కి.మీ. ప్రయాణించాలి. గంగ నిర్మాణాలన్నీ నత్తనడకన సాగాయి.

ఇలావుండగా తెలుగుగంగను 1989లోగా పూర్తి చేసి తీరుతామని అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ పలు సభల్లో, సమావేశాల్లో పదే పదే ప్రకటించారు. కొన్నాళ్ళకు మాట మార్చారు. 1992 లో పూర్తి చేస్తామన్నారు. అయితే 1989లోనే దేశం ప్రభుత్వం పతనమయింది. తర్వాత అధికారం చేపట్టిన కాంగ్రెస్ ముఖ్యమంత్రులు 1995లో గంగ గలగలలు వినిపిస్తాయని అన్నారు. బడ్జెట్ కేటాయింపులను బట్టి చూస్తే తెలుగు గంగ 2005 నాటికి కూడా పూర్తవుతుందన్న నమ్మకం లేదు. గంగ పై తలెత్తిన విభేదాలు కూడా ఇంత వరకు పరిష్కారం కాలేదు. 'సీమ'కు సాగునీరు దక్కకుండానే మద్రాసుకు తాగు నీరు ఇస్తున్నారు. ఇది 'సీమ' రైతుల నోట్లో మట్టి కొట్టడం కాదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఒక తెలుగు వ్యక్తి (పి.వి. నరసింహారావు) ప్రధానిగా వుండగా, మరో తెలుగు వ్యక్తి పి.వి. రంగయ్య నాయుడు కేంద్ర నీటి పారుదల శాఖ మంత్రిగా, ఇంకో తెలుగువ్యక్తి ఎం.ఎస్. రెడ్డి కేంద్ర జలవనరుల సంఘం అధ్యక్షునిగా పనిచేశారు. అంతేగాక తెలుగుగంగ సమస్యతో ముడిపడిన మూడు రాష్ట్రాల్లోనూ, కేంద్రంలోనూ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వుండేది. అప్పట్లోనే తెలుగుగంగకు పరిష్కారం లభించవలసి వుండాలి. అప్పుడు తీవ్రజాప్యం జరగడంతో సమస్య మరింత జటిలమయింది. తెలుగుగంగకు నికర జలాలు కేటాయించడమే సమస్యకు శాశ్వత పరిష్కారం.

పెను ప్రమాదం

"రెండు వేల సం. అంటే ఎంతో దూరం లేదు. ఆవిషయాన్ని తలచుకొంటే నా గుండె వేగం పెరుగుతున్నది". క్రిష్ణా జలాల పంపిణీ పై పునః పరిశీలన సమయం దగ్గర పడుతున్నదని గుర్తు చేస్తూ అప్పటి ప్రతి పక్షనాయకుడు మాజీ ముఖ్యమంత్రి ఎన్.టి. రామారావు అన్న మాటలివి. క్రిష్ణా మిగులుజలాలపై నిర్మిస్తున్న ప్రాజెక్టులను 2000 సం॥ మే 31లోగా పూర్తి చేయనందున మిగులు జలాలపై హక్కును పూర్తిగా కోల్పోయే అవకాశం వుంది. దానితో నీటి ప్రాజెక్టుల మనుగడ ప్రశ్నార్థకమై రాయలసీమ ఎడారిగా మారుతుంది. కేంద్ర అనుమతులకోసం వేచి చూడకుండా, డబ్బుకోసం వెనుకాడకుండా కర్నాటక ప్రభుత్వం తమ ప్రాజెక్టుల నిర్మాణాన్ని చకచకా కొనసాగిస్తున్నది. అయితే మన ప్రభుత్వం రాయలసీమ కోసం చేపట్టిన ప్రాజెక్టుల నిర్మాణం ఎంతో మందకొడిగా సాగుతున్నది.

కాలయాపన జరిగే కొద్దీ క్రిష్ణాజలాల వినియోగంలో రాయలసీమకు తీరని అన్యాయం జరగడం తథ్యం. బచావత్ అవార్డు మేరకు క్రిష్ణాజలాల పునః పంపిణీ జరగనున్నది. రాజకీయ కారణాలతో కొన్నాళ్లు, కోర్టుల విచారణతో మరికొన్నాళ్ళు ప్రాజెక్టులు నిర్మించకుండా కాలం వెళ్ళదీస్తే పరిస్థితి ఏమౌతుందని ఒకసారి పాలకులు ఆత్మపరిశీలన చేసుకోవాలి. ఈ రెండింటికి మించి నిధుల సమస్య తీవ్రంగా వుండి పెరుగుతున్న ప్రాజెక్టుల వ్యయం ఆకాశాన్ని అంటుతున్నది. ఇరిగేషన్ బాండ్లు వస్తున్నాయి. నిధులకు లోటు ఏమిటని ఎవరైనా అనుకొంటే పొరబాటే అవుతుంది. దిగువ క్రిష్ణ ప్రాజెక్టులైన శ్రీశైలం ఎడమ బ్రాంచి కెనాల్, తెలుగుగంగ, గాలేరు - నగరి తదితర ప్రాజెక్టులు వివాదస్పదమైనవి అని, అంతర్‌రాష్ట్ర జల పంపిణీతో ముడిపడి వున్నందున వాటిని రాష్ట్ర జల వనరుల అభివృద్ధి కార్పొరేషన్ పరిధిలోకి తీసుకురావడం లేదు. మరి ముంచుకొస్తున్న ప్రళయానికి ఎలా అడ్డుకట్ట వేస్తారన్న దాన్ని పాలకులే చెప్పాలి.

పాలకులు మేల్కొని పెను ప్రమాదాన్ని దృష్టిలో వుంచుకొని ప్రాజెక్టులను రాజకీయం చేయకుండా వాటి నిర్మాణాల పట్ల శ్రద్ధ చూపాలి. ఆల్మట్టి డ్యాంపై రాజీలేని పోరాటం చేస్తామంటూ, పెండింగ్ ప్రాజెక్టులను సాధించుకొంటామని తెలుగుదేశం పార్టీ తీర్మానాలను ఆమోదించింది. 2000 సం.ల నాటికి గడువు తీరక ముందే ప్రాజెక్టులను పూర్తి చేయాలని కూడా తీర్మానాన్ని ఆమోదించారు. భావితరాలు క్షమించలేని అన్యాయం జరిగిపోతుందని ఇంజనీరింగ్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

బచావత్ ట్రిబ్యునల్ - కృష్ణాజలాల వినియోగం

బచావత్ ట్రిబ్యునల్ అవార్డు మేరకు ఆంధ్రప్రదేశ్ 811 టి.ఎం.సి.ల నీటిని వినియోగించుకోవచ్చు. వంద సంవత్సరాల క్రిష్ణా నీటి ప్రవాహంను లెక్కవేసి 75 సంవత్సరాల పాటు నీటి ఆధారం (డిపెండబులిటి) మేరకు మహారాష్ట్రకు 560 టి.ఎం,సి.లు, కర్నాటకకు 700 టి.ఎం.సి.ల నీటిని కేటాయించారు. ఈ రెండు రాష్ట్రాలు ఎగువ ప్రాంతంలో వున్నందున 1260 టి.ఎం.సి.ల నీటిని మించి వాడుకోరాదని ఆంక్షలున్నాయి. దిగువ ప్రాంతంలో వున్న ఆంధ్ర ప్రదేశ్ 811 టి.ఎం.సి.లతో పాటు మిగులు జలాలను వాడుకొనే హక్కువుంది. క్యారీ ఓవర్ రిజర్వాయర్లను నిర్మించుకొనే హక్కు కూడా వుంది. క్రిష్ణా జలాలను ఎగువ రాష్ట్రాలు వందేళ్ళలో 98 సంవత్సరాలు కూడా వాడుకోవచ్చు. అదేబచావత్ ట్రిబ్యునల్ ప్రకారం 25 సంవత్సరాలు నీరు వుండదని లెక్క గట్టినందున ఆంధ్ర ప్రదేశ్ కనీసం 20 సంవత్సరాల పాటు నీరు వాడుకోవడానికి అవకాశాలు చాలా తక్కువ. అందుకని నీటిని నిల్వ చేసుకొని మరుసటి సంవత్సరాలు వాడుకోవడానికి క్యారీ ఓవర్ రిజర్వాయర్లను ఆంధ్రప్రదేశ్ నిర్మించుకోవడానికి అనుమతి వుంది. ప్రతి ఏడాది 811 టి.ఎం.సి.ల ప్రకారం సరాసరిన 20 సంవత్సరాల పాటు నీటిని నిల్వ చేసుకోడానికి ఇప్పుడున్న ప్రాజెక్టులు ఏ మాత్రం సరిపోవు. కొత్తవి కట్టాల్సిన అవసరం ఎంతైనా వుంది. కేటాయించిన 811 టి.ఎం.సిలలో 749.16 టి.ఎం.సి.ల నీటిని నిల్వచేయడానికి మాత్రమేప్రాజెక్టుల నిర్మాణాలున్నాయి. నీరు ఆవిరి వల్ల జరిగే నష్టం క్రింద శ్రీశైలం రిజర్వాయరుకు 33 టి.ఎం.సి.ల నీటిని అదనంగా కేటాయించినా ఆ నీటిని ఇంకా వుపయోగించటం లేదు. రీజనరేట్ కింద 11 టి.ఎం.సి.లను, కె.సి. కాలువ ఆధునీకరణ వల్ల ఆదా అయ్యేనీటిలో 8 టి.ఎం.సి.లను శ్రీశైలం కుడి బ్రాంచి కెనాల్‌కు కేటాయించారు. క్రిష్ణా జలాలు లేవంటూ మిగులు జలాలపై ప్రాజెక్టులు కట్టాలని ప్రభుత్వం వాటిని రూపొందించింది. పాలకులు పొంచివున్న పెను ప్రమాదాన్ని గుర్తించి, సరిగా స్పందించక పోతే రాయలసీమ వాసులు దారుణంగా దగాకు గురవుతారని హెచ్చరించక తప్పదు.


ముగ్గు రాళ్ళు - మంగంపేట



ఇదీ ఒక గ్రామమే!

శ్రీక్రిష్ణ దేవరాయల వేసవి విడిది గగన్‌మహల్- పెనుకొండ

కరువు ప్రకటనలతోనే కాలయాపన

రాయలసీమకు కరువులు కొత్తకాదు. కరువు దెబ్బకు సీమ పల్లెలు తల్లడిల్లుతుంటాయి. పంటలు సరిగా పండక, చేసిన అప్పులకు కనీసం వడ్డీ చెల్లించలేని స్థితిలో రైతులున్నారు. చేయడానికి పనిలేక, తినడానికి తిండి దొరకక రైతు కూలీలు సతమతమవుతుంటారు. పశుగ్రాసం కొరతతో పశువులు మరింతగా బక్కచిక్కిపోతున్నాయి. కరువు రక్కసి పల్లె తలపులను తట్టినప్పుడు సుదూర ప్రాంతాలకు వలస వెళ్ళడం గ్రామీణులకు ఆనవాయితీగా మారింది. పాలకులు, ప్రజా ప్రతినిధులు కరువు పట్ల గతంలో మాదిరిగా స్పందించడం లేదు. చివరకు ప్రచార సాధనాలు సైతం 'సీమ'లో నెలకొన్న దారుణ కరువు పరిస్థితులను బాహ్య ప్రపంచానికి తెలియచెప్పడంలో సరైన పాత్ర నిర్వహించడం లేదని సాహితీ వేత్తలు, ప్రతిపక్ష నాయకులు అభిప్రాయపడుతున్నారు. కరువు గురించి కలవరం చెందనవసరం లేదని పాలకులుచెప్పే మాటలు ఎప్పటిలాగే నీటి మూటలవుతున్నాయి. ఖరీఫ్ సీజన్‌లో దారుణంగా దెబ్బతిన్నా.. ఆశ చావని రైతాంగం రబీలో మళ్ళీ పంట పెట్టి భంగపాటుకు గురవడం మామూలే. ప్రకృతి పాలకులదగాల నేపథ్యంలో కరువు సీమ రైతాంగానికి మిగిలింది కన్నీటి వసంత వ్యధ మాత్రమే. 1997-98 సం॥లో సంభవించిన కరువు నృత్య రూపకం యీ విధంగా ఉంది.

సాధారణంగా ఖరీఫ్ సీజన్ జూన్ చివరిలో లేదా జులై మొదట్లో మొదలవుతుంది. 1997 ఖరీఫ్‌జన్ ఆగస్టులో మొదలయింది. దానితో 40శాతం మాత్రమే సాగయింది. ఆ కొద్దిపాటి పంట కూడా పండకపోవడంతో విత్తనాలకే దక్కలేదు. వరుసగా ఐదేళ్ళలో ఒక్కసారి కూడా 60 శాతం పంట దిగుబడి అయిన దాఖలాలు లేవు. సీమలో విస్తారంగా పండించే వేరుశనగ దెబ్బ తినడంతో రైతులే కాక రైతుకూలీలు బాగా దెబ్బతిన్నారు. అనంతపురం జిల్లాలో దాదాపు 22 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు పండిస్తుండగా 16లక్షల ఎకరాల్లో వేరుశనగ వేస్తారు. ఖరీఫ్‌సీజన్ రెండునెలల తరువాత ప్రారంభమయినందున దాదాపు ఆరు లక్షల ఎకరాల్లో మాత్రమే వేరుశనగ వేయడం జరిగింది. అందులో 20శాతమే పంట దక్కింది. అనంతపురం, కళ్యాణదుర్గం, ఉరవకొండ, రాయదుర్గం, గుంతకల్లు, హిందూపురం పరిసర ప్రాంతాల్లో వేరుశనగ వేయలేదు. ఫలితంగా రైతాంగం యమయాతన పడింది. ప్రభుత్వ సాయం కోసంఎదురుచూసింది. అందరికీ అన్నం పెట్టే రైతన్నను ఆదుకోవడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని హిందూపురం సమితి మాజీ ఉపాధ్యక్షుడు, రైతు నాయకుడు సిజి కేశవరెడ్డి

విమర్శించారు. తన జీవితంలో ఇటువంటి కరువు పరిస్థితులను చూడడం ఇదే ప్రప్రథమం అని గోరంట్ల మండలం కరావులపల్లికి చెందిన బడుగు రైతు గాదె నారాయణప్ప చెప్పారు.

కాగా కడప జిల్లాలోని 8 లక్షల ఎకరాలసాగుభూమిలో నాలుగు లక్షల ఎకరాల్లో వేరుశేనగ పండిస్తారు. అదనులో వనదును వాన పడనందున 1997లో 30శాతం విస్తీర్ణంలోనే వేరుశనగ వేశారు. రబీలో వేసిన వరి, అరటి, పొద్దు తిరుగుడు ఎండిపోయాయి. తాగునీటికే కటకట పడుతుండగా ఇకసాగుకు నీరు ఎలా అందుతుంది. కరువుసీమ ప్రజలను కాపాడడానికి శాశ్వత ప్రాతిపదికన పథకాలు అమలు చేయాలని రాయలసీమ కర్షక, కార్మిక సమితి ప్రధాన కార్యదర్శి సిహెచ్. చంద్రశేఖరరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు.

చిత్తూరు జిల్లాలో ఏడులక్షల ఎకరాల్లో వేరుశనగ వేయవలసి వుండగా సగం కూడా సాగుకాలేదు. పెట్టిన కొద్దిపాటి పంటసైతం సరిగా చేతికి చిక్కలేదు. లక్ష ఎకరాల్లో వరి, మరోలక్ష ఎకరాల్లోచెరుకు సాగయింది. జిల్లాలోని తూర్పు ప్రాంతంలో తుపాను వల్ల నీటి సౌకర్యం ఉంది. పడమటి ప్రాంతాలైన పలమనేరు, పుంగనూరు, మదనపల్లి, తంబళ్ళపల్లి పరిసరాల్లో కరువు రక్కసి విలయతాండవం చేస్తూనే వుంటుంది.

అనంతపురం జిల్లాలోని మొత్తం 63మండలాలను, కడప జిల్లాలోని 40 మండలాలను, చిత్తూరు జిల్లాలోను 43 మండలాలను, కర్నూలు జిల్లాలోని కొన్ని మండలాలను కరువుప్రాంతాలుగా ప్రభుత్వం ప్రకటించింది. కొన్ని పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు దుమ్ము అలవెన్సు పొందుతుండగా నిరంతరం దుమ్మును నెత్తిన వేసుకొనే తమకు ప్రభుత్వం ఏమి అలవెన్సు యిస్తున్నదని రైతాంగం ప్రశ్నిస్తున్నది. కరువు పనుల వల్ల రైతుల కంటే ఎమ్మెల్యేలకు, నాయకులకు బాగా మేలు జరుగుతుంది. ఆయా ప్రాంతాల్లో తమ వారికి పనులు యిప్పించుకొని పబ్బం గడుపుకోవడం నాయకులకు మామూలే! రాయలసీమ కరువునురూపుమాపడానికి నీటి ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలని పిసిసి కార్యదర్శి బి. కరుణాకరరెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి బి. నవీన్ నిశ్చల్; రాష్ట్ర లీగల్‌సెల్ కన్వీనర్ ముక్కు సత్యవంతుడు ప్రభుత్వాన్ని కోరారు.

ఇలా వుండగా ప్రతి ఐదేండ్లలో నాలుగేండ్లు కరువు వస్తున్నందున భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. దానికి తోడు ప్రభుత్వ ఖజానా నింపడం కోసం కొన్ని అనాలోచిత విధానాలను అమలు పరుస్తున్నందున కూడా సీమ భూగర్భ జల మట్టం పడిపోతున్నది. నదులలోని ఇసుకను లీజుకు ఇచ్చినందున ప్రయివేటు కాంట్రాక్టర్లు తమ యిష్టా రాజ్యంగా ఇసుకను తోడివేశారు. ఫలితంగా నదుల్లోను, చుట్టుపట్ల ప్రాంతాల్లోను నీటి నిల్వ సామర్థ్యం బాగా తగ్గిపోయింది. ఆదేవిషయాన్ని తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర యూనివర్శిటీ జియాలజీ విభాగం ఆచార్యులు ప్రొ. ఆర్. జగదీశ్వర రావు స్పష్టం చేశారు. రాయలసీమలో భూగర్భజల మట్టం ఏడాది ఏడాదికీ గణనీయంగా తగ్గుతున్నదని ప్రొ. రావు వివరించారు.

కాగా కరువు బారిన పడిన రైతాంగాన్ని ఆదుకోకుండా ప్రభుత్వం కరువు ప్రకటనలతోనే కాలయాపన చేస్తున్నది. బ్రిటిష్ ప్రభుత్వ హయాంలో కరువులు సంభవించినప్పుడు ఫ్యామిన్ కమిషన్లు నియమించేది. కమీషన్ నివేదికను మాత్రం అమలు పరిచేది కాదు. 1860లో భయంకర కరువు పరిస్థితులు ఏర్పడినప్పుడు బ్రిటిష్ ప్రభుత్వం తొలిసారిగా కల్నల్ బియర్డ్ స్మిత్ అధ్యక్షతన ఫ్యామిన్ కమిషన్‌నునియమించింది. అప్పటి నుంచి 1947 వరకు వలసపాలకులు ఎన్నో కమిషన్లను నియమించి కరువుకు ఏదో చేశాం అన్నట్లు వ్యవహరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ప్రకటనలతో కరువు పీడిత ప్రజలను మభ్యపెడుతూ కాలం వెళ్ళదీస్తున్నాయి. అయితే 1997లో సంభవించిన పంటల నష్టానికి గాను రాష్ట్ర ప్రభుత్వం పరిహారాన్ని అందించింది. అంతేకాక 1998 ఖరీఫ్ సీజన్ కోసం వేరుశెనగ విత్తనపు కాయలనుకూడా రైతులకు పంపిణీ చేసింది. ఒక్క అనంతపురం జిల్లాలోనే దాదాపు 40 కోట్ల రూపాయల పరిహారాన్ని రైతాంగం పొందింది. మనదేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి 1998 వరకు అంత పెద్ద ఎత్తున రైతాంగానికి మేలు జరిగిన దాఖలాలులేవు.

1999 ఖరీఫ్‌లో కూడా దారుణమైన కరువు పరిస్థితులు నెలకొనడంతో రైతాంగం తల్లడిల్లింది.



ఎండిన వరి పైరు

‘ సీమ ’ వాసుల ఆశలు వమ్ము

రాయలసీమలో నిత్యం కరువున్నా నాయకులకు మాత్రం కొదవ లేదు. రాష్ట్రపతి, ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి వంటి వున్నత పదవులను ‘సీమ’ నేతలు అధిష్టించారు. నాటి నీలం నంజీవరెడ్డి నుంచి హైటెక్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వరకు పలువురు రైతు బిడ్డలు రాజ్యాధికారం చేపట్టారు. అయితే రైతాంగం కడగండ్లు మాత్రం తీరలేదు. అత్యంత వెనుకబడిన ప్రాంతమైన అనంతపురం జిల్లా ఇల్లూరుకు చెందిన నీలం నంజీవరెడ్డి ముఖ్యమంత్రిగా, రాష్ట్రపతిగా అధికారం చెలాయించినా ‘అనంత’ వాసుల ఆశలు నెరవేరలేదు. కర్నూలు జిల్లాకు చెందిన దామోదరం నంజీవయ్య, కోట్ల విజయభాస్కరరెడ్డిలు ముఖ్యమంత్రులుగా పనిచేశారు. తెలంగాణాకు చెందిన పి.వి. నరసింహారావు రాయలసీమకు వలస వచ్చారు. ఆయన ప్రధానమంత్రి అయిన తరువాత కర్నూలు జిల్లా నంద్యాల నుంచి భారీ మెజార్టీతో గెలిచారు. స్వతంత్రభారత ప్రభుత్వంలోనెహ్రూ కుటుంబేతర వ్యక్తి ప్రధానిగా ఐదేండ్లు అధికారంలో వుండిన వ్యక్తి పి.వి. ఆ తెలుగు నాయకుల పాలనలోనే కర్నాటక నిర్మిస్తున్న ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంచడానికి అనుమతి లభించింది. బచావత్ ట్రిబ్యునల్ తీర్పునకు భిన్నంగా ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెరిగినందున నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుంది. కృష్ణా జలాల పరవళ్ళకు ఆల్మట్టి పెద్ద అడ్డుకట్ట కాగలదు. దానితో కృష్ణా జలాలతోనే పునీతం కావలసిన రాయలసీమకు గట్టి దెబ్బ తగులుతుంది.

ఇలా వుండగా అనంతపురం జిల్లా హిందూపురం నుంచి పోటీ చేసిన ప్రతి సారీ భారీ విజయాన్ని చవిచూసిన అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు తాను ‘రాయలసీమ దత్తపుత్రుడు’ అని ప్రకటించారు. సీమకోసం పలుప్రాజెక్టులు రూపొందించి, వాటికి నికర జలాలు కేటాయించకుండా మిగులు జలాలు చూపించి వివాదాస్పదం చేశారు.

ఆవిధంగా ఎందరో నాయకులు ఎన్నో వున్నత స్థానాలకు వెళ్ళినా సీమ వాసుల తలరాతలు మాత్రం మారలేదు.

‘ సీమ ’ కల్చర్‌ను మార్చిన ‘ సిరి ’ కల్చర్

అగ్రికల్చర్.... బాంబ్ కల్చర్... ఆక్వా కల్చర్... సిరికల్చర్. అగ్రికల్చర్ (వ్యవసాయం)తో సీమవాసులు అనేక కష్ట నష్టాలను ఎదుర్కొంటున్నారు. బాంబ్ కల్చర్ (బాంబుల సంస్కృతి), ఆక్వాకల్చర్ (రొయ్యల పెంపకం) లను సీమ వాసులు ఆదరించలేదు. దాదాపు 30 సం॥రాల కిందట కర్నాటక నుంచి సీమ జిల్లాల సరిహద్దు ప్రాంతాల్లో ప్రవేశించిన సిరి కల్చర్ (పట్టు గూళ్ళ పెంపకం) చిన్న, సన్నకారు రైతులకు ఎంతో లాభం చేకూర్చింది. ఒక్కోసారి పట్టు పురుగులు గూళ్ళు అల్లకానికి ముందే రోగాల బారిన పడి పంట నష్టం జరుగుతుంటుంది. అయినా కూడా సీమ రైతులు భయపడకుండా సిరి కల్చర్‌ను అక్కున చేర్చుకొన్నారు. రాష్ట్రంలో ఆరు లక్షల మంది సిరికల్చర్ రైతులు, పట్టుపై ఆధారపడిన వారున్నారు. అందులో సగం మంది రాయలసీమ జిల్లాల్లోనే వుండడం గమనించదగ్గ అంశం. సిరికల్చర్‌లో అనంతపురం జిల్లా అగ్రగామిగా వుంది. అనంతపురం జిల్లా గోరంట్ల, చిత్తూరు జిల్లా పలమనేరు పరిసర గ్రామాలు ‘సీడ్ ఏరియాలు’గా మంచి విజయాలు సాధించాయి. ఒక్క అనంతపురం జిల్లాలోనే సుమారు 40 వేల ఎకరాల్లో పట్టు మొక్కలను పెంచుతున్నారు. ఒకప్పుడు సిరులు పండించిన సిరికల్చర్ రైతులు నేడు పలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఎరువులు, పురుగు మందుల ధరలు పెరిగాయి. ముడి సిల్క్‌ను దిగుమతి చేసుకొంటున్నందున పట్టుగూళ్ళ ధరలు బాగా పడిపోయాయి. ఐదేండ్ల కిందట క్రాస్ బ్రీడ్ (సి.బి.) పట్టు గూళ్ళ కిలోధర 180 నుంచి 250 రూ.ల వరకు వుండేది. నేడు కిలో 75 నుంచి 110 వరకు మాత్రమే వుంది. పట్టుగుడ్ల ప్రత్యుత్పత్తిలో ప్రముఖ పాత్ర వహించే ఎల్.ఆర్. (లోకల్ రేస్), ఎఫ్. ఆర్ (ఫారిన్ రేస్), బైవాల్టిన్ వంటి వాటికి రేట్లు ఒక మాదిరిగా వున్నాయి. అయితే అందరూ వాటిపై మక్కువ చూపడం లేదు. ఒక్కమాటలో చెప్పాలంటే సీమలోని చిన్న, సన్నకారు రైతుల్లో కొందరి కల్చర్ (జీవన విధానం)ను సిరికల్చర్ మార్చిందని చెప్పకతప్పదు. పట్టు వస్త్రాల ఉత్పత్తిలోనూ ‘అనంత’ అగ్రభాగానే వుంది. ధర్మవరం, సోమందేపల్లి, ముద్దిరెడ్డిపల్లి తదితర ప్రాంతాల్లో వేలాదిమంది ఆ పరిశ్రమలో వున్నారు.

పాలెగాళ్ళ వారసులే ఫ్యాక్షనిస్టులు

విజయనగర రాజులు చేసిన పాలనా సంస్కరణల్లో భాగంగా నాయంకర పరిపాలన ఆవిర్భవించింది. పాలన రాజధానీ కేంద్రం నుంచి పల్లెప్రాంతాలకు వికేంద్రీకరణ జరిగింది. విజయనగర రాజ్య పతనానంతరం రాయలసీమలో రాజకీయ అనిశ్చిత పరిస్థితి నెలకొన్నది. నాయంకర పరిపాలనలో అతి చిన్న పాలకులు సైన్యాన్ని సమకూర్చుకొని కొద్దిపాటి బలాన్ని సంపాదించుకొన్నారు. రాజకీయశూన్యత కొత్తవ్యవస్థకు పునాది వేసింది. బలమైన రాజులు లేకపోవడం వల్ల, జవాబు దారీ తనం లేనందున నాయంకర పాలనలో విజయనగర ప్రభువుల ప్రతినిధులైన గ్రామాధికారులు, మండలాధికారులుగా వున్నవారు సర్వస్వతంత్రులై సరికొత్త వ్యవస్థను ఏర్పాటు చేసుకొన్నారు. తమ పాలనా పరిధిని పెంచుకోవడం ద్వారా మరింత సంపదను దోచుకోవడానికి పొరుగుపాలకులతో నిత్యం ఘర్షణపడ్డారు. ఆ ఘర్షణల్లో ఎందరో ప్రజలు తమ ప్రాణాలను పోగొట్టుకున్నారు. తమ అరాచక పాలనకు అడ్డు వచ్చిన వారిని, తమను ఎదిరించిన వారిని దారుణంగా హింసించి అణచివేశారు.

క్రీ. శ. 1600 నుంచి 1800సం॥ మధ్య రూపుదిద్దుకొని వేళ్ళూనుకొన్నదే పాలెగాళ్ళ వ్యవస్థ. నాటి దత్తమండలాల పాలన ఇంగ్లీష్ ఈస్ట్ ఇండియా కంపెనీ కిందకు చేరిన తరువాత పాలెగాళ్ళ వ్యవస్థ మెత్తబడింది. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన తరువాత పాలెగాళ్ళ వ్యవస్థ మరో రూపం సంతరించుకొన్నది. స్వాతంత్ర్యం వచ్చినా ఆ ఫలాలు సామాన్యులకు దక్కలేదు. కొన్ని పెత్తందారీ కులాలు మాత్రమే రాజకీయ అధికారాన్ని పొంది, రూపు చెదిరిన పాలెగాళ్ళ వ్యవస్థకు మరో కొత్త రూపం ఆవిష్కరించడానికి బీజం వేశాయి. నాటి పాలెగాళ్ళ వారసులు 'ముఠా సంస్కృతిని రాయలసీమ అంతటా విస్తరిపంచేశారు. ప్రస్తుత నాగరికసమాజం ముఠాసంస్కృతి వల్ల అనాగరికం వైపు పయనిస్తున్నది. తమ ఎదుగుదల కోసం ఎంతటి దారుణానికైనా పాల్పడడం ముఠా నాయకుల నైజం. తమ పబ్బం గడుపుకోవడానికి సీమ ప్రజల సమాధులపై పునాదులునిర్మించుకొంటున్నారు ముఠా నాయకులు. పెత్తందారులు, పెత్తందారీ కులాల వారు ఆయా ప్రాంతాల్లో తమ ఆధిపత్యం కోసం ముఠా సంస్కృతిని పెంచి పోషిస్తున్నారు. ఫ్యాక్షనిస్టుల ప్రభావం లేని అంశమే లేదు. రాజకీయాలూ, సారా - బ్రాందీ వ్యాపారాలు, కాంట్రాక్టు పనులు, మైనింగ్ (గ్రానైట్, ఇసుక) లీజులు, పంచాయతీలు, ఉద్యోగులు అధికారుల బదిలీలు.. ఇలా ఎన్నో ముఠా నాయకుల కను సైగలతో జరిగిపోతున్నాయి. అనంతపురం జిల్లా ధర్మవరం, పెనుకొండ నియోజకవర్గాలకు చెందిన కొందరు ఫ్యాక్షనిస్టులు 'రేపిస్టులుగా' మారి ఎందరో మహిళల మాన ప్రాణాలను హరించారు. వారి వారి ప్రాంతాల్లో ముఠా నాయకులు హిట్లర్ వంటి నియంతల్లా

వ్యవహరిస్తూ ప్రజల స్వేచ్ఛ, హక్కులకు భంగం కలిగిస్తున్నారు. అంతేకాక ఆర్థికంగా విపరీతంగా లాభపడుతున్నారు. ఆర్థిక దోపిడీలో భాగంగా కొందరు ముఠా నాయకులు తమ మనుషుల ద్వారా చీటీలు (డబ్బుపొదుపు) నిర్వహిస్తున్నారు. మధ్య తరగతి మినహా ఆ పైస్థాయి వ్యాపారులు నెలనెలా ముఠా నాయకుల చీటికి ముడుపులు చెల్లించాల్సిందే! ఆ చీటి పాడే హక్కుగానీ, డబ్బు పొందే అర్హత గానీ చెల్లింపు దారులకు లేదు. ఇంకొందరు ముఠాదారులు ప్రత్యర్థులతో బాండ్లు రాయించుకొని తమ అవసరాలకు డబ్బు వసూలు చేసుకొంటున్నారు. ప్రభుత్వం బడుగు వర్గాలకు కల్పిస్తున్న రాయితీలను బినామీ పేర్లతో ఫ్యాక్షనిస్టులే స్వంతం చేసుకొంటున్నారు. ప్రత్యర్థి ముఠాదారులను ఆర్థికంగా దెబ్బతీయడానికి వారి పంటలను నాశనం చేయడం, చేతికందిన పంటను దోపిడీ చేయడం, చెట్లను నరికి వేయడం, ఆస్తులను ధ్వంసం చేయడం ఆనవాయితీగా పెట్టుకొన్నారు. *అనంతపురం జిల్లా తాడిపత్రి సమీపంలోని యల్లనూరు మండలంలోగల వెన్నుపూసపల్లిలో 1991 నుంచి 1998 వరకు సుమారు 18 మంది ముఠా కక్షలకు బలయ్యారు. రెండు వర్గాలకు చెందిన తొమ్మిదివేల చీనీ చెట్లను నరికివేశారు. పచ్చని పంట పొలాలను బీడు భూములుగా మార్చారు. కరెంటు మోటార్లను కాల్చివేయడం, ఎత్తుకొని పోవడం వంటివి చేశారు. నీళ్ళు వున్న బోరు బావులను పూడ్చివేశారు. రెండు వర్గాల వారూ కేసులతో సతమతమవుతూ సుమారు అర్వై లక్షల రూపాయలు ఖర్చు పెట్టారు. అంత పెద్ద మొత్తం ఖర్చు చేయడానికి డబ్బు ఎక్కడినుంచి వస్తుందని ప్రశ్నించుకోవలసిన పని లేదు. ఫ్యాక్షనిస్టుల జీవితాల నరక ప్రాయానికి వెన్నుపూసపల్లి ప్రత్యక్ష ఉదాహరణ.* ఘర్షణలు జరిగినప్పుడల్లా ఊర్లు వదిలిపోవడం, మరో వర్గం ఊరిని దోపిడీ చేయడం ముఠా సంస్కృతిలో భాగమే. పాత కాలపు పాలెగాళ్ళు తమ అవసరాలకు మాత్రమే దోపిడీ చేసేవారు. కానీ నేటి ముఠా నాయకులు అత్యంత తక్కువ కాలంలో లక్షలు, కోట్ల రూపాయలు అక్రమంగా సంపాదించి రాజకీయ అధికారం పొందడమే లక్ష్యంగా పెట్టుకొన్నారు.

సీమ ముఠానాయకుల కక్షలలో ఎందరో మహిళలు సమిధలయ్యారు. ఆప్తులను పోగొట్టుకొని, ఆస్తులున్నా అనుభవించడానికి వీలు లేకుండా పోయినందున ఆడపడుచులు ఆవేదనతో కుమిలిపోతున్నారు. ఆ అబలల ఆవేదన ఆవేశంగా మారుతున్నది. మారుతున్న మహిళల కోపాగ్నిలో ఫ్యాక్షనిస్టులు కాలిపోయే రోజులు దగ్గరలోనే రానున్నాయి. ఒక మహిళ చైతన్యవంతమైతే మొత్తం కుటుంబ స్వరూపమే మారుతుంది. కొన్ని కుటుంబాలు ఏకమైతే గ్రామ రూపురేఖలు ఖచ్చితంగా మారితీరుతాయి. ఆ చైతన్యం పాలెగాళ్ళ వారసులైన ఫ్యాక్షనిస్టుల పని పడుతుంది. ఫ్యాక్షనిస్టులు నిర్మించుకొన్న పెత్తందారీ కోటలు కుప్పకూలిపోతాయి.

'సీమ'లో వివిధ రకాల బాంబులు తయారవుతున్నాయి. బాంబుల తయారీ కుటీర పరిశ్రమ అయింది. కొందరు కూలీలను వినియోగించుకొని ఫ్యాక్షనిస్టులు బాంబులను ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. తద్వారా లక్షలు సంపాదిస్తున్నారు. బాంబులు ఎంతటి విధ్వంసాన్ని, భయోత్పాతాన్ని సృష్టిస్తాయన్న సంగతి వాటినితయారుచేసే కూలీలకు తెలుసో తెలియదో గానీ, కూలీ మాత్రం రోజుకు నూరు రూపాయల వరకు గిట్టుబాటవుతున్నది. బయట ఏ పని దొరకనప్పుడు పస్తులతో వుండలేక,

భార్యా బిడ్డలకు కాసింత కూడు పెట్టాలన్న తాపత్రయంతో కూలీలు విధ్వంసకర బాంబుల తయారీలో పాలు పంచుకొంటున్నారు. బాంబుల తయారీ, బాంబు దాడులు గతంలో కడప, కర్నూలు జిల్లాలకు మాత్రమే పరిమితమై వుండేవి. అవి క్రమ క్రమంగా అనంతపురం, చిత్తూరు జిల్లాలకు అంటువ్యాధిలా వ్యాపించాయి. చిత్తూరు జిల్లాలో ప్రశాంతత కనిపిస్తున్నా బాంబుల మోతలు అప్పుడప్పుడు వినిపిస్తుంటాయి. అనంతపురం జిల్లాలో యిటీవలి రోజుల్లో ఫ్యాక్షన్ కొట్లాటలు ఎక్కువయ్యాయి. బాంబుదాడులు, కొడవండ్లతో నరుక్కోవడం వంటి సంఘటనలు బాగా పెరిగాయి. జిల్లాలోని గుత్తి సమీపంలోని నెమళ్ళ పల్లి, గుంతకల్లులో జరిగిన ముఠా ఘర్షణలు ఫ్యాక్షనిజం కు పరాకాష్టగా పేర్కొనవచ్చు.

ఫ్యాక్షనిస్టు అంటే...

కోసం గ్రామాల్లో ఘర్షణలు జరిగేవి. పెత్తందారీల ఆధిపత్యాన్ని ఎదిరిస్తే రక్తపాతం జరిగేది. ఆ ఘర్షణల్లో పూర్వకాలంలో గ్రామ పెత్తనం చెలాయించడం కోసం, పెత్తనం ద్వారా వచ్చే ఆదాయాన్ని పొందడం గ్రామ పెద్ద, గ్రామ సర్పంచ్, కరణం, రెడ్డి (మునసబు) లదే ప్రధాన పాత్ర. ఆ మూడు పదవుల ద్వారా వచ్చే అధికారంతో గ్రామాన్ని తమ గుప్పిట్లో పెట్టుకొనే వారు గ్రామ పాలనాధికారులు. గ్రామాధికారులు ప్రజలపై పెత్తనం చెలాయించడమే కాక దౌర్జన్యాలు చేసేవారు. గ్రామంలోనివసించే వారెవరూ ఏ రంగలోనూ గ్రామాధికారులకు మించకూడదు. గ్రామస్థులు గ్రామాధికారులకంటే మంచి బట్టలు వేసుకోకూడదు. వారి ఇండ్ల ముందు లేదా ఇండ్ల వద్దకు కాళ్ళకు చెప్పులు తొడుగుకొని వెళ్ళరాదు. గ్రామాధికారులకు ఎవరైనా ఎదురుపడితే నమస్కారం చేసి పక్కకు తప్పుకోవాలి. గ్రామంలో పండుగ, ఉత్సవం, పెండ్లి ఏది జరిగినా వారికే ముందు పీట వేయాలి. గ్రామాధికారులు లేదా గ్రామ పెద్దల పెత్తనాన్ని సహించలేని వారిని నిర్దాక్షిణ్యంగా అణచివేస్తారు. అనంతపురం జిల్లా గోరంట్ల మండలంలోని ఒక గ్రామంలోని ఒక వ్యక్తి గ్రామ పెద్దకంటే ఎక్కువ ఆదాయాన్ని పొందేవాడు. ఆ వ్యక్తి భూములను స్వాధీనం చేసుకొమ్మని గ్రామ పెద్ద తన మనుషులను పంపించాడు. వారిని అడ్డుకొన్నందున ఆ వ్యక్తి తన ప్రాణాలనే పోగొట్టుకొన్నాడు. మరో సంఘటనలో గ్రామ పెద్ద బయట నుంచి ఊరిలోకి వస్తున్నాడు. అతను వస్తున్నప్పుడు ఇండ్ల బయట అరుగులపై కూర్చొన్న యువకులు లేవలేదు. అంటే తన పెద్దరికాన్ని ధిక్కరిస్తున్నారని గ్రామ పెద్ద ఆగ్రహించడమే కాక అదే రోజు ఆ అరుగుల (రాతి కట్టడం)ను పీకించివేశాడు. గ్రామాధికారుల మద్దతుదారులు, వ్యతిరేకులు రెండు వర్గాలేర్పడి అప్పుడప్పుడు కొట్టుకొనేవారు. ఆ వర్గం, ఈ వర్గం మిద్దెలపై నిలబడి రాళ్ళు విసురుకొనేవారు. ఆ మనుషులు, ఈ మనుషులు కలబడి కొట్టుకొనేవారు. కొట్లాటల్లో హత్యలు కూడా జరిగాయి. తన పెత్తందారీ తనాన్ని నిలుపుకోవడం కోసం గ్రామ పెద్ద 'ఫ్యాక్షనిస్టు'గా మారాడు. అది పాతకాలం ఫ్యాక్షనిజం. నేటి ముఠాతత్వం మంచి లాభమైన వ్యాపారం. ప్రతి విషయంలోనూ తన ప్రమేయం ఉండి తీరాలంటాడు నేటి ఫ్యాక్షనిస్టు. అయితే హత్యలలో మాత్రం తన ఆచూకీ ఏమాత్రం లేకుండా ఆనవాలు లభించకుండా జాగ్రత్తపడతాడు.

1975లో కొందరు యువనాయకులు రాజకీయ ప్రవేశం చేసిన తరువాత రాజకీయంగా తమకు ఎదురులేకుండా వుండాలన్న భావన వారిలో కలిగిన తరువాత ఫ్యాక్షన్ భూతం పెట్రేగుతూ వస్తున్నది. గ్రామ సర్పంచ్ నుంచి పార్లమెంట్ సభ్యునివరకు తన మనుషులే ఎన్నికల్లో పోటీచేసి గెలవడానికి ఎన్ని అక్రమాలకైనా పాల్పడుతున్నాడు. కాంట్రాక్టు పనులలో పాటుప్రభుత్వం నుంచి పలు రాయితీలు. సౌకర్యాలు పొందడం ఫ్యాక్షనిస్టుల ప్రత్యేకత. పెత్తందారీ కులాల వారు ఫ్యాక్షనిస్టులుగా చెలామణి అవుతుండగా, వారి అనుచరులైన బడుగు వర్గాల వారు దాడులలో మృతి చెందుతున్నారు. తమ ఆధిపత్యానికి ముప్పురాకుండా వుండడానికి ఫ్యాక్షనిస్టులు ప్రతి గ్రామాన్ని విడగొట్టి ముఠాలను ప్రోత్సహిస్తున్నారు. ఇంకొందరు ఫ్యాక్షనిస్టులు ప్రత్యక్ష ప్రమేయం లేకుండా అంతా తమ మనుషులతో చేయిస్తున్నారు. ప్రస్తుతం ఎక్కువమంది ముఠా నాయకులు ప్రత్యర్థులను హతమార్చడానికి కిరాయి హంతకులను వాడుకొంటున్నారు. అంతేకాక హత్యలు చేయడానికి అత్యంత ఆధునిక పద్ధతులను అవలంబిస్తున్నారు. అనంతపురం జిల్లా ధర్మవరం మండలం ఓబులనాయనిపల్లిలో ఒక ఫ్యాక్షనిస్టును చంపడానికి 1992లో తొలిసారిగా మందుపాతర పేలింది. 1995, 1997లలో యాడికి మండలం చిక్కేపల్లి, వేములపాడులలో కూడా మందుపాతరలు పేలి ఫ్యాక్షనిస్టులు హతమయ్యారు. రాయలసీమలో ఫ్యాక్షనిస్టులను చంపడానికి మందుపాతరలను. టి.వి బాంబులను ఉపయోగించింది ఒక్క అనంతపురం జిల్లాలో మాత్రమే.

ఒక్కమాటలో చెప్పాలంటే తనతో సమానంగా ఎవ్వరినీ ఎదగనీయని వాడే ఫ్యాక్షనిస్టు. తన రాజకీయ జీవితం సజావుగా సాగడానికి ఎన్ని హత్యలైనా చేయిస్తాడు. ఆర్థికంగా బలపడడానికి వున్న అన్ని వనరులనూ వినియోగించుకొంటాడు. తనకే కాక తన అనుచరులకూ పోలీసు రక్షణ (గన్‌మెన్) ఏర్పాటు చేసుకొని ఆ తుపాకులతో బెదిరించి పంచాయతీలుచేసి లక్షలు సంపాదిస్తున్నారు.

'ఫ్యాక్షనిస్టు' అంటే ప్రజలను పీడించేవాడు మాత్రమే కాదు.. ప్రజల రక్తం తాగేవాడు. అభివృద్ధికి అడ్డుపడేవాడు, అందినంత దోచుకొనేవాడు.

*   *

మొన్న జమ్మలమడుగు ఎమ్మెల్యే పి.శివారెడ్డి బాంబు దాడిలో హతం. నిన్న పెనుకొండ ఎమ్మెల్యే పరిటాల రవి కారు బాంబు నుంచి త్రుటిలో తప్పించుకోవడం. పులివెందుల పెద్దాయనగా పిలిపించుకొన్న మాజీ సర్పంచ్ వై.ఎస్. రాజారెడ్డి దారుణ హత్య. రేపు ఏ ఫ్యాక్షన్ నాయకుని నిండు జీవితం అర్ధాంతరంగా అంతమవుతుందో? సీమ పోలీసుల పక్షపాత వైఖరి వల్ల ఫ్యాక్షనిస్టులకు మంచి మేలు జరుగుతున్నది. పోలీసులు సకాలంలో స్పందించి, సరైన చర్యలు తీసుకొంటే ముఠాల మారణహోమం కొంతవరకు తగ్గే అవకాశం వుంది. సీమ పోలీసుల వైఫల్యాలు ఎన్నో వున్నాయి. పైగా వారిపై రాజకీయ వత్తిడులు ఎక్కువ య్యాయి. ఫ్యాక్షన్ రాజకీయాల వల్ల రాయలసీమలో శాంతి భద్రతల సమస్య సవాల్‌గా మారడమేకాకుండా వేలాది మంది అమాయకులు బలయ్యారు. ప్రభుత్వానికి అందిన ఇంటలిజెన్సు

నివేదిక ప్రకారం సీమలో 1995 నుంచి 1998 వరకు సుమారు 500 మంది ఫ్యాక్షన్ రాజకీయాలవల్లనే ప్రాణాలు పోగొట్టుకొన్నారు సీమలో 60మంది దాకా ముఠానాయకులున్నట్లు పోలీసులు గుర్తించారు. అందులో కడప, కర్నూలు జిల్లాలు అగ్రస్థానంలో వున్నాయి. సీమ వ్యాప్తంగా లైసెన్స్ లేని మూడువేల తుపాకులను 1997 నవంబర్‌లో పోలీసులు స్వాధీనం చేసుకొన్నారు. అంటే ముఠా నాయకుల వద్ద, వారి ప్రయివేటు సైన్యం వద్ద యింకా ఎన్ని తుపాకులు, ఎంత మందుగుండు సామాగ్రి వుంటుందో వూహించవచ్చు. ముఠా సంస్కృతిని అరికట్టడంలో పోలీసులు విఫలమవుతున్నందున సీమ శాంతి భద్రతల పరిరక్షణా బాధ్యతలను కొన్నేండ్ల పాటు మిలటరీ కమాండెంట్‌లకు అప్పగించాలి. అప్పుడే ఖచ్చితంగా పరిస్థితులు చక్కబడతాయి. లేకుంటే ఫ్యాక్షనిస్టులు మరింతగా పెట్రేగుతారు. న్యాయ స్థానాలు, చట్టం, రాజ్యాంగం పోలీసులు సరిగా పనిచేస్తే ఫ్యాక్షనిస్టుల పని పట్టడం తేలిక అవుతుంది.

కాగా అత్యంత వెనుకబాటుతనం, ఆర్థిక, సామాజిక అభివృద్ధి లేకపోవడం, పాలకుల తీవ్ర నిర్లక్ష్యం వంటి కారణాల వల్ల ముఠా సంస్కృతి వ్యాపిస్తున్నది. ఫ్యాక్షన్ జీవితం అత్యంత భయానకమని తెలిసి కూడా ఫ్యాక్షనిస్టులు హత్యారాజకీయాలకు పాల్పడుతున్నారు. ఎంతటి ఫ్యాక్షనిస్టు అయినా ప్రత్యర్థుల చేతిలో దారుణ హత్యకు గురికావాల్సి వస్తున్నది. ఆ చేదు నిజాన్ని ఫ్యాక్షనిస్టులు అర్థం చేసుకోకుండా మూర్ఖంగా ప్రవర్తిస్తూ బలి అవుతున్నారు.

సంబంధం లేని వారికీ ముప్పు తెచ్చే ముఠా కక్షలు

రాజకీయాలతో, ఘర్షణలతో, ముఠా కక్షలతో ఎలాంటి సంబంధం లేని వారుసైతం దారుణ హత్యలకు గురైన సంఘటనలు రాయలసీమ జిల్లాల్లో జరిగాయి. కడప జిల్లాకు చెందిన ఒకముఠా తమ ప్రత్యర్థిని చంపాలని కడప పట్టణంలో మాటువేసింది. ఒక వ్యక్తి కడప లోని ఒక హోటల్‌లో టిఫిన్ చేస్తుండగా కిరాతకంగా హతమార్చారు. అతను నేల మీద పడిపోయిన తరువాత వాడు కాదే అని హంతక ముఠా సభ్యులు ఒకరి ముఖాలొకరు చూసుకొన్నారు. నిజానికి వారు చంపాలనుకొన్నది మరో వ్యక్తిని. కొద్దిగా పోలికలు వుండడంతో వెనుకవైపు నుంచి కొడవళ్ళతో నరికారు. వారు అతన్ని గుర్తించేసరికి ప్రాణం పోయింది. ఆ విషయం తెలిసి ఆ కుటుంబ సభ్యులు విలవిలలాడారు. తన భర్తను చంపిన ఆ కిరాతకులను హత్యచేసే వరకు తాను నుదుట కుంకుమ, గాజులు తీయనని హతుని భార్య శపథం చేశారు. డిగ్రీ చదువుతున్న కుమారుడు ముఠాకక్షల కూపంలోకి దిగవలసి వచ్చింది. అంతులేని ముఠాపోరులో దిగడానికి ఏమాత్రం యిష్టంలేని ఆమె కుమారుడు తల్లికి ఎంతగానో నచ్చచెప్పాడు. పోలీసు కేసు పెట్టి, కోర్టులో సాక్ష్యాధారాలు నిరూపణ కావడంతో హంతకముఠాకు యావజ్జీవ శిక్షపడింది. అప్పుడుగాని ఆ తల్లి మనసు కుదుటపడలేదు. సంయమనం పాటించిన ఆమె కుమారుడు ప్రస్తుతం ఉద్యోగ జీవనం సాగిస్తున్నారు. కడపలో జరిగిన ఆ కిరాతక సంఘటన ఒక ఉదాహరణ మాత్రమే. ఆవిధంగా ఎన్నో జరిగాయి. ముఠా కొట్లాటలతో ఏవిధమైన సంబంధం లేకున్నా కొందరి ప్రాణాలకు ముప్పు ఏర్పడుతున్నది.

అభివృద్ధికి అడ్డుగోడలు

రాయలసీమలో అపార ఖనిజ సంపద వున్నా ఆయా ముడి ఖనిజాల ఆధారంగా పరిశ్రమలు స్థాపించలేదు. కొన్ని సిమెంటు పరిశ్రమలనుమాత్రమే నెలకొల్పడం జరిగింది. ఆంధ్ర రాష్ట్రం ఏర్పడినప్పట నుంచి సీమలో పారిశ్రామిక ప్రగతి ఆశించిన రీతిలో జరగలేదు. ఏ ప్రాంతమైనా అభివృద్ధి చెందాలంటే నీరు, పరిశ్రమలు, వ్యాపారం, విద్యుత్తు పుష్కలంగా వుండాలి. ఆ మూల స్థంభాల ద్వారానే ప్రగతి సాధ్యమవుతుంది. రాయలసీమ జిల్లాలకే పరిమితమైన ముఠాకక్షలు కడప జిల్లా జమ్మలమడుగు ఎమ్మెల్యే శివారెడ్డి హత్యతో హైదరాబాద్ దాకా విస్తరించాయి. అనంతపురం జిల్లా పెనుకొండ ఎమ్మెల్యే పరిటాల రవిని హతమార్చడానికి ప్రత్యర్థులు హైదరాబాద్‌లో కారుబాంబుద్వారా మారణహోమం సృష్టించడం జరిగింది. ముఠాసంస్కృతి బాంబులను దాటి మందుపాతరలు, టి.వి. బాంబులు, కారు బాంబుల దాకా వెళ్లింది. ముఠా నాయకులు, వారి సైన్యాలు ఒకరినొకరు అంతమొందించుకొంటూ అందరూ చస్తున్నారు. ముఠాల వల్ల బాహ్య ప్రపంచంలో రాయలసీమపై చాలా చిన్న చూపుంది. అంతేకాక అత్యంత భయమూ వుంది. రాయలసీమలో బయటి ప్రాంతాలవారు పరిశ్రమలు స్థాపించడానికి జంకుతున్నారు. ప్రస్తుతం సీమలోగల సిమెంట్, స్పిన్నింగ్ మిల్లుల యూనియన్‌లలో కొన్ని అరాచక శక్తులు ప్రవేశించాయి. వివిధ యూనియన్‌ల మధ్య జరుగుతున్న ఘర్షణలు యాజమాన్యాలను ఇబ్బంది పెడుతున్నాయి. యూనియన్‌లను ముఠా నాయకులు నడిపిస్తున్నారు. సి.పి.ఐ.కు అనుబంధంగా వున్న కార్మిక సంఘం ఎ.ఐ.టి.యు.సి.కి కడప జిల్లాలోని కాంగ్రెస్ నాయకులు గౌరవ అధ్యక్షులుగా ఉండడం విడ్డూరం. కాంట్రాక్టులు, ఉద్యోగాలు, ముడి పదార్థాల సరఫరా, సరుకు రవాణా వంటి వన్నీ ముఠానాయకులే దక్కించుకొంటున్నారు. ముఠా నాయకుల ఆగడాలకు అడ్డుపడే పరిశ్రమల జనరల్ మేనేజర్లు, మేనేజింగ్ డైరెక్టర్‌లపై దాడులు నిర్వహిస్తున్నారు. టెక్స్‌మోకో సిమెంట్ చీఫ్ ఎగ్జిక్యూటివ్, సిసిఐ జనరల్ మేనేజర్, జువారి సిమెంట్స్ జనరల్ మేనేజర్ తదితరులపై దాడులు జరిగాయి. ఇవి కొన్నే.. ఆవిధంగా ఎన్నో దాడులు జరుగుతున్నాయి. భయోత్పాతాన్ని సృష్టించడం ద్వారా తమకు ఎదురులేకుండా చేసుకోవాలని సీమ ముఠానాయకులు కలలు కంటున్నారు. సీమ ముఠా దాడులతో కొన్ని పరిశ్రమలు మూతపడగా, మరి కొన్ని విస్తరణకు నోచుకోకుండా వున్నాయి. కొత్త పరిశ్రమలుస్థాపించడానికి యాజమాన్యాలు ముందుకు రావడం లేదు. కొత్త పరిశ్రమ పెట్టాలంటే ముందు ముఠా నాయకులనే సంప్రదించవలసిన దుస్థితి దాపురించింది.

తెలుగు గంగ కాలువ కాంట్రాక్టు పనుల విషయంలో పనులు తమ హస్తగతం చేసుకోవడానికి ముఠా నాయకులు పలుసార్లు దౌర్జన్యాలకు పాల్పడ్డారు. రైల్వే గేజ్ మార్పిడి పనులు, వంతెనల నిర్మాణం రోడ్లు వేయడం లాంటి వాటికి కాంట్రాక్టర్లు పర్సంటేజీ ముడుపులను ఆయా ప్రాంత ముఠా నాయకులకు ముందుగానే సమర్పించుకోవాలి. లేకుంటే టెండరు వేయడానికి వీలుండదు. ముఠా నాయకుల సాయుధ దళాలు టెండర్ వేయకుండా కాంట్రాక్టర్లను నిరోధిస్తుంటాయి. ముఠాలను కాదని ఒకవేళ కాంట్రాక్టును పొందినా, ముఠా నాయకులు పనిచేయనివ్వరు. ఆయా ప్రాంతాల్లో జరిగే అభివృద్ధి

పనుల మొత్తాల్లో వాటా పర్సంటేజీ తమకు ఇవ్వాల్సిందేనని సీమకు చెందిన కొందరు ఎమ్మెల్యేలు . ఎంపిలు కాంట్రాక్టర్లను బెదిరించిన సంఘటనలు కోకొల్లలు. పర్సంటేజీ వాటాల వల్ల కొన్ని అభివృద్ధి పనులు ఆగిపోతుండగా, మరికొన్ని చోట్ల మందకొడిగా సాగుతున్నాయి. ముఠాల వల్ల ముందు ముందు సీమ అభివృద్ధి పూర్తిగా స్తంభించిపోయే ప్రమాదం వుంది.

సీమ ముఠానాయకులు ఒకరినొకరు అంతమొందించు కొనేందుకు తమ వద్ద నమ్మకంగా పనిచేసేవారినే వుపయోగించేవారు. ఒకరికొకరు తీసిపోకుండా ఎత్తుకు పై ఎత్తులు వేసుకోవడంతో సాయుధ ముఠాల పోషణ ఖర్చు భారం ముఠా నాయకులు మోయలేనంతగా పెరిగిపోయింది. ముఠా నాయకులు హత్యలకు కిరాయి హంతకులను వినియోగిస్తున్నారు. ముఠా నాయకుని స్థాయిని బట్టి హతమార్చడానికి కిరాయి లక్షల్లో చెల్లిస్తున్నారు. కిరాయి హంతకుల వల్ల ఫ్యాక్షనిస్టులు కేసుల్లో ఇరుక్కోకుండా సులభంగా బయటపడుతున్నారు. ఫలానా వాడే ఫలానా వ్యక్తిని హత్య చేయించాడని తెలిసినా కోర్టుల్లో కేసులు నిలవక పోవడంతో ముఠాల పైశాచిక సంస్కృతి మరింతగా పెరుగుతున్నది. సీమ అభివృద్ధికి అడ్డుగోడలుగా మారిన ముఠా సంస్కృతిని మట్టుబెట్టడానికి సీమ లోనిప్రతి పౌరుడు ఒక సైనికుడిగా మారవలసిన అవసరం ఎంతైనా వుంది. ఫ్యాక్షనిస్టుల వల్ల అతలాకుతలమవుతున్న ప్రజలకు బాసటగా నిలవవలసిన బాధ్యత ప్రభుత్వాలపై వుంది.

ఖనిజ సంపదకు కొదువలేదు

రతనాల సీమగా ప్రఖ్యాతి గాంచిన రాళ్ళసీమ ఇప్పటికీ రత్నగర్భ గానే వుంది. రాయలసీమ జిల్లాల్లో వజ్రాలు, బంగారం, రాతినార, ముగ్గురాళ్ళు, సున్నపురాయి తదితర గనులు వున్నాయి. కడప జిల్లాలో గల యురేనియం నిక్షేపాలు ప్రపంచంలో మరెక్కడా లభించవని శాస్త్రజ్ఞులు అంచనావేశారు. అనంతపురం జిల్లాలోని ధర్మవరం, తాడిపత్రి, కడప జిల్లా పులివెందుల పరిసరాల్లో అత్యంత నాణ్యత గల ఆస్‌బెస్టాస్ (రాతినార) గనులున్నాయి. రాతి నారనుపయోగించి బ్రేక్‌లైనింగ్‌లు,ఆయిల్ ఇంజన్లు, పెట్రోల్ పంప్‌గాస్కెట్లు వంటివి తయారుచేస్తున్నారు. వాటికి విదేశాల్లో ముఖ్యంగా అరబ్ దేశాల్లో చాలామంచి మార్కెట్ వుంది. బైరైటీస్ (ముగ్గు రాళ్ళు) గనులకు కడప జిల్లా ప్రపంచ ప్రఖ్యాతి పొందింది. ముగ్గు రాళ్ళను ఇరాన్, ఇరాక్ దేశాలకు ఎగుమతి చేస్తున్నారు. ముగ్గురాళ్ళ పొడిని టైర్లు, పేపర్, లినోలియంగాజు, ఎనామిల్ పెయింట్స్ తయారీకి వాడుతారు. అనంతపురం జిల్లాలోని కొన్ని చోట్ల, కర్నూలు జిల్లా ద్రోణాచలం, బనగానపల్లి, కోయిలకుంట్ల, కడప జిల్లా జమ్మలమడుగు, కమలాపురం ప్రాంతాల్లో కోట్లాది టన్నుల సున్నపురాయి వుంది. సిమెంట్ పరిశ్రమకు సున్నపురాయి ప్రాణాధారం. అనంతపురం జిల్లా చెన్నేకొత్తపల్లి సమీపంలోని రామగిరి, చిత్తూరు జిల్లాలోని చిగురుకుంట వద్ద బంగారు గనులున్నాయి. అనంతపురం జిల్లా వజ్రకరూరు, లత్తవరం, కర్నూలు జిల్లా బనగానపల్లి, రాయలకోట, బొల్లారం ప్రాంతాల్లో వజ్రాలు లభిస్తున్నాయి. వజ్రకరూరు వజ్రాలు ప్రసిద్ధి పొందాయి. కడప బండలుగా పిలువబడుతున్న నాపరాళ్ళు కడప, అనంతపురం, కర్నూలు జిల్లాల్లో విస్తారంగా వున్నాయి. స్టీటైటు అనే ఖనిజం అనంతపురం

జిల్లా తాడిపత్రి, కడపజిల్లా పులివెందుల ప్రాంతాల్లో లభిస్తున్నది. ఇవేకాక రాగి, అభ్రకం (మైకా), జింక్, లెడ్ తదితర ఖనిజాలు అనంతపురం, కడప జిల్లా భూగర్భంలో నిక్షిప్తమై వున్నాయి. అరుదైన సంపదకు రాయలసీమ ఆలవాలమైనా వాటి ఆధారిత పరిశ్రమలను నెలకొల్పడంలో పాలకులు ఘోరంగా విఫలమయ్యారు. అన్ని రకాల ఖనిజాల ముడిపదార్థాలనే ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నందున రాయలసీమకు తీరని ద్రోహం జరుగుతున్నది. దాదాపు 30 నుంచి 40 సిమెంట్ పరిశ్రమలకు కావలసినంత ముడి పదార్థం లభిస్తున్నా పట్టుమని పది పరిశ్రమలు కూడా లేవు. ఇప్పటికైనా సీమ ప్రజా ప్రతినిధులు మేల్కొని ఆయా ప్రాంతాల్లో లభించే ఖనిజ ఆధారిత పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తే ప్రజలు హర్షిస్తారు.

ముఠా నాయకులు, కక్షలు నెలకొన్న నియోజకవర్గాలు

జిల్లా పేరు	నియోజకవర్గం
కర్నూలు	దాదాపు అన్ని నియోజక వర్గాల్లో ముఠా కక్షలు రగులుతున్నాయి
కడప	పులివెందుల, కమలాపురం, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, రైల్వేకోడూరు
చిత్తూరు	చిత్తూరు, తంబళ్ళపల్లి, పీలేరు, మదనపల్లి
అనంతపురం	తాడిపత్రి, పెనుకొండ, ఉరవకొండ, గుత్తి, ధర్మవరం

కాగా ఫ్యాక్షనిస్టుల దౌర్జన్యాలను, అకృత్యాలను ఎదిరించిన క్రమంలో కొందరు విధిలేని పరిస్థితుల్లో ఫ్యాక్షనిస్టులుగా మారుతున్నారు. తమకు న్యాయం జరగనప్పుడు బాధితులు నిందితులను హతమారుస్తున్నారు. తమకు జరిగిన అన్యాయానికి ప్రతీకారం తీర్చుకొంటున్నారు. ఆ నేపథ్యంలో వారికి తెలియకుండానే ఫ్యాక్షన్ జీవితంలోకి ప్రవేశిస్తున్నారు. ఫ్యాక్షనిజమ్ లోకి ఒకసారి అడుగుపెడితే అందులోనుంచి బయట పడడం అంత తేలికకాదు. ఫ్యాక్షనిస్టులను ఎదిరించిన వారూ ఫ్యాక్షనిస్టులుగానే పరిగణింపబడుతున్నారు.

వ్యర్థ విధానాలతో వ్యవసాయానికి విపత్తు

కరువు ప్రాంతమైన రాయలసీమలో సేద్యం జూదంగా మారింది. నదులున్నా వర్షాభావం వల్ల నీరు పారకపోవడం, భూగర్భజలాలు అడుగంటడం, మెట్ట సేద్యంలో పెట్టిన పెట్టుబడి కూడా వెనక్కు రాకుండడంవంటి కారణాలతో సీమ సేద్యం మోడువారుతున్నది. ప్రకృతి ఒక వైపు, పాలకులు మరోవైపు పీడిస్తున్నందున సీమ రైతాంగం కుంగిపోతున్నది. శాస్త్ర సాంకేతిక రంగాలు, వాణిజ్యం, పరిశ్రమలు, ఎంత అభివృద్ధి చెందినా తిండి లేకుండా ఎవరూ బ్రతుకలేరన్నది నగ్నసత్యం. అందరికీ అన్నం పెట్టే రైతన్నను ప్రభుత్వం చిన్న చూపు చూస్తున్నది. ప్రపంచ బ్యాంకు చేతిలో కీలుబొమ్మలుగా మారుతున్న పాలకులు దేశానికి వెన్నెముకగా వున్న రైతన్న నడ్డి విరుస్తున్నారు. వ్యవసాయ ఉత్పత్తుల పెంపుదలకు రైతాంగానికి కొత్త ప్రోత్సాహకాలు ప్రకటించకపోగా వున్న వాటిని తొలగిస్తున్నారు. ఆ క్రమంలో భాగంగానే వ్యవసాయానికి ఇస్తున్న సబ్సిడీలను తగ్గించాలని నిర్ణయించారు. విద్యుత్ ఛార్జీలు విపరీతంగా పెరిగిపోయాయి. కొత్తగా ఒక బావికి విద్యుత్ కనెక్షన్ తీసుకోవాలంటే బడుగు రైతు దాదాపు రూ. 20వేలు ప్రభుత్వానికి చెల్లించాలి. ఇక విద్యుత్ మోటారు, పంప్‌సెట్ కొనడానికి పదివేలకు పైగానే వెచ్చించాలి. అంటే ఒక బడుగు రైతు తరీ వ్యవసాయం చేయడానికి కనీసం ముప్ఫయి వేలు ఖర్చు పెట్టాలి. అంత సొమ్మును సీమ రైతు ఎక్కడినుంచి తేగలడు! పెంచిన విద్యుత్ ఛార్జీలతో సీమ రైతాంగం డీలా పడిపోయింది. ఆర్థికంగా చాలా అధ్వాన్నంగా వున్న వ్యవసాయ కుటుంబాలు విద్యుత్ షాక్‌నుంచి తేరుకొనే పరిస్థితి లేదు. వ్యవసాయ రంగానికి మౌలిక సదుపాయాలు సమకూర్చకపోగా సబ్సిడీలను హరిస్తూ విద్యుత్ ఛార్జీలను పెంచుతూ రైతులు సేద్యం మానివేసేటట్టు చేయడానికి ప్రభుత్వం పరోక్షంగా పురిగొల్పుతున్నది. వాస్తవానికి ప్రభుత్వమే నీటి వసతి కలుగచేయాలి. కొన్ని ప్రాంతాల్లో మాత్రమే కాలువల ద్వారా నీటి సరఫరా జరుగుతున్నది. మరి మెట్ట ప్రాంత రైతుల మాటేమిటి? తమ స్వంత ఖర్చుతో బావులు తవ్వుకొంటే బోర్లు వేసుకొంటే వాటికి మోటార్లు బిగించుకోవడానికి వేలకు వేలు ఖర్చు చేయాలి. అంతటి ఆర్థిక స్థోమత తమకు వుందా అని రైతులు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు.

ప్రభుత్వాలు, పాలకులు మారినప్పుడల్లా విధానాలు మారుతున్నాయి. గతంలో వ్యవసాయ విద్యుత్‌పై శ్లాబ్‌రేటు వుండేది. ఎన్టీఆర్ ముఖ్యమంత్రి అయిన తొలి సంవత్సరంలో రాయలసీమ వ్యవసాయదారులకు మేలు చేయాలని సంకల్పించారు. కొన్నినీటి పథకాలు ప్రకటించడం, ఎండిపోయిన బావుల్లో చిన్న

సన్నకారు రైతులకు ఉచితంగా బోర్లు వేయడం, బావులు తవ్వకానికి విరివిగా రుణాలు మంజూరు వంటి కార్యక్రమాలను అమలు చేశారు. విద్యుత్ శ్లాబ్ విధానంలో ఐదు హార్స్ పవర్ గల మోటారుకువిద్యుత్ చార్జి నెలకు కేవలం యాభై రూపాయలే వుండేది. కాంగ్రెస్ ప్రభుత్వంలో అది రూ.300 అయింది. ప్రస్తుత సంగతి సరేసరి! విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఖర్చును రైతులే భరించాలి. కొత్త కనెక్షన్ తీసుకొని బడుగు రైతుకు కావాల్సిన కరెంటు స్తంభాలను, విద్యుత్ వైర్‌ను కరెంటోళ్ళనుంచి కొనుగోలు చేయాలి. కనెక్షన్ తీసుకొనేటప్పటికి రైతుకు షాక్ కొట్టిపడిపోతాడు. రాయలసీమలోని కర్నూలు, కడప జిల్లాలో కాలువల ద్వారా సాగు కాస్త ఎక్కువగానే ఉంది. అనంతపురం జిల్లాల్లో గుడ్డిలో మెల్లగా తుంగభద్ర ఎగువ కాలువవున్నా ఆశించినంత ప్రయోజనం కలుగలేదు. ఇక చిత్తూరు జిల్లాలో తరీ సేద్యమంతా చెరువులు, బావుల కింద మాత్రమే సాగుతున్నది. వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించి పెంచిన విద్యుత్ ఛార్జీలు వసూలు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయం రైతాంగాన్ని మరింత కుంగదీసింది.

విద్యుత్ కోసం ఎంత వెచ్చించినా ప్రభుత్వం చెప్పినట్టు వ్యవసాయానికి విద్యుత్ సరఫరా కావడం లేదు. కరెంటు ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియక పంటలకు నీళ్ళు పెట్టడానికి రైతులు పొలాల వద్దే పడిగాపులు కాయవలసిన దుస్థితి దాపురించింది. పంజాబ్‌లో రోజుకు 23 గంటలపాటు, కేరళలో 18గంటలపాటు, తమిళనాడులో పది గంటలపాటు వ్యవసాయానికి ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తున్నాయి ఆయా ప్రభుత్వాలు. అంతేకాకుండా రుణాలు ఇవ్వడంలో, రుణాలు వసూలుచేయడంలో సంయమనం పాటిస్తున్నారు. మన రాష్ట్రంలో అధిక బిల్లులు వసూలు చేస్తున్నా విద్యుత్ సరఫరా మాత్రం చాలినంత జరగడం లేదు. పెద్ద పెద్ద పారిశ్రామిక వేత్తలు, కోట్ల రూపాయలు బకాయిలున్నా విద్యుత్ అధికారులు వారి జోలికెళ్ళడం లేదు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటినుంచి పారిశ్రామిక వేత్తలు దాదాపు 65 వేల కోట్ల రూపాయల రాయితీలను పొందారు. అయితే వ్యవసాయ దారులు అందులో పదోవంతు కూడా రాయితీలు పొందలేదు. బడా బకాయిదార్ల విషయంలో కిమ్మనకుండా వుండే పాలకులు బడుగురైతును మాత్రం షాక్‌కు గురిచేస్తున్నారు. కాగా మనదేశంలో డెబ్భై శాతం మందికి పైగా గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తూ వ్యవసాయ ఆధారిత జీవనాన్ని గడుపుతున్నారు. మనదేశం వ్యవసాయ దేశమైనా వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి పరచడంలో పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారు. వ్యవసాయ రంగానికి కేటాయించే నిధుల్లో సైతం కోత విధిస్తున్నారు. ఎనిమిదో పంచవర్ష ప్రణాళికలో కేటాయించిన మొత్తాన్ని తొమ్మిదో ప్రణాళికలో పెంచాలి. అయితే తొమ్మిదో ప్రణాళికలో వ్యవసాయ రంగ నిధులు ఆరుశాతం తగ్గాయి. సరళీకృత ఆర్థిక విధానాలు, వ్యవసాయ సబ్సిడీలపై ప్రపంచ ద్రవ్యనిధి (ఐ.ఎం.ఎఫ్) విధించిన ఆంక్షలు వంటి కారణాలతో కరువు సీమ సేద్యం మరింతగా కుచించుకపోతున్నది. పాలకులకు నిర్దుష్టమైన వ్యవసాయ విధానమే లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న వ్యర్థ విధానాలతో సీమ వ్యవసాయానికి విపత్తు తప్పదు.

విధ్వంసక విత్తనాలు వద్దు

మనదేశంలో డెబ్బైశాతం మందికి పైగా వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నాం... వ్యవసాయాన్ని ఒక పరిశ్రమగా గుర్తించడంలో కేంద్ర ప్రభుత్వాలు అలసత్వంగా వుంటున్నాయి. ఇక వ్యవసాయ పరిశోధనల వల్ల రైతాంగానికి ఆశించినంత ప్రయోజనం కలగడం లేదు. రైతులు ఎటువంటి సూచనలను తెలుసుకోకుండానే తమకున్న కొద్దిపాటి వ్యవసాయ పరిజ్ఞానంతోనే పంటలు బాగా పండిస్తున్నారు. వర్షం సరిగాకురిస్తే రైతు రాజే గిట్టుబాటుధరలు లభించక రైతన్నలు లబోదిబోమంటున్నారు. వేరుశనగ ధర వున్నట్టుండి పడిపోవడంతో ఆందోళన చేస్తున్న రైతాంగంపై 1998 అక్టోబర్‌లో కర్ణాటక ప్రభుత్వం కాల్పులుజరిపింది. ఫలితంగా తుంకూరు జిల్లా శిర (అనంతపురం జిల్లా మడకశిరకు 50 కి.మీ. దూరం)లో ఎనిమిది మంది రైతన్నలు ప్రాణాలు పోగొట్టుకొన్నారు. సేద్యానికి అవసరమైనంత విద్యుత్ సరఫరా కావడం లేదు. ఆవిధంగా రైతులు ఎన్నో సమస్యలతో సతమతమవుతుండగా.. మరో ప్రాణాంతక సమస్య టర్మినేటర్ (విధ్వంసక) విత్తనాలు దేశంలోకి దిగుమతి అయ్యాయి. ప్రత్యేకంగా జీవశాస్త్ర విజ్ఞానాన్ని వినియోగించి అమెరికాలో రూపొందించిన టర్మినేటర్ విత్తనాలు ప్రయోగం పేరుతో ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల పొలాల్లో 1998 నవంబర్‌లో ప్రవేశించాయి. టర్మినేటర్ విత్తనాలు చీడపీడలను ఎదుర్కోవడమే గాక అధికదిగుబడినిస్తాయని అమెరికా శాస్త్రజ్ఞులు సెలవిస్తున్నారు. మరో మరణశాసనం గురించి వారు మాట్లాడడం లేదు. అదే.. టర్మినేటర్ విత్తనాలద్వారా ఉత్పత్తి అయినవి మళ్ళీ మొలకెత్త అవకాశమే లేదు. అంటే పంట వేయవలసినప్పుడల్లా కొత్తగా విత్తనాలు కొనవలసిందే. ఆర్థికస్థోమత అంతగాలేని రైతులు ప్రతిసారి విత్తనాలు ఎలాకొంటారు. రైతన్నల అవసరాలకు అనుగుణంగా విత్తనాల సరఫరా జరుగుతుందా? ప్రస్తుతం కేవలం రెండుశాతంమంది రైతులే ఏటా విత్తనాలు కొంటున్నారు. మిగతా వారంతా తమ పొలాల్లో పండిన వాటినే విత్తనాలుగా పునరుత్పత్తికి వాడుతున్నారు. మనదేశంలో వేలాది సంవత్సరాల నుంచి వ్యవసాయం సంప్రదాయ పద్ధతుల్లోనే సాగుతున్నది. వ్యవసాయ విధానంలో ఆధునికత (టర్మినేటర్ విత్తనాలు కాదు) ఉంటే దిగుబడులు మరింతగా పెరుగుతాయి. అంతేగాక విస్తారంగా వున్న సారవంతమైన భూముల్లో ఆహారధాన్యాలు, నూనెగింజలు ఎక్కువగా పండించాలి. ప్రస్తుతం మనదేశంలో ఒక సంవత్సరంలో పండే ఆహారధాన్యాలు, నూనెగింజలు సుమారు మూడు సంవత్సరాల వరకు సరిపోతాయి. ఇక వ్యవసాయ విస్తరణ జరిగితే రైతుల జీవనప్రమాణాలు పెరుగుతాయి. లేకుంటే వారి బతుకులు అధోగతే. వ్యవసాయ

దారుల జీవితాలను విధ్వంసం చేసే విత్తనాలను మనదేశంలో అనుమతించకూడదు. వ్యవసాయ రంగంలో విధ్వంసం సృష్టించే టర్మినేటర్ విత్తనాలు వద్దు.

అమెరికాను అడ్డుకోండి

అభివృద్ధి చెందుతున్న దేశాలపై కొన్ని ఆంక్షలు విధించి ప్రపంచంలో తన పట్టును పెంచుకోవాలని పెద్ద సామ్రాజ్యవాద దేశమైన అమెరికా కలలు కంటున్నది. ప్రపంచ దేశాలను తమ గుప్పిట్లో వుంచుకోవడానికి వ్యవసాయ రంగంపై పడింది. టర్మినేటర్ విత్తనాలను సృష్టించి, వాటిని విదేశాల్లో మార్కెట్‌చేసి పబ్బం గడుపుకోవాలని అమెరికా చూస్తున్నది. అమెరికా ప్రభుత్వ వ్యవసాయ సంస్థ, డెల్టా అండ్ పైన్ లాండ్ అనే విత్తనాల పంపిణీ సంస్థ ఉమ్మడిగా విధ్వంసక (టర్మినేటర్) విత్తనాల సృష్టికి 1998 మార్చిలో పేటెంట్ హక్కులు పొందాయి. ఆ రెండు సంస్థలూ పత్తి, పొగాకు విత్తనాలను విధ్వంసక విజ్ఞానంతో రూపొందించి ప్రయోగాలు మొదలు పెట్టాయి. కొన్నేండ్లలోనే వరి, గోధుమ వంటి ఆహార ధాన్యాలు, వేరుశెనగ, చిక్కుడు, పొద్దుతిరుగుడు లాంటి నూనె గింజలను సైతం టర్మినేటర్ టెక్నాలజీ ద్వారా సృష్టించాలని సంకల్పించారు. తద్వారా ప్రపంచదేశాల వ్యవసాయాన్ని శాసించే అవకాశం వుంది. అమెరికా ప్రభుత్వ వ్యవసాయ సంస్థ, డెల్టా అండ్ పైన్ లాండ్ సంస్థ ఏజెంట్లను నియమించి ప్రపంచమంతా విత్తనాల వ్యాపారం చేస్తాయి. అమెరికాలోని మోన్ సాంటా కంపెనీ మన దేశంలోని మహారాష్ట్ర హైబ్రీడ్ సీడ్స్ కంపెనీ (మహికో) కి టర్మినేటర్ విత్తనాల ఏజెన్సీ యిచ్చింది. మహికో పలురకాల విత్తనాలను అమ్ముతున్నది. విత్తనాలు అమ్మే సంస్థలలో మహికో కంపెనీ అగ్రగామిగా వుంది. దాదాపు 30 విదేశీ కంపెనీలు విత్తనాలను, పురుగు మందులను మన దేశంలో అమ్ముతున్నాయి. వాటి ప్రభావం మన వ్యవసాయ రంగంపై ఎక్కువగా వుంది. వాటిని అదుపు చేయకుంటే భారత వ్యవసాయం బాగా దెబ్బతింటుంది. కాగా అభివృద్ధి చెందుతున్న దేశాలను తమ అదుపులో వుంచుకోవాలన్న అమెరికా తపన ఈనాటిది కాదు. అంతరిక్ష శాస్త్ర, సాంకేతిక రంగంలో స్వయం సమృద్ధి దిశగా వేగంగా పయనిస్తున్న భారత్ పై 1992లో అమెరికా ఆంక్షలు విధించింది. రాకెట్ టెక్నాలజీని భారత్‌కు సరఫరా చేయవద్దని రష్యాను కోరింది. అంతేగాక భారత్ అణుపరీక్షలను విజయవంతంగా నిర్వహించిన తర్వాత మరోసారి ఆంక్షలను విధించింది. మేధావులైన మన శాస్త్రవేత్తలు కొందరిని అమెరికా నుంచి మనదేశానికి పంపివేసింది. అదేవిధంగా జపాన్ వస్తువుల అమ్మకాలను అమెరికాలో తగ్గించాలని దిగుమతి సుంకాన్ని విపరీతంగా పెంచింది. అంతా తమ అదుపులో వుండాలని అమెరికా ఆరాటపడుతున్నది. అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందుతున్న దేశాలు ఒక్కటై అమెరికా ఆరాటానికి అడ్డుకట్ట వేయాలి. అమెరికా దుందుడుకు తనానికి ముగుతాడు వేయడానికి మేధావులందరూ ప్రభుత్వంపై వత్తిడి చేయాలి.

పంటల బీమా పథకం ఏదీ?

భారతదేశం వ్యవసాయక దేశం అనే విషయాన్ని పాలకులు మరచిపోతున్నారు. పారిశ్రామిక వేత్తలకు వేలకోట్లు రాయితీలు కల్పించే ప్రభుత్వాలు రైతాంగానికి నామ మాత్రంగా సబ్సిడీలు అందిస్తున్నాయి. పారిశ్రామిక వేత్తలకు తమ ఉత్పత్తులను అమ్ముకోడానికి తగిన ధరను నిర్ణయించే హక్కు వుంది. కానీ రైతుల విషయంలో అదిలేదు. సంవత్సరమంతా కుటుంబంలోని ప్రతి ఒక్కరూ కష్టపడి పంట పండిస్తే 'గిట్టుబాటు ధర' లభించదు. తాను పండించిన పంటకు ధర నిర్ణయించే హక్కు లేదు. రాయలసీమలోని మారుమూల ప్రాంతంలో పండించే పంటకు ఢిల్లీలోనో, బొంబాయిలోనో ధర నిర్ణయమవుతుంది. అదే ధర కొంత వ్యత్యాసంతో దేశ వ్యాప్తంగా అమలవుతుంది. తమకు *గిట్టుబాటు ధరలు లేవని రైతాంగం కొన్నేండ్ల నుంచి ఆందోళన చెందుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదు. ప్రకృతి భీభత్సాలకు, కరువులకు గురైనప్పుడు రైతులను ఆదుకోవడానికి* పంటల బీమా పథకాన్ని విధిగా అమలు చేయడం లేదు. పేరుకు వ్యవసాయ దేశమైనా బీమా పథకం 1985 నుంచి లోపభూయిష్టంగా అమలు జరుగుతున్నది. దానివల్ల రైతులకు ఏ మాత్రం ఉపయోగం లేదు. అమెరికా, రష్యా, జపాన్ తదితర దేశాల్లో పంటల బీమా పథకం బాగా అమలవుతున్నది. కానీ మన దేశంలో మాత్రం పంటల బీమా పథకం ద్వారా రైతులకు మేలు చేకూర్చడానికి పాలకులు మీన మేషాలు లెక్కిస్తున్నారు. కుక్కలకు సైతం బీమా సౌకర్యం వున్న ఈ దేశంలో పంటలకు మాత్రం బీమా సదుపాయం లేదు. రైతాంగంపై ఎందుకుకీ వివక్ష? పెద్ద పెట్టుబడిదారులు, పారిశ్రామిక వేత్తలు, తాము చేసే వ్యాపారాలకు 'అగ్రో' అనే బోర్డు తగిలించుకొని కోట్లు మింగుతున్నారు. అగ్రో ఫామ్స్ (వ్యవసాయ క్షేత్రాలు), అగ్రో టెక్నాలజీ, అగ్రో ఇండస్ట్రీ అంటూ రకరకాల పేర్లతో పెద్ద పెట్టుబడిదార్లు రైతుల రాయితీలను కొల్లగొడుతున్నారు. ప్రభుత్వం నుంచి సౌకర్యాలు పొందడమే గాకుండా 'అగ్రో' అనే పదం ద్వారా ప్రభుత్వానికి వందల కోట్లు పన్ను ఎగ్గొడుతున్నారు. నకిలీ వ్యవసాయ దారులు నిరాటంకంగా పంటల బీమా పథకంతో లబ్ధిపొందుతున్నారు. నిరంతరం దుమ్ము ధూళిలో పడిలేచి తమకష్టార్జితాన్ని కరువు పాలు చేసుకొన్నా పంటల బీమా పథకం తమకు వర్తించనందుకు కరువు రైతులు కుంగిపోతున్నారు. కోస్తా ప్రాంతాలలో తుపానులు సంభవించినప్పుడు ప్రభుత్వం వెంటనే స్పందించి వారిని అన్ని విధాలా ఆదుకొంటున్నది. ప్రతి సంవత్సరం కరువు వాతన పడే రాయలసీమ రైతాంగాన్ని ఆదుకోడానికి ప్రభుత్వం అంత శ్రద్ధ చూపడం లేదు. తుపాను బాధితులకు సదుపాయాలను సమకూర్చినట్లే కరువుబాధితులకు కూడా సౌకర్యాలను ఖచ్చితంగా

కల్పించాలి. 'ఎప్పుడూ వుండే కరువే గదా' అని కరువు సీమ ప్రజల పట్ల పాలకులు చూపుతున్న వివక్షను మానుకోవాలి. పంటల బీమా పథకాన్ని విధిగా అమలు చేయడం, వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు కల్పించడం, నకిలీ వ్యవసాయ దారులకు కల్పిస్తున్న రాయితీలను రద్దు చేయడం ప్రభుత్వం ముందున్న తక్షణ సమస్యలు.

ఇలా వుండగా కేంద్రంలో ఒక్కో ప్రభుత్వం ఏర్పడినప్పుడల్లా ఒక్కో విధంగా పంటల బీమా పథకాన్ని ప్రవేశ పెడుతున్నారు. డా. బలరాం జక్కర్, డా. ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, చతురానన్ మిశ్రా తదితరులు పంటలబీమా పథకం అమలుకు గ్రామ పంచాయితీని యూనిట్‌గా పరిగణించాలని, మండలాన్ని ఒక యూనిట్‌గా తీసుకోవాలని రకరకాలుగా అభిప్రాయపడ్డారు. చతురానన్ మిశ్రా కేంద్ర వ్యవసాయ మంత్రిగా వుండగా పంటల బీమా పథకం అమలు చేయడానికి ఫ్రంట్ ప్రభుత్వం కృతనిశ్చయంతో వుందని ప్రకటించారు. పథకం అమలు విధానంపై ఒక నిర్ణయానికి రాలేకపోయారు. గ్రామాన్ని యూనిట్‌గా తీసుకొని పంటల బీమా పథకాన్ని అమలు చేయాలని పదేండ్లకిందటే అప్పటి వ్యవసాయ మంత్రి రైతాంగానికి హామీ ఇచ్చారు. ***ఎప్పటికైనా గ్రామాన్ని ఒక యూనిట్‌గా తీసుకొని పంటలబీమా పథకాన్ని అమలు చేస్తేనే రైతులకు ఊరట కల్గుతుంది.*** ముఖ్యంగా రాయలసీమలోని కరువు ప్రాంత రైతాంగానికి పంటల బీమా పథకం వల్ల మేలు కలుగుతుంది. కనుక కరువు సీమ కర్షకులు తమ ప్రాంత ప్రజా ప్రతినిధులను నిలదీయాలి. పంటల బీమా పథకాన్ని వెంటనే అమలు చేయడానికి కేంద్ర ప్రభుత్వంపై వత్తిడి పెరిగేందుకు ఆందోళనలు నిర్వహించాలి. పంటల బీమా పథకం అవసరాన్ని రైతు సంఘాలు రైతాంగానికి తెలియచెప్పి, రైతులు ఆందోళనలో పాల్గొనేటట్టు చేయాలి. మన రాష్ట్రంలో మండలాన్ని ఒక యూనిట్‌గా పరిగణిస్తున్నారు. జిల్లాను యూనిట్‌గా తీసుకొన్న రాష్ట్రాలూ వున్నాయి. గ్రామాన్ని గాక రెవిన్యూ మండలాన్నో, జిల్లానో ప్రాతిపదికగా తీసుకొంటే విస్తృత ప్రాంతంలో పంటకు అపారంగా నష్టం వాటిల్లితే తప్ప రైతుకు సాయం లభించదు. ఈ మెలిక వల్లనే ప్రకృతి భీభత్సాల్లో సర్వం కోల్పోయినా సహాయానికి నోచుకోని వ్యవసాయ కుటుంబాలు అనేకం వున్నాయి. ఖరీఫ్‌లో పదహారు, రబీలో పది పంటలకే బీమా పథకం వర్తిస్తున్నది. ప్రాథమిక వ్యవసాయ సహకారసంఘాలు, బ్యాంకుల నుంచి పంటరుణాలు తీసుకొన్న వారికే బీమాపథకం వర్తిస్తున్నది. బంగారు, భూములను, ఇండ్లను కుదువపెట్టి రుణాలు పొందినవారు, వాణిజ్య పంటలు సాగు చేస్తున్నావారు, పండ్లతోటల రైతుల పని గాలిలో దీపమే! అహేతుకనిబంధనలను ప్రత్యక్షరం పాటిస్తున్నా పూర్తి సాయం అందడం లేదు. ఒక్కో రైతుకు పదివేల రూపాయల రుణానికి మించకుండా నష్టపరిహారాన్ని బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేస్తున్నారు. రుణంలో కొంత భాగంగానో, వడ్డీగానో చెల్లి పోవడమే తప్ప రైతుల చేతికందేది వుండదు. ఇప్పటి పథకంలోని లోటుపాట్లేవి చొరబడకుండా జాగ్రత్త పడితేనే ఆహారధాన్యాల అధికోత్పత్తి, ఎగుమతుల ద్వారా దేశ రుణ భారం తగ్గించుకోవచ్చునన్న నిజాన్ని పాలకులు గ్రహించాలి.

పంటలబీమా పథకం అమలు కాకపోతే రైతులు దారుణంగా దెబ్బతింటారు. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు ఈ వాస్తవాన్ని గుర్తించక పోవడం గర్హనీయం. పంటల బీమా పథకాన్ని అమలు చేయడానికి మొదట (1995లో) పంతొమ్మిది రాష్ట్రాలు, నాలుగు కేంద్ర పాలిత ప్రాంతాలు మాత్రమే

ఆసక్తి చూపాయి. అది కూడా కొన్ని సీజన్లకు, కొన్ని పంటలకి మాత్రమే. రైతుల ప్రయోజనాల పట్ల ప్రభుత్వాల నిర్లక్ష్యానికి ఇది చక్కటి ఉదాహరణ. పంటల బీమా పథకం సమగ్రం కావాలన్నా, రైతు జనామోదం పొందాలన్నా దేశవ్యాప్తంగా సన్న చిన్నకారు రైతులందరికీ విధిగా వర్తింపజేయడమే శరణ్యం. ప్రస్తుత స్థితిగతులను బట్టి రైతుల నుంచి వసూలయ్యే ప్రీమియం రూ. 305 కోట్లు, క్లెయిములపైచెల్లించాల్సిన నష్టపరిహారం నాలుగు వేల కోట్లనే అంచనాలున్నాయి. ప్రీమియం సొమ్ము పోను నష్టపరిహారం భారాన్ని రాష్ట్రాలు, కేంద్రం 1 : 2 నిష్పత్తిలో భరిస్తే కేంద్రం తన వాటాగా రూ. 2463 కోట్లు యివ్వాలి. బడ్జెట్లో కేటాయిస్తున్నది చాలా తక్కువ. దీనిని బట్టి ప్రభుత్వ చిత్త శుద్ధిని అర్థం చేసుకోవచ్చు.

కాగా మన రాష్ట్రంలో 1985 నుంచి 96.49 లక్షల మంది రైతులు బీమా పథకంలో చేరారు. అందులో 19 లక్షల మంది రైతులకు మాత్రమే సాయం అందింది. బీమాపథకం ఏవిధంగా అమలవుతున్నదో తెలుసుకోవచ్చు. నిబంధనల బంధనాల్లో నలుగుతున్న పంటల బీమా పథకానికి విముక్తి కలిగించి రైతులకు ప్రయోజనం చేకూర్చడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే చర్యలు తీసుకోవాలి.

కాగా సమగ్ర పంటల బీమా పథకాన్ని రైతులందరికీ వర్తించే విధంగా అమలు చేస్తామని ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పాయ్ 1999 జూన్‌లో ప్రకటించారు.



అత్యంత ఆధునిక వైద్య సహాయాన్ని ఉచితంగా అందించే
శ్రీసత్యసాయి సూపర్ స్పెషాలిటీస్ ఆసుపత్రి - పుట్టపర్తి

మానవతా వాదులంతా ముందుకు రండి

రాయలసీమలో నెలకొన్న కరువు, ముఠాకొట్లాటలు అభివృద్ధికి అడ్డు గోడలుగా నిలిచాయి. అభివృద్ధి పట్ల పాలకుల్లో నిర్లక్ష్యం, ప్రజల్లో నిరుత్సాహం వుంది. ప్రజలు చైతన్యవంతులై ప్రజా ప్రతినిధులతో, స్వచ్ఛంద సంస్థలతో సరిగా పనిచేయిస్తే 'సీమ' అభివృద్ధి దిశగా పయనిస్తుంది. ఎం.పి., ఎమ్మెల్యేల నియోజక వర్గ నిధులు, రాజ్యసభ సభ్యుల కోటా నిధుల్లో తొంభై శాతం గ్రామీణాభివృద్ధికి, ముఖ్యంగా నీటి పథకాలకు ఖర్చు పెడితే సీమలో పచ్చదనం పెరుగుతుంది. అనంతపురం, కర్నూలు, కడప, చిత్తూరు జిల్లాల్లో కోట్ల రూపాయలు సంపాదించిన వారు వందలాది మంది వున్నారు వారిలో వంద కోట్లు మించిన వారూ వున్నారు. కోటీశ్వరులు తాము పుట్టిన గ్రామం, పరిసరాల్లోని ఒకటి రెండు గ్రామాలను దత్తత తీసుకొని అభివృద్ధి కార్యక్రమాలు చేపడితే గ్రామ రూపురేఖలు మారుతాయి. అదే విధంగా వెనుకబడిన 'సీమ'కు చెందిన సినీ పరిశ్రమవారు, విదేశాల్లో నివసిస్తున్న సీమవాసులు స్పందించాలి. రాయలసీమ లోని శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం (తిరుపతి), శ్రీ క్రిష్ణదేవరాయ విశ్వవిద్యాలయం (అనంతపురం) గ్రామాలను దత్తత చేసుకొని గ్రామీణాభివృద్ధికి పాటుపడాలి. తిరుపతిలోని తిరుమల-తిరుపతి దేవస్థానాల ధర్మకర్తల మండలి, పుట్టపర్తిలోని శ్రీ సత్యసాయి ట్రస్ట్, సేవలు అందరికీ ఆదర్శం కావాలి. శ్రీ సత్యసాయి ట్రస్ట్ పలు సేవా కార్యక్రమాలు చేపట్టింది. పుట్టపర్తి, అనంతపురం, బెంగుళూరు, చిక్‌బళ్ళాపురం వద్ద గల ముద్దేన హళ్ళి (ప్రపంచ ప్రఖ్యాత ఇంజనీర్ 'సర్' మోక్షగుండం విశ్వేశ్వరయ్య స్వస్థలం), తమిళనాడులో పాఠశాలలను, కళాశాలలను శ్రీ సత్య సాయి ట్రస్ట్ నిర్వహిస్తున్నది. అనంతపురంలో మహిళల కోసం ప్రత్యేకంగా కళాశాలను స్థాపించిన ఘనత సత్యసాయి ట్రస్ట్‌కే దక్కింది. విద్యాలయాల నిర్వహణకు శ్రీ సత్యసాయి ట్రస్ట్ ప్రతి సంవత్సరం సుమారు రూ. 20 కోట్లు ఖర్చు చేస్తున్నది. తి.తి.దే. యాజమాన్యం సైతం విద్యాలయాల నిర్వహణకు యేటా పది కోట్లకు పైగానే ఖర్చు చేస్తున్నది. తి.తి.దే. ఆధ్వర్యంలోని బాలాజీ వికలాంగుల ఆస్పత్రి (బర్డ్) దేశంలోనే పేరు గాంచింది. అప్పటి రాష్ట్రపతి ఆర్. వెంకటరామన్ చేతుల మీదుగా పుట్టపర్తిలో ప్రారంభమైన శ్రీ సత్యసాయి సూపర్ స్పెషాలిటీస్ ఆసుపత్రి అద్భుతమైన వైద్య సేవలను అందిస్తున్నది. సూపర్ స్పెషాలిటీస్ ఆసుపత్రి కోసం ట్రస్ట్ రూ. 125 కోట్లు ఖర్చు పెట్టింది. గుండె, ఊపిరితిత్తులు, మూత్రపిండాలు తదితర అవయవాల చికిత్సకు అధునాతన వైద్య సదుపాయాలను రోగులందరికీ ఉచితంగా కల్పిస్తున్నారు...

యలసీమ జిల్లాల్లో తాగునీటి కొరతను శాశ్వతంగా నివారించాలని సత్యసాయి ట్రస్ట్ ంచింది. అందులో భాగంగా అనంతపురం జిల్లాలో సుమారు వెయ్యి గ్రామాల్లో సత్యసాయి టి పథకం అమలులో వుంది. అందుకు గాను ట్రస్ట్ రూ. 300 కోట్లు ఖర్చు చేసింది. ప్రస్తుతం నీటి పథకం చిత్తూరు జిల్లా లోని 950 గ్రామాల్లో రూపుదిద్దు కొంటున్నది. తిరుమల-తిరుపతి నాల యాజమాన్యం, శ్రీ సత్యసాయి ట్రస్ట్, సేవా స్ఫూర్తితో 'సీమ'లోని పారిశ్రామిక వేత్తలు ాభివృద్ధికి పాటుపడాలి. కాగా సత్యసాయి నీటి పథకాల మొత్తం ఖర్చు రూ.350 కోట్లకు ే వుంది. అదే ఖర్చుతో ఒక పెద్ద రిజర్వాయర్‌ను నిర్మించి వ్యవసాయానికి, ప్రజల దైనందిన రాలకు నీటిని నిరంతరంగా సరఫరా చేసి వుండవచ్చు. స్వర్గీయ ఎన్టీరామారావు ప్రకటించిన ్రీ - నీవా పథకానికి సత్యసాయి ట్రస్ట్ నిధులిస్తే ఆ పథకానికి బాబా పేరు పెడతామని అప్పటి క మంత్రి పరిటాల రవి అర్థించారు. అయితే ట్రస్ట్ ఆ అభ్యర్థనను పట్టించుకోలేదు. సత్యసాయి నిధులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మ్యాచింగ్ గ్రాంట్‌ను విడుదలచేసి వుంటే హంద్రీ-నీవా కం పూర్తయి వుండేది.

ఒక వేళ సాయి పథకాలు కడప, కర్నూలు జిల్లాల్లో ప్రారంభించ దలిస్తే భూగర్భ జలాలను తోడడానికి లు రిజర్వాయర్ల నిర్మాణం చేపట్టడం మంచిది. రిజర్వాయర్ల ద్వారా చెరువులకు నీటిని మళ్ళించి వసాయానికి వాడవచ్చు. చెరువుల్లో నీరు నిలువ వున్నందున చుట్టు పట్ల నీటి మట్టం బాగా రుగుతుంది. ఇప్పటికైనా మానవతావాదులంతా ముందుకు వచ్చి ఎడారి దిశగా పయనిస్తున్న యలసీమను సస్యశ్యామలం చేయాలి.

కాగా రాయలసీమకు చెందిన ముఠానాయకులు కొందరు తమ పెట్టుబడులను హైదరాబాద్, జయవాడ, బెంగుళూరు, మద్రాసు నగరాల్లో పెట్టి ఆస్తులను బాగా పెంచుకొంటున్నారు. తమ రుగుదలకు ప్రథమ మెట్టు అయిన స్వస్థలాల అభివృద్ధిని విస్మరించడం బాధాకరం. అటువంటి రికి ప్రజలే బుద్ధి చెప్పాలి.

గొంతెండిన సీమకు జలధారను ప్రసాదించిన
భగవాన్ శ్రీసత్యసాయి బాబా

ఉపగ్రహాలతో ఉత్పత్తుల పెంపుదల

భారత వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయడంలో భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ప్రముఖ పాత్ర పోషిస్తున్నది. కేరళలోని కొబ్బరి చెట్లకు వచ్చిన తెగులును కనుక్కోవడానికి 1960వ దశకంలో విమానాలు వాడారు. కానీ. నేడు రిమోట్ సెన్సింగ్ శాటిలైట్ (ఐ.ఆర్.ఎస్)లను వినియోగిస్తున్నారు. ప్రధాన పంటలైన వరి, గోధుమ, నూనెవిత్తులు తదితరాలకు వచ్చే తెగుళ్ళను కనుగొని, ఆయా ప్రాంతాలను గుర్తించి వ్యవసాయ శాఖకు సూచనలిస్తున్నారు. కరువు పరిస్థితులను గుర్తించి హెచ్చరిస్తున్నారు. కరువు స్థితిగతులకు అనుకూలంగా పంటల విధానాన్ని అమలు చేయమని సలహాలిస్తున్నారు. అడవుల తగ్గుదలను నిరుపయోగ భూమిని గుర్తించి అటవీశాఖకు తెలుపుతున్నారు. వాటర్‌షెడ్ పథకాలు చేపట్టవలసిన ప్రాంతాలను గుర్తిస్తున్నారు. ఆ చర్యల ద్వారా వ్యవసాయ ఉత్పత్తులు గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. వ్యవసాయ శాఖ ఉపగ్రహాల సూచనలను ఖచ్చితంగా అమలు చేస్తే ముందు ముందు వ్యవసాయ రంగం మరింతగా అభివృద్ధి చెందుతుంది. వ్యవసాయ అభివృద్ధికి ఐ.ఆర్.ఎస్. అద్భుత సేవలను అందిస్తున్నది. అంతేకాక భూగర్భ జల వనరులు. ఖనిజ సంపద. సముద్ర నిక్షేపాలపై కూడా ఐ.ఆర్.ఎస్. పరిశోధనలు చేస్తున్నది. రాయలసీమ లాంటి కరువు ప్రాంతాలకు ఉపగ్రహ సేవలు వరమే. సమగ్రాభివృద్ధి కోసం ఇన్‌టిగ్రేటెడ్ మిషన్ ఫర్ సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ (ఐ.ఎం.ఎస్.డి) అనే పథకాన్ని ఐ.ఆర్.ఎస్. ద్వారా అమలు చేస్తున్నారు.

సాంఘిక, ఆర్థిక అభివృద్ధి సాధించడానికి వివిధ అంశాలపై ఐ.ఆర్.ఎస్. కొన్ని వివరాలను సేకరిస్తున్నది. ఆవిధంగా సేకరించిన డేటాను జిల్లాస్థాయి అధికారులకు, స్వచ్ఛంద సంస్థలకు అందించడం జరుగుతున్నది. ఐ.ఎం.ఎస్.డి. కార్యాచరణను అమలు చేసే బాధ్యత వారిదే. కేంద్ర గ్రామీణాభివృద్ధి ఉపాధి మంత్రిత్వ శాఖ అభ్యర్థన మేరకు ఐఎంఎస్‌డిని కొన్ని జిల్లాల్లో అమలుపరుస్తున్నారు. ఆ అభివృద్ధి పథకాలకు కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయిస్తున్నది. కొన్ని చోట్ల ఇప్పటికే మంచి ఫలితాలు సాధించారు. అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం సమీపంలోని వంజు వంక రైతులు సంవత్సరానికి రెండు పంటలు పండిస్తున్నారు. వారి సాంఘిక, ఆర్థిక స్థితిలో ఎంతోమార్పు వచ్చింది. వంజువంక ప్రాంతం గతంలో చాలా వెనుకబడి వుండేది. దేశవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో ఐ.ఎం.ఎస్.డి. పథకాన్ని ఆచరిస్తే ఎంతో అభివృద్ధి సాధించవచ్చు.

ఇలా ఉండగా ఇన్‌శాట్ - 2 సి లోని ప్రత్యేక ఛానల్‌లను వుపయోగించి గ్రామీణ ప్రాంతాల్లో అక్షరాస్యతా కార్యక్రమాలు, వైద్య, ఆరోగ్య పథకాలను దూరదర్శన్‌లో ప్రసారం చేస్తున్నారు. ఆ సేవలు ప్రస్తుతం మధ్యప్రదేశ్‌లో గల ఝాబువా జిల్లాలోని 150 గ్రామాల ప్రజలకు అందుబాటులో వున్నాయి. ఝాబువా డెవలప్‌మెంట్ కమ్యూనికేషన్స్ ప్రాజెక్టు (జెడిసిసి) పేరిట 150 టెలివిజన్ సెట్ల ద్వారా వాటర్‌షెడ్ మేనేజ్‌మెంట్, విద్య, వ్యవసాయం, ఆరోగ్యం,పంచాయతీరాజ్ తదితర అంశాలను నేరుగా ప్రసారం చేస్తున్నారు. వాటివల్ల గ్రామవికాసం జరుగుతుంది. జె.డి.సి.సి. తరహా పథకాన్ని దేశంలోని వివిధ ప్రాంతాలకు విస్తరించడంద్వారా ప్రజలను చైతన్యవంతులను చేయవచ్చు.

కాగా దేశంలో కరువు బారిన పడుతున్న 158 జిల్లాల్లో ఐ.ఆర్.ఎస్ సర్వే జరుపుతున్నది. వాటిలో ఆరు జిల్లాల్లో ప్రత్యేక సర్వేను నిర్వహిస్తున్నారు. ప్రత్యేక సర్వేలో వున్న ఆరు జిల్లాల్లో రాయలసీమ లోని అనంతపురం జిల్లా వుంది. మిగతా ఐదు జిల్లాలు తమిళనాడు లోని ధర్మపురి, ఒరిస్సాలోని కలహండి, మహారాష్ట్రలోని జంగు, హర్యానాలోని భివాండి, మధ్యప్రదేశ్‌లోని అహమ్మద్ నగర్. ఆయా జిల్లాల అధికారులు 'ఇస్రో' సూచనలు బాగా పాటిస్తే ఆశించిన రీతిలో అభివృద్ధి జరుగుతుంది.



రైతు ఉపకారి - ఐ.ఆర్.ఎస్.

సీమ నీటిని మింగుతున్న కర్నాటక

రాయలసీమ జిల్లాల్లో పారుతున్న నదీపరీవాహక ప్రాంతాలు ఎక్కువ భాగం కర్నాటక రాష్ట్రంలో వుండడం వల్ల సీమ రైతాంగానికి తీరని నష్టం జరుగుతున్నది. క్రిష్ణా, తుంగభద్ర, పెన్నా, చిత్రావతి, హగరి, పాపాఘ్ని తదితర నదుల నుంచి న్యాయంగా పొందవలసిన వాటా నీటిని రాయలసీమ పొందడం లేదు. ఆ నదుల ఎగువ భాగంలో కర్నాటక ప్రభుత్వం వీలైనన్ని చోట్ల భారీ, మధ్యతరహా, చిన్న నీటి ప్రాజెక్టులు, చెక్ డ్యామ్‌లు నిర్మించినందున దిగువ ప్రాంతానికి రావలసినంత నీరు రావడం లేదు. క్రిష్ణా నదిపై గతంలో పలు ప్రాజెక్టులు నిర్మించిన కర్నాటక తాజాగా ఆల్మట్టి రిజర్వాయర్ ఎత్తుపెంచి 'సీమ'కు ద్రోహం చేసింది. బచావత్ అవార్డు ద్వారా తమకు కేటాయించిన 500 టి.ఎం.సి.ల నీటి కంటే ఎక్కువగా క్రిష్ణా నీటిని వాడుకోవడానికి వీలుగా ప్రాజెక్టులను నిర్మించడం జరిగింది. భవిష్యత్తులో క్రిష్ణ నీటివాటా రాయలసీమ ఖచ్చితంగా వినియోగించుకోగలదన్న నమ్మకం లేదు. అదేవిధంగా తుంగభద్ర నదీ పరీవాహక ప్రాంతంలో ఎక్కువ ప్రాజెక్టులను కర్నాటక నిర్మించింది. తుంగభద్ర నది ఎగువన అప్పర్ తుంగ ప్రాజెక్టును గతంలో నిర్మించగా ప్రస్తుతం మరో కొత్త ప్రాజెక్టు నిర్మాణాన్ని యిటీవలే కర్నాటక ప్రభుత్వం ప్రారంభించింది. తుంగభద్ర ప్రాజెక్టు నుంచి రాయలసీమకు హక్కుగా సంక్రమించిన 140 టి. ఎం.సి. ల నీటిని సైతం వాడుకోనివ్వకుండా చేస్తున్నారు. వాస్తవానికి తుంగభద్రలో 480 శ.కో.ఘ.అ. నీరు లభ్యమవుతున్నది. అందులో సీమకు 140 టి.ఎం.సి.లు కేటాయించారు. కర్నూలు - కడప (కె.సి.) కెనాల్‌కు 39.9 టి.ఎం.సి.లు, తుంగభద్ర ఎగువ కాలువకు 32.5 టి.ఎం.సి.లు, దిగువ కాలువకు 29.5 టి.ఎం.సి.లు, గాజులదిన్నె. భైరవాని తిప్ప వంటి చిన్న రిజర్వాయర్లకు 21 టి.ఎం.సి.లు, రాజోలిబండ పథకానికి 16 శ.కో.ఘ. అ. నీటిని తుంగభద్ర ప్రాజెక్టు నుంచి మళ్ళించారు. తుంగభద్ర ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయడంలో కర్నాటక ఎప్పుడూ జాప్యం చేస్తూ వుంటుంది. నీటివాటాలో కోత విధిస్తూ ఎక్కువ నీటిని కర్నాటకకే వినియోగిస్తూ వుంటుంది. నీటి విడుదలలో జాప్యం చేసినప్పుడల్లా రైతాంగం తీవ్ర ఆందోళనకు గురికావడం, మన ముఖ్యమంత్రి కర్నాటక ముఖ్యమంత్రితో మాట్లాడి నీటిని విడుదల చేయించడం ఆనవాయితీగా మారింది. రెండు రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులున్న తుంగభద్ర ప్రాజెక్టు పాలక మండలి తీర్మానాలను, ఆదేశాలను కర్నాటక ప్రభుత్వం ఖాతరు చయడం లేదు. తుంగభద్ర నీటిలో కోత విధించడం వల్ల ముందు ముందు సుంకేశుల రిజర్వాయర్ కింద గల ఆయకట్టుకు ప్రమాదం ఏర్పడనుంది. కర్నూలు

- కడప కాలువ సుంకేశుల ఆనకట్ట వద్ద ప్రారంభమవుతుంది. తుంగభద్ర ఎగువ కాలువ రెండో దశ నిర్మాణంలో బాగా ఆలస్యమైనందున మన వాటా నీటిని పూర్తిగా వాడుకోలేక పోతున్నాం. తుంగభద్ర ఎగువ కాలువకు సమాంతరంగా మరో కాలువను తవ్వి అనంతపురం జిల్లా దక్షిణ భాగాన్ని సస్యశ్యామలం చేస్తామని అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీరామారావు 1985లో ప్రకటించారు. కర్నాటక ప్రభుత్వంతో చర్చలు కూడా జరిపారు. అదిగో.. యిదిగో అంటూ సమాంతర కాలువపై ప్రకటనలు గుప్పించిన నాటి ఎన్టీఆర్ ప్రభుత్వం, తర్వాత వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పథకం అమలులో శ్రద్ధ వహించలేదు. పైగా కర్నూలు - కడప తుంగభద్ర నీటిని సమాంతర కాలువకు మళ్ళించి, కె.సి. కాలువకు క్రిష్ణ నీటిని పంపుతామని చేసిన ఎన్టీఆర్ ప్రకటనకు కడప జిల్లా నాయకులు తీవ్ర అభ్యంతరం తెలిపారు.

ఇదిలావుండగా సుమారు ఆరువేల ఎకరాలకు నీటి వసతి కల్పించడం కోసం అనంతపురం జిల్లా హిందూపురం వద్ద పెన్నార్ - కుముద్వతి రిజర్వాయర్‌ను 1952లో నిర్మించారు. ఆ రిజర్వాయర్‌కు నీటిని చేరవేసే నదికి ఎగువ భాగాన కర్నాటకలో జయమంగళం సమీపాన చెక్‌డ్యామ్‌లు నిర్మించడంతో పెన్నార్ - కుముద్వతి నిరుపయోగమయింది. పెన్నానది పరీవాహక ప్రాంతంలో పలుచోట్ల చెక్‌డ్యామ్‌లు. చెరువులకు నీటి మళ్ళింపు వంటి వాటితో పెన్నలో నీరు ఎక్కువగా పారడం లేదు. క్రిష్ణ. తుంగభద్ర. పెన్నా నదుల నీటిని మింగినట్టే చిత్రావతి నీటిని సైతం కింది ప్రాంతానికి వదలకుండా తానే వినియోగించుకోవడానికి తాజాగా కర్నాటక మరో నిర్మాణాన్ని చేపట్టింది. అనంతపురం జిల్లా గోరంట్లకు 35 కి.మీ. దూరంలోని కర్నాటక గ్రామమైన పరగోడు వద్ద చిత్రావతికి అడ్డంగా పదికోట్ల రూ.లతో ప్రాజెక్టు నిర్మాణం యిటీవలే ప్రారంభమయింది. పరగోడు ప్రాజెక్టు పూర్తయితే అనంతపురం జిల్లా కొడికొండ. గోరంట్ల, కొత్తచెరువు, బుక్కపట్నం, ధర్మవరం తదితర ప్రాంత రైతులు దారుణంగా దెబ్బతింటారు. కోట్ల రూ.ల ఖర్చుతో నిర్మించిన చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, చారిత్రాత్మకమైన బుక్కపట్నం చెరువులకు నీరు వచ్చే అవకాశం వుండదు. వేలాది ఎకరాలు బీడుభూములుగా మారుతాయి. చిత్రావతి నదికి అడ్డంగా కర్నాటక అక్రమంగా నిర్మిస్తున్న పరగోడు రిజర్వాయర్‌పై అనంత రైతాంగం ఆందోళన చేసింది. నిర్మాణాన్ని వెంటనే ఆపాలని కోరుతూ రైతులు ధర్నాలు, రాస్తారోకోలు చేశారు.

రాయలసీమకు హక్కుగా దక్కిన నీటిని అక్రమంగా మింగుతున్న కర్నాటకను అడ్డుకోవడానికి రైతాంగం సన్నద్ధం కావాలి. లేకుంటే సీమ రైతులు తీవ్రంగా నష్టపోతారు.

చెరువులపై చిన్నచూపు తగదు

చెరువు గ్రామీణ జీవన వికాసంలో అత్యంత ముఖ్యమైనది. చెరువుల వల్ల ఎన్నో ప్రయోజనాలున్నాయి. చెరువులకు వేల యేండ్ల చరిత్ర వుంది. వేదకాలంలోనే చెరువుల నిర్మాణాలు జరిగాయని నీటిపారుదల రంగానికి చెందిన సుప్రసిద్ధ మేధావి, ఇంజనీర్ డా. కె. శ్రీరామక్రిష్ణయ్య రాశారు. రాయలసీమ చెరువులకు పెట్టింది పేరు. రాయలసీమను పాలించిన ఎందరో రాజులు వేలాది చెరువులను కట్టించారు. కేవలం సేద్యానికే గాక, నీటిని నిల్వ చేయడం ద్వారా చుట్టు పట్ల బావుల్లో నీటి వూటను పెంచడానికి చెరువులు కట్టించిన సంఘటనలున్నాయి. అనంతపురం జిల్లా గోరంట్ల మండలం మేరెడ్డిపల్లి చెరువు కింద సాగుభూమి లేదు. ప్రజల నిత్యావసరాలకు. భూగర్భజల మట్టం పెంచడానికి మాత్రమే మేరెడ్డిపల్లి చెరువును కట్టించారు. విజయనగర రాజు హరిహరరాయల కుమారుడు బుక్కరాయల ఆధ్వర్యంలో మేరెడ్డిపల్లి నాయకుడు తొలి దేదిరాజు కుమారుడు పెదబైరరాజు ఆ చెరువును క్రీ.శ. 1383లో నిర్మించినట్టు ఒక శిలా శాసనం వుంది. పల్లవులు, చాళుక్యులు, చోళులు, కాకతీయులు, విజయనగర రాజులు తదితరులు రాయలసీమలో వేలాది చెరువులను కట్టించారు. అయితే విజయనగర రాజుల కాలంలో మాత్రమే ఎక్కువ చెరువులను నిర్మించడం జరిగింది. సీమలో పలుచోట్ల 'రాయల చెరువు' అనే మాట వినిపిస్తుంది. కారణం విజయనగర రాజులు వ్యవసాయాభివృద్ధికి చెరువుల ద్వారా రాచబాటను నిర్మించడమే. తొలుత చెరువును కట్టిస్తే... ఆ చెరువు ఆధారంగా గ్రామాలు వెలసినట్టు ఆధారాలున్నాయి. తుంగభద్ర పై ఆనకట్టను శ్రీ క్రిష్ణదేవరాయలు 1521లోనే కట్టించాడు.

చరిత్రలోనే కాదు... నేడు కూడా చెరువు బహుళ ప్రయోజనకారి. ఆహారధాన్యాల ఉత్పత్తి, తాగు నీటి వసతి, పశుగ్రాసం, కట్టెల కొరత నివారణకు చెరువు వుపయోగపడుతున్నది. గ్రామీణ ప్రాంతాల్లో కొన్ని ఉత్సవాలు చెరువు సంస్కృతి పై ఆధారపడి జరుగుతున్నాయి. చెరువు కట్టపై గంగమ్మ గుడి కట్టించడం, పొలి, బలి, జాతరలు చేయడం వంటి వాటితో గ్రామస్థులంతా ఒకచోట కలవడానికి చెరువు ఒక సమావేశ స్థలం అయింది. గ్రామస్థుల సంఘీభావానికి చెరువు నిదర్శనగా నిల్చింది. చెరువు నీటిని గ్రామ రైతులంతా సమానంగా వంతులవారీగా వాడుకోవడానికి నీరుగంటి వ్యవస్థ ఎంతగానో వుపయోగ పడింది. నేటి ఆధునిక సాగునీటి సంఘాలే... ఆనాటి నీరుగంటి వ్యవస్థ.

రాయలసీమలోని చెరువుల కింద ఒకప్పుడు సుమారు నాలుగు లక్షల ఎకరాలు సాగయ్యేది. ప్రస్తుతం అందులో సగం కూడా సాగు కావడం లేదు. అనంతపురం జిల్లాలో దాదాపు 1500

చెరువులున్నాయి. కడప జిల్లాలో 1993 చెరువులు కలవు. అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో తరీ సేద్యం ఎక్కువగా చెరువులు, బావులకిందే ఉంది. "దత్త మండలాల్లో కొత్తగా కాలువలు, చెరువులు నిర్మించవలసిన పనిలేదు. ఉన్న వాటికి మరమ్మత్తులు చేసి వాటిని వినియోగించుకొంటే చాలు" అని అప్పటి దత్తమండలాల (రాయలసీమ జిల్లాలు) కలెక్టర్ సర్ థామస్ మన్రో 1801 లో చెప్పాడు. చెరువుల ప్రాధాన్యతను, వాటిని పరిరక్షించుకోవలసిన బాధ్యతను ప్రజలకు మన్రో వివరించాడు. చెరువుల ప్రాముఖ్యాన్ని నాటి పాలకులు గుర్తించారు. అయితే ప్రస్తుతం చెరువులు పలుచోట్ల ఆక్రమణలకు గురవుతున్నాయి. చెరువులు రాజకీయ నాయకులకు బాగా వుపయోగపడుతున్నాయి. చెరువుల్లో పేదల పేరిట గుడిసెలు వేయడం, తర్వాత ఇళ్ళ స్థలాల పట్టాలు పొందడం పరిపాటయింది. పట్టణాల దరిదాపుల్లోని వందలాది చెరువులు నివాస స్థలాలుగా మారాయి. తిరుపతి సమీపంలోని అవిలాల చెరువును అఖిలభారత కాంగ్రెస్ పార్టీ సమావేశాల కోసం 1991లో నాశనం చేశారు. గొల్లపల్లి చెరువు, తిరుచానూరు చెరువు ఆక్రమణలు కొన్ని ఉదాహరణలు మాత్రమే.

ప్రస్తుతం చెరువులు దయనీయ స్థితిలో వున్నాయి. శతాబ్దాల తరబడి పూడిక పేరుకు పోయింది. చెరువులకు నీళ్ళు చేరవేసే కాలువలు సైతం దుస్థితిలోనే వున్నాయి. చెరువుల్లోని పూడికను తొలగించి ఊట చెరువులుగా మారిస్తే రైతాంగానికి వూరట కలుగుతుంది.

ఇలావుండగా ఆహార ధాన్యాల ఉత్పత్తిలో, జనజీవన వికాసంలో అత్యంత ముఖ్యమైన చెరువులపై చిన్నచూపు తగదు. చెరువులను, కాలువలను కాపాడుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరి పై వుంది.



తెగిన చెరువు

వ్యయసాయాభివృద్ధే దేశాభివృద్ధి

శాస్త్ర - సాంకేతిక రంగాల్లో ఎంత అభివృద్ధి సాధించినా, మానవ మేధలో మనకు ఎవరూ సాటిలేరని పిలిపించుకొన్నా తినడానికి తిండి లేకుండా వుండలేము. వ్యవసాయాభివృద్ధి జరగకుండా దేశాభివృద్ధి సాధ్యం కాదు. మనదేశం వ్యవసాయ దేశం. వేలాది సం॥రాల నుంచి సంప్రదాయ పద్ధతుల్లోనే సేద్యం సాగుతున్నది. చారిత్రక ఆధారాలు లభ్యమైన 'సింధూలోయ నాగరికత' (క్రీ. పూ. 3 వేల సం॥) నాటికే ఆహార ధాన్యాలు నిలువ వుంచిన ఘనత మన దేశానికి దక్కింది. నేటి ఆధునిక యుగంలో వ్యవసాయం నిర్లక్ష్యానికి గురవుతున్నది. దేశానికి వెన్నెముక రైతన్న అని చెప్పే పాలకులు రైతు సంక్షేమం గురించి పట్టించుకోవడం లేదు. ఆహార ధాన్యాలు, కూరగాయలు, నూనెగింజలు, పాలు, పండ్లు ఉత్పత్తిలో గణనీయమైన అభివృద్ధి సాధించడంలో రైతాంగం కృషి ఎంతో వుంది. ఒకప్పుడు యాభై మిలియన్ టన్నుల ఆహార ధాన్యాలను పండిస్తుండగా నేడు 200 మిలియన్ టన్నుల ధాన్యాన్ని పండిస్తున్నారు. సేద్యానికి నీటి వసతి పెంచితే ఆహార ధాన్యాల ఉత్పత్తులు మరింతగా పెరుగుతాయి. వర్షాలు సరిగా కురవనందున, భూగర్భజలాలు తరిగి పోతున్నందున, జీవనదులు లేనందున రాయలసీమ సేద్యం వట్టిపోతున్నది. రాయలసీమ అన్ని విధాలా అభివృద్ధి చెందడానికి యీ సూచనలు పాటించాలి.

1. *రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి. ధర నిర్ణయంలో రైతులను భాగస్వాములను చేయాలి. ధర నిర్ణయానికి రైతులతో కూడిన కమిటీలను నియమించాలి. ధర నిర్ణయ హక్కుకై రైతాంగం ఉద్యమించాలి.*
2. *సమగ్ర పంటల బీమా పథకాన్ని విధిగా అమలు చేయాలి. చిన్న - సన్న కారు రైతులు చెల్లించవలసిన బీమా ప్రీమియం సొమ్మును ప్రభుత్వమే భరించాలి.*
3. *నీటి వనరులను కాపాడు కోవాలి.*
4. *గోదావరి - క్రిష్ణా నదులను కలపాలి.*
5. *సీమలోని నదులు, వాగులు, వంకలపై చిన్న చిన్న ఆనకట్టలు నిర్మించి కాలువల ద్వారా తరీ సేద్యం చేయాలి.*

6. చెరువులలోని పూడిక తీయాలి. చెరువు కట్టలకు మరమ్మత్తులు చేయాలి. తెగిన కట్టలను వెంటనే పునర్ నిర్మించాలి. చెరువులకు నీళ్ళు చేరవేసే కాలువల్లో పూడిక తీయాలి. చెరువులను, కాలువలను ఆక్రమణ దారుల నుంచి కాపాడాలి. నదుల నుంచి చెరువులకు నీళ్ళు మళ్ళించాలి.
7. పెండింగ్ లోని నీటి ప్రాజెక్టులన్నీ యుద్ధ ప్రాతిపదికన.పూర్తి చేయాలి.
8. అభివృద్ధి చెందిన కోస్తా ప్రాంతంలో ఒక పంటకు నీటిని సరఫరా చేయకుండా ఆ నీటిని సీమ పొలాలకు మళ్ళించాలి.
9. వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను సీమ పట్టణాల్లో నెలకొల్పాలి.
10. సీమలో లభిస్తున్న ముడిఖనిజాల ఆధారంగా పరిశ్రమలను స్థాపించాలి. ఎలక్ట్రానిక్ పరిశ్రమలను పెట్టాలి.
11. మల్బరీ (పట్టు) సాగును పెంచి, సిల్క్ దిగుమతిని నిరోధించాలి.
12. వ్యవసాయ ఉత్పత్తులకు మెరుగైన మార్కెటింగ్ సదుపాయం కల్పించాలి.
13. వ్యవసాయ పరిశోధనలు పరిశోధకులకు ఉపాధిగా మాత్రమే వుపయోగ పడకుండా రైతులకు ప్రయోజనం కలిగించే విధంగా రూపొందించాలి.
14. ప్రగతి రథాన్ని పల్లెల వైపు పరుగు తీయించి, పట్టణాలకు వలస పోతున్న గ్రామీణులను వారించాలి.
15. కృత్రిమ వర్షాలు కురిపించాలి.
16. రాయలసీమలో గ్రామీణ ప్రజలు ఆర్థిక వృద్ధి సాధించడానికి ప్రత్యేక పథకాలు అమలు చేయాలి.

కృత్రిమ వర్షాలు కురిపించండి

అత్యంత కరువు పరిస్థితులు ఏర్పడినప్పుడు కృత్రిమ పద్ధతుల ద్వారా వర్షాలను కురిపించి రైతాంగాన్ని ఆదుకోవచ్చు. కృత్రిమ వర్షాలను కురిపించడానికి రెండు రకాల పద్ధతులను అనుసరించవచ్చు. ఒకటి ఏరియల్ క్లౌడ్ సీడింగ్. అంటే విమానాల ద్వారా మేఘాలలోకి చల్లని గాలిని వదలడం. అవసరమైన రసాయనిక చర్యలు చేపట్టి వాన వచ్చేటట్టు చేయడం. ఇది ఎక్కువ ఖర్చుతో కూడుకొన్నది. రెండోది సిల్వర్ అయొడైడ్ ప్రయోగం. ఒక కుంపటిలో నిప్పులపై 35 గ్రా. సిల్వర్ అయొడైడ్‌ను వేస్తే దట్టమైన పొగ పైకి లేస్తుంది. ఆకాశం మబ్బులతో నిండివున్నప్పుడు సిల్వర్ అయొడైడ్ ప్రయోగం చేస్తే సిల్వర్ అయొడైడ్ పొగ మబ్బులతో కలిసి 10-15 కి.మీ. మధ్య దూరంలో వర్షం కురిసే అవకాశం వుంది. సిల్వర్ అయొడైడ్ ప్రయోగానికి అయ్యే ఖర్చు రెండు వేల రూ.లు మాత్రమే. కరువులు వచ్చినప్పుడు ప్రతి గ్రామ పంచాయితీలో సిల్వర్ అయొడైడ్ ప్రయోగాలు చేయడం ద్వారా కృత్రిమ వర్షాలు కురిపించవచ్చు. అయితే ప్రయోగాలు ఎత్తైన కొండ గుట్టలపై చేస్తే మంచి ఫలితాలు వస్తాయని శాస్త్రజ్ఞులు ప్రకటించారు. కనుక రాయలసీమ జిల్లాల కలెక్టర్లు సిల్వర్ అయొడైడ్ ప్రయోగాలపై దృష్టి సారిస్తే కరువు సీమ రైతాంగానికి మేలు చేసిన వారవుతారు. 1999 ఆగస్టు, సెప్టెంబర్‌లలో అనంతపురం జిల్లాలో కృత్రిమ వర్షప్రయోగాలు జరిగాయి. ఆశించిన ఫలితం కనిపించకపోయినా నిరాశ చెందకుండా పదే పదే ప్రయోగాలు చేయడం ద్వారా విజయం సాధించవచ్చు.



చిత్రావతి

‘సీమ’ను మరో ఇథియోపియాగా మార్చొద్దు

కరువు పరిస్థితులు, ప్రభుత్వ నిర్లక్ష్యం కొనసాగితే రాయలసీమ మరో ఇథియోపియాగా మారడానికి ఎంతో కాలం పట్టదు. అప్పుడు ఎన్ని పథకాలు చేపట్టినా చేతులు కాలాక ఆకులు పట్టుకొన్నట్టు అవుతుంది. ఆఫ్రికాలోని ఇథియోపియా ఒకప్పుడు ఆహారధాన్యాల సమృద్ధిలో అగ్రగామి. అవసరాలకు సరిపడి మిగులు సాధించింది. కష్టపడే రైతులు, సారవంతమైన నేల, చిక్కటి అటవీసంపద అక్కడి వ్యసాయాభివృద్ధికి దోహదపడ్డాయి. ధాన్యాగారంగా పేరుగాంచిన ఇథియోపియా మిగులు ధాన్యాన్ని యితర దేశాలకు ఎగుమతి చేసింది. అటువంటి దేశం కాలక్రమేణా కరువు కూపంలో కూరుకొని పోయింది. ప్రకృతి చిన్నచూపు, ప్రభుత్వ నిర్లక్ష్యం, అధికారుల్లో అంకిత భావం లోపించడం, ప్రపంచ బ్యాంకు ఆదేశించిన సంస్కరణలు ఇథియోపియాకు ఎన్నటికీ వీడని గ్రహణంగా మారాయి. ఆహారంలేక పశువులే కాదు... మనుషులూ చచ్చిపోతున్నారు. ఆహార ధాన్యాలను ఎగుమతి చేసిన దేశం నేడు అమెరికా నుంచి గోధుమల దిగుమతిలేనిదే పూట గడవని పరిస్థితి దాపురించింది. పాలపాడికోసం, బ్రెడ్ ముక్కకోసం పసిపాపలేగాక పెద్దలూ అలమటిస్తున్నారు. 1970 నుంచి శాశ్వతకరువుకు ఆలవాలమయింది ఇథియోపియా. అక్కడి ప్రజలకు ఎన్నిరకాల ఉపశమన చర్యలు చేసినా కోలుకొనే పరిస్థితి లేదు. ఇథియోపియా వ్యవసాయం అంతగా చెడిపోవడానికి కారణం కరువు మాత్రమే కాదు. పాలకుల అవకాశవాదం, ప్రపంచబ్యాంకు చేతిలో కీలు బొమ్మలుగా మారిన ప్రభుత్వాధినేతలు చేసిన వ్యవసాయ సంస్కరణలు, శాశ్వత కరువు నివారణ చర్యలు చేపట్టక పోవడం వంటివి పచ్చని పంట పొలాలను బీడుభూమిగా మార్చివేశాయి. రాయలసీమ సేద్యం కూడా అదే దిశలో పయనిస్తున్నది. కరువులు సంభవించినప్పుడు మొక్కుబడిగా ఏవోకొన్ని పథకాలు చేపట్టడం, శాశ్వత చర్యల గురించి ఆలోచించక పోవడం, ప్రపంచబ్యాంకు ఆదేశానుసారం వ్యవసాయ రంగానికి యిస్తున్న సబ్సిడీలను తగ్గించడం, తర్వాత రద్దుచేయడం, నీటి ప్రాజెక్టులను చేపట్టకపోవడం, నకిలీ వ్యసాయ దారుల (అగ్రోఫామ్స్)కు ప్రభుత్వం సకల సదుపాయాలు కల్పించడం, రైతులకు తక్కువ ధరలకు యిచ్చే విత్తనాలు, జిప్సమ్ వంటి ఎరువుల పంపిణీలో అవినీతి, కరువు సాయంలో నిర్లక్ష్యం తదితర కారణాలవల్ల ‘సీమ’ సేద్యం ఇథియోపియాను తలపిస్తున్నది. తాత్కాలిక నివారణా చర్యల వల్ల కరువు పోదని తేలిపోయింది. నీటివనరుల కల్పన ద్వారానే కరువు తీరుతుందన్నది నగ్నసత్యం. 1975లో సీమలో వరదలు సంభవించి జనజీవనాన్ని స్తంభింపచేశాయి. తర్వాత లెక్కలేనన్ని కరువులు వచ్చి రైతాంగాన్ని పీల్చి పిప్పి చేశాయి.

వరదలు వచ్చినప్పుడు ఆ నీటిని నిల్వచేయడానికి ప్రాజెక్టులు లేవు. కరువులు వస్తే... తాత్కాలిక చర్యలే. కరువు పై కరువు వచ్చి సీమ సేద్యాన్ని భూస్థాపితం చేస్తూంటే పాలకులు చేస్తున్నదేమిటి? మనసు వుంటే మార్గం వుండకపోదు. రాజస్థాన్‌లోని థార్ ఎడారిలో భాగమైన జైసల్మీర్ ప్రాంత అభివృద్ధి ఎలా జరిగిందో పాలకులు తెలుసుకోవాలి. దాదాపు 500 కి.మీ. కాలువ తవ్వి (ఇందిరాగాంధీ కెనాల్) జైసల్మీర్ ప్రాంతానికి సాగునీరు అందించారు. ఒకప్పటి ఎడారి నందనవనం అయింది. రాయలసీమలో కూడా జైసల్మీర్ తరహా అభివృద్ధి పథకాలను ఎందుకు చేపట్టకూడదని రైతాంగం ప్రశ్నిస్తున్నది. ‘సీమ’లో శాశ్వత కరువు నివారణా పథకాలను అమలు చేయకుంటే మరో ఇథియోపియాగా మారుతుందని నిస్సందేహంగా చెప్పవచ్చు. ప్రపంచ బ్యాంకు షరతుల మూలంగా సాగుతున్న సంస్కరణలు ‘సీమ’ సేద్యాన్ని దారుణంగా దెబ్బ తీస్తున్నాయని అభ్యుదయవాది, సాహితీ విమర్శకులు త్రిపురనేని మధుసూదనరావు అన్నారు. ‘సీమ’ వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేస్తే ఆకలి చావులు తప్పవని ఆయన హెచ్చరించారు.

సంస్కరణల పేరుతో సాగుతున్న ‘వ్యవసాయబలి’ని ఆపడానికి రైతు సంఘాలు పెద్ద ఎత్తున ఆందోళన చేయాలి. రైతులు ఏమాత్రం ఏమరుపాటుకు గురైనా రాయలసీమ ఖచ్చితంగా ఇథియోపియాగా మారుతుంది. ‘సీమ’ను మరో ఇథియోపియాగా మార్చొద్దని రైతులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

అవినీతి వ్యవసాయం

భారత గ్రామీణ ప్రాంతాల్లో పేదరిక నిర్మూలనా పథకాలు సరిగా అమలు చేయనందున పేదరికం బాగా పెరిగిందని ప్రపంచ బ్యాంకు పేదరిక నిర్మూలనా విభాగం తన తాజా నివేదికలో స్పష్టం చేసింది. అవిద్య, అవినీతి పేదరికం పెరగడానికి ప్రధానకారణాలని ఆ నివేదిక పేర్కొన్నది. తుపానులు, కరువులు వచ్చినపుఉడు రైతాంగానికి అందించే సహాయంలో సైతం అవినీతి వుందని ప్రపంచ బ్యాంకు నివేదిక తెలిపింది. విత్తనాలు, మందులు, ఎరువుల పంపిణీలో సంబంధిత అధికారులు అవినీతికి పాల్పడుతున్నారని రైతులు వివరించారని నివేదిక పేర్కొన్నది. వ్యవసాయం దెబ్బతినడంద్వారా గ్రామీణపేదలు నిరుపేదలవుతున్నారని నివేదికను రూపొందించిన అధికారులు చెప్పారు. అంటే వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేయడంద్వారా పేదరికాన్ని మనపాలకులే పెంచుతున్నారని స్పష్టంగా చెప్పవచ్చు. భారత వ్యవసాయ రంగానికి అవినీతి చీడపట్టి పంటలను, రైతాంగాన్ని నాశనం చేస్తున్నా పాలకులు సరైన చర్యలు తీసుకోకపోవడం శోచనీయం.

సీమ ఖనిజ సంపదపై ఐ.ఆర్.ఎస్. తీసిన అద్భుత చిత్రం

అధోగతిలో గ్రామీణ ఆర్థిక వృద్ధి

దేశానికి పట్టుగొమ్మలైన పల్లెలు బక్క చిక్కిపోయాయి. పట్టణ ప్రాంతాలు విపరీతంగా విస్తరిస్తున్నాయి. పల్లె - పట్టణ ప్రాంతాల అభివృద్ధిలో ఎంతో తేడా వుంది. ఐదేండ్లలో కనీసం మూడేండ్లు కరువు వుంటున్నందువల్ల రాయలసీమ గ్రామీణ ఆర్థిక వ్యవస్థ చిన్నా భిన్నమయింది. పి.వి. నరసింహారావు ప్రభుత్వం ప్రపంచ వాణిజ్య సంస్థ (W.T.O.) తో కుదుర్చుకొన్న ఒప్పందం మేరకు వ్యవసాయ ఉత్పత్తులు, ఉప ఉత్పత్తులు విదేశాల నుంచి ఇబ్బడి ముబ్బడిగా దిగుమతి అయ్యాయి. ఆ దిగుమతులు రాయలసీమ ఆర్థిక వృద్ధిని కోలుకోలేని విధంగా దెబ్బ తీశాయి. ఉదా: పామోలిన్ ఆయిల్ మలేషియా నుంచి వెల్లువలా వచ్చింది. ఐదు కాదు పది సం॥రాల్లో వినియోగించేటంత నూనె మన దేశానికి దిగుమతి అయింది. వేరు శెనగ ఉత్పత్తిలో అగ్రగామిగావున్న రాయలసీమ రైతులు పామోలిన్ ప్రవాహంలో కొట్టుకొని పోయారు. వేరు శెనగ పంటకు గిట్టుబాటు ధర లభించలేదు. వ్యవసాయ పెట్టుబడులు ఎంతో పెరిగాయి. అయితే2000 సం॥లో వేరు శెనగ కాయల మూట (42 కె.జి.లు) ధర 580 నుంచి 460 రూ. లకు పడిపోయింది. రాష్ట్ర ప్రభుత్వం వేరు శెనగ మద్దతుధర 480 రూ.లుగా నిర్ణయించినా మిల్లర్లు ఆ ధరకు కొనలేదు. మిగతా వ్యవసాయ ఉత్పత్తులకు కూడా గిట్టుబాటు ధరలు లేక రైతాంగం ఎంతో నష్టపోయింది. 2000 సం॥ ఖరీఫ్ సీజన్‌లో వేరు శెనగకు సోకిన కొత్తరకం వేరుపురుగు తెగులు, బీహార్ ఎర్ర గొంగళి పురుగు వల్ల ఉత్పత్తి బాగా తగ్గింది. అనంతపురం జిల్లాలో వేరుశనగ పంట తీవ్రంగా దెబ్బతినడంతో రైతులు ఆత్మ స్థయిర్యాన్ని కోల్పోయి ఆత్మహత్యలు చేసుకొన్నారు. ఎటువంటి ప్రయోగాలు చేయకుండా 'మోనో్క్రోటోఫాస్' పురుగు మందును రైతులకు ఉచితంగా పంపిణీ చేశారు. వేరుపురుగు తెగులుకు ఆ మందు పనిచేయలేదు. పంట సర్వనాశనం అయింది. అప్పులపై అప్పులు. దిక్కుతోచని అభాగ్యులు సుమారు 35 మంది రైతులు తమ నిండు ప్రాణాలను మోనోక్రోటోఫాస్ ద్వారా తామే బలితీసుకొన్నారు. స్వతంత్ర భారత చరిత్రలో రాయల సీమ రైతాంగం ఆకలి చావులకు గురయింది కానీ ఆత్మ స్థయిర్యాన్ని కోల్పోలేదు. అయితే అనంతపురం జిల్లా రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. సమస్యలు వచ్చినప్పుడు ఎదురు నిలబడి సాధించుకోవాలే తప్ప ఆత్మహత్య ఎంత మాత్రమూ పరిష్కారం కాదు.

ఇలా వుండగా రాయలసీమలోని కొన్ని పెత్తం దారీ కులాల కుటుంబాలు మినహా ప్రజల జీవన ప్రమాణాలు ఆశించిన స్థాయిలో పెరగలేదు. ఆర్థిక పరిస్థితి కుదుట పడితే జీవన ప్రమాణాలు ఖచ్చితంగా

పెరుగుతాయి. రైతు ఆర్థిక వృద్ధి అధః పాతాళానికి పోతూంటే వారి జీవన విధానం ఎంత దారుణంగా వుంటుందో ప్రత్యేకంగా చెప్పవలసిన పనిలేదు.

గ్రామీణ ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహకాలు, లబ్ధిదారులు పొందే రుణాలు దుర్వినియోగమవుతున్నాయి.

అనంతపురం లాంటి వెనుకబడిన జిల్లాల్లో పరిశ్రమలు స్థాపించే వారికి ప్రభుత్వం రుణాలు, సబ్సిడీలు ఇస్తున్నది. గుజరాత్, మహారాష్ట్రల నుంచి వచ్చి కరువు సీమలో ఫ్యాక్టరీలు పెడతారు. కొన్ని ప్రారంభమైన తర్వాత మూసివేస్తారు. మరికొన్ని ప్రారంభం గాకుండానూ మూత పడతాయి. ఫ్యాక్టరీ యజమానులు 'పొందవలసినవన్నీ' తీసుకొని వారి ప్రాంతానికి పోతారు. ఇంకా కొన్ని పరిశ్రమల్లో ఉత్పత్తి అంతా కాగితాలమీదే వస్తువులను ఎక్కడి నుంచో కొని వాటికి ఆయా ఫ్యాక్టరీల పేర్లు ముద్రించడం జరుగుతున్నది. ఆ విధంగా చేయడం వల్ల కరువు సీమ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు చాలా తగ్గిపోతున్నాయి. రైతులు తీసుకొనే రుణాల్లో కొన్ని దుర్వినియోగమవుతున్నాయి. తీసుకొన్న రుణాన్ని ఖచ్చితంగా అదే పథకానికి ఖర్చుపెట్టి ఆదాయం పొందవచ్చు. కానీ రుణం తీసుకొని తర్వాత చెల్లిస్తున్నారే గానీ పథకం అమలు చేయడం లేదు. ఉదా: పాడి ఆవులకు రుణాలు తీసుకొంటారు. ఇతరుల ఆవులు బ్యాంకు యాజమాన్యాలకు చూపించి రుణాలు పొందుతున్నారు. ఆ విషయం బ్యాంకు వారికీ తెలుసు. నిజంగా ఆవులను కొని పాలు ఉత్పత్తి చేసి అమ్మితే వారి ఆర్థిక స్థితి ఖచ్చితంగా మెరుగు పడుతుంది. ఆ విధంగా గ్రామీణ అభివృద్ధి పథకాలు దుర్వినియోగం అవుతూంటే ఆర్థిక అభివృద్ధి ఏ విధంగా జరుగుతుంది?

ప్రతి యేటా తగ్గుతున్న గ్రామీణ ఆర్థిక వృద్ధి పెరగడానికి గ్రామ పంచాయతీ వ్యవస్థను పటిష్టం చేయాలి. గ్రామీణాభివృద్ధి పథకాల అమలు, పర్యవేక్షణ, ఫలితాలను చూడడానికి గ్రామ పంచాయతీ యూనిట్‌గా ఒక అధికారిని నియమించాలి. ప్రతి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఒక కంప్యూటర్, టెలిఫోన్ నెలకొల్పి వాటిని జిల్లా కేంద్రం, హైదరాబాద్‌తో అనుసంధానం చేయాలి. సమాచార విప్లవం ప్రారంభం కావలసింది గ్రామ పంచాయితీ నుంచే. ఆధునిక సమాచార వ్యవస్థతో రాయలసీమ గ్రామీణ ఆర్థిక రంగాన్ని మెరుగు పరచవచ్చు. ప్రభుత్వ పథకాలు, రుణ సదుపాయాలు, రైతుల బకాయిలు, అభివృద్ధి కార్యక్రమాలు, వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ సౌకర్యాల వంటి సమాచారమంతా గ్రామ పంచాయితీలోని కంప్యూటర్‌లో నిక్షిప్తం చేయాలి. గ్రామ పంచాయితీ యూనిట్‌గా "ఆర్థిక అభివృద్ధి చైతన్య సదస్సు"లు నిర్వహించాలి. పంచాయితీ, వ్యవసాయం, రెవిన్యూశాఖల మధ్య సమన్వయం ఏర్పాటు చేసి వాటి పథకాలన్నీ గ్రామ పంచాయితీ అధికారి పర్యవేక్షణలో సాగేలా చూడాలి. గ్రామ పాలనకు పంచాయతీ సర్పంచ్, సభ్యులు, పాలనాధికారి (వి.ఎ.ఒ.) వున్నా ప్రజల భాగస్వామ్యం చాలా తక్కువగా వుంది. అభివృద్ధి అంతా సర్పంచ్ ఆదేశాల ప్రకారమే సాగుతున్నది. ఏక పక్ష అభివృద్ధి గాకుండా ప్రజా స్వామ్య బద్ధంగా సాగితే గ్రామీణాభివృద్ధి రూపు రేఖలు తప్పకుండా మారుతాయి.

ఈగా ఫ్యాక్షన్ రాజకీయాలు రాయలసీమ గ్రామీణ ఆర్థిక అభివృద్ధిని దెబ్బ తీస్తున్నాయి. ఒకరిద్దరు గ్రామ పెత్తందారుల స్వార్థాలకు మొత్తం గ్రామమంతా బలికావలసి వస్తున్నది. ఫ్యాక్షన్ ఘర్షణలు జరిగినప్పుడు గ్రామంలోని ఒక పక్షం వారు వూరు వదలి పారిపోవడం, పారిపోయినవారి ఇండ్లను దోపిడీ చేయడం, వ్యవసాయ మోటార్లను దొంగిలించడం, పచ్చని పంట పొలాలను ధ్వంసం చేయడం, చెట్లను నరికి వేయడం వంటి దుశ్చర్యలకు ఫ్యాక్షనిస్టులు పాల్పడుతున్నారు. ఆ విధంగా తీవ్ర ఆర్థిక నష్టాలకు గురికావడమే గాక కేసుల పరిష్కారమయ్యే వరకు కోర్టుల చుట్టూ తిరుగుతూ లక్షలాది రూ.లు ఖర్చు చేయాలి. గ్రామ పంచాయితీ కార్యాలయాన్ని ఆధునీకీకరించడం, వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించడం, పండించిన పంటలకు స్వేచ్ఛా మార్కెటింగ్ సౌకర్యాన్ని కలిగించడం, ఎగుమతులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇవ్వడం, మిగులు భూమి పంపిణీ, చిన్న తరహా పరిశ్రమలు స్థాపించడం వంటి వాటి ద్వారా రాయలసీమ గ్రామీణ ఆర్థిక అభివృద్ధిని కొంతవరకు సాధించవచ్చు.

గ్రామీణాభివృద్ధి పథకాలను దుర్వినియోగం చేసినవారిని కఠినంగా శిక్షించాలి.

గ్రామీణాభివృద్ధి పథకాలు ఢిల్లీలో, హైదరాబాద్‌లోను కూర్చొని రూపకల్పన చేయకుండా గ్రామ పంచాయతీ స్థాయిలో ప్రజల అవసరాలను బట్టి పథకాలను రూపొందించాలి. గ్రామీణ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచే పథకాలకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలి.

బావి ఎండింది - మోటరు వుంది